అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 03-07-2024 సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి: 10 సంచిక: 184 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల: 6.50



పనితీరు మార్చుకోండి

ఐఏఎస్‌లకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం

- వినూత్నంగా ఆలోచించండి.. ప్రజలకు చేరువ కండి
- వారానికో రోజు క్షేత్ర స్థాయి పర్యటన చేయండి
- నెలకోసారి జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించండి
- దేశానికి తెలంగాణను ఆదర్శంగా నిలపండి

అన్ని విభాగాల ముఖ్య కార్యదర్శులతో సీఎం సమీక్షా సమావేశం

త్వరలో సీఎం జిల్లాల పర్యటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

"ఐఏఎస్‌లు తమ పని తీరును మార్చుకోవాలి. చాలా జిల్లాల్లో కలెక్టర్లు ఆఫీసులు దాటడం లేదు. విధిగా క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి ప్రజలతో మమేకం కావాలి. జనానికి ఉపయోగపడే కొత్త కార్యక్రమాలు, వినూత్న ఆలోచనలతో ముందుకు సాగండి. అభివృద్ధి, సంక్షేమ పథకాలను పేద లకు అందించడంలో పారదర్శకంగా వ్యవహరిం చండి. తెలంగాణను దేశానికి ఆదర్శగా నిల పండి" అని ముఖ్య మంత్రి ఏ. రేవంత్‌రెడ్డి అధికారులకు సూచిం చారు. రాష్ట్రంలోని అన్ని విభాగాల కార్యద ర్శులతో మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహిం చారు. మొత్తం 29 విభాగాలకు చెందిన ఐఏఎస్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో ప్రభుత్వ పథకాలు, ప్రాధాన్యతాక్రమం, ప్రజ లకు, ప్రభుత్వానికి మధ్య తత్సంబంధాలు తదితర అంశాలపై వారికి సీఎం దిశా నిర్దేశం చేశారు.

ఉమ్మడి రాష్ట్రం నుంచి ఇప్పటివరకు...13లో



హత్రాస్‌లో ఘోరం

తొక్కిసలాటలో వందమందికి పైగా మృతి

- నిండు ప్రాణాలు బలిగొన్న సత్సంగ్
- ఉత్తరప్రదేశ్‌లో విషాదం
- రాష్ట్రపతి సహ పలువురి దిగ్భ్రాంతి

ఉత్తరప్రదేశ్‌లో ఘోరం చోటు చేసుకుంది. హత్రాస్‌లో నిర్వహిం చిన ఒక ఆధ్యాత్మిక సత్సంగ్ (ప్రార్థనా శిబిరం) కార్యక్రమంలో నిర్వాహకులు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో జరిగిన తొక్కిసలాటలో వందమందికిపైగా మరణించారు. 200 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఘటనా స్థలంలో ఎటుచూసినా హృదయ విదారక దృశ్యాలే కనిపించాయి. గుండెలవిసే రోదనలతో పరిసర ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రశాంత వాతావారణంలో సాగాల్సిన ఆధ్యాత్మిక కార్యక్రమంలో నిర్వాహకులు, ప్రభుత్వ యంత్రాంగ ఘోర వైఫల్యం వల్ల మృత్యువు విలయతాండవం చేసింది. సాంత్వన కోసం పరితపించి వచ్చిన నిండు ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి.

హత్రాస్ : హత్రాస్ జిల్లా సికందర్ రావు పోలీసు స్టేషన్ పరిధిలోని పులారి గ్రామంలో స్థానిక గురువు గౌరవార్థం ఏర్పాటు చేసిన సత్సంగ్ (ప్రార్థనా సమావేశం) సందర్భంగా జరిగిన ఈ తొక్కిసలాట పెనువిషాదానికి దారితీసింది. వందమందికి పైగా నిండు ప్రాణాలు కోల్పోగా, సుమారు రెండువందల మందికిపైగా క్షతగాత్రులయ్యారని ఇటా సీనియర్ ఎస్పీ రాజేష్ కుమార్ తెలిపారు. వచ్చిన జనం వెళ్లిపోవడానికి ప్రయత్నించిన సమయంలో ఈ తోపులాటలు, తొక్కిసలాట చోటు చేసుకుందని ఈ కార్యక్రమానికి హాజరైన ఒక మహిళ తెలిపారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో జరిగిన ఈ భయానక సంఘటనకు సంబంధించిన దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. మృతదేహా లను బస్సుల్లో, టెంపోల్లో తరలిస్తున్నారు. ఇటా ఆస్పత్రికి ఇప్పటివరకు 27 మృత దేహాలను తీసుకువచ్చారు. వీరిలో 23 మంది మహిళలు కాగా, ముగ్గురు పిల్లలు, ఒక పురుషుడు వున్నారని ఎస్‌పి విలేకర్లకు తెలిపారు. ఈ సత్సంగ్ కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు గుమిగూడారని, జనాలు కిక్కిరిసి రావడంతో తొక్కిసలాట జరిగిందని ఎస్పీ చెప్పారు. కాగా ఈ ఘటనపై దర్యాప్తు చేసేందుకు ఆగ్రా అదనపు డీజీపీ, అలీగఢ్ కమిషనర్ నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేస్తూ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ దారుణ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రభృతులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అక్కడి దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయని పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుం బాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ తీవ్ర విషాద ఘటన పట్ల సీపీఐ(ఎం) తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఇలాంటి సందర్భాల్లో ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వల్లే ఇంతటి విషాదం చోటుచేసుకున్నదని, ఇకనైనా తగిన ప్రొటోకాల్ వ్యవస్థ ఏర్పాటు చేయాలని సామాజిక మాధ్యమాల్లో సీపీఐ(ఎం) పోస్టు చేసింది. ఇంతటి ఘోరం జరిగినా ఉత్తం ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘటనాస్థలానికి వెళ్లలేదు. బాధితులకు తగిన సహాయం అందించాలంటూ సామా జిక మాధ్యమాల ద్వారా అధికారులకు ఆదేశాలు జారీ చేసి ఆయన చేతులు దులిపేసుకున్నారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి.

ఎవరీ బాబా?

ఇటా జిల్లా పాటియాలి తహసల్‌కు చెందిన బహదూర్ గ్రామానికి చెందిన భోలే బాబా గతంలో ఇంటెలిజెన్స్ బ్యూరో ఉద్యోగిగా పనిచేసినట్టు చెబుతారు. 26 ఏండ్ల క్రితమే ఆయన ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి మతపరమైన సత్సంగాలు ప్రారంభించారు. ఆయనకు వెస్ట్రన్ ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, హర్యానా, రాజస్థాన్, ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా లక్షలాది మంది ఫాలోవర్స్ ఉన్నారు. మోడ్రన్ బాబాల మాదిరిగా కాకుండా బోలో బాబా సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటారు. బోలో బాబా సత్సంగ కార్యక్రమాలు ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో ప్రతి మంగళవారం ...5లో

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- సినీ పరిశ్రమతో పాటు సమాజంలోని అన్ని వర్గాలూ సహకరించాలి
- ఈ విషయంలో ప్రతిభ కనబర్చిన అధికారులకు పదోన్నతులు కల్పిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి
- టీజీన్యాబ్‌-సైబర్ సెక్యూరిటీ విభాగాలకు కొత్తవాహనాలు

వివరాలు 6లో..

నేడు క్షమాభిక్షపై 231 మంది యావజ్జీవ ఖైదీల విడుదల

- చర్లపల్లి జైలులో ఖైదీల జాబ్‌మేళా
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర హోంశాఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

పలు జైళ్లలో యావజ్జీవ శిక్ష అనుభవిస్తూ మంచి ప్రవర్తన కలిగిన 231 మంది ఖైదీలను క్షమాభిక్షపై విడుదల చేస్తూ రాష్ట్ర హోం శాఖ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఖైదీలను బుధవారం విడుదల ...13లో

ఓకే సార్.. 6న కలుద్దాం

చంద్రబాబును ఆహ్వానించిన సీఎం రేవంత్ 5లో..

టీజీఎస్ ఆర్టీసీలో 3,035 కొలువులు

- వాటిలో రెండువేల మంది డ్రైవర్, 743 శ్రామిక్ పోస్టులు
- భర్తీకి ప్రభుత్వ అనుమతి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో 3,035 పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వీటిలో రెండువేల డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్, 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్) 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్), 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, 23 అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్), 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్, 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్), 7 మెడికల్ ఆఫీసర్ (జనరల్), 7 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) ఉద్యోగాలు ఉన్నాయి. ఆర్టీసీ ఉన్నతాధి కారులు ఇచ్చిన ప్రతిపాదనల మేరకు ఈ ఉద్యోగాల భర్తీకి అనుమతులు ...13లో

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

11మంది మావోయిస్టులు మృతి

రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణ్‌పూర్ జిల్లాలో మంగళవారం జరిగిన ఈ ఎన్‌కౌంటర్‌లో 11మంది మావోయిస్టులు మరణించారని పోలీసులు తెలిపారు. ఖోకామెటా పోలీసు స్టేషన్ పరిధిలోని ధనంది-కుర్రేవాయ అడవుల్లో మావో యిస్టులకు, భద్రతా సిబ్బందికి మధ్య కాల్పులు జరిగాయని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. నక్సల్ వ్యతిరేక చర్యల్లో భాగంగా చేపట్టిన ఆపరేషన్‌లో వివిధ భద్రతా దళాలకు చెందినవారు పాల్గొన్నారు.



జిల్లా రిజర్వ్ గార్డులు, ప్రత్యేక టాస్క్ ఫోర్స్, సరిహద్దు భద్రతా బలగాలు, ఇండో టిబెటన్ సరిహద్దు పోలీసులకు చెందిన సిబ్బంది ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పోలీసులను గుర్తించిన మావోయిస్టులు ఎదురు కాల్పులు జరపడంతో ఇరు వర్గాల మధ్య కాల్పులు మొదలయ్యాయని, ఇప్పటికీ ఆగకుండా ఇంకా కాల్పులు జరుగుతున్నాయని ఐజీ సుందరరాజ్ తెలిపారు అయితే ఇవి ప్రభుత్వ హత్యలేనని పౌరసంఘాలు ఆరోపిస్తున్నాయి..

జెడ్పీచైర్మెన్లకు కేసీఆర్ బుజ్జగింపులు

- ఎమ్మెల్యేలు పార్టీ మారినా మీరుండాలని సూచన
- ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో లంచ్ మీటింగ్



నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ రాజకీయాల్లో ఆపరేషన్ ఆకర్ష్ హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే ఆరుగురు ఎమ్మెల్యేలు కండువా మార్చగా అదే బాటలో మరికొంతమంది ఎమ్మెల్యేలు ఉన్నారనే ఊహాగానాల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ దిద్దుబాటు చర్యలకు దిగారు. గత వారం వరకు ఉమ్మడి జిల్లాల వారీగా ఎమ్మెల్యేలను బుజ్జగించిన కేసీఆర్.. తాజాగా జెడ్పీ చైర్మెన్లపై దృష్టిపెట్టారు. మంగళవారం 20 మంది జెడ్పీ చైర్మెన్లను కుటుంబ సమేతంగా సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవెల్లిలోని తన వ్యవసాయ క్షేత్రానికి పిలిపించుకుని వారితో కలిసి లంచ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ మారొద్దని వారిని బుజ్జగించినట్టు సమాచారం.

ఒక వేళ ఎమ్మెల్యేలు పార్టీ మారినా మీరు పార్టీలోనే ఉండాలని, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు అధికార పార్టీ వైపు క్యూ కడుతుంటే పలువురు ఎమ్మెల్సీలు సైతం ఇదే బాటలో ఉన్నారన్న ఊహాగానాలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలసలను నిలువరించలేమనే ఆలోచనకు కేసీఆర్ వచ్చారని, వారు ఎప్పుడైనా జంప్ కావొచ్చనే అంచనాలో భాగంగానే ద్వితీయ శ్రేణి నాయకులను బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే పార్టీ మారితే పార్టీలో వారి స్థానం మీదేనని, రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అవకాశం దక్కబోతున్నదని చెబుతున్నట్టు తెలుస్తోంది. కాగా, కేసీఆర్ తాజా ప్రయత్నం ఎలాంటి ఫలితాలను ఇస్తుందో చూడాలి.

మూడు రోజుల తర్వాతే

టీపీసీసీకి కొత్త బాస్

- మహేష్‌కుమార్‌గౌడ్ వైపే మొగ్గు
- రేసులో పలువురు నేతలు
- ఢిల్లీలో మకాం... అధినేతలతో భేటీలు



నవతెలంగాణబ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) కొత్త అధ్యక్షుని ప్రకటన మూడు రోజుల తర్వాతనే రానుంది. ఈ విషయంలో అధిష్టానం ఓ నిర్ణయానికి రాకపోవడంతో ఆలస్యమవుతున్నది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క బుధవారం ఢిల్లీకి వెళ్లనుండటంతో కొత్త అధ్యక్షుడిపై మరోసారి చర్చ మొదలైంది. ఇప్పటికే కొంత మంది నాయకులు ఢిల్లీలో మకాం వేశారు. ఏఐసీసీ అగ్రనేతలతో కలిసి తమకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఆ పదవి రేసులో టీపీసీసీ కార్యానిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్, జగ్గారెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి ఎస్‌ఏ సంపత్‌కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పేర్లు ప్రము ఖంగా వినిపిస్తున్నాయి. జూన్ 27న ప్రస్తుత అధ్యక్షులు, సీఎం రేవంత్‌రెడ్డి మూడేండ్ల గడువు ముగిసింది. ఆ తర్వాత కొత్త అధ్యక్షులు ఎవరనేది కొన్ని రోజులుగా కాంగ్రెస్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఇదే సమయంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు అన్యాయం జరిగిందనే అపవాదు పార్టీల్లో నెలకొంది. దీన్నించి ...5లో

ప్రతిపక్షాలే టార్గెట్‌గా...

లోక్‌సభలో ప్రధాని మోడీ ప్రసంగం ... • అడ్డుకున్న ప్రతిపక్షాలు • ప్రజా సమస్యలపై చర్చించాలని డిమాండ్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

లోక్‌సభలో ప్రతిపక్షాలను టార్గెట్ చేస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని ఆసాంతం కొనసాగించారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని మోడీ మంగళవారం సాయంత్రం లోక్‌సభలో బదులిస్తూ దాదాపు 2.10 గంటల పాటు సుదీర్ఘంగా చర్చించారు. ఈ ప్రసంగంలో కనీసం దేశంలోని కీలక అంశాలనూ ప్రస్తావించలేదు. దీంతో ప్రధాని ప్రసంగాన్ని ప్రతిపక్షాలు అడ్డుకున్నాయి. నీట్, మణిపూర్, అగ్నిపథ్ వంటి ప్రజా సమస్యలపై మాట్లాడాలని డిమాండ్ చేశాయి. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు ఎన్ని అసత్యాలు ప్రచారం చేసినా వారికి పరాజయం తప్పలేదని అన్నారు. ప్రజలు తమ పాలన, ట్రాక్ రికార్డు చూశారని తెలిపారు. తమ పదేండ్ల హయాంలో 25 కోట్ల మంది ప్రజలు పేదరికం నుంచి బయట పడ్డారని అన్నారు. అవినీతిని ఏమాత్రం సహించకుండా పరిపాలన సాగిస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఈ దశాబ్దంలో భారత్ ఖ్యాతి పెరిగిందని వివరించారు. రాష్ట్రపతి ప్రసంగంలో వికసిత్ భారత్ లక్ష్యాలను వివరించారని, ఈ దిశగా తమ ప్రస్థానం సాగుతుందని స్పష్టం చేశారు. నేషన్ ఫస్ట్ అనే నినాదంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. లౌకికవాదం అంటే సామాజిక న్యాయం పాటించడమని చెప్పుకొచ్చారు. దేశ ప్రజలు తమపై భరోసా ఉంచారని అన్నారు. వికసిత్ భారత్‌తో ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని అన్నారు. తమ ప్రభుత్వ పథకాలు సామాన్యులకు చేరుతున్నా యని చెప్పారు. పోటీ పరీక్షల్లో ప్రశ్నా పత్రాల లీకేజీల విషయాన్ని అత్యంత తీవ్రంగా పరిగణిస్తున్నా మని అన్నారు. నీట్ ప్రశ్నా పత్రం లీక్ చేసిన నిందితులను కఠినంగా శిక్షిస్తామని తెలిపారు. విద్యా వ్యవస్థను బలోపేతం చేసే చర్యలు తీసుకుంటా మన్నారు. ఓబీసీ వర్గాలను కాంగ్రెస్ దొంగలుగా చిత్రీకరిస్తోందని ...13లో

నిరవధిక వాయిదా

539 మంది సభ్యుల ప్రమాణ స్వీకారం

లోక్‌సభ సమావేశాలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధాని నరేంద్ర మోడీ బదులిచ్చిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు. జూన్ 24న ప్రారంభమైన 18వ లోక్‌సభ తొలి సమావేశాలు వాడీవేడిగా కొనసాగాయి. ఈ సమా వేశాల్లో నీట్ వివాదం, మణిపూర్ అల్లర్లపై చర్చకు ప్రతిపక్షాలు ...13లో

రాహుల్ ప్రసంగ వ్యాఖ్యలు రికార్డుల్లోంచి తొలగింపు

- ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విరుద్ధమంటూ స్పీకర్ ఓం బిర్లాకు రాహుల్ లేఖ

13లో.

నీట్‌పై లోక్‌సభలో చర్చించాలి

ప్రధాని మోడీకి రాహుల్ గాంధీ లేఖ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

నీట్ అంశంపై లోక్‌సభలో చర్చించాలంటూ బుధవారం ప్రధాని నరేంద్ర మోడీని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ...13లో

అప్పుల ఊబిలో రైతులు

సీపీఐ(ఎం) ఎంపీ కె. రాధాకృష్ణన్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని సీపీఐ(ఎం) ఎంపీ కె. రాధాకృష్ణన్ అన్నారు. మంగళవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోడీ పాలనలో దేశం భారీ ఆర్థికాభివృద్ధిని సాధించిందన్న వాదనలు నిరాధారమని అన్నారు. త్వరలో ప్రపంచంలోనే మూడో ఆర్థిక శక్తిగా భారత్ అవతరిస్తుందని రాష్ట్రపతి అన్నారని, కానీ ఆకలి సూచికలో భారతదేశం 111వ స్థానంలో ఉందని తెలిపారు. సంతోష సూచికలో 126వ స్థానంలో ఉన్నామని, బ్రిటిష్ పాలన తరువాత అసమానతలు పెరిగాయని అన్నారు. ప్రజల జీవన నాణ్యతను కేవలం ఆర్థికాభివృద్ధితో కొలవలేమని, ప్రభుత్వం బడా కార్పొరేట్ల ప్రయోజనాలకు మొగ్గు చూపుతుండగా, బలహీన వర్గాలు నిర్లక్ష్యానికి గురవుతున్నాయని విమర్శించారు. దేశ లౌకికవాదం, ప్రజాస్వామ్యం, సమాఖ్యవాదం అన్నీ ప్రమాదంలో పడ్డాయని దుయ్యబట్టారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో కూడా కుల, మత విభజనలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. రైతుల కోసం ప్రభుత్వం ఎంతో చేసిందని రాష్ట్రపతి అన్నారని, కానీ వాస్తవమేమిటంటే రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయి కనీస మద్దతు ధరలు లేక పతనమవుతున్నారని పేర్కొన్నారు. మహిళలు, షెడ్యూల్డ్ కులాలు, ఇతర బలహీన వర్గాలకు సంబంధించిన పథకాలు నిర్లక్ష్యం చేయబడ్డాయని అన్నారు. అర్హులైన వారికి పథకాలు అందేలా చూడాలనీ, ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. గత పదేండ్లలో ఎయిమ్స్ సంఖ్య ఏడు నుంచి 16కి పెరిగిందని అంటున్నారని, అయితే కేరళకు ఇంకా ఎయిమ్స్‌ను కేటాయించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం తగిన స్థలాన్ని గుర్తించి నోటిఫై చేసినా కేరళపై రాజకీయ వివక్ష కొనసాగుతోందని రాధాకృష్ణన్ ధ్వజమెత్తారు.

సీజీఆర్ సభ్యులకు జాతీయ పురస్కారాలు

- 6న సీఎం చేతుల మీదుగా అవార్డుల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్(సీజీఆర్)కు చెందిన పలువురికి జాతీయ స్థాయి పురస్కారాలు లభించాయని ఆ సంస్థ చైర్‌పర్సన్ లీలా లక్ష్మారెడ్డి, సీనియర్ సైంటిస్టు డాక్టర్ ఎం.మహేశ్వర్, ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తమ్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు సీహెచ్. శివప్రసాదరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్ కె.తులసీరావుకు పర్యావరణ జాతీయ అవార్డు, దిలీప్‌రెడ్డికి నూకల నరోత్తమ్‌రెడ్డి జాతీయ అవార్డు, దొంతి నర్సింహారెడ్డికి ప్రొఫెసర్ టి.శివాజీరావు జాతీయ అవార్డు, డాక్టర్ ఎ.కిషన్‌రావుకు ఎర్త్‌కేర్ ఎన్విరాన్‌మెంట్ జాతీయ అవార్డు లభించాయని తెలిపారు.

పేపర్ లీకేజీలపై ప్రధాని మౌనమెందుకు?

పదేండ్ల మోడీ పాలనలో 70 లీకులు

- 'నీట్'పై సుప్రీం సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- 4న తలపెట్టిన భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి
- విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు, ప్రజలు సహకరించాలి : విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి విజ్ఞప్తి



నవతెలంగాణ-సిటీబ్యూరో

బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పరీక్ష పేపర్ లీకేజీలు జరుగుతున్నా ప్రధాని నరేంద్రమోడీ స్పందించపోవడం అప్రజాస్వామికమని, పదేండ్ల మోడీ పాలనలో 70 పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయని విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి పేర్కొంది. నీట్ పరీక్ష రద్దుతో పాటు అవకతవకలు, అక్రమాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ నాంపల్లిలోని టీజేఎస్ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, వైజేఎస్, వీజేఎస్, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, పీడీఎస్‌యూ, పీవైఎల్ విద్యార్థి, యువజన సంఘాల విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. మోడీ పాలనలో పరీక్ష ప్రశ్నా పత్రాల లీకేజీలు సాధారణమయ్యాయన్నారు. పోటీ పరీక్షల నిర్వహణలో ఎన్టీఏ విఫలమైందన్నారు. ఈ విషయాలపై స్పందించాల్సిన ప్రధాని మౌనంగా ఉంటున్నారని, లీకేజీలు జరుగుతున్నది బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనేనని.. అందుకే మోడీ స్పందించడం లేదని విమర్శించారు. పేపర్ లీకేజీలకు బీజేపీ నేతలు కారణమనే అనుమానాలు ఉన్నాయన్నారు. ఎన్టీఏ తప్పు చేసింది కాబట్టే దాని డైరెక్టర్ జనరల్ సుబోధ్ కుమార్‌ను తొలగించారన్నారు. దేశ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై నిర్లక్ష్య పూరిత వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. అందుకే ఈనెల 4న భారత్ బంద్‌కు పిలుపునిచ్చామని చెప్పారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రజనీకాంత్, జాయింట్ సెక్రెటరీ ఎం.మమత మాట్లాడుతూ.. 24లక్షల మంది విద్యార్థుల భవిష్యత్‌తో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయలు చెల్లించి లాంగ్ టర్మ్ కోచింగ్‌లు తీసుకున్న విద్యార్థులు, తల్లిదండ్రుల ఆవేదన మోడీ సర్కార్‌కు పట్టకపోవడం అన్యాయమన్నారు. నీట్ విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛందంగా అందరూ బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లాడుతూ.. నీట్ బాధిత విద్యార్థులకు కేంద్రం న్యాయం చేయాలని, పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏను రద్దు చేయాలని, రాష్ట్రాలకే నీట్ పరీక్ష నిర్వహించుకునే అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 4న నిర్వహించ తలపెట్టిన భారత్ బంద్‌కు విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు, వ్యాపారవేత్తలు, ప్రజలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యువజన సమితి రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలీమ్ పాషా మాట్లాడుతూ.. నీట్ సమస్యపై సీబీఐ దర్యాప్తు సరిగ్గా జరగడం లేదని, సీబీఐ ప్రస్తుతం మోడీ చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శించారు. అందువల్ల సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. వీజేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేసి, తిరిగి నిర్వహించాలన్నారు. లేకుంటే ఐక్య విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్ మాట్లాడుతూ.. నీట్ అక్రమాలపై సీబీఐ విచారణ కాకుండా.. సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని, ఎంసెట్ లాగే నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్రాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు కె.ఎస్.ప్రదీప్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షులు సాగర్, వైజేఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎర్ర వీరన్న, రాష్ట్ర కో-ఆర్డినేటర్ కొత్త రవి, వీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పేరాల శ్రీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నకిరేకంటి నరేందర్ మాట్లాడారు. నీట్‌తో పాటు ఇతర స్కాములన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే జరుగుతున్నాయని, వీటిల్లో ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని అనుమానం కలుగుతోందన్నారు. అందుకే కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని అర్థమవుతుందన్నారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజరు స్పందించాలని డిమాండ్ చేశారు. 25 రోజులుగా నీట్ పేపర్ లీకేజీ కుంభకోణానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా విద్యార్థి యువజన సంఘాలు ఆందోళన చేస్తున్నా, పార్లమెంటులో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబడుతున్నా ప్రధాని మోడీకి చీమ కుట్టినట్టు కూడా లేదని, వెంటనే దేశ ప్రజలకు మోడీ క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, నగర అధ్యక్షులు హస్మి బాబు, కార్యదర్శి ఎండీ జావిద్, ఇతర విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

17 నెలల వేతనాలివ్వకుంటే ఎట్ల బతుకుతారు?



- గిరిజన కార్మికుల సమస్యలు పరిష్కరించండి : బి.మధు
- కమిషనరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా
- తొందరల్లోనే 9 నెలల వేతనాలిస్తాం : అధికారులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన సంక్షేమ శాఖలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులు 17 నెలలుగా వేతనాల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, జీతాలివ్వకుంటే ఎలా బతుకుతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి.మధు ప్రశ్నించారు. వారు పస్తులుండాల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. వందల కోట్ల రూపాయల ఆస్తులున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రతి నెలా ఒకటో తేదీనే జీతాలిస్తూ గిరిజన కార్మికులకు మాత్రం 17 నెలలుగా ఇవ్వకపోవడమేంటని నిలదీశారు. వారి వేతనాల సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదే విషయంపై మంగళవారం హైరాబాద్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట గిరిజన సంక్షేమ శాఖ పోస్ట్ మెట్రిక్ హాస్టల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..వారికి జీవో నెంబర్ 60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లించాలనీ, నేరుగా వారి ఖాతాల్లోనే వేయాలని కోరారు. క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని విన్నవించారు. గిరిజన సంక్షేమం గురించి గొప్ప చెప్పుకుంటున్న మంత్రులు కార్మికుల వేతనాల సమస్యపై ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని హెచ్చరించారు.అనంతరం ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందనకు వినతిపత్రం అందజేశారు. సమస్య తీవ్రతను ఆమెకు వివరించారు. వేతనాలకు సంబంధించి రూ.13 కోట్ల బడ్జెట్ విడుదలైందనీ, 9 నెలల వేతనాలు చెల్లించ డానికి అవి సరిపోతాయని ఆమె హామీనిచ్చారు. చెక్కులను వెంటనే ఆర్థిక శాఖకు పంపిస్తున్నామని తెలిపారు. మిగిలిన పెండింగ్ వేతనాలనూ విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు. ధర్నాలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బ్రహ్మచారి, రాష్ట్ర నాయకులు చందా జలంధర్, రాము, లక్ష్మణ్, తిరుపతమ్మ, జయ, అనురాధ, జంపన్న, స్వరూప, సుగుణలక్ష్మి, ధనమ్మ, భద్రమ్మ, లక్ష్మి, కాంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

జనగణనపై కేంద్రం మీనమేషాలు !

- పాలనా సరిహద్దులపై ప్రకటించని వైనం

న్యూఢిల్లీ : జనగణన (సెన్సస్)పై కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది. దేశాభివృద్ధికి జనగణన చాలా కీలకం. అందుకే ప్రతిపక్షాలు సైతం జనగణన నిర్వహించాలని ఏళ్లతరబడి పట్టుబడుతున్నాయి. బీహార్‌లో ఆర్‌జెడి పార్టీతోపాటు ఎన్‌డిఎ కూటమిలోని భాగస్వామ్య పార్టీగా ఉన్న జెడియు పార్టీ కూడా కులగణన చేపట్టాలని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది. అన్ని పార్టీలు జనగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ మోడీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. జనగణనకు ఎంతో కీలకమైన జిల్లాలు, తాలూకాలు, మున్సిపల్, పట్టణాల పరిపాలనా సరిహద్దుల గడువు 2024 జూన్ 30తో ముగిసింది. అయితే ఇప్పటివరకు జనగణన ఏ తేదీలోగా పూర్తి చేయాలో కేంద్ర ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. అయితే, ఈ అంశంపై ఇంకా చర్చలు జరుగుతున్నాయని ఒక ప్రభుత్వ సీనియర్ అధికారి మీడియాతో చెప్పారు. కాగా, యుపిఎ ప్రభుత్వ హయాంలో 2011లో జనగణన జరిగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు తొమ్మిదిసార్లు గడువును పొడిగించాయి. మళ్లీ పదేళ్లకు అంటే ఈ జనగణన 2021లో జరగాలి. కానీ కోవిడ్ వల్ల జనగణన నిర్వహించడం సాధ్యంకాలేదని మోడీ ప్రభుత్వం చెప్పుకొచ్చింది. ఈ నేపథ్యంలో జనగణన సరిహద్దు గడువు పొడిగించే అవకాశం ఉంది. ఒకవేళ ఆ తేదీని పొడిగించే అవకాశం లేకపోతే దానికి సంబంధించిన కసరత్తుకు మూడు నుంచి ఆరునెలలు సమయం పట్టే అవకాశం ఉందని మాజీ జనగణన అధికారి ఒకరు తెలిపారు.

గతేడాది (2023) డిసెంబర్ 30వ తేదీన రాష్ట్ర పరిపాలనా సరిహద్దుల గడువును 2024 జూన్ 30 వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ జనగణన కోసం యంత్రాంగాన్ని సిద్ధం చేసేందుకు కనీసం మూడు నెలల సమయం తీసుకున్నా... అక్టోబర్ 1 నుండైనా ఈ ప్రక్రియ చేపట్టేందుకు అవకాశం ఉంటుంది.

జనగణన పూర్తైతేనే.. మహిళారిజర్వేషన్ బిల్లు అమలు

గతేడాది మోడీ ప్రభుత్వం చట్టసభల్లో 33 శాతం మహిళల రిజర్వేషన్ బిల్లును ఆమోదించింది. 'నారీశక్తి వందన్ అధినియమ్' పేరుతో ఆమోదించిన ఈ బిల్లు కూడా జనగణన లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ చేపట్టిన తర్వాతే అమల్లోకి రానుంది. ఈ లెక్కన చూస్తే ఈ బిల్లు అమలయ్యేటప్పటికి వచ్చే లోక్‌సభ ఎన్నికలే కాదు.. మరికొన్ని సంవత్సరాలు పట్టే అవకాశముందని, ఈ బిల్లు ఆమోదం పొందినప్పుడే ప్రతిపక్షాలు, మహిళా సంఘాలు మోడీ ప్రభుత్వాన్ని నిలదీశాయి. ఇక లోక్‌సభ ఎన్నికలకు ముందు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఎన్నికల తర్వాత జనగణన, సీట్ల పునర్విభజన నిర్వహిస్తామని ప్రకటించారు. కానీ ఎన్నికల ఫలితాలు వచ్చి దాదాపు నెలరోజులు కావొస్తున్నా... ఇప్పటివరకూ ఆయన ప్రకటించలేదు.



సుగంధ ద్రవ్యాలు కావు...
ప్రాణాంతకాలు

వాటిలో బయటపడిన క్యాన్సర్ కారకాలు

- పరీక్షలు జరపకుండానే మార్కెట్‌లో అమ్మకాలు
- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం
- తిప్పిపంపుతున్న పలు దేశాలు

న్యూఢిల్లీ : ఏప్రిల్ ఐదవ తేదీన మన దేశం నుండి దిగుమతి అయిన రెండు సుగంధ ద్రవ్యాలలో హాంకాంగ్ ఆహార భద్రతా విభాగం క్యాన్సర్ కారకాల ఉనికిని కనిపెట్టింది. ఎవరెస్ట్ ఫిష్ కర్రీ మసాలా పౌడర్‌లో ఇథలిన్ ఆక్సైడ్‌తో పాటు ఎండీహెచ్ కంపెనీ తయారు చేసిన మద్రాస్ కర్రీ పౌడర్, సాంబార్ మసాలా మిక్స్‌డ్ పౌడర్, కర్రీ పౌడర్ మిక్స్‌డ్ మసాలా... ఈ మూడింటిలో కూడా క్రిమి సంహారకాల అవశేషాలు కన్పించాయి. ఎవరెస్ట్ ఫిష్ కర్రీ మసాలా పొడిని తిప్పి పంపుతున్నామని ఏప్రిల్ 18న సింగపూర్ ఆహార సంస్థ తెలిపింది. ఏప్రిల్ నెలాఖరుకు మరో ఐదు దేశాలు కూడా మన సుగంధ ద్రవ్యాలపై నిషేధం విధించడమో లేదా తిప్పిపంపడమో చేశాయి. భారత్ నుండి దిగుమతి అయిన సుగంధ ద్రవ్యాలపై విచారణ జరుపుతున్నామని కొన్ని దేశాలు ప్రకటించాయి.

హెచ్చరికల తర్వాతే...

మరి మన దేశంలోని వినియోగదారుల మాటేమిటి? గతంలో ఎన్నడూ సుగంధ ద్రవ్యాలలో క్యాన్సర్ కారకాలు ఎందుకు కన్పించలేదు? హాంగ్‌కాంగ్ మాత్రమే ఎందుకు హెచ్చరికలు జారీ చేసింది? మన దేశంలో తయారవుతున్న సుగంధ ద్రవ్యాలను మార్కెట్‌లో విక్రయించడానికి ముందు పరీక్షిస్తున్న దాఖలాలు లేవు. అధికారుల నుండి నిర్దిష్ట ఆదేశాలు వస్తేనే వీటిని పరీక్షలకు పంపుతారు. లేకుంటే పట్టించుకునే నాథుడే ఉండడు. హాంకాంగ్ నుండి హెచ్చరిక అందిన తర్వాత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) కళ్లు తెరిచింది. సుగంధ ద్రవ్యాలలో పురుగు మందుల అవశేషాలు ఉన్నాయా లేవా అనే దానిపై పరీక్షలు నిర్వహించాలని అన్ని రాష్ట్రాలకు సూచించింది. ఈ నేపథ్యంలో జరిగిన పరీక్షలలో క్యాన్సర్ కారకాలు బయటపడ్డాయి.

ఎగుమతులకే పరీక్షలు

మహారాష్ట్రలో పరీక్షలు నిర్వహించగా ఐదు ఎవరెస్ట్ మసాలా శాంపిల్స్‌లో ఇథలిన్ ఆక్సైడ్ కన్పించింది. అయితే నిర్దిష్ట నిబంధనలేవీ లేకపోవడంతో ఏం చేయాలో అధికారులకు పాలుపోవడం లేదు. తదుపరి చర్యలు సూచించాలని వారు ఎఫ్ఎస్-ఎస్ఏఐని కోరారు. ఎవరెస్ట్, ఎండీహెచ్ కంపెనీలు తయారు చేసిన సుగంధ ద్రవ్యాలకు సంబంధించిన కొన్ని బ్యాచ్‌లను రాజస్థాన్ వెనక్కి తీసుకుంది. సుగంధ ద్రవ్యాల ఎగుమతులను నియంత్రించాల్సిన బాధ్యత స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియాది. హాంకాంగ్ హెచ్చరికల నేపథ్యంలో దేశం నుండి ఎగుమతి అవుతున్న సుగంధ ద్రవ్యాలన్నింటినీ ఈ బోర్డు ఇప్పుడు పరీక్షిస్తోంది. అయితే దేశీయ మార్కెట్‌లో విక్రయించే వాటికి మాత్రం ఇలాంటి పరీక్షలేవీ జరపడం లేదు.

ఆ నిబంధనే లేదట

సుగంధ ద్రవ్యాల పరీక్షలకు సంబంధించి ఎఫ్ఎస్ఎస్ఏఐ కొన్ని నిబంధనలు రూపొందించింది. ఈ నిబంధనల ప్రకారం... క్రిమిసంహారకాల అవశేషాలు ఉన్నాయా లేవా అనే దానిపై ప్రత్యేకంగా పరీక్ష ఏదీ జరపాల్సిన అవసరం లేదు. ఇతర ప్రమాణాలపై మాత్రమే సాధారణంగా పరీక్షలు జరుపుతుంటారు. కాగా తొమ్మిది రాష్ట్రాల నుండి సేకరించిన 13 సుగంధ ద్రవ్యాల శాంపిల్స్ మానవ వినియోగానికి పనికిరావని ఎఫ్ఎస్ఎస్ఏఐ తేల్చింది. మూడు నమూనాలు నాసిరకంగా ఉన్నాయి. ఇప్పటి వరకూ 251 శాంపిల్స్‌ను సేకరించగా 104 నమూనాలకు పరీక్షలే జరపలేదు. నమూనాలలో క్రిమిసంహారకాల అవశేషాలు బయటపడుతున్నా, నాసిరకంగా ఉన్నాయని తేలినా జాతీయ స్థాయిలో ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

లేబొరేటరీలలో పరికరాలు ఏవి?

పరీక్షలు నిర్వహించే లేబొరేటరీలలో ఆధునిక పరికరాల కొరత స్పష్టంగా కన్పిస్తోంది. అనేక ప్రభుత్వ లేబొరేటరీలలో పరీక్షలు జరపడానికి అవసరమైన పరికరాలు, సామగ్రి అందుబాటులో లేవు. దీంతో వాటిని ప్రైవేటు లేబొరేటరీలకు పంపుతున్నారు. క్రిమి సంహారకాల ఉనికి తెలుసుకునే సామర్థ్యం ఉన్న లేబొరేటరీలు దేశంలో కేవలం 73 మాత్రమే ఉన్నాయి. దీంతో పరీక్షా ఫలితాలు రావడానికి చాలా కాలం పడుతోంది.

పదేండ్లకు 'బలంగా ప్రతిపక్షం'

లోక్‌సభలో పెరిగిన సభ్యుల సంఖ్య

- ఫలవంతమైన చర్చలకు ఆస్కారం
- భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికిది చాలా కీలకం
- గత రెండు లోక్‌సభల్లో చర్చలు లేకుండానే బిల్లుల ఆమోదం : రాజకీయవేత్తలు, నిపుణులు
- తొలిసారి ప్రతిపక్ష నాయకుడి హెూదాలో రాహుల్ గాంధీ
- పలు అంశాలపై మోడీ ప్రభుత్వానికి ప్రశ్నల వర్షం
- కేంద్రం వైఫల్యాలపై నిలదీసిన విపక్ష సభ్యులు


గత పదేండ్ల మోడీ పాలనలో లోక్‌సభలో చర్చలు ఏకపక్షంగా సాగాయి. విపక్ష సభ్యులకు మాట్లాడే అవకాశమివ్వకుండా, వారి అభిప్రాయాలకు ఏ మాత్రమూ గౌరవం లేకుండా సమావేశాలు జరిగాయి. ఎన్డీఏ సర్కారు తీసుకొచ్చిన బిల్లులు అనేకం సభలో తమకున్న సంఖ్యాబలం ఆధారంగా చట్టాలుగా మారినవే. విపక్ష సభ్యుల నుంచి అభ్యంతరాలు, సూచనలు వచ్చినా.. మోడీ సర్కారు తాను అనుకున్న పనినే చేసేది. ఇందుకు స్పీకర్ స్థానాన్ని కూడా దుర్వినియోగం చేసిందనే ఆరోపణలున్నాయి. అయితే, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ వంటి పలు కీలక పార్టీల ఇండియా బ్లాక్ ఎన్నికల్లో 230కి పైగా స్థానాలు సాధించి.. బలమైన ప్రతిపక్షంగా అవతరించింది. ప్రధానపార్టీగా ఉన్న కాంగ్రెస్ 99 స్థానాలతో అతిపెద్ద భాగస్వామిగా ఏర్పడింది. ఈ లోక్‌సభ సమావేశాల్లో ప్రతిపక్షం అనేక సమస్యలను ప్రస్తావించింది. కేంద్రం వైఫల్యాలను లేవనెత్తింది. మొత్తానికి పదేండ్ల తర్వాత.. ప్రస్తుతం సభలో ప్రతిపక్షం గొంతు బలంగా వినిపించిందని రాజకీయవేత్తలు, నిపుణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



న్యూఢిల్లీ : ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో ప్రతిపక్షం స్థానం చాలా కీలకం. ప్రభుత్వ పనితీరును ప్రశ్నిస్తూ, వైఫల్యాలను లేవనెత్తుతూ, సమస్యలను సర్కారు దృష్టికి తీసుకొస్తూ శ్రేష్టమైన పాలనలో కీలక పాత్రను వహిస్తుంది ప్రతిపక్షం. గత పదేండ్లలో సభలో.. ప్రతిపక్షాలకు సభలో తగినంత సంఖ్యాబలం లేకపోటం, విపక్షాల మధ్య అనైక్యత, విస్పష్టమైన మెజారిటీ వంటి కారణాలతో మోడీ సర్కారు ఏకపక్ష ధోరణిని అనుసరించింది. దీంతో లోక్‌సభ సమావేశాల్లో ప్రతిపక్షం గొంతు బలంగా వినిపించలేదని రాజకీయవేత్తలు, నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు. అయితే, ప్రస్తుత లోక్‌సభలో ప్రతిపక్షం గొంతు బలంగా వినిపించటంతో.. దాని ప్రాధాన్యతను దేశ ప్రజలూ గుర్తిస్తున్నారని చెప్తున్నారు.

'సభలో చర్చలు చాలా కీలకం'

గత పదేండ్లలో మోడీ ప్రభుత్వం సభలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదనీ, సభలో, సభ వెలుపల నుంచి ప్రతిపక్షం, పౌర సమాజం నుంచి వచ్చే ప్రశ్నలు, ఆరోపణలకు స్పష్టతనివ్వకుండా తనకు నచ్చిన విధంగా వ్యవహరించిందని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. గత లోక్‌సభలో స్పీకర్‌గా వ్యవహరించిన ఓం బిర్లానే మోడీ సర్కారు మళ్లీ 18వ సభకు స్పీకర్‌గా తీసుకురావటం వెనకున్న ఉద్దేశం ప్రతిపక్షాల గొంతును అణచివేసే చర్యల్లో భాగమేనని వారు హెచ్చరిస్తున్నారు. అయితే, ఈ విషయంలో ప్రతిపక్షం ఐక్యంగా ఉంటే ప్రభుత్వం వ్యూహాలు ఏమాత్రమూ పని చేయవని సూచిస్తున్నారు. ప్రతిపక్షం బలంగా ఉన్న కారణంగా లోక్‌సభలో గతంలో ఎన్నడూ లేని విధంగా స్పీకర్ ఎన్నిక అనివార్యమైందనీ, అయితే ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుల మైక్రోఫోన్లు కూడా సైలెంట్ కావటం పలు అనుమానాలకు తావిచ్చిందని అంటున్నారు. "భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో చట్టాలు చేసే పార్లమెంట్ అత్యంత కీలకం. ప్రజా సమస్యలపై మాట్లాడే ఈ వేదికలో చర్చలు అత్యంత కీలకం. ప్రశ్నించటం ప్రతిపక్షం హక్కు. ప్రతిపక్షం, పాలకపక్షం మధ్య నాణ్యమైన చర్చలు జరిగితేనే ఫలవంతమైన విధానాలు, చట్టాలు బయటకు వస్తాయి" అని రాజకీయ నిపుణులు, మేధావులు అంటున్నారు. ఇలాంటి సమయంలో ప్రతిపక్షాన్ని నిందించకుండా, సమస్య పరిష్కారానికి మార్గం చూపే విధంగా ప్రభుత్వం తీరుండాలనీ, అధికార సభ్యులకు చాలా సహనం అవసరమని సూచిస్తున్నారు.



బిల్లుల చర్చకు తక్కువ సమయం

మోడీ పాలనలో గత లోక్‌సభలో కేవలం 16 శాతం బిల్లులే పార్లమెంటరీ కమిటీలకు చర్చలు, పరిశీలన కోసం పంపబడ్డాయి. కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ-2 హయాంలో ఇది 72 శాతం కావటం గమనార్హం. గత 17వ లోక్‌సభలో 33 శాతం కంటే ఎక్కువ బిల్లులు గంట కంటే తక్కువ సమయంలోనే చర్చలకు నోచుకొని ఆమోదం పొందాయి. కీలకమైన మహిళా రిజర్వేషన్ బిల్లు, జమ్మూకాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం వంటివి రెండు రోజుల్లోనే చట్టాలు మారటం గమనార్హం. అలాగే, గతంలో ఎన్నడూ లేని విధంగా గత లోక్‌సభ సమావేశాల్లో ప్రతిపక్షాలకు చెందిన 141 మంది సభ్యులను స్పీకర్ సస్పెండ్ చేశారు. అయితే, మోడీ పాలనలో ఏకాభిప్రాయానికి, చర్చలకు ఆస్కారం లేకపోవటానికి పై ఘటనలే కొన్ని ప్రత్యక్ష ఉదాహరణలు అని రాజకీయవేత్తలు చెప్తున్నారు.

యూపీఏ హయాంలో ఎన్ఏసీ

ప్రధానికి సలహాలు ఇవ్వటం కోసం యూపీఏ పాలనలో ఏర్పాటు చేసిన జాతీయ సలహా కమిటీ(ఎన్ఏసీ)లో అధికారపార్టీకి చెందినవారికే కాకుండా కాంగ్రెస్‌పార్టీ విమర్శకులకూ స్థానం దక్కిన విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ), మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్ గ్యారెంటీ స్కీం లను తీసుకురావటంలో ఎన్ఏసీ కీలక పాత్రను పోషించిందని రాజకీయనిపుణులు, మేధావులు, సామాజికవేత్తలు చెప్తున్నారు. అయితే, మోడీ పాలనలో మాత్రం అందరినీ కలుపుకొని పోవాలన్న సామాజిక స్పృహ కనబడటం లేదనీ, ఇలాంటి తరుణంలో దేశానికి ప్రస్తుతమున్న బలమైన ప్రతిపక్షం అవసరం అనివార్యమని వారు సూచిస్తున్నారు.



ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్

పదేండ్ల పాటు అధికారానికేగాక.. ప్రతిపక్ష హెూదాకూ దూరమైన కాంగ్రెస్ ఈ సారి బలంగా తయారైంది. 99 స్థానాలతో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఈ సభలో రాహుల్ గాంధీ తొలిసారిగా లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి హెూదాను పొందాడు. మోడీ సర్కారును పలు అంశాల్లో నిలదీశాడు. ప్రభుత్వ వైఫల్యాలను లేవనెత్తుతూ మోడీ సర్కారు చేస్తున్న మత రాజకీయాలను చర్చకు తీసుకొచ్చాడు. ఇతర విపక్ష సభ్యులు సైతం పలు అంశాల్లో మోడీ సర్కారు తీరును సభలో ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభ మోడీ సర్కారుకు అంత సులువేమీ కాదని నిపుణులు, విశ్లేషకులు అంటున్నారు.

రాహుల్ ప్రసంగాన్ని
వక్రీకరించారు

ఆయన దాడి బీజేపీ, ఆర్ఎస్ఎస్ పైనే

- హిందువులను హింసావాదులు అనలేదు
- సంసద్ టీవీ ఛానల్‌లో రాహుల్ ప్రసంగం



న్యూఢిల్లీ : ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిందూ సమాజాన్ని అవమానించారంటూ ఢిల్లీ నుండి గల్లీ వరకూ బీజేపీ నాయకులు విమర్శలు సంధిస్తున్నారు. రాహుల్ ప్రసంగానికి సంబంధించిన వీడియో ఇప్పుడు ఇంటర్నెట్‌లో దర్శనమిస్తోంది. అసలు రాహుల్ ఏమన్నారు? ఆయన యావత్ హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకొని కించపరిచారా? పదకొండు సెకన్ల పాటు కన్పించిన వీడియో క్లిప్‌లో రాహుల్ హిందీలో 'తమను తాము హిందువులుగా చెప్పుకుంటున్న వారు రోజుకు 24 గంటలూ హింస, విద్వేషం గురించే మాట్లాడుతున్నారు. అసత్యాలు చెబుతున్నారు' అని మాత్రమే అన్నారు.

అధికారిక ఛానల్‌లో ప్రసంగం

ఈ వివాదం వెనుక అసలు వాస్తవమేమిటో పరిశీలించాల్సిన అవసరం ఉంది. రాహుల్ తన ప్రకటనలో ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేశారు. రాహుల్ పూర్తి ప్రసంగ పాఠాన్ని సంసద్ టీవీ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేశారు. 'రాహుల్ గాంధీ వ్యాఖ్యలు : 18వ లోక్‌సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ' అనే శీర్షిక కింద రాహుల్ ప్రసంగం ఉంది.

నిర్మల వ్యాఖ్యలు

రాహుల్ ప్రసంగ వీడియోను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ షేర్ చేశారు. దానికి ఆమె రాసిన వ్యాఖ్య ఇలా ఉంది...'తనను తాను హిందువుగా పిలుచుకునే ప్రతి వ్యక్తినీ రాహుల్ హింసావాదిగా చిత్రించారు. ఇది హిందువుల పట్ల ఇండియా కూటమికి ఉన్న ద్వేషభావాన్ని, ధిక్కారాన్ని చూపుతోంది. ఇండియా కూటమిలోని ఆయన భాగస్వాములు కూడా హిందూ ద్వేషాన్ని నింపుకున్నారు. తమది ప్రేమ దుకాణమని చెప్పుకోవడంలో వారి కపటత్వం బయటపడింది'.

రాహుల్ ఏమన్నారు?

గత పది సంవత్సరాలుగా బీజేపీ ప్రభుత్వం ఓ పథకం ప్రకారం రాజ్యాంగంపై దాడి చేస్తోందని రాహుల్ తన ప్రసంగంలో విమర్శించారు. ఆ తర్వాత ఆయన శివుని చిత్రపటం గురించి మాట్లాడారు. భయాన్ని ఎలా జయించాలో, అహింసను ఎలా ఆచరించాలో తాను, ఇతర ప్రతిపక్ష నేతలు శివుడి నుండి నేర్చుకున్నామని తెలిపారు. అనంతరం ఆయన 'అభయముద్ర' గురించి మాట్లాడారు. ఇతరులను భయపెట్టవద్దని, వారిలో నెలకొన్న భయాన్ని పారద్రోలాలని, అహింసావాదులుగా మారేందుకు ఇతరులకు సాయపడాలని చెప్పారు. అన్ని మతాలు ధైర్యాన్ని గురించి చెబుతాయని అన్నారు. భయాన్ని వీడి అభయముద్రను ముందుకు తీసికెళ్లాలని ఇస్లాం, సిక్కిజం, క్రైస్తవం, జైనిజం ఉద్బోధించాయని వివరించారు. 'ఇతరులను చూసి భయపడవద్దని, ఇతరులను భయపెట్టవద్దని శివుడు చెప్పాడు. ఆయన అభయముద్రను చూపాడు. అహింసను గురించి మాట్లాడి తన త్రిశూలాన్ని నేలపై గుచ్చాడు. కానీ, తమను తాము హిందువులుగా చెప్పుకుంటున్న వారు రోజులో 24 గంటలూ హింస, ద్వేషం గురించి మాట్లాడుతున్నారు. అబద్ధాలు చెబుతున్నారు. మీరు హిందువులు కారు. సత్యం వైపు నిలవాలని, దాని నుంచి వెనక్కి మళ్లరాదని హిందూ మతం చెబుతోంది. నిజాన్ని చూసి భయపడవద్దని, అహింసే మన చిహ్నమని కూడా చెబుతోంది' అని రాహుల్ తన ప్రసంగంలో చెప్పారు.



వాతావరణ మార్పులతో
దోమల విజృంభణ

న్యూఢిల్లీ : జూన్ నెల నుండి కురిసే వానలు రైతులకు ఆనందాన్ని కలిగిస్తాయి. ఎందుకంటే ఖరీఫ్ సీజన్‌లో విత్తనాలు విత్తుకునేందుకు ఆ వానలు ఉపయోగపడతాయి. కానీ మండు వేసవిలో వర్షాలు పడితే ? ఫిబ్రవరి, మార్చి నెలల్లో కురిసే వర్షాల కారణంగా దోమలు విజృంభించి మలేరియా వ్యాప్తికి దోహదపడతాయి. నిలువ ఉండే నీటిలో దోమలు గుడ్లు పెడతాయి. వీటిని ఆ దశలోనే నిర్మూలించేందుకు క్రిమిసంహారకాలు పిచికారీ చేస్తుంటారు. అయినప్పటికీ దోమల స్వైరవిహారాన్ని పూర్తిగా అరికట్టలేకపోతున్నారు.

దోమల కారణంగా వ్యాపించే మలేరియా ప్రాణాంతక వ్యాధి. దోమ కుట్టిన 10-14 రోజుల తర్వాత వ్యాధి లక్షణాలు బయట పడతాయి. వర్షపు నీరు నిలువ ఉండే ప్రాంతాలలో దోమల తాకిడి అధికంగా ఉంటుంది. 2023వ సంవత్సరంలో విడుదలైన ప్రపంచ మలేరియా నివేదిక ప్రకారం 2022లో 85 దేశాల్లో 249 మిలియన్ల కేసులు నమోదయ్యాయి. 2021తో పోలిస్తే కేసుల సంఖ్య యాభై లక్షలు పెరిగింది. ప్రపంచంలో నమోదైన కేసుల్లో భారత్ వాటా 1.4%గా ఉంది. ఆగ్నేయాసియా ప్రాంతంలో నమోదైన ప్రతి మూడు కేసుల్లోనూ రెండు మన దేశంలో నమోదైనవే. అయితే 2020-21లో మలేరియా ప్రభావం అధికంగా ఉన్న 11 దేశాల్లో మన దేశంలో కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టడం ఊరట కలిగించే విషయం. మలేరియా మరణాలు కూడా తగ్గిపోయాయి.

మన దేశంలో 2016లో మలేరియా నిర్మూలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అప్పటి నుండి దేశంలో కేసుల సంఖ్య తగ్గుతోంది. 2030 నాటికి దశలవారీగా దోమలను నిర్మూలించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. అయితే వాతావరణంలో సంభవించే ఆకస్మిక మార్పుల కారణంగా దోమల నిర్మూలన ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

పాఠాలు నేర్వని పాలకులు

పేపర్ లీకేజీలపై అలసత్వం

- ప్రస్తుత చట్టాలు కోరలు తీసిన పాములు
- కఠిన చట్టాల రూపకల్పనలో సర్కారు ఉదాశీనత
- చట్టసభలో చర్చకు సైతం అనుమతించని ప్రభుత్వం



న్యూఢిల్లీ : విద్యా రంగంలో మన దేశం ప్రస్తుతం అనేక సమస్యలు ఎదుర్కొంటోంది. ఆ జాబితాలో తాజాగా పేపర్ లీకేజీలు చేరిపోయాయి. జాతీయ స్థాయి పరీక్షలైన నీట్, యూజీసీ-నెట్ పేపర్లు లీక్ కావడం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రశ్నాపత్రాల లీకేజీల వ్యవహారం పార్లమెంటును కూడా కుదిపేస్తోంది. పేపర్ లీకేజీల నేపథ్యంలో ఈ పరీక్షలను నిర్వహిస్తున్న జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) విశ్వసనీయతపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లక్షలాది మంది విద్యార్థుల భవితవ్యం అగమ్యగోచరంగా మారుతోంది. ఈ పరిస్థితులలో వారి భవిష్యత్తుకు పాలకులు ఏ విధంగా గ్యారంటీ ఇవ్వాలనే ప్రశ్న తలెత్తుతోంది.

జేఈఈ, సీ మ్యాట్ వంటి కీలక పరీక్షలను కూడా ఎన్టీఏ నిర్వహిస్తోంది. ఈ సంస్థ 1860వ సంవత్సరపు సొసైటీల రిజిస్ట్రేషన్ చట్టం కింద ఓ సొసైటీగా నమోదైంది. 2017వ సంవత్సరం వరకూ జాతీయ స్థాయి పరీక్షలన్నీ విడివిడిగానే జరిగేవి. ఎన్టీఏ ఉనికిలోకి వచ్చిన తర్వాత అవన్నీ ఒకే గొడుగు కింద జరుగుతున్నాయి. అయినప్పటికీ ఈ సంస్థపై ఆజమాయిషీ చేసే పార్లమెంటరీ చట్టమేదీ లేదు. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన, పనితీరుకు సంబంధించిన నిబంధనలేవీ దీనికి వర్తించడం లేదు.

చట్టాలు ఉన్నా ఫలితం సున్నా

పరీక్షల నిర్వహణలో మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు అనేక రాష్ట్రాలు చట్టాలు రూపొందించాయి. అయినప్పటికీ ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్ సహా పలు రాష్ట్రాలలో పేపర్ లీకేజీ ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. గత సంవత్సరం జనవరిలో ఉత్తరాఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్లు లీక్ అయ్యాయి. ఇలాంటి అనేక ఉదంతాలు చోటుచేసుకోవడం, నిరసనలు వెల్లువెత్తడంతో ఆ రాష్ట్ర ప్రభుత్వం ఓ ఆర్డినెన్స్ జారీ చేసింది. 2015 తర్వాత పేపర్ లీకేజీ జరగకుండా గుజరాత్‌లో ఒక్కటంటే ఒక్క ఉద్యోగ నియామక పరీక్షను కూడా ప్రభుత్వం నిర్వహించలేకపోయింది. ఈ నేపథ్యంలో గుజరాత్ శాసనసభ గత సంవత్సరం ఫిబ్రవరిలో ఓ చట్టాన్ని ఆమోదించింది. రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో కూడా ఇలాంటి చట్టాలు అమలులో ఉన్నాయి.

బీహార్, హర్యానా, మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు, మధ్యప్రదేశ్, ఒడిషా, పంజాబ్, తెలంగాణ, ఉత్తరాఖండ్ రాష్ట్రాలు సైతం చాలా కాలం క్రితమే చట్టాలు చేశాయి. పరీక్షల్లో అవకతవకలను అడ్డుకోవడానికి అనేక చట్టాలు ఉన్నప్పటికీ అక్రమార్కుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందడంతో జాతీయ స్థాయి పరీక్షా పత్రాల హ్యాకింగ్, లీకేజీలు డిజిటలైజ్ అవుతున్నాయి. ఇటీవల లీక్ అయిన నీట్ ప్రశ్నాపత్రాలు అనేకం ఆన్‌లైన్ అప్లికేషన్ 'టెలిగ్రామ్' ద్వారా బయటపడ్డాయి. డిజిటల్ మాధ్యమాల ద్వారా జరిగే అక్రమాలు, అవకతవకలను అడ్డుకునే చట్టాలేవీ ప్రస్తుతం అందుబాటులో లేవు. కేంద్రం ఈ సంవత్సరమే తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్ చట్టంలోనూ ఎలాంటి చర్యలు సూచించలేదు.

నష్టపోతున్నది విద్యార్థులే

పరీక్షా పత్రం రద్దయినా, లీక్ అయినా లేదా పరీక్ష వాయిదా పడినా నష్టపోతున్నది లక్షలాది మంది విద్యార్థులే. సంవత్సరాల తరబడి కష్టపడి చదివి పరీక్షకు హాజరైతే తీరా అది రద్దు కావడమో, వాయిదా పడడమో జరుగుతోంది. దీంతో విద్యార్థులు ఆర్థికంగానే కాకుండా మానసికంగా కూడా దెబ్బ తింటున్నారు. తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నారు. వారి తల్లిదండ్రులపై కూడా ఆర్థిక భారం పడుతోంది. విద్యా వ్యవస్థ పైనే నమ్మకం సడలిపోతోంది. పరీక్షల నిర్వహణలో అక్రమాలు, అవకతవకలు జరగకుండా నివారించేందుకు ప్రభుత్వం మరిన్ని కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

నోటిఫై కాని చట్ట నిబంధనలు

ప్రభుత్వ పరీక్షల్లో ఛీటింగ్, అవాంఛనీయ పద్ధతులను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం నూతన చట్టాన్ని రూపొందించింది. ఈ చట్టం ద్వారా అవకతవకలకు పాల్పడే వ్యక్తులు, సంస్థలకు కఠినమైన జరిమానాలు, జైలుశిక్షలు విధించవచ్చు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై అధికారులే తీవ్రమైన చర్యలు తీసుకోవచ్చు. అభ్యర్థులందరికీ నిస్పాక్షిక, పారదర్శక ప్రక్రియను వర్తింపజేయడం ద్వారా వివిధ పరీక్షలపై వారిలో విశ్వాసాన్ని పునరుద్ధరించడమే ఈ చట్టం ఉద్దేశం. కేంద్రం ఫిబ్రవరిలో ఈ బిల్లును ప్రవేశపెట్టింది. దాని నిబంధనలను ఇంకా నోటిఫై చేయలేదు. ఈ లోగానే దేశంలో అనేక పేపర్ లీకేజీల ఘటనలు వెలుగు చూశాయి.

ప్రభుత్వ మొండి వైఖరి

నీట్ పరీక్షా పత్రాల లీకేజీపై పార్లమెంటులో చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుపడుతుంటే ప్రభుత్వం మాత్రం ససేమిరా అంటోంది. కనీసం ప్రతిపక్ష సభ్యులు మాట్లాడేందుకు కూడా స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మైక్ సైతం కట్ చేశారు. సమస్యల పరిష్కారానికి, ప్రజలలో విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు చట్టసభలలో తప్పనిసరిగా చర్చలు జరగాల్సి ఉంటుంది. కానీ దురదృష్టవశాత్తూ మోడీ ప్రభుత్వం అందుకు సుముఖంగా లేదు. చర్చకు నిరాకరించడం అంటే ప్రజాస్వామ్య ప్రక్రియకు విఘాతం కలిగించడమే అవుతుంది.

ఆత్మపరిశీలన అవసరం

జాతీయ స్థాయి పరీక్షా పత్రాలు లీక్ కావడం ఇది మొదటిసారి కాదు. అయినప్పటికీ ఆ వైఫల్యాల నుండి పాలకులు పాఠాలు నేర్చుకోవడం లేదు. ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞానం వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో లీకేజీలను ఎలా అరికట్టాలన్న విషయంపై ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఉంది. లీకేజీలను అరికట్టేందుకు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలో మార్పులు చేయడమో లేదా డిజిటల్ నేరాలకు అడ్డుకట్ట వేయడానికి కొత్తగా మార్గదర్శకాలు జారీ చేయడమో చేయాల్సి ఉంది. దీనిపై ప్రభుత్వం, అధికారులు దృష్టి సారిస్తే లక్షలాది విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసిన వారు అవుతారు.

సంపాదకీయం

అసలు సమస్యలు అటకెక్కించి..



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభలనుద్దేశించి చేసిన ప్రసంగం మోడీ ప్రభుత్వ మెచ్చుకోళ్లు తప్ప దేశ ప్రజల బాధల్ని, సమస్యల్ని పట్టించుకోనేలేదు. ఎన్నికల అనంతరం ఏర్పడిన కొత్త ప్రభుత్వ విధానాలను వెల్లడించాల్సిన ఈ ప్రసంగం పాత చింతకాయ పచ్చడిలా సాగింది. నీట్ దోషులను శిక్షిస్తామనడం తప్ప కొత్త విషయమేమీ చెప్పలేదు. ఇటీవలి ఎన్నికల్లో ప్రజలు ప్రధానమైనవిగా భావించిన అధిక ధరలు, పెరిగిన నిరుద్యోగం వంటి సమస్యలను వాటికి పరిష్కారాలను లేదా కనీస ఉపశమనం కల్పించడం గురించైనా పేర్కొనకపోవడం సబబు కాదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తున్న వైనాన్ని ప్రస్తావించకుండా ప్రభుత్వ సుపరిపాలన గురించి గొప్పలు చెప్పారు. ఎన్నికల్లో ముఖ్యంగా ఉత్తరాదిన చర్చనీయాంశమైన అగ్ని పథ్ ఊసే ఎత్తలేదు. పార్లమెంటరీ వ్యవస్థపై విశ్వాసం గురించి సుదీర్ఘంగా సూక్తులు వల్లించిన ఆ ప్రసంగంలో 17వ లోక్‌సభలో ప్రతిపక్షాలు మాట్లాడేందుకు ప్రభుత్వం అనుమతించలేదనే విషయాన్ని ఉద్దేశపూర్వకంగానే విస్మరించారు. స్వయానా రాష్ట్రపతి ముర్ము ఆదివాసీ అయినప్పటికీ మణిపూర్ ఆదివాసీలపై జరుగుతున్న దాడులను, హత్యల గురించిన ప్రస్తావనే చేయలేదు. ముఖ్యమైన ఎలాంటి చర్చ లేకుండా గిలెటెన్ చేయడం, సభలో హోంమంత్రి వివరణ ఇవ్వాలని కోరినందుకు 140 మంది ప్రతిపక్ష ఎంపీలను సస్పెండ్ చేయడం వంటివన్నీ మరచిపోయి పార్లమెంటు సక్రమంగా జరగాలని రాష్ట్రపతి హితోపదేశం చేయడం సర్కారు నిరంకుశ చరిత్రను కప్పిపెట్టే ప్రయత్నం తప్ప వేరేమీ కాదు.

> నిన్న, ఈ రోజు, లోక్‌సభలో ప్రతిపక్షాలు సమైక్యంగానే మోడీ అప్రజాస్వామిక చర్యల్ని, కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్న విషయాలను లేవనెత్తి గట్టిగా నిలదీయగలిగాయి. చర్చకు సమాధానంగా మాట్లాడిన ప్రధాని కూడా ఏ ఒక్క సమస్యకూ సమాధానం చెప్పలేకపోయారు. కేవలం వారి గెలుపుల గురించి గప్పాలు పలకడం తప్ప ప్రజా సమస్యలు ప్రస్తావించలేదు. ఈ పరిస్థితులన్నింటినీ సభలోపల, వెలుపల ప్రశ్నించాల్సి ఉంది.

గత పదేళ్లుగా దేశంలో మోడీ ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని కొనసాగిస్తున్న సంగతి వదిలేసి 1975 ఎమర్జెన్సీ గురించి రాష్ట్రపతి తన ప్రసంగంలో ప్రస్తావించారు. ప్రభుత్వరంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులు బుక్ అడ్జెస్ట్‌మెంట్ చేసి తగ్గినట్టుగా చూపగా అదంతా మోడీ సర్కారు గొప్పతనంగా ముర్ము పేర్కొనడం మసిబూసి మారేడుకాయ చేయడమే! వివక్షాపూరితమైన పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)ను గొప్పగా ప్రస్తుతించారు. మతపరంగా వివక్ష చూపుతున్న ఆ చట్టానికి వ్యతిరేకంగా దేశ వ్యాపితంగా ఆందోళనలు సాగితే దాని గురించి ప్రస్తావించకుండా విదేశాల నుంచి వచ్చే శరణార్థులకు హుందాగా జీవించేందుకు ఇది ఉపయోగపడుతుందని రాష్ట్రపతి సెలవివ్వడం వక్రభాష్యం చెప్పడమే. ప్రజాస్వామ్య ప్రియులు ఆందోళనలు చేసినా పట్టించుకోకుండా పార్లమెంటు ఉభయ సభల్లో ఎలాంటి చర్చ లేకుండా ఆమోదింపజేసుకున్న కొత్త క్రిమినల్ చట్టాలు జులై ఒకటి నుంచి అమలులోకి రానున్నాయని రాష్ట్రపతి చెప్పడం మోడీ సర్కారు నిరంకుశ చర్యలను మరింత ముందుకు నెట్టడమే! రాజ్యాంగంలోని 370 అధికరణం రద్దు గురించి కూడా రాష్ట్రపతి గొప్పగా చెప్పడం దారుణమైన విషయం. ప్రకృతి సేద్యాన్ని గురించి, గ్లోబల్ మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఆర్గానిక్ పంటలకు ప్రాధాన్యతనిస్తామని చెప్పారు. గరీబ్ కల్యాణ్ యోజన, ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలను వల్లె వేశారు. మహిళా రిజర్వేషన్ చట్టం ఇంకా ఆచరణకు రాకపోయినా మహిళా సాధికారతకు ఎంతగానో తోడ్పడుతుందని చెప్పడం అంతుపట్టని అంశం. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎఫ్‌పిఓలతో పెద్ద నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసిందని గొప్పగా పేర్కొన్న రాష్ట్రపతి మద్దతు ధరల చట్టం గురించి మాట్లాడకపోవడం అన్నదాతల పట్ల ఈ సర్కారు చిన్నచూపునకు నిదర్శనం.

రాష్ట్రపతి ప్రసంగం ఆసాంతం స్వోత్కర్ష పరనిందగానే సాగడం విచారకరం. గడచిన రెండు సాధారణ ఎన్నికలకు భిన్నంగా భారత ప్రజలు బీజేపీకి సొంతంగా మెజార్టీని ఇవ్వకపోయినా మోడీ-అమిత్ షా ద్వయం గతంలో మాదిరిగానే పాలన సాగించాలని ప్రయత్నిస్తున్నారనడానికిది తాజా తార్కాణం. ప్రజలిచ్చిన తీర్పును తుంగలో తొక్కాలని చూస్తున్న ఇటువంటి ప్రయత్నాలను ప్రతిపక్షాలు ఉమ్మడిగా ప్రతిఘటించాలి.

భారత రాజ్యాంగానికి, దాని మౌలికమైన ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజాన్ని దెబ్బ తీస్తున్న కార్పొరేట్ మతతత్వ సర్కారు ఆటలు సాగనివ్వరాదు. నిన్న, ఈ రోజు, లోక్‌సభలో ప్రతిపక్షాలు సమైక్యంగానే మోడీ అప్రజాస్వామిక చర్యల్ని, కార్పొరేట్లకు దేశ సంపదను దోచి పెడుతున్న విషయాలను లేవనెత్తి గట్టిగా నిలదీయగలిగాయి. చర్చకు సమాధానంగా మాట్లాడిన ప్రధాని కూడా ఏ ఒక్క సమస్యకూ సమాధానం చెప్పలేకపోయారు. కేవలం వారి గెలుపుల గురించి గప్పాలు పలకడం తప్ప ప్రజా సమస్యలు ప్రస్తావించలేదు. ఈ పరిస్థితులన్నింటినీ సభలోపల, వెలుపల ప్రశ్నించాల్సి ఉంది.

ఈ నగరానికి ఏమైంది?

ఈ నగరానికి ఏమైంది? ఓవైపు దోమల బెడద, మరోవైపు మూసీ నది, ఇంకోవైపు మురుగునీరు, డ్రెయినేజీ కంపు.పేరుకు మాత్రం పెద్దనగరమే కానీ సమస్యలకు నిలయంగా మారింది.430 సంవత్సరాల చరిత్ర కలిగిన హైదరాబాద్ దేశంలోని ప్రధాన నగరాల్లో ఒకటి. బలమైన ఐటీ రంగం, అభివృద్ధి చెందుతున్న రియల్ ఎస్టేట్ రంగం, గొప్ప సాంస్కృతిక వారసత్వంతో సందడిగా ఉన్న మహానగరం. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు, ఆసుపత్రులు నైపుణ్యం కలిగిన శ్రామికశక్తికి ప్రధాన వనరు. పెరల్ సిటీ ఇప్పుడు మైక్రోసాఫ్ట్, గూగుల్, టిసిఎస్ వంటి కంపెనీలతో ప్రపంచంలోని గ్లోబల్ ఐటి కేంద్రాలలో ఒకటిగా మారింది. ఇది భారతదేశానికి ఫార్మా రాజధానిగా కూడా అభివృద్ధి చెందుతోంది. పైన పేర్కొన్న అన్ని సానుకూల కారణాల వల్ల, నగరం పెట్టుబడులు ఉపాధికి ఆకర్షణీయంగా ఉంది. హైదరాబాద్‌ను ముందస్తుగా పాదచారులకు అనుకూలమైన నగరంగా మార్చడంలో భాగంగా, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదించిన 22 ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌లలో ఎనిమిది పనులు ప్రారంభమయ్యాయి, మిగిలిన 14 పనులు జరుగుతున్నాయి.



రూ.75.65 కోట్లతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులు తుదిదశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతమున్న ఎఫ్ఓబీలను వినియోగించే వారు తక్కువేనన్నది వాస్తవం. ఇది నాణానికి ఒకవైపు మాత్రమే. మరోవైపు నగరం అనేక సమస్యలతో అతాలకుతలమవుతున్నది.

నగరంలో బ్రిడ్జిలు ఫ్లైఓవర్ నిర్మాణం నత్తనడగా సాగుతున్నాయి. ఉప్పల్ నుండి మేడిపల్లి బ్రిడ్జి, ఆరాంఘర్ నుండి జూ పార్క్ వరకు, రామంతాపూర్ బ్రిడ్జి, సంతోష్‌నగర్- మలక్ పేట బ్రిడ్జి, సుచిత్ర- కొంపల్లి బ్రిడ్జి పనులు మరచి పోయినట్టున్నారు. ఆరేండ్ల క్రితం ప్రారంభించిన పనులు కాంట్రాక్టర్లు, అంచనాలు, ప్రభుత్వాలు మారి తప్పు మాది కాదని తప్పించు కుంటున్నారు. ట్రాఫిక్ జాం, ప్రమాదాలు నిత్యకృత్య మయ్యాయి. ప్రజలు కూడా ఏం చెద్దాంలే అన్నట్టుగా అలవాటు పడ్డారు. నగరంలో నలభై శాతం రోడ్లు డ్రెయినేజీ నీటితో తడిసి ముద్దవుతున్నాయి. రోడ్లపై నుంచి డ్రెయినేజీ నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. చాలా పోష్ లోకాలిటీ అలాగే గ్రీన్ ఛాలెంజిలో ఉత్తమ కాలనీలుగా గుర్తింపు పొందిన కాలనీలు సైతం డ్రెయినేజీ కంపుతో సతమతమవుతున్నాయి. నలభై ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ వాటి మీద పెద్ద పెద్ద చెట్లు, చెట్ల వేర్లు డ్రెయినేజీ పైప్ లైన్ ధ్వంసమైన ఆనవాళ్లు చాలా చోట్ల ఉన్నాయి. సైనిక్ పురి, వాయుపురి, పెద్ద భవంతులు విశాలమైన రోడ్లపై మురుగు నీరు ధారావాహికంగా ప్రవహిస్తున్నాయి. ఈ సమస్యల్ని గుర్తించి సామాజిక మాధ్యమాల ద్వారా పోస్టులు పెట్టినా జీహెచ్ఎంసీ, సీవేజ్ బోర్డు అధికారుల్లో చలనం లేదు. ఏయస్ రావు నగర్, మహాత్మా గాంధీ బస్తీ, మౌలాలీ, రాధిక దగ్గర మురుగు నీరు మోకాలి లోతు వెళుతున్నా, పట్టించుకున్న దాఖలాలు లేవు. మ్యాన్‌హోల్ ధ్వంసమై రోడ్లు గుంతలుగా మారాయి. నాలుగు కర్రలు నాటి ప్లాస్టిక్ బాక్సులు పెట్టి హెచ్చరిక బోర్డు పెడుతున్నారు. శాశ్వత పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేద్దామన్న స్పృహ అధికారులకు, కార్పొరేటర్లకు లేకుండా పోయింది. ఇటీవల పద్మారావునగర్‌లో విష సర్పాలు సంచరిస్తున్నాయని చెప్పినా అధికారులు పట్టించుకోక పోవడంతో స్థానికుడు పామును ప్లాస్టిక్ డబ్బాలో తీసుకుని వెళ్లి ఎమ్మెల్యే దగ్గర ప్రదర్శించి నిరసన తెలిపాడు.

పెరిగిన జనాభాకు అనుగుణంగా పాత డ్రెయినేజీ పైపులైన్ సామర్థ్యం సరిపోకపోవడంతో తరుచూ మ్యాన్‌హోల్స్ పొంగి మురుగు రోడ్లపై పారుతుండటంతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్తున్నారు. మురుగు నీటి సమస్య వల్ల దుర్వాసన, దోమలు వృద్ధి చాలా అవస్థలు పడుతున్నారు. డ్రెయినేజీ చాంబర్ నుంచి మరుగునీరు ప్రవహిస్తూ రోడ్డు పై వెళుతున్న పాదచారులపై పడుతున్నా ఎవరరూ పట్టించుకోవడం లేదు. గృహాలకు సంబంధించిన డ్రెయినేజీ నీరు చాంబర్ ద్వారా పొంగి రోడ్డుపై ప్రవహిస్తుండడంతో కంపుకొడుతుందని స్థానికులు వాపోతున్నారు. ఈ డ్రైనేజీ నీటి పారుదలతో పందుల సంచారం, ఈగలకు, దోమలకు నిలయంగా మారింది. ఇప్పటికైనా సీవేజి అధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. డ్రెయినేజీ వ్యవస్థను సక్రమంగా పునరుద్ధరించి, రోడ్డు పైకి నీరు చేరకుండా సత్వరమే చర్యలు తీసుకోవాలి. దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందిన రాజధాని నగరం హైదరాబాద్‌ను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని అభివద్ధి చేయాల్సిన అవసరం ఉన్నది.

- డా.యం. సురేష్ బాబు

ఐఎంఎఫ్ భారాలకు కెన్యాలో ప్రతిఘటన!



ఎం కోటేశ్వరరావు
8331013288

జనంపై భారాలు మోపుతూ పార్లమెంటు ఆమోదించిన విత్త బిల్లుకు వ్యతిరేకంగా జూన్ 25న కెన్యాలో నిరసన ప్రదర్శనలు జరిగాయి. ఈ సందర్భంగా 26 మంది కాల్పుల్లో మరణించగా అనేకమంది గాయపడినట్లు దేశ మానవహక్కుల కమిషన్ ప్రకటించింది.మృతుల సంఖ్య 30 దాటినట్లు వార్తలు వచ్చాయి. దేశ పార్లమెంటు భవనానికి నిరసనకారులు నిప్పు పెట్టటంతో సహా అనేక చోట్ల లూటీలు, దహనకాండకు పాల్పడినట్లు సమాచారం. దీంతో బిల్లుపై తాను సంతకం పెట్టడం లేదంటూ అధ్యక్షుడు విలియమ్స్ రూటో ప్రకటించాడు. అయినప్పటికీ నమ్మకం లేక రాజీనామా చేయాలని కోరుతూ జూలై రెండున తిరిగి ప్రదర్శనలకు పిలుపునిచ్చారు. రాజధాని నైరోబీలో పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ(ఐఎంఎఫ్), ప్రపంచ బ్యాంకులను బ్రెట్టన్ ఉడ్ కవలలు అంటారు. అక్కడ జరిగిన సమావేశాల్లో అవి పుట్టాయి గనుక ఆ పేరు వచ్చింది. ప్రజాకంటకుల పుట్టుక కూడా మామూలుగానే జరిగినప్పటికీ వారు పెరిగి పెద్దవారైన తరువాత మాత్రమే సమాజానికి ముప్పుగా చివరకు జనం చేతిలో తుప్పుగా మారతారు.కానీ ఈ కవలలు అలాంటివి కాదు. పుట్టుకతోనే వాటి దగ్గరకు వెళ్లిన దేశాలకు స్పాట్ పెడుతున్నాయి.ప్రపంచ బ్యాంకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను తమ విధానాలకు ముఖ్యంగా విద్యుత్ సంస్కరణలకు ఒక ప్రయోగశాలగా మార్చిన సంగతి తెలిసిందే. వాటికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం, పర్యవసానంగా చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో పరాజయం పాలైన విషయాన్నీ వేరే చెప్పనవసం లేదు.

ఆఫ్రికా ఖండంలోని తూర్పు ప్రాంతంలో ఉన్న ఒక దేశం కెన్యా. హిందూ మహాసముద్ర తీరంలో ఉన్న ఈ దేశ జనాభా 5.22 కోట్లు. రాజధాని నైరోబీ. ఐరోపా సామ్రాజ్యవాదుల వలసగా ఉంది. బ్రిటీష్ పాలకులు తొలుత తమ రక్షక ప్రాంతంగా, తరువాత వలసగా మార్చారు.1952 నుంచి ప్రారంభమైన మౌమౌ విప్లవంగా పిలిచిన ఉద్యమం కారణంగా 1963లో స్వతంత్రదేశంగా ఆవిర్భవించింది.ఆఫ్రికాలో ఆర్థికంగా అభివృద్ధి, ప్రజాస్వామిక వ్యవస్థతో స్థిరంగా ఉన్న దేశంగా చెబుతారు.అలాంటిది గతంలో ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా వీధుల్లోకి వచ్చిన జనాలపై భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో 30 మందికి పైగా మరణించారని, నేరస్త ముఠాల చేతుల్లో గితురాయి అనే చోట 250 మంది మరణించినట్లు, వారి మృతదేహాలను కూడా లభ్యం కావటం లేదని, అనేక మంది అపహరణలకు గురైనట్లు వార్తలు వచ్చాయి.పౌరులపై భారాలను మోపే ఆర్థిక బిల్లుకు పార్లమెంటు ఆమోదం తెలిపిన వెంటనే ఆందోళన తలెత్తింది. దాంతో బిల్లును నిలిపివేస్తున్నట్లు అధ్యక్షుడు విలియం రూటో ప్రకటించినప్పటికీ నివురుగప్పిన నిప్పులా పరిస్థితి ఉంది. అతగాడి మాటల మీద తమకు నమ్మకం లేదంటూ రూటో రాజీనామా చేసి గద్దె దిగాల్సిందేనంటూ యువత అనేక పట్టణాల్లో ప్రదర్శనలు జరిపింది. మిలిటరీ కవాతులతో భయపెట్టాలని చూసినా బెదరటం లేదు. మరో శ్రీలంకగా మారినా ఆశ్చర్యం లేదు.

ఎందుకీ పరిస్థితి వచ్చింది? దేశం అప్పులపాలైంది. దేశ, విదేశీ అప్పు 80 బిలియన్ డాలర్లు దాటింది. వాటిని గడువులోపల తీర్చే పరిస్థితి కనిపించటం లేదు.దివాలా ప్రకటిస్తే పరిస్థితి మరింత దిగజారుతుంది. దాంతో ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు దగ్గరకు వెళ్లింది. మేం చెప్పిన షరతులకు అంగీకారం తెలిపితే ఇబ్బందుల నుంచి బయటపడవేస్తామని అవి చెప్పాయి. ఆ మేరకు ప్రభుత్వం 2021లో ఒప్పందం చేసుకుంది. బ్రెట్టన్ ఉడ్ కవలలు, ఇతర అంతర్జాతీయ సంస్థలన్నీ ముందుగా అప్పెలా తీరుస్తారో చెప్పమంటాయి. వెంటనే, మీరేమీ చెప్పలేరుగానీ మేం చెప్పినట్లు చేయండి, వాటికి మీ పేరు పెట్టుకోండి అంటాయి. ఇదిగో అలాంటి ఒప్పందంలో భాగంగానే కెన్యా పార్లమెంటు ఆమోదించిన 2024 విత్త బిల్లు. దాని ప్రకారం నిత్యావసర వస్తువులు, పిల్లలకు మార్చే డైపర్లతో సహా అనేక వస్తువులపై ఎడాపెడా పన్నులను పెంచాలని ప్రతిపాదించారు. ఇప్పటికే పెరిగిన నిరుద్యోగం, ధరల పెరుగుదలతో అతలాకుతలంగా ఉన్న పరిస్థితి మరింత దిగజారనుందనే భయంతో జనం నిరసనలకు దిగారు. ఆగ్రహం ఎలా ఉందంటే పార్లమెంటు భవనానికి నిప్పు పెట్టారు. ఎంపీలందరూ బతుకుజీవుడా అంటూ పారిపోయారు.అయినా తగ్గేదే లే అన్నట్లుగా అధ్యక్షుడి వైఖరి ఉండటంతో ఆందోళన విస్తరించింది.దాంతో బిల్లు మీద సంతకం చేయటం లేదని ప్రకటించాడు. ఇదంతా ఒక నాటకమని, వ్యవధి తీసుకొనేందుకు వేసిన పాచిక అని చెబుతున్నారు.నిజానికి జనంలో ఆగ్రహం ఇప్పటికిప్పుడు పెరిగింది కాదు. కరోనాకు ముందు పరిస్థితి దిగజారటం ప్రారంభమైంది, కరోనా మరింత దెబ్బతీసింది. అనేక మంది యువతకు ఉపాధిపోయింది. గతేడాది వేసవిలోనే పన్నుల వ్యతిరేక నిరసనలు జరిగాయి. ఉపాధి, పరిశ్రమలు పెద్దగా పెరగకపోయినా అనేక దేశాల్లో విదేశీ సంస్థలు ఇచ్చే రుణాలు, వాటితో పాటు దొరికే ముడుపులకు ఆశపడి ఆర్థిక వ్యవస్థ అవసరాలతో నిమిత్తం లేకుండా పెద్ద ఎత్తున రోడ్ల వంటి మౌలిక సదుపాయాలకు గాను దొరికిన మేర అప్పులు చేసిన దేశాలలో కెన్యా ఒకటి.రెండువేల సంవత్సరాల ప్రారంభంలో విదేశాల నుంచి తీసుకున్న భారీ మొత్తాలను ఆర్థిక వృద్ధికి ఖర్చు పెట్టలేదు.దానికి తోడు వరదలు, కరోనా జతకలిశాయి.

దివాలా కోరు ఆర్థిక విధానాలను అనుసరిస్తున్న అన్ని వర్ధమాన దేశాల మాదిరే కెన్యా కూడా ఉంది.ప్రపంచంలో మూడు వందల కోట్ల మంది జనాభా ఉన్న దేశాలు ప్రజారోగ్యం, వైద్యం వంటి వాటికి చేస్తున్న ఖర్చు కంటే రుణాల అసలు, వడ్డీలు తీర్చటానికి ఎక్కువ మొత్తాలను ఖర్చు చేస్తున్నట్లు ఓపెన్ సొసైటీ ఫౌండేషన్ అధ్యక్షుడు బినాయిఫెర్ నౌరోజీ చెప్పాడు. వలసవాద అవశేషాలు, అవినీతి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, విత్త దుర్వినియోగం. పెరిగిన ఆర్థిక, తెగల మధ్య అసమానతల వంటి అంశాలు కెన్యాను పట్టిపీడిస్తున్నాయి. వీటన్నింటినీ తొలగించి మంచి రోజులను తెస్తానంటూ అనేక సంవత్సరాలు మంత్రిగా, ఐదేండ్ల పాటు ఉపాధ్యక్షుడిగా పని చేసిన విలియం రూటో 2022 ఎన్నికల్లో అధ్యక్షుడయ్యాడు. రెండు సంవత్సరాల్లోనే తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించి ప్రజా వ్యతిరేకిగా రుజువు చేసుకున్నాడు. తాజా విత్త బిల్లును ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఉద్దేశించారు. దానికి గాను పొదుపు అని ముద్దు పేరు పెట్టారు. చూడండి నా కార్యాలయ ఖర్చుకే కోతపెడుతున్నా అంటూ రూటో ప్రకటించాడు. ఇదంతా జనం మీద మోపే భారాలకు నాంది. ప్రపంచంలో పొదుపు చర్యలు ఎక్కడ తీసుకున్నప్పటికీ తొలుత కోతల వేటు పడేది



> వలసవాద అవశేషాలు, అవినీతి, ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం, విత్త దుర్వినియోగం. పెరిగిన ఆర్థిక, తెగల మధ్య అసమానతల వంటి అంశాలు కెన్యాను పట్టిపీడిస్తున్నాయి. వీటన్నింటినీ తొలగించి మంచి రోజులను తెస్తానంటూ అనేక సంవత్సరాలు మంత్రిగా, ఐదేండ్ల పాటు ఉపాధ్యక్షుడిగా పని చేసిన విలియం రూటో 2022 ఎన్నికల్లో అధ్యక్షుడయ్యాడు. రెండు సంవత్సరాల్లోనే తన నిజ స్వరూపాన్ని ప్రదర్శించి ప్రజా వ్యతిరేకిగా రుజువు చేసుకున్నాడు. తాజా విత్త బిల్లును ప్రభుత్వ ఆదాయాన్ని పెంచుకొనేందుకు ఉద్దేశించారు. దానికి గాను పొదుపు అని ముద్దు పేరు పెట్టారు. చూడండి నా కార్యాలయ ఖర్చుకే కోతపెడుతున్నా అంటూ రూటో ప్రకటించాడు. ఇదంతా జనం మీద మోపే భారాలకు నాంది. ప్రపంచంలో పొదుపు చర్యలు ఎక్కడ తీసుకున్నప్పటికీ తొలుత కోతల వేటు పడేది సామాన్యులు, వారికి ప్రభుత్వం చేసే ఖర్చుల మీదే.

సామాన్యులు, వారికి ప్రభుత్వం చేసే ఖర్చుల మీదే.అన్నింటికీ ఒక్కసారే కోతపెడితే జనం సహించరు. చేదు మాత్రను మింగించటం అలవాటు చేసినట్లుగా దశల వారీ మొదలు పెడతారు. కెన్యా రాబడిలో 60శాతం రుణాలు తీర్చేందుకే పోతోంది. అందువలన నేరుగా చేసే నగదు బదిలీల మొత్తాల కోత, చివరకు బడి పిల్లల మధ్యాహ్న భోజనఖర్చునూ తగ్గించనున్నారు.

పశ్చిమ దేశాలకు, ప్రత్యేకించి అమెరికా తొత్తుగా అధ్యక్షుడు విలియమ్ రూటో వ్యవహరిస్తున్నాడని కెన్యా కమ్యూనిస్టు పార్టీ విమర్శించింది. గద్దె దిగేవరకూ ఆందోళన చేస్తామని ప్రకటించింది. రాజీనామా మినహా మరొకదాన్ని అంగీకరించేది లేదంది. గాజాలో మారణకాండ జరుపుతున్న యూదు దురహంకార ఇజ్రాయిల్ పాలకులకు, ఉక్రెయిన్ వివాదంలో నాటోకు మద్దతు ఇచ్చాడు. ఇటీవల కెన్యాను నాటో ఏతర భాగస్వామిగా ప్రకటించారు. సిఐఏ అల్లుతున్న కథలన్నింటినీ వల్లిస్తున్నాడు. అమెరికా మిలిటరీ కార్యకలాపాలకు మండా అనే దీవిని అప్పగించాడు. దేశీయంగా ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు జరుపుతున్నట్లు కమ్యూనిస్టు పార్టీ పేర్కొన్నది. ఒకసారి పార్లమెంటు ఆమోదించిన బిల్లును వెనక్కు తీసుకోవటానికి రాజ్యాంగం అనుమతించదని, ఒక వేళ అధ్యక్షుడు వెనక్కు పంపితే మూడింట రెండువంతుల మెజారిటీతో ప్రతిపాదనను ఆమోదిస్తే అది చట్టమై కూర్చుంటుందని చెప్పింది. పార్లమెంటు బిల్లును ఆమోదించిన తరువాత 14రోజుల్లో అధ్యక్షుడు ఆమోదం తెలపాల్సి ఉంటుంది, లేదా సవరణలు చేయాలంటూ వెనక్కు పంపాలి.

రొట్టెలపై 16, వంటనూనెలపై 25శాతం పన్ను ప్రతిపాదించారు.ఆర్థిక లావాదేవీలపై దశలవారీ పన్ను పెంపుదల, మోటారు వాహనాల ధరలో రెండున్నరశాతం ప్రతి ఏటా పన్ను కొత్తగా విధింపు, పర్యావరణానికి హాని కలిగించే వృధా ఉత్పత్తులపై పన్ను ప్రతిపాదించారు. దీనిలోనే దిగుమతి చేసుకొనే ఎలక్ట్రానిక్ వస్తువులు, శానిటరీ పాడ్‌ల మీద పన్ను ప్రతిపాదించారు. జిఎస్‌టి 16శాతం, ఆసుపత్రుల్లో వాడే పరికరాలు, నిర్మాణ సామగ్రి మీద కూడా పన్ను ప్రతిపాదించారు.ఉద్యోగుల వేతనాలపై గరిష్ట పన్ను మొత్తాన్ని 30 నుంచి 35శాతానికి పెంచగా, కొత్తగా 1.5శాతం ఇంటి పన్ను, వైద్య బీమా పేరుతో 2.75శాతం, ఇంధనంపై ఎనిమిదిశాతంగా ఉన్న పన్నును 16శాతానికి పెంచుతూ ప్రతిపాదించారు. పన్నుల పెంపుదల బాధాకరమే అయినప్పటికీ మన స్వాతంత్ర్య సమర యోధులు గర్వపడాలంటే జనం త్యాగాలు చేయాల్సి ఉంటుందని అధ్యక్షుడు సమర్థించుకున్నాడు. తనకు గత ప్రభుత్వం నుంచి 65 బిలియన్ డాలర్ల అప్పు వారసత్వంగా వచ్చిందన్నాడు. రానున్న కాలంలో పన్ను వసూలు రోజులను కూడా పాటించాల్సి ఉంటుందేమో అంటూ జోకులు వేశాడు. ఏడాది కాలంలో 40సార్లు విదేశీ పర్యటనలు జరిపిన రూటో అట్టహాసంగా ఎంతో ఖర్చు చేశాడు. ఎందుకీ పర్యటనలు అంటే పెట్టుబడుల సాధన, ఉద్యోగ అవకాశాలను వెతికేందుకు అని సమర్థించుకున్నాడు. ఇదే సమయంలో అనేక సంస్థలు మూతబడి వేలాది మందికి ఉపాధి పోయింది.రానున్న రోజుల్లో ఇంకా కార్యకలాపాలను కుదించవచ్చని కెన్యా యజమానుల సంఘం పేర్కొన్నది.జనం దగ్గర డబ్బులేక రోజుకు ఏడువందల గ్యాస్ సిలిండర్లు అమ్మే తాను ప్రస్తుతం రెండువందలకు పడిపోయినట్లు, తన దగ్గర ఉన్న సిబ్బందిని ఆ మేరకు తగ్గించినట్లు ఒక సంస్థ యజమాని చెప్పాడు. ప్రభుత్వ సిబ్బంది పన్ను వసూలు పేరుతో వ్యాపారులను వేధిస్తున్నట్లు చెప్పాడు. గత పాలకుల హయాంలో జరిగిన అవినీతి, ఆశ్రిత పక్షపాతం, జనాన్ని పట్టించుకోకపోవటం వంటి అంశాలను తీసుకొని తాము వస్తే మంచి రోజులు తెస్తామని చెప్పి, అంతకంటే ఎక్కువ భారాలు మోపిన వారిని చరిత్రలో ఎందరో ఉన్నారు. శ్రీలంకలో తాము అభిమానించిన దేశాధ్యక్షుడినే జనం చివరకు తరిమి కొట్టిన తీరును చూశాము. కెన్యాలో ప్రతిపాదించిన భారాలను రద్దు చేస్తే సరే లేకుంటే ఏం జరుగుతుందో చెప్పలేము. ■

నూతన న్యాయ చట్టాలు: సమస్యలు, సవాళ్లు!



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్

ఇప్పటివరకు అమల్లో ఉన్న బ్రిటీష్ చట్టాల స్థానాల్లో కేంద్రం తీసుకొచ్చిన కొత్త నేర చట్టాలు జూలై 1 సోమవారం నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. ఇండియన్ పీనల్ కోడ్ (ఐపీసీ), కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్ (సీఆర్‌పీసీ), ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ (ఐఏఏ) స్థానంలో భారతీయ న్యాయసంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్) భారతీయ సాక్ష్య అధినయం (బీఎస్ఏ)అమల్లోకి వచ్చాయి. అయితే వివిధ వర్గాల నుంచి నూతన చట్టాలపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. చర్చ లేకుండా ఆమోదించడమేంటని పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ ఆందోళనకు దిగాయి. వీటి అమలు నిలిపివేయాలని కోరుతూ సుప్రీం కోర్టులో ఇప్పటికే ఓ పిటిషన్ దాఖలైంది. గతేడాది డిసెంబర్‌లో సదరు చట్టాల తాలూకు బిల్లుల ఆమోదం సందర్భంగా లోక్‌సభ ,రాజ్యసభ నుంచి ఏకంగా 146 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారనీ, పార్లమెంటు సభ్యులతో చర్చ జరపకుండానే కేంద్రం బిల్లులను ఏకపక్షంగా ఆమోదించిందని పిటీషనర్లు అంజలీ పటేల్, ఛాయా మిశ్రా పేర్కొన్నారు. ప్రజల నుంచి కూడా ఈ కొత్త చట్టాలపై అభిప్రాయాలు సేకరించలేదన్నారు. పశ్చిమబెంగాల్, తమిళనాడు ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నారని గుర్తుచేశారు. ఈ చట్టాల ప్రకారం నిందితులకు బెయిలిచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గిపోతాయని, పోలీసులకు విపరీతమైన అధికారాలు సంక్రమిస్తాయని పిటీషన్‌లో పేర్కొన్నారు. మరొకవైపు ఈ కొత్త నేరచట్టాల అమలును పార్లమెంటులో చర్చించేంత వరకు వాయిదా వేయాలని కోరుతూ పౌరహక్కుల ప్రజా సంఘం (పీయూసీఎల్) కేంద్ర న్యాయ శాఖా మంత్రి అర్జున్ రామ్ మేఘ్‌వాల్‌కు లేఖ రాసింది.

ప్రజాస్వామ్యంపై తీవ్ర ప్రభావం

క్రిమినల్ లాయర్లు, దర్యాప్తు సంస్థలు, న్యాయమూర్తులు,సాధారణ పౌరులతో విస్తృత స్థాయిలో సంప్రదించి వారి అభిప్రాయాలను సేకరించకుండానే ఈ చట్టాలను తొందరపాటుతో తీసుకొచ్చారని గుర్తుచేసింది. భారతదేశ ప్రజాస్వామ్యంపై దీర్ఘకాలికంగా తీవ్రప్రభావం చూపే ఈ చట్టాలపై ఇప్పటికైనా దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చలు జరపాలని, అప్పటివరకు వాటి అమలును వాయిదా వేయాలని పీసీఎల్ గట్టిగా కోరింది. వలస చట్టాల నుంచి బయట పడుతున్నామని చెబుతూనే నాటి బ్రిటీష్ చట్టాలలోని అనేక అంశాలను యధాతథంగా నూతన చట్టాల్లో కూడా తీసుకొచ్చారని పీయూసీఎల్ వెల్లడించింది. న్యాయ సంహిత చట్టంలో గ్యాంగ్, వ్యవస్థీకృత నేరస్తులు,ముఠాల వంటి పదాలు ఉన్నాయి. కానీ, వాటిని స్పష్టంగా నిర్వచించలేదు. ఫలితంగా అమాయకులను కూడా కేసుల్లో ఇరికించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు అంటున్నారు. న్యాయసంహిత ప్రకారం మానసిక వికలాంగులకు విచారణ నుంచి రక్షణ లభిస్తుంది.అయితే బుద్ధిమాంద్యం ఉన్నవారిని ఈ కేటగిరిలో చేర్చలేదు. దీంతో వారిపై కూడా కేసులు నమోదు చేయవచ్చు.నాగరిక్ సురక్ష సంహితం ప్రకారం పోలీసులు నిందితులను తమ కస్టడీలో 15 రోజులు ఉంచుకోవచ్చు. అంతేకాదు ఆ తర్వాత కూడా 40 నుంచి 60 రోజులు వరకు అదనపు కస్టడీని కోరవచ్చు. ఈ కస్టడీని ఒకే దఫాలో కానీ పలు దఫాలలో గానీ అమలు పరచవచ్చు. తద్వారా నిందితుడికీ న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసినా కూడా పోలీసులు కస్టడీలోకి తీసుకునే అవకాశం ఉంటుంది.



> స్వాతంత్రోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం ఉపయోగించిన 'రాజద్రోహ' చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామనీ కేంద్రం నాడు సుప్రీంకోర్టులో తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి 'రాజ ద్రోహం' చట్టాన్ని 'దేశ ద్రోహం' పేరుతో తీసుకొచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడానికి ప్రజలకు ఉన్న హక్కును హరించి వేయటానికే ఈ చట్టం ఉపయోగపడుతుందన్న విమర్శలు ఎంతో కాలంగా ఉన్నాయి. అరెస్టు సందర్భంగా నిందితుల చేతులకు బేడీలు వేయటాన్ని పునరుద్ధరించటం సరైంది కాదు. తప్పనిసరిగా బాధితుల నుండి ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ప్రస్తుత నిబంధనను తొలగించడాన్ని పాతకాలపు పోకడలకు దేశాన్ని వెనక్కు తీసుకెళ్లడంగా పలువురు విమర్శిస్తున్నారు.

'రాజద్రోహం' స్థానంలో 'దేశద్రోహం'

ఎలక్ట్రానిక్ రికార్డులను ఎవిడెన్స్ యాక్ట్ ద్వితీయ స్థాయి సాక్షాధారాల (సెకండరీ లెవల్ ఎవిడెన్స్)గా పరిగణిస్తే, దాని స్థానంలో వచ్చిన భారతీయ సాక్ష్య అధినియమ్ వాటిని ప్రథమ స్థాయి సాక్షాధారాలుగా పరిగణిస్తుంది. తద్వారా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌ల వంటి సాధనాలతో పాటు,సెమీకండక్టర్ మెమరీలోని నిక్షిప్తమై ఉన్న సమాచారాన్ని కూడా సాక్షాధారంగా భావిస్తుంది.వీటిని సాక్ష్యంగా పరగణించే కొత్తచట్టం పోలీసులు వీటిని నిందితులనుంచి స్వాధీనం చేసుకున్నప్పుడు లేదా తనిఖీ నిర్వహించినప్పుడు వాటిల్లో లేని సమాచారాన్ని పోలీసులే స్వయంగా గతంలో మాదిరిగా "ఫెడా సెన్స్" వంటి ఏదైనా సాఫ్ట్ వేర్‌తో చొప్పించే ప్రమాదకరమైన పరిస్థితి కూడా ఉంటుంది. ఈవిషయంలో ఎలాంటి వివరణ ఈ చట్టాల్లో లేదు. స్వాతంత్రోద్యమంలో నాటి జాతీయ నాయకులను జైళ్లలో పెట్టడానికి బ్రిటీష్ ప్రభుత్వం ఉపయోగించిన 'రాజద్రోహ' చట్టం అమలును సుప్రీంకోర్టు 2022లో నిలిపివేసింది. ఈ చట్టంపై సమీక్ష జరుపుతామనీ కేంద్రం నాడు సుప్రీంకోర్టులో తెలిపింది. కానీ, కొత్త చట్టంలో తిరిగి 'రాజ ద్రోహం' చట్టాన్ని 'దేశ ద్రోహం' పేరుతో తీసుకొచ్చింది. ప్రభుత్వ విధానాలను విమర్శించడానికి ప్రజలకు ఉన్న హక్కును హరించి వేయటానికే ఈ చట్టం ఉపయోగపడుతుందన్న విమర్శలు ఎంతో కాలంగా ఉన్నాయి. అరెస్టు సందర్భంగా నిందితుల చేతులకు బేడీలు వేయటాన్ని పునరుద్ధరించటం సరైంది కాదు. తప్పనిసరిగా బాధితుల నుండి ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలన్న ప్రస్తుత నిబంధనను తొలగించడాన్ని పాతకాలపు పోకడలకు దేశాన్ని వెనక్కు తీసుకెళ్లడంగా పలువురు విమర్శిస్తున్నారు.

అందరికీ సవాళ్లే

కొత్త చట్టాల అమలుకు ముందు (2024 జులై 1వ తేదీకి ముందు జరిగిన నేరాలను ఐపీసీ తదితర పాత చట్టాల ప్రకారం విచారించాల్సి ఉంటుంది. జులై 1 నుంచి జరిగే నేరాలను కొత్త చట్టాల ప్రకారం విచారణ జరపాల్సి ఉంటుంది. ఇది తీవ్ర గందరగోళానికి దారితీసే ప్రమాదం ఉంది. న్యాయవాదులు, న్యాయమూర్తులు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. కేసుల నమోదు విషయంలో పోలీసులకూ ఇటువంటి ఇబ్బందులు ఎదురవుతాయి. నిందితులు వీడియో కాల్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరపవచ్చని కొత్త చట్టాలు చెబుతున్నాయి.కానీ, దేశంలో 80శాతం కోర్టుల్లో దీనికి అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు.ఈ కొత్త చట్టాల విషయంలో సుప్రీంకోర్టు ఏం తీర్పు చెబుతుందో వేచిచూడాలి. ఈ నూతన చట్టాలు అమలుకు కోర్టు అంగీకరిస్తే... భారతీయ భాషల్లోకి ఈ మూడు చట్టాలను వివరంగా, సరళంగా అనువాదాలు వెలువడాలి.ఈ మూడు చట్టాల అమలు తీరుపై ప్రతి క్లాజును పార్లమెంటులోనూ, సివిల్ సొసైటీలోనూ విస్తృతంగా చర్చ జరగాలి.సీనియర్ న్యాయవాదులు, సుప్రీంకోర్టు, హైకోర్టు మాజీ న్యాయమూర్తులు, పత్రికా సంపాదకులు,ప్రముఖ జర్నలిస్టులు,లా కాలేజీలు,యూనివర్సిటీ ప్రొఫెసర్లతో చర్చలు జరిపి వారి సలహాలు, సూచనలు కేంద్రం స్వీకరించాలి. వారు లేవనెత్తిన లోపాలు సవరించాలి. అవసరమైన సంస్థాగత మార్పులు చేయాలి. పోలీసులకు, న్యాయవాదులకు, న్యాయమూర్తులకు కూడా సెమినార్లు, వర్క్‌షాపులు నిర్వహించి చట్టాల అమలులో తలెత్తే సమస్యలు పరిష్కరించాలి. అవసరమైన నూతన 'సాఫ్ట్‌వేర్'ను కేసుల నమోదుకు రూపొందించాలి. పాత,కొత్త చట్టాలకు సంబంధించిన కేసులను వాదించేటప్పుడు ఎదురయ్యే ప్రాక్టికల్ సమ్యలను పరిష్కరించకుండా, చర్చలకు అవకాశం లేకుండా, కోర్టులలో మౌలిక సదుపాయాలు లేకుండా ప్రభుత్వం బేషజాలకు పోయి తొందరపాటుతో ఈ చట్టాలను అమలు చేయరాదు.

సెల్ : 9849328496 ■

అమీన్‌పూర్‌లో రూ.50 కోట్ల విలువ చేసే..

ప్రభుత్వ భూమి కబ్జా



- 5000 గజాల స్థలం ఆక్రమణ
- చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం
- 993 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో.. 842, 844 సర్వే నెంబర్ తప్పుడు దస్తావేజు
- కబ్జాదారుల ఆగడాలు.. పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం
- రాజకీయ నేతల అండదండలు
- సర్కారు భూమిని కాపాడాలని స్థానికుల డిమాండ్
- నిర్మాణాలను అడ్డుకున్న ప్రజలపై కబ్జాదారుల రౌడీయిజం
- సర్వే చేసి కంచె వేయాలని ఏడీకి కలెక్టర్ ఆదేశం

అమీన్‌పూర్ ప్రాంతంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. పరిశ్రమలు, రియల్ ఎస్టేట్ రంగం విస్తరించడంతో ప్రభుత్వ స్థలాలు కనిపిస్తే చాలు కబ్జాకు గురవుతున్నాయి. చెరువులు, కుంటలు, గుట్టలే కాదు విలువైన ప్రభుత్వ భూముల్ని సైతం కబ్జాదారులు వదలట్లేదు. రాజకీయ పెద్దల అండ, రెవెన్యూ పోలీసు అధికారుల సహకారం పుష్కలంగా ఉండటంతో కబ్జాల పర్వానికి అడ్డేలేకుండా పోయింది. తప్పుడు దస్తావేజులు సృష్టించడం, విలువైన ప్రభుత్వ భూముల్ని ఆక్రమించి కట్టడాలు నిర్మించడం పరిపాటిగా మారింది. వందల కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జా పాలవుతున్నా రెవెన్యూ యంత్రాంగానికి పట్టట్లేదనే అపవాదు ఉంది. రిజిస్ట్రేషన్, సర్వే అధికారులు సైతం కబ్జాదారులకే వంత పాడటం గమనార్హం.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తప్పుడు దస్తావేజుతో ప్రభుత్వ భూముల్ని కబ్జా చేస్తున్న వైనం బహిరంగంగానే సాగుతోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ ప్రాంతంలో కబ్జాల దందా జోరుగా సాగుతోంది. 993 సర్వే నెంబర్‌లో ఉన్న వంద ఎకరాల ప్రభుత్వ భూమికి మార్కెట్ విలువ విపరీతంగా పెరిగింది. దాంతో ఎప్పటి నుంచో ఆక్రమణకు గురవుతోంది. విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం అవుతుండటంతో స్థానిక శివాలయానికి కేటాయించాలని బీరంగూడ ప్రాంత ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. కబ్జా కాకుండా కాపాడేందుకు 2015లో 993 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని సర్వే చేశారు. అప్పట్లో 65 ఎకరాల భూమిని తేల్చి సరిహద్దులు నిర్ధారించారు. బీరంగూడ ప్రాంతంలో గజం స్థలం విలువ లక్ష రూపాయల వరకు పలుకుతుంది. దాంతో చట్టాల్లోని లోసుగుల్ని ఆసరా చేసుకుని కబ్జాదారులు ప్రభుత్వ భూముల్ని కాజేస్తున్నారు. దీని వెనుక ప్రధాన రాజకీయ పార్టీల నేతలు, కొంతమంది అధికారుల అండదండలు ఉన్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.50 కోట్ల విలువ చేసే 5 వేల గజాల స్థలం కబ్జా

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ గుట్ట కమాన్ శివాలయం ప్రాంతంలో 993 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని తప్పుడు దస్తావేజుతో తమ భూమిగా కొందరు క్లైయిమ్స్ చేసుకుంటూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. 993 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిలో మరి కొందరు 5000 గజాల స్థలాన్ని ఆక్రమించి.. 842, 844 సర్వే నెంబర్లతో తప్పుడు దస్తావేజులు సృష్టించారు. అందులో చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి గేట్ పెట్టేశారు. ప్రభుత్వ భూమిని ఇతర సర్వే నెంబర్లు వేసి రిజిస్ట్రేషన్ కార్యాలయంలో బురిడీ కొట్టించారు. రిజిస్ట్రేషన్ అధికారులు, రియల్టర్లు కలిసి ప్రభుత్వ భూమికి తప్పుడు దస్తావేజు సృష్టించినట్టు ఆరోపణలున్నాయి. కాగా, ఈ భూమి గజానికి మార్కెట్ ధర ప్రకారం లక్ష వరకు పలుకుతుండటంతో 5 వేల గజాలు ఆక్రమణకు గురైనందున ఆ భూమి విలువ రూ.50 కోట్ల వరకు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు.

కబ్జాల్ని పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

అమీన్‌పూర్ మున్సిపాలిటీ అంటేనే ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల కబ్జాలకు పెట్టింది పేరుగా మారింది. ముఖ్యంగా రెవెన్యూ యంత్రాంగం భూముల కబ్జాలపై సీరియస్‌గా ఉండట్లేదనే ఆరోపణలున్నాయి. రాజకీయ పార్టీల నాయకుల సిఫార్సులు, కబ్జాదారుల నుంచి భారీ ఎత్తున ముట్టే ముడుపుల వల్ల కబ్జాలపై ఫిర్యాదులు వచ్చినా పట్టించుకునే పరిస్థితిలేదు. తప్పుడు దస్తావేజుతో 5000 గజాల్లో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న విషయం గురించి స్థానికులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అయినా పట్టించుకున్న పాపానపోలేదని బీరంగూడ గ్రామస్తులు తెలుపుతున్నారు.



అడ్డుకున్న స్థానికులపై రౌడీయిజం

ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వ్యక్తుల్ని స్థానికులు ప్రశ్నించారు. తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు ఎలా చేపడతారని అడిగారు. దాంతో కబ్జాదారులు దాడులకు దిగినట్టు తెలిసింది. వందల మంది రౌడీలను పెట్టుకుని రాత్రిరాత్రికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించారు. గేటు పెట్టుకుని తమ భూమిగా చెప్పుకుంటున్నారు. ప్రభుత్వ భూమిలో మీరెలా నిర్మాణాలు చేపడతారని అడిగిన స్థానికులపై దౌర్జన్యం చేయడమే కాకుండా పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కూర్చోబెట్టి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని వాపోయారు. ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికి బీరంగూడ గ్రామస్తులు పలువురు జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరును కలిసి విన్నవించారు.

వందల ఎకరాలు కబ్జా పాలవుతుంది: ఎ.రవికుమార్, బీరంగూడ వాసి

అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని 993 సర్వే నెంబర్‌లో 2015లో సర్వే చేసి ప్రభుత్వ భూమికి సరిహద్దులు నిర్ధారించారు. ఇటీవల కొందరు ఆ సర్వే నెంబర్‌లో 842, 844 సర్వే నెంబర్‌లో దస్తా వేజు సృష్టించి 5 వేల గజాల వరకు ఆక్రమించి చుట్టూ ప్రహరీ నిర్మించారు. కబ్జాను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే రౌడీలను పెట్టి బెదిరిస్తున్నారు. 50 మంది మేస్త్రీలను పెట్టి రాత్రిపూట గోడ కట్టారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దాంతో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం.

సర్వే చేసి కంచె ఏర్పాటు చేస్తాం: కలెక్టర్ క్రాంతి వల్లూరు

అమీన్‌పూర్‌లోని 993 సర్వే నెంబర్‌లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్నట్టు తమ దృష్టికి వచ్చింది. జిల్లా సర్వే అధికారిని పంపించి సమగ్ర సర్వే చేయిస్తాం. ప్రభుత్వం భూమికి సరిహద్దులు నిర్ధారించి చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం. సెంటు భూమి కూడా కబ్జాకు గురికాకుండా కాపాడేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూముల్ని ఎవరు కబ్జా చేసినా ఉపేక్షించేది లేదు.

ఓకే సార్..6న కలుద్దాం

- చంద్రబాబును ఆహ్వానించిన సీఎం రేవంత్
- బేగంపేట ప్రజాభవన్‌లో భేటీ
- విభజన సమస్యలే ఎజెండాగా సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఓకే సర్.. రండి కలుద్దామంటూ ఆహ్వానం పంపారు. విభజన హామీలపై చర్చల ప్రతిపాదనను స్వాగతిస్తూ, ఈనెల 6న భేటీకి సిద్ధమని తెలిపారు. తెలుగు రాష్ట్రాల అభివృద్ధితోపాటు విభజన హామీలపై కలిసి చర్చిద్దామని లేఖలో పేర్కొన్నారు. చంద్రబాబు అభిప్రాయాలతో పూర్తిగా ఏకీభవిస్తున్నట్లు సీఎం తెలిపారు. ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీకీ హైదరాబాద్‌లోని ప్రజాభవన్ వేదిక కానుంది. విభజన చట్టంలోని పెండింగ్ సమస్యల పరిష్కారం అవసరమనీ, వాటిపై కలిసి కూలంకషంగా చర్చిద్దామని సీఎం రేవంత్ తన లేఖలో ప్రస్తావించారు. ఈ సందర్భంగా ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన కూటమి ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. నాలుగోసారి సీఎం అయిన అరుదైన నేత చంద్రబాబు అని కొనియాడారు. తెలుగురాష్ట్రాల పరస్పర సహకారానికి ముఖాముఖి చర్చలు అవసరమన్న ఆయన, చర్చలే పరస్పర సహకారానికి గట్టి పునాది వేస్తాయని వ్యాఖ్యానిం చారు. పదేండ్లుగా తెగని సమస్యలకు పరిష్కారం కనుగొందామని లేఖలో పేర్కొన్నారు.

కొలిక్కి రాని విభజన హామీలు

విభజనకు సంబంధించి రెండు రాష్ట్రాల మధ్య అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. పదేండ్లు గడిచినా ఇప్పటి వరకూ అవి కొలిక్కిరాలేదు. ప్రధానంగా విభజన చట్టం 9, 10వ షెడ్యూల్‌లోని పలు అంశాలపై ఇరు రాష్ట్రాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం లేదు. తొమ్మిదో షెడ్యూల్‌లోని సమస్యలపై కేంద్రం ఏర్పాటు చేసిన షీలా భిడే కమిటీ పలు సిఫారసులు చేసింది. ఉమ్మడి ఏపీలో దాదాపు 91 కార్పొరేషన్లు ఉండగా, ఆర్టీసీ, ఎస్ఎఫ్‌సీ వంటి 23 కార్పొరేషన్ల ఆస్తుల పంపకంలో ఎవరి వాదన వారిదే అన్న చందాన పరిస్థితి తయారైంది. ఆస్తుల విషయంలో తెలంగాణ వాదనను కేంద్రం సమర్థించినప్పటికీ ఏపీ అంగీకరించకపోవడంతో అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. పదో షెడ్యూల్‌లో మొత్తం 142 సంస్థలుండగా, తెలుగు అకాడమీ లాంటి 30 సంస్థలపై ఇరు రాష్ట్రాల మధ్య భిన్నాభిప్రాయాలున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు మారిన నేపథ్యంలో జరుగుతున్న ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది.

మూడు రోజుల తర్వాతే టీపీసీసీకి కొత్త బాస్

(మొదటిపేజీ తరువాయి)

బయటపడేందుకు ఈసారి పార్టీ అధ్యక్ష పదవిని బీసీలకు కట్టబెట్టే అవకాశాలున్నాయి. బీసీలకు ఇవ్వాల్సి వస్తే పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ పేరు ప్రముఖంగా వినిపిస్తున్నది. మూడు దశాబ్దాలుగా ఆయన పార్టీలో వివిధ హోదాల్లో పని చేస్తున్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌కి సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిల్లో పని చేసిన అనుభవం ఆయనకున్నది. ప్రస్తుతం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులుగా ఉన్నప్పటికీ పార్టీ సంస్థాగత వ్యవహారాలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. ఆయా జిల్లాల నేతలతో పరిచయాలు ఉండటం, పార్టీ నిర్మాణంపై పూర్తి అవగాహన, సమస్యను ఓపికగా డీల్ చేయడం తదితరాంశాలు ఆయనకు కలిసొచ్చే అవకాశముంది. మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కీగౌడ్ ఇద్దరూ రేసులో తలపడుతున్నారు. రెడ్డి సామాజికతరగతికి సంబంధించిన నేత ముఖ్యమంత్రిగా ఉండటంతో ఆ పదవి ఆవర్గాలకు వచ్చే అవకాశం లేదనే చెప్పవచ్చు. మొత్తంగా కొత్త అధ్యక్షుడి ఎంపిక విషయంలో ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎం అభిప్రాయాలే కీలకంగా మారనున్నాయి. అందుకే బుధవారం వారు ఢిల్లీకి పోతున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

ఎవరీ బాబా?

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహిస్తుంటారు. వీటికి పెద్ద సంఖ్యలో జనం హాజరవుతుంటారు. అయితే మంగళవారం వారిని మృత్యువు వెంటాడుతుందని ఊహించలేదు. ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. పోస్టుమార్టం నిర్వహించే ఆస్పత్రుల వద్ద కుటుంబ సభ్యుల్ని కోల్పోయిన బంధుమిత్రుల అరణ్యరోదనలు మిన్నంటుతున్నాయి.

మోతిలాల్ నాయక్ దీక్ష విరమణ

- నేటి నుంచి పోరాటం తీవ్రం చేస్తానని వెల్లడి
- నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని నిరుద్యోగుల డిమాండ్ల కోసం గాంధీ ఆస్పత్రిలో తొమ్మిది రోజులు నిరాహార దీక్ష చేసిన తెలంగాణ నిరుద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకుడు మోతిలాల్ నాయక్ మంగళవారం కొబ్బరి నీళ్ల తాగి దీక్షను విరమించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్న పానీయాలు లేకుండా దీక్ష చేస్తున్నందున ఆరోగ్యం సహకరించడం లేదని, క్రియాటిన్ లెవల్స్ పెరిగి.. కిడ్నీ, లివర్ పాడయ్యే పరిస్థితికి రావడంతో దీక్ష విరమించినట్టు చెప్పుకొచ్చారు. నిరుద్యోగుల డిమాండ్ల కోసం తొమ్మిది రోజులు దీక్ష చేశానని, ఈ దీక్షతో ఒక్క ఉద్యోగం కూడా పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి నుంచి తీవ్ర పోరాటం చేస్తానని చెప్పిన మోతిలాల్.. 50వేల ఉద్యోగాలు వచ్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడినా నిరుద్యోగుల సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదని, ఇతర రాష్ట్రాల పెత్తనం పోయినా తెలంగాణ యువత బతుకులు మారలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఇప్పుడు ఆ దిశగా అడుగులు వేయడం లేదని విమర్శించారు. 25-35 ఏండ్ల వయస్సున్న యువత ఉద్యోగాల కోసం కండ్లు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారని, వెంటనే వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారిస్తామని హామీనిస్తే సరిపోదని, ప్రభుత్వం జీవోలను రిలీజ్ చేసే వరకు ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలే తప్ప, తాను నిరాహార దీక్ష చేపట్టడానికి వేరే డిమాండ్లేవీ లేవన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను విడుదల చేయడం, రిక్రూట్ మెంట్ పరీక్షలకు నోటిఫికేషన్ జారీ చేయడంలో విఫలమైందన్నారు. ఈ ప్రభుత్వానికి రాజకీయాలపై ఉన్న శ్రద్ధ విద్యార్థులు, నిరుద్యోగులపై లేదన్నారు. మనుషులు చచ్చిపోయినా పట్టించుకోకపోవడం ప్రజాపాలనా..? అని ప్రశ్నించారు. తన ఫోన్ లాక్కుని ఎవరితోనూ మాట్లాడనీయకపోవడం సరికాదన్నారు.

ప్రధాన డిమాండ్లు ఇవే..

1.డీఎస్సీని పోస్టు పోన్ చేసి.. మెగా డీఎస్సీ రిలీజ్ చేయాలి
2.గ్రూప్-1 మెయిన్స్ ఎలిజిబిలిటీ 1:100కు పెంచాలి
3.గ్రూప్-2లో 2వేలు, గ్రూప్-3లో 3వేల ఉద్యోగాలు కలపాలి
4.జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి
5.25వేల పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాలి.
6.గురుకుల ఉపాధ్యాయ పోస్టులను బ్యాక్‌లాగ్‌లో ఉంచకూడదు.
7.నిరుద్యోగులకు రూ.4వేల భృతి, 7 నెలల బకాయిలు ఇవ్వాలి.

రాష్ట్రంలో గాడితప్పిన పాలన

- ఖమ్మం జిల్లాలో రైతు ఆత్మహత్యకు సర్కారే కారణం
- ఏడు మండలాలు, లోయర్ సీలేరును దక్కించుకోవాలి : హరీశ్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గాడి తప్పిందని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. ఖమ్మం జిల్లాలో రైతు ఆత్మహత్యకు రాష్ట్ర సర్కారే కారణమని ఆరోపించారు. రాష్ట్ర విభజన సమస్యల్ని పరిష్కరించాలని కేంద్రానికి సీఎం లేఖ రాయడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఏపీ సీఎం చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చి ఏడు మండలాలు, లోయర్ సీలేరును తెలంగాణకు వచ్చేలా చూడాలని కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. సర్పంచి, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో పంచాయతీలకు ప్రతినెలా నిధులు కేటాయించి ప్రాధాన్యం ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పుడు పంచాయతీ ట్రాక్టర్లలో డీజిల్ పోయించే పరిస్థితి కూడా లేదని దెప్పిపొడిచారు. రోడ్డు ట్యాక్సీ లేదనీ, బీమా లేదని వాటిని సీజ్ చేయించడం దారుణమన్నారు. ఏడు నెలల నుంచి జీతాలివ్వకుంటే పంచాయతీ కార్మికులు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. స్థానిక సంస్థలను ఎందుకు నిర్వీర్యం చేస్తున్నారని నిలదీశారు. ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు కూడా గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి సర్పంచుల పెండింగ్ బిల్లులను చెల్లించాలనీ, పంచాయతీ, మున్సిపాల్టీ కార్మికులకు వేతనాలు, ఎంపీటీసీలు, జెడ్పీటీలకు గౌరవ వేతనాలివ్వాలని కోరారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశమున్న నేపథ్యంలో స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. రెండు నెలల ఆసరా పింఛన్లను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు గాడి తప్పాయని విమర్శించారు. ప్రభాకర్ తండ్రి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఎస్ఐ, తహసీల్దార్, కలెక్టర్‌లలో ఎవ్వరు పట్టించుకున్నా ప్రభాకర్ ఆత్మహత్య జరిగేది కాదని చెప్పారు. ఆయన చావుకు కారణమైన వారిపై కేసులు నమోదు చేయకుండా వీడియో తీసిన వారిపై కేసులు పెట్టడం దారుణమన్నారు. బాధిత కుటుంబానికి ఆ భూమిని వెంటనే అప్పగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శాసనమండలిపై కాంగ్రెస్ ఫోకస్




- బీఆర్ఎస్ ఎమ్మెల్సీలను చేర్చుకుని పట్టు సాధించేలా ప్లాన్
- సీఎం సలహాదారుతో ఎమ్మెల్సీల చర్చలు
- ఎమ్మెల్సీ సారయ్యతో సహా మరో ఇద్దరికి గ్రీన్ సిగ్నల్ : ఇప్పటికే కారు దిగుతున్న ఎమ్మెల్యేలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

శాసనమండలిలో సంఖ్యాబలం తక్కువగా ఉన్న కాంగ్రెస్ తన బలాన్ని పెంచుకునేందుకు ఫోకస్ చేసింది. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అధికార పార్టీలోకి వలసబాట పట్టారు. అదేదారిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు కూడా సిద్ధమవుతున్నారు. వారిని చేర్చుకుని శాసనమండలిలో పట్టు సాధించేందుకు కాంగ్రెస్ ప్లాన్ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కొంత మంది గులాబీ పార్టీ ఎమ్మెల్సీలు చర్చలు జరిపినట్టు విశ్వసనీయ సమాచారం. వరంగల్ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నేత, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్యతోపాటు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు అధికార పార్టీలో చేరేందుకు సిద్ధమవుతున్నారు. రేపో,మాపో ఆ ముగ్గురు ఎమ్మెల్సీలు అధికార కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇది గులాబీ పార్టీకి మూలిగే నక్కపై తాటిపండు పడిన చందంగా మారనుంది. ఇప్పటికే గులాబీకి చెందిన పలువురు ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరిపోయారు. మరి కొందరు చేరేందుకు సిద్ధమవుతున్నారు. వీరిని కాపాడుకోవడమే గులాబీ దళపతికి గగనంగా మారింది. ఈ క్లిష్ట సమయంలో శాసనమండలి సభ్యులు కూడా జంప్‌జిలానీలుగా మారేందుకు సిద్ధం కావడం గమనార్హం. త్వరలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ఆ సమావేశాలకు ముందుగానే చేరికల ప్రక్రియ సాధ్యమైనంత వేగంగా పూర్తి చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఈ నేపథ్యంలో గులాబీ పార్టీకి చెందిన ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు సాగిస్తున్నారు. గంపగుత్తగా వెళ్లి కాంగ్రెస్‌లో చేరడం ద్వారా అనర్హత వేటు నుంచి తప్పించుకునేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. మరో రెండు, మూడు రోజుల్లోనే చేరికలు గ్యారంటీ అనే ప్రచారం జోరుగా సాగుతున్నది. ఇదిలా ఉండగా పార్టీని వీడనున్న నేతలను కట్టడి చేసేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్వయంగా రంగంలోకి దిగారు. తొందర పడి నేతలు ఎవరూ పార్టీని వీడొద్దంటూ వారిలో భరోసా కల్పించే ప్రయత్నం చేస్తున్నారు. సొంత పార్టీ ప్రజాప్రతినిధులతో వరుసగా భేటీ అవుతున్నారు. రెండు, మూడు నెలల వ్యవధిలోనే పార్టీకి మంచి రోజులు రానున్నాయని నేతలకు విశ్వాసం కల్పిస్తున్నారు. అయితే కేసీఆర్ ముందు పార్టీ వీడబోమంటూ తలూపినా వారి మనసంతా హస్తం వైపే లాగుతున్నట్టు పార్టీ వర్గాలు అంటున్నాయి. కేసీఆర్‌తో సమావేశమైన తర్వాత కూడా కాంగ్రెస్ గూటికి చేరుకుంటున్న విషయం తెలిసిందే. ఈ ప్రక్రియ ఇప్పుడు జోరుగా సాగుతుండటంతో గులాబీ పార్టీ భవిష్యత్తు ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగా కనిపిస్తున్నది. ఇలాంటి తరుణంలో కారుకు మరో షాక్ తగలనుందన్న ప్రచారం ఊపందుకుంది. వరంగల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య ఒకటి రెండు రోజుల్లో కారుకు గుడ్ బై చెప్పే యోచనలో ఉన్నట్టు తెలిసింది. రెండు రోజుల క్రితం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటనకు వెళ్లిన సందర్భంగా సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సమా వేశమైనట్టు సమాచారం. కాంగ్రెస్ నుంచి దాదాపుగా గ్రీన్ సిగ్నల్ వచ్చినట్టు చర్చ జరుగుతున్నది. ఆయనతోపాటు మరో ఇద్దరు ఎమ్మెల్సీలు రెడీగా ఉన్నారు. వాస్తవానికి ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచే వచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని కిరణ్ కుమార్ రెడ్డి మంత్రివర్గంలో బీసీ సంక్షేమశాఖ మంత్రిగా పని చేశారు. విభజన తర్వాత నేతలు వలస పోవడంతో 2016లో సారయ్య బీఆర్ఎస్‌లో చేరిపో యారు. కొన్నాళ్ల తర్వాత కారు పార్టీ...ఆయనకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చింది. మళ్లీ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో తనకున్న పరిచయాలతో పార్టీ పెద్దలతో సంప్రదింపులు జరిపారు. గులాబీ పార్టీలో కొనసాగుతున్న ఇలాంటి పరిణామాలు ఎటువైపు దారి తీస్తాయోనని గులాబీ నేతల్లో కలవరం మొదలైంది.

ప్రత్యేక కేటగిరీ టీచర్లకు త్వరలో బదిలీలు

- వెబ్‌పోర్టల్‌ను రూపొందించిన విద్యాశాఖ
- వారం, పదిరోజుల్లో దరఖాస్తుల స్వీకరణ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఉన్న ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయుల బదిలీలు త్వరలో చేపట్టేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. ఇప్పటికే విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దీనిపై చర్చించారు. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్‌ను రూపొందించారు. దరఖాస్తు నమూనాను తయారు చేశారు. సాధారణ బదిలీల ప్రక్రియలో అవకాశం లభించని వారి కోసం దీన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో వికలాంగులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు, క్యాన్సర్ బాధితులుగా ఉపాధ్యాయులు దరఖాస్తు చేసేందుకు అర్హులు. వారం, పది రోజుల్లో ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను స్వీకరించే అవకాశమున్నది. ఈ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అయితే ప్రత్యేక కేటగిరీ ఉపాధ్యాయులు బదిలీ అవకాశం కల్పించాలంటూ విద్యాశాఖ కార్యాలయానికి వచ్చి ఉన్నతాధికారులకు విజ్ఞాపన పత్రాలను అందజేస్తున్నారు. ఇంకోవైపు ఒకే బడిలో రెండేండ్ల సర్వీసు పూర్తయిన వారు కూడా బదిలీ అవకాశమివ్వాలంటూ కోరుతున్నారు. వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు.

కొత్త టీచర్లు వస్తేనే ఎస్జీటీలకు స్థానచలనం

రాష్ట్రంలో సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)ల పరిస్థితి అయోమయంగా మారింది. 26 వేల ప్రభుత్వ పాఠశాలల్లో 1,22,386 ఉపాధ్యాయ పోస్టులున్నాయి. అందులో ప్రస్తుతం 1,03,343 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 19,043 ఉపాధ్యాయ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. అయితే రాష్ట్రంలో 50,808 మంది ఎస్జీటీలు పనిచేస్తున్నారు. వారిలో 25,036 మంది సోమవారం బదిలీ అయ్యారు. కానీ వారిలో 50 శాతం మంది ఎస్జీటీలకు మాత్రమే స్థానచలనం కలిగింది. మిగిలిన సగం మంది ఉపాధ్యాయులు బదిలీ అయినప్పటికీ అదే పాఠశాలలో కొనసాగాల్సి వస్తున్నది. కొత్త టీచర్లు వచ్చే వరకు వారు అక్కడే కొనసాగాల్సి ఉంటుంది. దీంతో బదిలీ అయి స్థానచలనం పొందని ఎస్జీటీలు ఆందోళన చెందుతున్నారు. వారిని వెంటనే రిలీవ్ చేయాలంటూ పలు ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలో మల్టీజోన్-1లో 11,177 మంది, మల్టీజోన్-2లో 7,765 మంది కలిపి మొత్తం 18,942 మంది ప్రభుత్వ, స్థానిక సంస్థల పరిధిలోని ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. హైకోర్టులో కేసు ఉండడంతో రంగారెడ్డి జిల్లాలో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు హైకోర్టు ఆదేశాలతో రంగారెడ్డి జిల్లాలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమైంది. సోమవారం 955 మంది స్కూల్ అసిస్టెంట్ల బదిలీలు జరిగాయి. బుధవారం సుమారు 700 మంది ఎస్జీటీలు, పీఈటీలు, భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు లభిస్తాయి. అందుకు సంబంధించిన ఉత్తర్వులను డీఈవో సుశీందర్‌రావు జారీ చేస్తారు. స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులు వెంటనే కేటాయించిన పాఠశాలల్లో చేరాల్సి ఉంటుంది.

జీతాలు రాక సఫాయి కార్మికుల భిక్షాటన

నవతెలంగాణ-జగదేవపూర్



ఆరు నెలలుగా తమకు జీతాలు రావడం లేదని సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలంలోని ముని గడప, పలుగుగడ్డ, మాందాపూర్, తదితర గ్రామాల సఫాయి కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. అందులో భాగంగానే మంగళవారం తమ ఖర్చులకు డబ్బులు లేవని భిక్షాటన చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, అధికారులు, నాయకులకు తమ కష్టాలు పట్టడం లేదన్నారు. ఆరు నెలలుగా జీతాలు రాకుండా ఉంటే ప్రభుత్వ అధికారులు పని చేస్తారా అంటూ ప్రశ్నించారు. ప్రతి రోజూ మురికి పనులు చేస్తూ సాయంత్రం కాగానే జీతాలు వచ్చాయా అంటూ చూసుకుంటే నిరాశే మిగులుతుందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు కల్పించుకుని పరిశుభ్రత కోసం పనిచేసే కార్మికుల జీతాలు వెంటనే విడుదలయ్యేలా చూడాలని కోరుతున్నారు.

రైతు ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరపాలి

- సీఎం రేవంత్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన రైతు బోజడ్ల ప్రభాకర్ ఆత్మహత్య ఘటనపై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. దీనిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పొద్దంతా ఎండ..రాత్రి వాన

- 627 ప్రాంతాల్లో వర్షపాతం
- హైదరాబాద్‌లో పలుచోట్ల మోస్తరు వర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో మంగళవారం పొద్దంతా ఎండ కొట్టగా..సాయంత్ర పూట మాత్రం విస్తారంగా వర్షం కురిసింది. టీజీడీపీఎస్ నివేదిక ప్రకారం సాయంత్రం ఆరు గంటల వరకు కేవలం 30 ప్రాంతాల్లో వర్షం పడింది. రాత్రి 11 వరకు ఆ సంఖ్య 627 ప్రాంతాలకు చేరింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో అత్యధికంగా 8.08 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. 137 ప్రాంతాల్లో మోస్తరు వాన పడింది. బుధ, గురువారాల్లో రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. హైదరాబాద్‌లో హిమాయత్‌నగర్‌లోని జీహెచ్ఎంసీ కార్యాలయం ప్రాంతంలో అత్యధికంగా నాలుగు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. హైదరాబాద్‌లోని చాలా ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు పడ్డాయి.

ప్రజావాణిలో 601 దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతిపత్రాలను అందజేశారు. మొత్తం 601 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 142, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 87, మున్సిపల్ శాఖకు సంబంధించి 53, హోం శాఖకు సంబంధించి 47, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 52, ఇతర శాఖలకు సంబంధించి 220 చొప్పున మొత్తం 601 దరఖాస్తులు అందినట్టు ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య తెలిపారు. ఇతర అధికారులు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను స్వీకరించండంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారని పేర్కొన్నారు



బీఆర్ఎస్ జిల్లా కార్యాలయం కూల్చివేతకు రంగం సిద్ధం

- గ్రేటర్ వరంగల్‌లో నోటీసుల జారీ..
- అనుమతుల ప్రతులనుసమర్పించాలని ఆదేశం
- నల్లగొండలోనూ ఇవ్వాలని మంత్రి కోమటిరెడ్డి ఆదేశం

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) హన్మకొండ జిల్లా కార్యాలయానికి గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. హన్మకొండ బాలసముద్రంలోని సర్వే నెంబర్ 1066లో నిర్మించిన బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా కార్యాలయానికి నిర్మాణ అనుమతులు, స్థల కేటాయింపునకు సంబంధించిన ప్రతులను మూడ్రోజుల్లో సమర్పించాలని కోరారు. ఈ మేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, హన్మకొండ డీసీసీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి వరంగల్ ఆర్‌డీఓకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ అధికారులు ఈ నోటీసులు జారీ చేశారు. మూడ్రోజుల్లో భూ కేటాయింపు, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించిన ప్రతులను సమర్పించని పక్షంలో బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా కార్యాలయాన్ని కూల్చివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం పక్కా వ్యూహంతో ముందుకు పోతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇది పార్క్ స్థలం కావడంతో బీఆర్ఎస్ నేతలు దీని అనుమతులపై స్పందించడం లేదని తెలుస్తోంది. ఏదేమైనా రెండోసారి నోటీసులు అందజేయడంతో నగరంలో హై టెన్షన్ నెలకొంది. అంతేకాదు, నల్లగొండ జిల్లాలోనూ నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ కార్యాలయం నిర్మించారని, వారికి నోటీసులు ఇవ్వాలని సోమవారం మంత్రి కోమటిరెడ్డి అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. అయితే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.

ఎమ్మెల్యే 'నాయిని' ఫిర్యాదు..

డీసీసీ హన్మకొండ జిల్లా అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హన్మకొండ ఆర్‌డీఓకు ఇచ్చిన ఫిర్యాదులో భాగంగానే గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్ బీఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్‌భాస్కర్‌కు నోటీసులు ఇచ్చారు. తొలుత నోటీసు ఇచ్చినా స్పందించకపోవడంతో తాజాగా మంగళవారం మరోమారు కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. మూడ్రోజుల్లో భూ కేటాయింపు, భవన నిర్మాణ అనుమతి ప్రతులను సమర్పించాలని, లేనిపక్షంలో తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ యాక్ట్ అండర్ 2019, సెక్షన్ 254 ప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వరంగల్‌లో బీఆర్ఎస్ నేతల కట్టడాల కూల్చివేత

వరంగల్ నగరంలో పుల్లాయికుంట సర్వేనెంబర్ 140లో నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయ నిర్మాణానికి భూమిని కేటాయించింది. ఈ భూమిలో పార్టీ కార్యాలయం బదులు బీఆర్ఎస్ నేతలు షాపింగ్‌కు సంబంధించి షట్టర్లను నిర్మించినట్టు ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక వెంటనే ప్రభుత్వ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు అనధికారికంగా నిర్మించిన ఆ భవనాలను కూల్చివేశారు. తాజాగా హన్మకొండ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయానికి నోటీసులు జారీ చేయడంతో ఈ భవనం కూల్చివేత ఖాయమనే ప్రచారం జరుగుతోంది.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- సినీ పరిశ్రమతో పాటు సమాజంలోని అన్ని వర్గాలూ అందుకు సహకరించాలి
- ఈ విషయంలో ప్రతిభ కనబర్చిన అధికారులకు పదోన్నతులు కల్పిస్తాం : సీఎం రేవంత్‌రెడ్డి
- టీజీన్యాబ్-సైబర్ సెక్యూరిటీ విభాగాలకు కొత్త వాహనాలు
- జెండా ఊపి ప్రారంభం



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలో సైబర్ నేరాలు, డ్రగ్స్ రవాణాను ఉక్కుపాదంతో అణచివేస్తామనీ, ఇందుకు సమాజంలోని అన్ని వర్గాలూ సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం పోలీస్ కమాండ్ కంట్రోల్ వద్ద యాంటీ నార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలకు కొత్తగా సమకూర్చిన వాహనాలకు ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత పదేండ్ల కాలంలో రాష్ట్రంలో సైబర్ నేరాలతో పాటు మాదక పదార్థాల రవాణా, వినియోగం విపరీతంగా పెరిగిందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ఈ మహమ్మార శక్తులు సమాజంలో పేట్రేగిపోతున్నాయనీ, వీటి నుంచి ప్రజలను కాపాడటానికి పోలీసు వ్యవస్థ కఠినంగా వ్యవహరించాల్సి ఉన్నదని స్పష్టం చేశారు. డ్రగ్స్ వినియోగం పెరగటం వలన పాఠశాలలకు చెందిన బాలలు మొదలుకొని యూనివర్సిటీల విద్యార్థుల వరకు అనేక మంది బానిసలుగా మారి సమాజానికి భారంగా మారుతున్నారని అన్నారు. చదువులేనివారే గాక, ఉన్నత విద్యావంతులు సైతం సైబర్ నేరగాళ్ల బారిన పడుతున్నారని ఆయన తెలిపారు. మాదకపదార్థాల రవాణా, సైబర్ నేరాలను అరికట్టటానికి పోలీసు వ్యవస్థలో యాంటీ నార్కొటిక్ బ్యూరో, సైబర్ సెక్యూరిటీ బ్యూరోలను ఏర్పాటు చేయటమేగాక వాటికి అన్ని రకాల సౌకర్యాలను కల్పించటంలో ప్రభుత్వం ప్రాముఖ్యతనిస్తున్నదనీ, అందులో భాగంగానే కొత్తగా వాహనాలను సిబ్బంది అధికారులతో సమకూర్చినట్టు సీఎం తెలిపారు. కేవలం పోలీసు విభాగమేగాక ఈ పెడ ధోరణులను అరికట్టటానికి సినీ పరిశ్రమ కూడా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. నటుడు చిరంజీవి మాదక పదార్థాలకు వ్యతిరేకంగా ఒక వీడియోను రూపొందించి పంపించారనీ, అది సినీ పరిశ్రమకు ప్రేరణ కావాలని ఆయన చెప్పారు. ఇక నుంచి రాష్ట్రంలో కొత్తగా నిర్మించే సినిమాలకు అనుమతించే సమయంలో ఆ సినిమాకు చెందిన నటులతో రెండు నిమిషాల నిడివిగల లఘు చిత్రాన్ని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నిర్మించి థియేటర్లలో ప్రదర్శించేలా నిర్మాతలకు షరతులు విధించాలని ఆయన పోలీసు అధికారులను ఆదేశించారు. అలాగే, ప్రతి సినిమా థియేటర్లలో సైతం సినిమా ప్రదర్శనకు ముందు ఈ డ్రగ్స్ వ్యతిరేక లఘు చిత్రాలను ప్రదర్శించేలా చూడాలని ఆయన కోరారు. పోలీసులు అనుసరిస్తున్న పీపుల్స్ ఫ్రెండ్లీ విధానం బాధితుల పట్లనే గానీ.. నేరస్తుల పట్ల కాదనీ, వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ఆయన అధికారులను కోరారు. రాష్ట్రంలో సైబర్ నేరాలు, మాదక పదార్థాల రవాణా, వినియోగానికి పాల్పడేవారు అడుగు పెడితే వారి వెన్నులో దడ పుట్టేలా పోలీసులు వ్యవహరించాలన్నారు. అలాగే, ఈ రెండు విభాగాలలో నేరస్తుల కార్యకలాపాలను కఠినంగా అణచివేయటంలో ప్రతిభ కనబర్చిన ప్రతి అధికారికీ పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సీఎం డీజీపీని ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణేగాక సమాజానికి సవాలు విసురుతున్న సైబర్ నేరాలు, డ్రగ్స్ మహమ్మారిపై ప్రభుత్వ వైఖరి కఠినంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ రవిగుప్తా, రాష్ట్ర హెూంశాఖ ముఖ్యకార్యదర్శి జితేందర్, టీజీన్యాబ్-డీజీ సందీప్ శాండిల్యాతో పాటు నగర పోలీసు కమిషనర్లు, సీనియర్ పోలీసు అధికారులు పలువురు పాల్గొన్నారు.

ఇకపై ఆన్‌లైన్‌లో సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులు

ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) దరఖాస్తులను ఇక నుంచి ఆన్‌లైన్‌లో స్వీకరించనున్నారు. ఈ పథకం నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో నిర్వహించాలని సీఎం ఇచ్చిన ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇందు కోసం సెంటర్‌ఫర్ గుడ్‌గవర్నెన్స్ ఆధ్వర్యంలో వెబ్ సైట్‌ను రూపొందించారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇందుకు సంబంధించిన వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టిన నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇక ముందు దరఖాస్తులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. సీఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు సిఫార్సు లేఖను జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అప్లికేషన్లో సంబంధింత దరఖాస్తు దారుల బ్యాంక్ అకౌంట్ నెంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలి. అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎంఆర్ఎఫ్‌కు సంబంధించిన ఒక కోడ్ ఇస్తారు. దాని ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఆన్ లైన్ ద్వారా అప్లికేషన్‌ను సంబంధిత ఆస్పత్రులకు పంపించి నిర్ధారించుకుంటారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే ధరఖాస్తును ఆమోదించి చెక్కును సిద్ధం చేస్తారు. ఆ తర్వాతనే సంబంధిత ప్రజాప్రతినిధులు చెక్కులను స్వయంగా దరఖాస్తుదారులకు అందజేస్తారు. ఈ నెల 15నుంచి ఈ విధానం అమల్లోకి రానుంది. .

సీంను కలిసిన నోకియా ప్రతినిధులు

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జర్మనీకి చెందిన నోకియా ప్రతినిధి బందం భేటీ అయింది. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్స్, డైరెక్టర్ వెంకట్ తదితరులు మర్యాదపూర్వక కలిసారు. రాష్ట్రంలో నోకియా పెట్టుబడులు, విస్తరణ తదితర అంశాలపై వారు ఈ సందర్భంగా సీఎంతో చర్చించినట్టు సమాచారం. అలాగే ఇండియన్ పారాసైక్లింగ్ టీమ్ సభ్యులు సైతం ముఖ్యమంత్రిని కలిసారు. రాష్ట్రంలో పారా సైక్లింగ్ తీరు తెన్నులను ఆయనకు వివరించారు.

అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలి

- జీఓ 10ని రద్దు చేయాలి : అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి



నవతెలంగాణ- ఆదిలాబాద్‌టౌన్

అంగన్‌వాడీ ఉద్యోగులకు నష్టం కలిగించే జీఓ నెంబర్ 10ని రద్దు చేసి, సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ అంగన్‌వాడీ వర్కర్స్ (టీచర్స్) అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆదిలాబాద్‌లోని సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్స్‌కు రూ.2లక్షలు, హెల్పర్స్‌కు రూ.లక్ష పెంచుతూ కొత్త జీఓను జారీ చేయాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు అత్యంత తక్కువ డబ్బులు చెల్లించి, జులై 24 తర్వాత ఇంటికి పంపించే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో 65 సంవత్సరాలు పూర్తయిన అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ సుమారు 10 వేల మంది పని చేస్తున్నారన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని 2023 సెప్టెంబర్ 11 నుంచి అక్టోబర్ 4 వరకు నిరవధిక సమ్మె చేశారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్స్‌కు పెన్షన్, వీఆర్ఎస్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చిందన్నారు. అనంతరం రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులకు తీవ్రమైన నష్టం కలిగించే ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు ముందు గత బీఆర్ఎస్ ప్రభుత్వం జీఓ 10ని జారీ చేసిందని చెప్పారు. ఈ అంశాలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిశీలించకుండా పక్కన పెట్టడం సమంజసం కాదన్నారు. పైగా అంగన్‌వాడీ ఉద్యోగులు వ్యతిరేకించిన పాత జీఓను అమలు చేయాలని చూడటం అన్యాయమన్నారు. జూన్ 17న ఐసీడీఎస్ మంత్రి సీతక్కకు విన్నవించగా.. సానుకూలంగా స్పందించారని తెలిపారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెరుగుతాయని, వీఆర్ఎస్ సౌకర్యం వస్తుందని అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారన్నారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.సునీత, జిల్లా అధ్యక్షురాలు డి.వెంకటమ్మ, నాయకులు డి.సునీత, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, నాయకులు యాటల సోమన్న, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్ పాల్గొన్నారు.

అందుకే సీతక్కకు హోం ప్రతిపాదన...

సీఎంకు రైట్ హ్యాండ్, పార్టీకి వీర విధేయురాలు

- అటు అధిష్టానం దృష్టిలోనూ మాస్ లీడర్
- రాహుల్ యాత్రలోనూ పదం కలిపిన నేత
- గెలిచినా, ఓడినా ప్రజల్లోనే
- అప్పగించిన బాధ్యతలకు పూర్తి న్యాయం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎంతోమంది సీనియర్లు, మాజీ మంత్రులు ఉన్నప్పటికీ వారందర్నీ కాదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి సీతక్కకు హోం శాఖను ఎందుకు అప్పగించబోతున్నారు? కాంగ్రెస్ అధిష్టానం సైతం ఆయన ప్రతిపాదనకు ఎందుకు ఓకే అంటోంది...? అని ఎవరికైనా సందేహం వస్తే దానికి సమాధానం పార్టీ పట్ల ఆమెకున్న విధేయతే అంటున్నారు అధికార పార్టీ నేతలు. సీఎం రేవంత్‌తో కలిసి టీడీపీ నుంచి ఇప్పటి దాకా తన రాజకీయ ప్రస్థానాన్ని కొనసాగించటం, ఆయనకు రైట్ హ్యాండ్‌గా మారటమే దీనికి కారణమని వారు చెబుతున్నారు. దీంతోపాటు గెలిచినా, ఓడినా నిత్యం ప్రజల్లో ఉండటం కూడా అధిష్టానం దృష్టిలో ఆమెను ప్రత్యేకంగా నిలిపింది.



ఈ కారణంతోనే ఒకానొక సమయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సైతం నాయకులంటే సీతక్కలాగా ఉండాలి, ఆమె కష్టపడి, డక్కీమొక్కీలు తిని పైకొచ్చిందంటూ ప్రశంసలతో ముంచెత్తారు. ఆయన దేశవ్యాప్తంగా నిర్వహించిన జోడో యాత్ర రాష్ట్రంలో ప్రవేశించినప్పుడు రాహుల్‌తో కలిసి సీతక్క కొన్ని ప్రాంతాల్లో పర్యటించారు. దీంతో ఆయన కూడా ఆమె పనితీరును నిశితంగా పరిశీలించారు. వెరసి ఇప్పుడు ఆమెకు అత్యంత కీలకమైన హోం శాఖను అప్పగించనున్నారనే సంకేతాలు బలంగా వినబడుతున్నాయి.ఉమ్మడి రాష్ట్రంలో 2009 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి వరంగల్ జిల్లా ములుగు నుంచి టీడీపీ తరపున తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన సీతక్క... 2014లో మాజీ మంత్రి చందూలాల్ చేతిలో ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత 2018, 2023 ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి వరసగా గెలిచారు. అయితే 2014 తర్వాత రేవంత్‌తో కలిసి ఆమె కాంగ్రెస్‌లో చేరారు. ఈ క్రమంలో గెలుపోటములతో సంబంధం లేకుండా ప్రజలతో మమేకం కావటమనేది ఆమెను కాంగ్రెస్ అధిష్టానం దృష్టిలో పడేలా చేసింది. అనంతరం గత డిసెంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత కీలకమైన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను సీఎం రేవంత్ ఆమెకు అప్పజెప్పారు. ఈ నేపథ్యంలో అటు ఎమ్మెల్యేగా, మంత్రిగా, ఆదిలాబాద్ జిల్లాకు ఇన్‌ఛార్జీ మంత్రిగా సీతక్క తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా పోషిస్తున్నారనే పేరును తెచ్చుకున్నారు. విధానపరమైన అంశాల్లో ఇతర మంత్రులు తమ పరిధులు, పరిమితులు దాటి మాట్లాడుతున్నప్పటికీ సీతక్క మాత్రం వాటి జోలికెళ్లకుండా తనకు అప్పగించిన పనికే పరిమితమవుతుండటం గమనార్హం. ఇది ఆమెకు బోనస్ మార్కులు తెచ్చి పెట్టింది. గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో తొలి దఫా ప్రభుత్వంలో నాయిని నర్సింహారెడ్డి, ఆ తర్వాత మహమూద్ అలీ హోం మంత్రులుగా ఉన్నప్పటికీ వారు ఆ పదవిలో అంతగా రాణించలేకపోయారనీ, వ్యవహారం మొత్తం కేసీఆరే చూసుకోగా, వారిద్దరూ నామ్ కే వాస్తేగా ఉండిపోయారనే అభిప్రాయాలున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ నక్సలైటు, మాస్ లీడర్ అయిన సీతక్కకు హోం శాఖ అప్పగించనున్నారనే వార్తలు సర్వత్రా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

అభివృద్ధి కోసమే కాంగ్రెస్‌లో చేరాను

- ఎమ్మెల్సీ కవిత సహకారంతోనే రాజకీయాల్లోకి వచ్చా : జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

నవతెలంగాణ-జగిత్యాల

జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కోసమే కాంగ్రెస్ పార్టీలో చేరాను అని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం జగిత్యాల పట్టణంలోని పద్మనాయక మినీ కల్యాణ మండపంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సహకారంతోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు వ్యవసాయరంగ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలతోపాటు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నందున కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు తెలిపారు. జగిత్యాల పట్టణంలో 4500 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టామని, వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో కొంత ఆలస్యం



అయిందన్నారు. సీఎం, మంత్రుల సహకారంతో డబుల్ ఇండ్లకు మౌలిక సదుపాయాల కోసం రూ.32 కోట్ల 16 లక్షల మంజూరుకు జీవో తీసుకొచ్చినట్టు తెలిపారు. తమది కూడా రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమే అని చెప్పారు. మాకునూరి శ్రీరంగరావు, మాజీ మంత్రి చొక్కారావు తమ కుటుంబ సభ్యులే అన్నారు. తాను ఎమ్మెల్యేగా పోటీ చేసే నాటికి జగిత్యాల నియోజవర్గంలో బీఆర్ఎస్‌కు ఎంపీటీసీలు, జడ్పీటీసీ, కౌన్సిలర్ లేరని చెప్పారు. ప్రజాస్వామ్యంలో అధికార పార్టీలో ఉంటేనే నియోజకవర్గ అభివృద్ధి జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంలో కేటీఆర్ చేసిన విమర్శలు ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి తనకు ఎలాంటి వ్యక్తిగత విభేధాలూ లేవని తెలిపారు.

రూట్ సర్వేలు చేసి రన్నింగ్ టైం ఇవ్వండి

- ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి : టీజీఎస్ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీజీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) యాజమాన్యాన్ని కోరింది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలుతో ఉద్యోగుల ఉద్యోగ భద్రత మరింత ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ స్కీం అమలుతో డ్రైవర్లు, కండక్టర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారనీ, అన్ని రూట్లను శాస్త్రీయంగా అధ్యయనం చేసి రన్నింగ్ టైమ్ నిర్ణయించాలని డిమాండ్ చేసింది. మహాలక్ష్మి స్కీం వల్ల నమోదవుతున్న కేసులను సానుభూతితో పరిశీలించాలని సంస్థ వీసీ అండ్ ఎమ్‌డీ వీసీ సజ్జనార్‌కు విజ్ఞప్తి చేసింది. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో మోటారు వాహన చట్టంలోని సెక్షన్ 184ను కచ్చితంగా అమలు చేయాలని కూడా కోరింది. ఈ మేరకు టీజీఎస్ఆర్టీసీ వీసీ అండ్ ఎమ్‌డీ వీసీ సజ్జనార్‌కు వినతిపత్రం ఇచ్చినట్టు ఫెడరేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్ రావు తెలిపారు. ఈ అంశాలపై ఇప్పటికే పలుమార్లు తమ సంఘం వినతిపత్రాలు సమర్పించిందని గుర్తుచేశారు. మహాలక్ష్మి స్కీం అమల్లోకి వచ్చిన పది రోజుల్లోనే డ్రైవర్లు, కండక్టర్ల సమస్యలపై అధ్యయనం చేసి, వాటి పరిష్కారం కోరుతూ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చినట్టు తెలిపారు. వాటిలో కొన్నింటిని పాక్షికంగా పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అయితే ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు సంబంధించిన సమస్యలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. బస్సుల్లో ప్రతి ట్రిప్పులో వంద నుంచి 120 శాతం ఆక్యుపెన్సీ ఉంటున్నదనీ, టిమ్ మెషిన్‌లో జీరో టిక్కెట్ల జారీకి సంబంధించి సమస్యలు ఉన్నాయని వివరించారు. వీటివల్ల గడచిన ఏడు నెలల్లో 80 మందిపై మహాలక్ష్మి కేసులు నమోదయ్యాయనీ, వారిలో 70 మందిపై ఒకే తరహా కేసులు ఉండటాన్ని గమనించాలన్నారు. మహాలక్ష్మి స్మార్ట్ కార్డ్‌ను త్వరగా అమల్లోకి తేవాలని కోరారు. రన్నింగ్ టైం చాలకపోవడంతో ప్రతి సర్వీసులో రెండు గంటలు ఆలస్యంగా డ్యూటీ ముగుస్తున్నదని వివరించారు. ఆర్టీసీలో కాలం చెల్లిన బ్రీత్ ఎనలైజర్ల వల్ల ఇబ్బందులు వస్తున్నాయనీ, వాటిస్థానంలో కొత్తవి తేవాలని కోరారు. ఎమ్‌వీ యాక్ట్ సెక్షన్ 184 ప్రకారం బ్రీత్ ఎనలైజర్స్‌తో పరీక్షించినప్పుడు 30 ఎంజీ/100 ఎంఎల్ కంటే ఎక్కువ వుంటేనే శిక్షార్హులు అనీ, దేశవ్యాప్తంగా పోలీసులు కూడా ఇదే ప్రమాణాన్ని పాటిస్తున్నారని తెలిపారు. కానీ ఆర్టీసీలో మాత్రం 1ఎంజీ వచ్చినా పనిష్మెంట్లు ఇచ్చి, సస్పెండ్ చేస్తున్నారనీ, ఇది అన్యాయమని పేర్కొన్నారు.

ఖర్గేతో మహేశ్వర్ గౌడ్ భేటీ

- రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై చర్చ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోన్న ఆరు గ్యారెంటీల అమలును ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గే సూచించారని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్వర్ గౌడ్ తెలిపారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్వర్ గౌడ్ మంగళవారం ఏఐసీసీ కార్యాలయం లో పార్టీ చీఫ్ ఖర్గేను మర్యాదపూర్వకంగా కలిశారు. దాదాపు 20 నిమిషాలకుపైగా సాగిన ఈ భేటీలో రాష్ట్రంలోని తాజా రాజకీయ అంశాలపై చర్చించారు. అనంతరం మహేశ్వర్ గౌడ్ తెలంగాణ భవన్‌లో మీడియా ప్రతినిధులతో కాసేపు మాట్లాడారు. తెలంగాణకు సంబంధించిన పలు అంశాలపై ఖర్గేతో చర్చించినట్లు చెప్పారు. తెలంగాణలో ప్రభుత్వం అమలు చేస్తోన్న సంక్షేమ పథకాలకు మరింత ప్రచారం కల్పించాలని ఖర్గే ఆదేశించారన్నారు. అలాగే ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోన్న ఆరు గ్యారెంటీలపై క్యాంపెన్‌పై ఫోకస్ చేయాలని సూచించారన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ కు చెందిన పలువురు సీనియర్ నేతల ఆరోగ్య పరిస్థితిపై ఖర్గే ఆరా తీశారన్నారు. ఇక మహేశ్వర్ రెడ్డి తన గురించి పరిచయం చేసుకునే ప్రయత్నం చేయగా... తనకు అన్నీ తెలుసునని, కొత్తగా పరిచయం అవసరం లేదని ఖర్గే చెప్పినట్టు తెలిపారు.

పీసీసీ చీఫ్ రేసులో మహేశ్వర్ రెడ్డి...!

ఈ నెల 7తో ప్రస్తుత పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి పదవీకాలం ముగియనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తోన్న నేపథ్యంలో... అదనంగా ఉన్న పీసీసీ పదవి నుంచి తనను రిలీవ్ చేయాలని రేవంత్ రెడ్డి ఇప్పటికే హైకమాండ్‌కు స్పష్టం చేశారు. దీంతో ఢిల్లీ అధిష్టానం ఇప్పటికే సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రులు, రాష్ట్రానికి చెందిన పార్టీ ముఖ్యనేతల అభిప్రాయాన్ని సేకరించింది. ఈ నేపథ్యంలో నేడు, రేపో కొత్త పేరును కూడా ప్రకటించే ఆస్కారం ఉన్నట్లు ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. దీనికి తోడు సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం ఢిల్లీ పర్యటనకు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా ఈసారి పీసీసీ చీఫ్ పదవిని బీసీకి కేటయించనున్నట్టు ప్రచారం జరుగుతోంది. దీంతో పీసీసీ రేసులో బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ మధుయాష్కీ, ప్రస్తుత పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్వర్ గౌడ్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. మధు యాష్కీకి హైకమాండ్‌తో మంచి సంబంధాలు ఉండగా... మహేశ్వర్‌గౌడ్ పేరును రాష్ట్ర నేతలు సూచిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మల్లికార్జున ఖర్గేతో మహేశ్వర్ గౌడ్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆర్థిక అవినీతిని బీజేపీ దాచిపెడుతోంది

- కోట్లు ఖర్చు చేసిన కట్టడాలు నేలమట్టం : రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



ఆర్థిక అవినీతిని బీజేపీ దాచిపెడుతోందని రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ వి.శివదాసన్ విమర్శించారు. మంచి భవిష్యత్తు, మోక్షం కోసం భక్తులు రామనామాన్ని జపిస్తారని, డబ్బు దోచుకోవడానికి, అవినీతిని దాచుకోవడానికి ఈ ప్రభుత్వం రామనామం జపిస్తోందని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రామమందిరం పైకప్పు లీక్ అవుతోందని స్వయంగా పూజారి వెల్లడించారని, ఆలయ నిర్మాణ వ్యయం రూ.1,800 కోట్లు అని, రామ మందిరాన్ని నరేంద్ర మోడీ ప్రారంభించారని అన్నారు. రూ.845 కోట్లతో నిర్మించిన రామ్ పాత్ పెద్ద పెద్ద గుంతలతో నిండిపోయిందని, దీనిని కూడా నరేంద్ర మోడీనే ప్రారంభించారని గుర్తు చేశారు. రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా సీపీఐ(ఎం) తరపున వి. శివదాసన్ మాట్లాడారు. ఢిల్లీ, రాజ్‌కోట్, జబల్‌పూర్ విమానాశ్రయాల్లో టెర్మినల్స్ కూలిపోయాయని, అటల్ అంటే దృఢమైనది. కానీ ముంబై అటల్ సేతుకు పగుళ్లు వచ్చాయని తెలిపారు. అటల్ సేతు కోసం రూ.17,480 కోట్లు ఖర్చు చేశారని పేర్కొన్నారు. ఒక్క బీహార్‌లోనే 20 రోజుల్లో ఆరు వంతెనలు కూలిపోయాయని, విద్యారంగంలో కూడా పరిస్థితి ఆశాజనకంగా లేదని పేర్కొన్నారు. నీట్ ప్రశ్నాపత్రం లీక్ దేశంలోనే అతిపెద్ద కుంభకోణమని, దేశ వైవిధ్యాన్ని నాశనం చేసే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. అందుకే ' కేజీ టు పీజీ' నిర్వహణకు ఎన్టీఏ అనే ఏజెన్సీని ప్రారంభించారని శివదాసన్ చెప్పారు.

రాష్ట్రపతి ప్రసంగానికి దేశ సామాజిక, రాజకీయ నేపథ్యానికి సంబంధం లేదు : రహీం

పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగానికి భారతదేశ సామాజిక, రాజకీయ నేపథ్యానికి సంబంధం లేదని రాజ్యసభలో సీపీఐ(ఎం) ఎంపీ ఎఎ రహీమ్ అన్నారు. నిరుద్యోగ ప్రస్తావనే లేకుండా చేయడం యువతను ఆందోళనకు గురి చేస్తోందని విమర్శించారు. కేంద్ర సర్వీసులో 9.6 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని, రైల్వేలో 2.5 లక్షల ఖాళీలను భర్తీ చేయలేదని విమర్శించారు. లోకో పైలట్లు 18,999 ఖాళీలు ఉన్నాయని సీఎంఐఈ ప్రకారం, దేశంలో నిరుద్యోగం గత ఏప్రిల్‌లో 8.01 శాతానికి పెరిగిందని తెలిపారు. అగ్నిపథ్‌తో సైన్యంలో కాంట్రాక్టీకరణ తీసుకొచ్చారని, అసమర్థ విధానాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ మైనారిటీ ప్రభుత్వానికి మద్దతునిస్తున్న జేడీయూ కూడా ఇదే అభిప్రాయంతో ఉందని అన్నారు. అగ్నిపథ్ ప్రాజెక్టును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పదేండ్లుగా ఈ ప్రభుత్వం దేశంలో నెలకొన్న సమస్యలను పట్టించుకోలేదన్నారు. మోడీ ప్రభుత్వం గాంధీని పరిశుభ్రత అంబాసిడర్‌గా మారుస్తోందని, గాంధీజీ భారతీయ లౌకికవాదం, బహుళత్వానికి అంబాసిడర్ అని అన్నారు. గాంధీజీ పేరుతో మరుగుదొడ్లు నిర్మిస్తున్న బీజేపీ ప్రభుత్వం సెక్యులర్ భారత్‌ను బుల్డోజర్ చేస్తోందని విమర్శించారు. గాంధీజీని ఉటంకించే హక్కు బీజేపీ ప్రభుత్వానికి లేదన్నారు. గాంధీ మంత్రం 'ఈశ్వర్ అల్లా తేరే నామ్' అయితే బీజేపీ మంత్రం 'కాశీ మధుర బాకీ హై' అని రహీమ్ అన్నారు.

బీజేపీ నిరంకుశ రాజకీయాలకు తగిన గుణపాఠం : ఎస్. వెంకటేషన్

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నిరంకుశ రాజకీయాలకు ఓటర్లు తగిన గుణపాఠం చెప్పారని సీపీఐ(ఎం) లోక్‌సభ ఎంపీ ఎస్. వెంకటేషన్ అన్నారు. బీజేపీకి మళ్లీ మెజారిటీ వస్తే తమ ఓటు హక్కును కూడా కోల్పోతారని ప్రజలు గ్రహించారన్నారు. వచ్చే అసెంబ్లీలో ప్రతిపక్షం ఉండదని మోడీ గత లోక్‌సభలో చివరి ప్రసంగంలో చెప్పారని అన్నారు. ప్రతిపక్ష సభ్యుల సంఖ్యను గణనీయంగా పెంచడంతో ప్రజలు స్పందించారని, రైతుల సమ్మె సందర్భంగా ఢిల్లీలోకి ట్రాక్టర్లు రాకుండా ప్రభుత్వం నిషేధం విధించిందని అన్నారు.

అయితే రైతు నేతైన సీపీఐ(ఎం) ఎంపీ అమ్రారామ్ మాత్రం ట్రాక్టర్‌పై పార్లమెంట్‌కు చేరుకుని ప్రమాణ స్వీకారం చేశారని గుర్తు చేశారు. లోక్‌సభ ఎన్నికలు కూడా బీజేపీ పతనాన్ని ప్రారంభించాయని వెంకటేషన్ అన్నారు. అయోధ్యతో కూడిన ఫైజాబాద్‌లో దళిత నాయకుడు అవధేష్ కుమార్ జనరల్ స్థానంలో బీజేపీపై గెలిచారని తెలిపారు. బీజేపీ దేవాలయాలను పోలింగ్ బూత్‌లకు గేట్‌వేలుగా చూసిందని, కానీ ఓటర్లు వేరే విధంగా బోధించారని ఎద్దేవా చేశారు. దేవాలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలని పేర్కొన్నారు. బీజేపీ అయోధ్యలో ఓడిపోయి కాశీలో నీళ్లు తాగిందని ఎద్దేవా చేశారు. తాను దేవుని కుమారుడనని ఆయన చెప్పుకోవడం ప్రజలకు ఆమోదయోగ్యంగా లేదని మోడీని ఉద్దేశించి అన్నారు. కోచింగ్ మాఫియాలు పరీక్ష నిర్వహించే ఏజెన్సీలను నియంత్రిస్తున్నాయన డా నికి ప్రశ్నాపత్రం లీక్ ఒక ఉదాహరణ అని, దీనిని ప్రభుత్వం అడ్డుకోలేదని విమర్శించారు.

అయోధ్య వీధులన్నీ బురదతో నిండి ఉన్నాయని, కొత్త ఆలయానికి వెళ్లాలంటే దానిని దాటాల్సిందే నని ఫైజాబాద్ ఎంపీ అవధేష్ కుమార్ అన్నారు.

ద.మ.రైల్వే సీఎస్‌టీఈగా సౌరభ్ బందోపాధ్యాయ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దక్షిణ మధ్య రైల్వేలో ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికాం ఇంజనీర్‌గా ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజనీర్స్ (ఐఆర్ఎస్ఎస్ఈ) అధికారి సౌరభ్ బందోపాధ్యాయ సికింద్రాబాద్ రైల్ నిలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1990 బ్యాచ్‌కి చెందిన ఆయన మౌలానా ఆజాద్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ పూర్తి చేశారు. 21 ఏండ్లకే అదే సంవత్సరం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. అప్పటి నుంచి దేశంలోని పలు రైల్వే జోన్లలో వివిధ హెూదాల్లో ఆయన పనిచేశారు. ఈ సందర్భంగా సిగ్నల్ అండ్ టెలికం విభాగం అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

పదేండ్లలో జాబ్ క్యాలెండర్ ఎందుకివ్వలేదు?

కేటీఆర్‌కు చనగాని దయాకర్ సూటిప్రశ్న

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వరుసగా పదేండ్లు బీఆర్ఎస్ ప్రభుత్వమే ఉందనీ, ఆ కాలంలో జాబ్ క్యాలెండర్ ఎందుకు విడుదల చేయలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావుని కాంగ్రెస్ నేత చనగాని దయాకర్ ప్రశ్నించారు. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ నోటిఫికేషన్లలో తప్పులు, పరీక్షపత్రాల లీకులతో నిరుద్యోగుల బతుకులు ఆగమయ్యాయన్న సోయి లేదా? అని నిలదీశారు. మోతీలాల్‌ను బలిపశువును చేయాలని హరీశ్‌రావు కుట్ర పన్నారని ఆరోపించారు. జాబ్‌క్యాలెండర్‌తో పాటు నిరుద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా తమ ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతల ట్రాప్‌లో పడి నిరుద్యోగులు తమ జీవితాలను ఆగం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ - మహేశ్వరం
బుధవారం జూలై 03, 2024 www.navatelangana.com

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను కలిసిన రాగుల



నవతెలంగాణ - వనస్థలిపురం

వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్ రెడ్డి మంగళవారం వివిధ కాలనీల అధ్యక్షులతో కలిసి కొత్తగా వచ్చిన ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తర్వాత పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం పలు సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్ జోనల్ కమిషనర్‌ను కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో క్రిస్టియన్ కాలనీ అధ్యక్షుడు హరి, నాగార్జున నగర్ కాలనీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి, వెంకటరమణ కాలనీ అధ్యక్షుడు, నవీన్, మల్కాజ్ నగర్ కాలనీ అధ్యక్షుడు నిరంజన్, వివిధ కాలనీల అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేసిన సబితమ్మ

నవతెలంగాణ - మీర్ పేట్

మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ లెనిన్ నగర్‌కు చెందిన రేణుక భర్త రాములుకు సీఎం సహాయ నిధి నుండి చెక్కు మంజూరైంది. ఈ మేరకు మంగళవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రూ.1,50,000 విలువ గల ఆ చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాధితులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలి

- సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్



నవతెలంగాణ - ఎల్బీనగర్ / హస్తినాపురం

కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చంద్రమోహన్ అన్నారు. సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో భూపేష్ నగర్ ప్రభుత్వ స్కూల్లో కార్మికుల పిల్లలకు మంగళవారం నోట్ బుక్స్ అందజేశారు. ఎల్బీనగర్ సర్కిల్ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. కార్మికుల పిల్లల్లో ఆణిముత్యం లాంటి పిల్లలు ఉంటారని అన్నారు. భవన నిర్మాణ జీహెచ్‌ఎంసీ హమాలీ, ఆటో కార్మికులు, మెకానిక్ కార్మికులు, వీధి వ్యాపారాలు, వివిధ రంగాలకు సంబంధించిన కార్మికుల పిల్లలు ప్రభుత్వ స్కూల్లో చదువుకుంటున్నారని తెలిపారు. వీరికి ప్రైవేట్ స్కూళ్ల కంటే దీటుగా ప్రభుత్వ స్కూల్లో నాణ్యమైన విద్యనందించాలని కోరారు. మంచి చదువు అందిస్తే పిల్లల ప్రతిభ బయటికి వస్తుందని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన మాటల్లో అధ్యాయం, పోరాటం చేయాలని గుర్తు చేశారు. నందనవనం భూపేష్ నగర్ ప్రాంతంలో ఎక్కువ మంది కార్మికుల పిల్లలు చదువుతున్నారని చెప్పారు. ప్రభుత్వ హాస్టల్ సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నందనవనం ఆసియా ఖండంలోనే అతిపెద్ద స్లమ్ ఏరియా అని తెలిపారు.

నందనవనం, భూపేష్ నగర్‌లో విద్య, వైద్యం పేదలకు అందించడానికి, స్థానికంగా కార్మికులు సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ, వృత్తి సంఘాల అండతో స్కూల్, హాస్టల్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి ముందు ఉంటారని అన్నారు. ఎస్ఎఫ్ఐ స్టూడెంట్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో అధ్యయనం, పోరాటం చేయాలి అన్నారు. పిల్లలు పక్క దారి పట్టకుండా చెడు అలవాట్లకు బానిసలుగా మారకుండా ఎస్ఎఫ్ఐ సంఘంలో చేరి మంచిగా చదువుకొని పై స్థాయికి ఎదగాలని కోరారు. ప్రభుత్వ హాస్టల్, ప్రభుత్వ జూనియర్ కాలేజీలను నందనవనం, భూపేష్ నగర్ ప్రాంతాలలో ఏర్పాటు చేసేంతవరకూ ఎస్ఎఫ్ఐ, సీఐటీయూ, వృత్తి సంఘాలు, కార్మికుల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్షవర వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెన్నారం మల్లేష్, సీఐటీయూ ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ సభ్యులు పి.రామస్వామి, సీపీఐ(ఎం) పార్టీ నందనవనం శాఖ కార్యదర్శి మంతాని యాదయ్య, కె వెంకటయ్య, పి.శ్రీనివాస్, సంతోష్, బుచ్చమ్మ, అంజమ్మ పాల్గొన్నారు.

6 నుండి ప్రజా సమస్యలపై
క్షేత్రస్థాయిలో సీపీఐ(ఎం) బస్తీ బాట

- సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాస్





నవతెలంగాణ-సిటీబ్యూరో

నగర ప్రజా సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బస్తీ బాట నిర్వహిస్తున్నామని సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నగర కార్యదర్శి ఎం.శ్రీనివాస్ తెలిపారు. గోల్కొండ చౌరస్తాలోని సీపీఐ(ఎం) నగర కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బస్తీ బాటను జూలై 6 నుంచి 15 వరకు నిర్వహిస్తామని, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. అధికారంలోకి వస్తే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడిచినా నగరంలో ప్రజా సమస్యల పరిష్కారంపై ఇప్పటికీ తగినంత కృషి ప్రారంభించలేదని విమర్శించారు. నగరంలో ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పేదల ఇండ్ల విషయంలో 10 ఏండ్ల పాటు నాన్చిందని, తీరా అసెంబ్లీ ఎన్నికల ముందు 60 వేల మందికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇచ్చిందని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్స్ నిర్మించిన కాంప్లెక్స్‌లలో కనీస సౌకర్యాలు లేవన్నారు. రోడ్లు, తాగు నీరు, కరెంటు లేదన్నారు. లిఫ్టులు కూడా పనిచేయడం లేదన్నారు. దాంతో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లలో లబ్దిదారులు ఉండగలిగే పరిస్థితి లేదన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాంప్లెక్స్‌లలో సదుపాయాలు కల్పించాలంటే దాదాపు రూ.600కోట్లు కావాలని అధికారులే లెక్కలు చెపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అవసరమైన నిధులు కేటాయించి, లబ్దిదారులు ఇండ్లల్లో నివసించే పరిస్థితులను కల్పించాలన్నారు.

నగరంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను తక్షణమే గుర్తించి, మురికివాడల పేదల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వం సహకరించాలన్నారు. గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు కరెంటు వాడుకున్న వారికి ఉచిత విద్యుత్ అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ నగరంలో అనేక మంది లబ్దిదారులకు ఈ పథకం అందడం లేదన్నారు. దరఖాస్తు చేసుకున్నప్పటికీ కొంత మంది దరఖాస్తులను పక్కన పెట్టారన్నారు. రేషన్‌కార్డు లేకపోవడంతో లబ్దిదారులకు ఏ స్కీమ్ అమలు కావడం లేదన్నారు. రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనేకమంది దరఖాస్తులను పక్కన పెట్టారన్నారు. రూ. 500లకే గ్యాస్ సిలిండర్ స్కీం కూడా ఎక్కువ మందికి అందడం లేదన్నారు. రేషన్ కార్డుల పంపిణీ తక్షణమే ప్రారంభించాలన్నారు. నగరంలో చిన్న వర్షానికే రోడ్లన్నీ చెరువులుగా మారిపోతున్నాయని, కరెంట్ సైతం కట్ అవుతుందన్నారు. అనేక ప్రాంతాల్లో రోడ్లపై గుంతలు పడ్డాయని, డ్రైనేజీ, నాలాలు పొంగి పొర్లుతున్నాయని, నగర అభివృద్ధికి ప్రభుత్వం తగినంత శ్రద్ధ పెట్టాలన్నారు. మూసీ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రతిపాదనలను ఆహ్వానిస్తున్నామని, అదే సమయంలో మూసీ అభివృద్ధి పేరుతో ఏకపక్షంగా పేదల ఇండ్లను తొలగించే చర్యలను అంగీకరించమన్నారు.

నగరంలో మెట్రో రైల్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను సైతం స్వాగతిస్తున్నామని, అదే సమయంలో అతి చౌకగా ప్రయాణించే ఎంఎంటీఎస్ రైళ్లపై కూడా సమీక్ష చేసి దాని అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మూడు కోచ్‌లతో నడుపుతున్న మెట్రోరైల్‌ను ఆరు కోచ్‌లకు పెంచాలన్నారు. నగరంలో బస్సుల సంఖ్య పెంచకపోవడంతో బస్సులల్లో రద్దీ పెరిగి ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. తక్షణమే బస్సుల సంఖ్యను రెట్టింపు చేయాలన్నారు. గత ప్రభుత్వంలో జీహెచ్‌ఎంసీ పాలకమండలి నామ్ కే వాస్తేగా మారిపోయిందని విమర్శించారు. ఈ ప్రభుత్వమైనా ప్రజలు ఎన్నుకున్న జీహెచ్‌ఎంసీ కౌన్సిల్, స్టాండింగ్ కమిటీకి తగిన ప్రాధాన్యతనివ్వాలన్నారు. నగర పాలన రాజ్యాంగ బద్ధంగా జరిగేలా తగిన నిధులు, బాధ్యతలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా నగర శివార్లలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాంప్లెక్స్‌లలో కరెంట్, తాగునీరు, లిఫ్ట్, రోడ్ల సదుపాయాలను తక్షణమే కల్పించాలన్నారు. మధ్యలో ఆగిపోయిన ఇండ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులను వెంటనే గుర్తించాలని, పేదల ఇండ్ల నిర్మాణానికి ప్రభుత్వ సహాయం తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి రేషన్ కార్డులను ఇవ్వాలన్నారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అర్హులందరికీ అమలు చేయాలన్నారు. రూ.500కు గ్యాస్ సిలిండర్ అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.శ్రీనివాసరావు, ఎం.దశరద్, ఎం.మహేందర్ పాల్గొన్నారు.

డెంగ్యూ వ్యాధి నివారణపై
ప్రజలకు అవగాహన కల్పించాలి



- సీజనల్ వ్యాధుల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలి
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు, డెంగ్యూ, మలేరియా వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున వ్యాధుల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో దోమల నియంత్రణ, వాటి వల్ల సంక్రమించే వ్యాధుల నియంత్రణపై డీసీసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా, విష జ్వరాలు ప్రభలకుండా వ్యాధుల నివారణపై జీహెచ్‌ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ నివారణ చర్యలపై దృష్టి పెట్టి, ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. డెంగ్యూ వ్యాధి రాకుండా ఉండేందుకు అన్ని వైద్య ఆరోగ్య కేంద్రాలలో వైద్య సౌకర్యాలు, టెస్టింగ్ కిట్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అయిదేండ్లలో ఏ ప్రాంతాలలో ఎక్కువ డెంగ్యూ కేసులు వచ్చాయని చూసుకొని.. ఆ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని జీహెచ్‌ఎంసీ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులను, సిబ్బందిని కలెక్టర్ కోరారు. ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల రెసిడెన్షియల్ వసతి గృహాల్లో పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండకుండా, సానిటేషన్ బాగుండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో డెంగ్యూ కేసులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున ఎప్పటినుండే ప్రత్యేక కార్యచరణతో నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబ్‌లకు వైద్య పరీక్షలకు వచ్చే వారి అడ్రస్, మొబైల్ ఫోన్ నెంబర్లు తప్పకుండా తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట్, జీహెచ్‌ఎంసీ సీఎంవోహెచ్ రాంబాబు, చీఫ్ ఎంటమాలజిస్ట్, డిస్టిక్ సర్వేలెన్సు ఆఫీసర్ డాక్టర్ హర్ష, ఇంచార్జ్ డీఎంవో నిరంజన్, జిల్లా అధికారులు యాదయ్య, కోటాజి, ఇలియాజ్ అహ్మద్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగ ఏర్పాట్లు పూర్తి

- పంపిణీకి సిద్ధంగా ఉన్న చెక్కులు
- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతికి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగ ఏర్పాట్లు పూర్తి చేశామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. ఈ నెల 7 నుంచి ప్రారంభమయ్యే ఆషాఢ జాతర బోనాల ఉత్సవాలకు వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన ఏర్పాట్లు పూర్తి కావస్తున్నాయన్నారు. 7న శ్రీ జగదాంబ మహంకాళి గోల్కొండ లంగర్‌హౌస్ నుంచి తొట్టెల ఊరేగింపు మంత్రులచే ప్రారంభించనున్నామని తెలిపారు. సదరు బోనాల ఏర్పాట్లన్నీ కమిటీ సభ్యులు, కార్యనిర్వాహణ అధికారి కలసి నిర్వహించనున్నారని తెలిపారు. దేవాలయానికి సంబంధించిన రంగులు, అలంకరణ మొదలగు పనులు పూర్తి అయినట్టు, ఆర్ అండ్ బి శాఖ ద్వారా బారికేడ్లు, దేవాలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. విద్యుత్ దీపాలంకరణ చేయనున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాలకు బోనాల పండుగ నిమిత్తం ఇవ్వాల్సిన చెక్కులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని, నేడు లేదా రేపు చెక్కులను పంపిణీ చేస్తామన్నారు. అలాగే ఇతర దేవాలయాల వద్ద భద్రత, పార్కింగ్, విద్యుత్ బ్యారికేడ్ల, తాగునీరు, టాయిలెట్స్‌ల ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయని కలెక్టర్ తెలిపారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ ద్వారా పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నదని తెలిపారు.

నాగోలులో జోనల్ కమిషనర్ పర్యటన



నవతెలంగాణ -నాగోల్

ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఐఏఎస్ మంగళవారం నాగోలు డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన డివిజన్‌లోని సుందరీకరణ పనులు ఆగిపోయిన నాగోలు చెరువును, గుంతలు పడి శిథిలావస్థకు చేరిన నాగోల్ నుండి ఓఆర్ఆర్‌కు వెళ్లే రేడియల్ రోడ్డును పరిశీలించారు. తర్వాత డివిజన్‌లోని పలు సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. డివిజన్‌లో ప్రధానంగా డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన స్థితిలో ఉందనే విషయాన్ని కమిషనర్ దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. ఏపాటి చిన్న వర్షాలు పడినా రోడ్ల వెంట డ్రైనేజీలు పొంగుతుంటాయని చెప్పారు. అదేవిధంగా మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరిన రేడియల్ రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టి వాహనదారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కమిషనర్‌ను కోరారు. నాగోల్ చెరువు సుందరీకరణ పనులు వెంటనే చేపట్టి.. త్వరలో పూర్తి చేసి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్‌లను ప్రజలకు అందుబాటులో తేవాలన్నారు. ఆనందనగర్ చౌరస్తాలో రోడ్డు ఇరుక్కుగా ఉండడంతో ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్య నెలకొంటుందని, ఆనంద నగర్ చౌరస్తాలో రోడ్డు విస్తరణ చేపట్టి అభివృద్ధి చేయాలని కోరారు. కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పందిస్తూ... వారం రోజుల్లో నాగోల్ నుండి తాజ్ హోటల్ వరకు సీసీ రోడ్లు, బీసీ రోడ్ల పనులను ప్రారంభించి, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. కమిషనర్ వెంట హయత్ నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ యాదయ్య తో పాటు పలువురు అధికారులు, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు చింతల సురేందర్ యాదవ్, పలువురు ఉన్నారు.

రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన



నవతెలంగాణ-హయత్ నగర్

అంగన్ వాడీ టీచర్స్, హెల్పర్స్‌కు రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరుతూ హయత్ నగర్ ప్రాజెక్ట్ టీచర్స్, ఆయాలు విజయవాడ జాతీయ హైవే అంబేద్కర్ విగ్రహం దగ్గర సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ మాట్లాడుతూ హయత్ నగర్ ప్రాజెక్ట్ ఏర్పడినప్పటి నుంచి దాదాపుగా 36 సంవత్సరాల నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలకు పౌష్టికాహారం అందించి, చిన్నపిల్లల మల, మూత్రాలు తీసి సేవ చేసిన వారికి రిటర్మెంట్ సందర్భంగా కనీసం టీచర్‌కు రెండు లక్షలు, ఆయాకు లక్ష రూపాయలు ఇస్తామని గత బీఆర్ఎస్ ప్రభుత్వం, ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఒప్పుకుని జీవో నెంబర్ 10 తీసుకొచ్చారన్నారు.

జూలై ఒకటో తారీకు నుంచి పదవి విరమణ తీసుకోవాలని అంగన్‌వాడీ ప్రాజెక్టు అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీ కంటే ముందు 1975లో బాల్ బడి పేరుతో ప్రారంభమైన సెంటర్లు.. ఇన్ని సంవత్సరాలుగా స్వచ్ఛందంగా ఈ ప్రభుత్వానికి, పిల్లలకు ఇంత సేవ చేసినా వారిని గుర్తించడం లేదని అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి దిగివచ్చి రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని కోరారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా పదవీ విరమణ తీసుకుంటున్న టీచర్లను, ఆయాలను ఏకం చేసి పోరాటాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో రిటైర్ అవుతున్న టీచర్లు అమృతమ్మ, జానకమ్మ, అరుణ, పాపమ్మ, ఆయాలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత రాణించాలి



కార్పొరేటర్ రాజశేఖర్

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఉద్యోగం కోసం నిరీక్షించకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని రాణించాలని లింగోజిగూడ డివిజన్ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ పరిధిలోని కర్మన్ ఘాట్, సాగర్ రోడ్, గ్రీన్ పార్క్ కాలనీ, అమరావతి బార్ ప్రధాన రహదారి పై నూతనంగా ఏర్పాటు చేసిన లీఫ్ మందీ అండ్ ఫ్యామిలీ రెస్టారెంట్‌ను మంగళవారం కార్పొరేటర్లు వంగా మధుసూదన్ రెడ్డి, శ్వేతా మధుకర్ రెడ్డి, కొత్త కాపు అరుణా రవీందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన అన్ని రకాల భోజన బండరాలు ప్రత్యేకత ఉండాలన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి.. ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఆహారం విషయంలో పరిశుభ్రత, నాణ్యత, జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ ప్రారంభంలో నిర్వాకులు భానుచందర్ వరప్రసాద్, సునీల్, భాను, సాంబ, సుధీర్, నిఖిల్, సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'వ్యాపారంతో పాటు సేవకు ప్రాధాన్యం ఇవ్వాలి'



నవతెలంగాణ-సిటీబ్యూరో

వ్యాపారం చేసేవారు సమాజ సేవకు సైతం ముందుకు రావాలని, తద్వారా నిరుపేదలకు ప్రయోజనం చేకూరుతుందని కమ్మ మ్యాచ్ మేకింగ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మినేని ధనలక్ష్మి అన్నారు. నగరంలోని కమ్మ సంఘం భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన వధూవరుల పరిచయ వేదికలో మహిళలు ఏర్పాటు చేసిన వివిధ రకాల స్టాల్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు, చేనేత వృత్తి కళాకారులకు సహకారం అందించేందుకు తాము ఏర్పాటు చేసిన వివాహ వేదికలో ఉచితంగా స్టాల్స్ ఏర్పాటు చేసేందుకు అవకాశం ఇచ్చినట్టు తెలిపారు. ఇక్కడి వధూవరుల వేదికకు హాజరయ్యే వారు ఈ స్టాల్స్‌లో వివిధ రకాల ఉత్పత్తులు కొనుగోలు చేయడం ద్వారా పలువురు స్వయం సంఘాల మహిళలకు చేయూతను అందించినట్టు తెలిపారు. కమ్మ మ్యాచ్ మేకింగ్ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన వధూవరుల పరిచయ వేదికకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పలువురు తల్లీదండ్రులు హాజరయ్యారని, సుమారు 500 మంది పాల్గొన్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సౌజన్య, మాధవి, సుజాత, రామలక్ష్మి, రుద్రమదేవి, అనురాధ పాల్గొన్నారు.

దశల వారీగా అభివృద్ధి చేస్తా : లచ్చిరెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

దశల వారీగా కాలనీలో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఆఫీసర్స్ కాలనీలో 15 లక్షల రూపాయలతో పార్క్ అభివృద్ధి పనులు రేపు ప్రారంభం కానున్న నేపథ్యంలో.. పార్కును కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి పర్యవేక్షించారు. తర్వాత కాలనీలో పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీలోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డీఈ దామోదర్, వాటర్ వర్క్స్ డీజీఎం రాజగోపాల్, జీహెచ్‌ఎంసీ ఏఈ నరేందర్ రెడ్డి, కాలనీ కార్యదర్శి మహేష్ గుప్తా, ఉపాధ్యక్షురాలు పవిత్ర, కోశాధికారి రఘుపతి రెడ్డి, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, చీఫ్ అడ్వైజర్ మోహన్ రెడ్డి, సభ్యులు నాయుడు, రమేష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఇండోనేషియాలోని జకర్తాలో జరిగిన జాతీయ స్థాయి మేయర్ల సమావేశంలో పాల్గొన్న బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి..
నవతెలంగాణ-బడంగ్‌పేట్



పనామా చౌరస్తాలో అండర్ పాస్ వద్దు

- రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి



నవతెలంగాణ-హయత్ నగర్

పనామా చౌరస్తాలో అండర్ పాస్‌ను నిర్మించొద్దని రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో బీజేపీ అర్బన్ జిల్లా అధ్యక్షుడు ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ఉన్నప్పుడు స్థానికులతో సంప్రదింపులు లేకుండా స్థానిక ఎమ్మెల్యే ఫ్లై ఓవర్ పనులు పట్టించుకోలేదని విమర్శించారు. ప్రజల ఇబ్బందులు గ్రహించి ఆనాడు గత ఎనిమిది నెలల కిందట ఎల్బీనగర్ అసెంబ్లీ పరిధిలోని కార్పొరేటర్లు కలిసి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఎన్‌హెచ్65 జాతీయ రహదారిపై పనామా చౌరస్తాలో నిర్మిస్తున్న అండర్ పాస్ ప్రతిపాదన కాకుండా పిల్లర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై వినతి పత్రం అందజేసినట్టు గుర్తుచేశారు. ఎల్బీనగర్ ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉండేది భారతీయ జనతా పార్టీ అన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల నరసింహా రెడ్డి, కళ్లెం నవ జీవన్ రెడ్డి, బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, నూతి శ్రీనివాస్, నాంపల్లి రామేశ్వర్, పోరెడ్డి కవిత రెడ్డి, మంగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం మహాదానం : కౌన్సిలర్ నర్సింగ్‌రావు గౌడ్



నవతెలంగాణ-శామీర్‌పేట

అన్నదానం మహాదానం అని తూం కుంట మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ పి. నర్సింగ్‌రావు గౌడ్ అన్నారు. తూంకుంట మున్సిపాలిటీ దేవరయాంజల్ గ్రామంలో గౌడ సంఘం నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నర్సింగ్ రావు గౌడ్ దంపతులు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ కారంగుల రాజేశ్వర్ రావు, మాజీ ఎంపీపీ నాలిక యాదగిరి, రామాలయ కమిటీ మాజీ చైర్మెన్ వీరారెడ్డి కౌన్సిలర్లు సురేష్, హరిబాబు, రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ చైర్మెన్ రఘువీర్ గౌడ్, సభ్యులు కొండల్ గౌడ్, యాదగిరి గౌడ్, రామచందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి అండగా 'సారా'



నవతెలంగాణ-సిటీబ్యూరో

సెవెన్ రేస్ ఫౌండర్ డాక్టర్ సారా పదో తరగతి పాసై ఇంటర్ చదవలేని విద్యార్థులకు అండగా నిలుస్తున్నారు. కాప్రా ప్రభుత్వ స్కూల్‌లో 9.5 సాధించిన మనీషా ఇంటర్‌లో చేరేందుకు స్తోమత లేదు. వీరిది చాలా పేద కుటుంబం. విషయం తెలుసుకున్న డాక్టర్ సారా ఈసీఐఎల్‌లోని గీతం జూనియర్ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్‌లో చేర్పించి అండగా నిలిచారు.

మల్లాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ వినతి

నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ అభివృద్ధికి నిధులు కేటాయించాలని జీహెచ్‌ఎంసీ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్‌కు కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి వినతి పత్రం అందజేశారు. మంగళవారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ త్వరలోనే మల్లాపూర్ డివిజన్ పరిధిలో ప్రతిపాదిత పనులను పరిశీలిస్తానని అన్నారు. ఆయన వెంట చినింగల శ్రీనివాస్, ఉస్మాన్, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-అల్వాల్

బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దిష్టిబొమ్మను పలువురు వ్యాపారస్తులు ఓల్డ్ అల్వాల్ చౌరస్తా ఇందిరా గాంధీ విగ్రహం దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి చిరు వ్యాపారస్తులు వ్యాపారం చేసుకోకుండా రోడ్డు వెడల్పు చేపట్టి వారికి బతుకుదెరువు లేకుండా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే చిరు వ్యాపారుల పొట్టకొట్టడం సరికాదన్నారు. అనంతరం పలువురు వ్యాపారస్తులు ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యాపారస్తులు అంజయ్య గౌడ్, బాబురావు, వేణు గౌడ్, విష్ణు, శ్రీనివాస్, భరత్, భాను, ఆనంద్, రాజు, సాయిరాం, తదితరులున్నారు.

శానిటేషన్ అధికారులతో కార్పొరేటర్ సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంల జీహెచ్‌ఎంసీ కాప్రా సర్కిల్ శానిటేషన్ అధికారులు, డా.వెంకట రమణ, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇతర సిబ్బందితో మంగళవారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్ష కాలంలో పారిశుధ్య నిర్వహణ, చెత్తను ఎప్పటికప్పుడు ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ, స్వప్న, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రీదేవిని కలిసిన హనుమాన్ కాలనీ కార్యవర్గం



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి డివిజన్ పరిధిలోని హనుమాన్ కాలనీ నూతన కార్యవర్గ సభ్యులు చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవిని మంగళవారం ఆమె కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుల బొకే అందజేసి శాలువాతో సన్మానించారు. హనుమాన్ కాలనీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. హనుమాన్ కాలనీ ప్రెసిడెంట్‌గా సుధాకర్, వైస్ ప్రెసిడెంట్‌గా సిద్ధారెడ్డి, ట్రెజరర్‌గా ప్రవీణ్ కుమార్, జాయింట్ సెక్రటరీగా ఆంజనేయులు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సోను, శివరాజ్, జగన్, అడ్వైజర్స్‌గా సుధాకర్ రెడ్డి, లక్ష్మాచారి, మల్లయ్య గౌడ్, కమిటీ మెంబర్స్‌గా స్వామి గౌడ్, వెంకటేష్, శ్రవణ్ కుమార్, భిక్షపతి, ఉమాపతి, జగదాంబ ఎన్నికయ్యారని కార్పొరేటర్‌కు తెలిపారు. నూతన కమిటీకి శ్రీదేవి శుభాకాంక్షలు తెలిపారు. వారికి ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానన్నారు. కాలనీలో స్ట్రీట్ లైట్స్, జీడీ కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం ఇచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

బీజేఆర్ నగర్‌లో బాక్స్ నిర్మాణ పనులు ప్రారంభం



నవతెలంగాణ-మలాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ పరిధిలోని బీజేఆర్ నగర్‌లో రూ.1 కోటి 3 లక్షలతో చేపట్టిన బాక్స్ నిర్మాణ పనులను కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ శ్రీకాంత్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, డివిజన్ అధ్యక్షుడు ఉమేష్ సింగ్, సత్యమూర్తి, బాబు, సత్యనారాయణ, బీకే శ్రీనివాస్, సంపత్‌రావు, బ్రమ్మయ్య, అచ్చిరెడ్డి, రాము, నర్సింగ్ రావు, శ్రీనివాస్, కిషోర్, రాము, ములుగు శీను, అరుణ్, వాజిద్, తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్మెన్ వర్సెస్ వైస్ చైర్మెన్





- దళితబంధుపై గరంగరం
- వాడీవేడిగా జెడ్పీ సమావేశం
- సభ్యులకు సన్మానం, వీడ్కోలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ సమావేశం జెడ్పీ చైర్మెన్ వర్సెస్ వైస్ చైర్మెన్‌గా సాగింది. శరత్‌చంద్రారెడ్డి, బెస్త వెంకటేశం మధ్య దళితబంధు పథకంపై కాసేపు మాటల యుద్ధం నడిచింది. ఇద్దరూ ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటూ.. వారి వారి ప్రభుత్వాల హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌పై జరిగిన.. జరగబోయే విషయాలపై చర్చించుకున్నారు. మంగళవారం జెడ్పీ చైర్మెన్ శరత్‌చంద్రారెడ్డి అధ్యతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు జిల్లా అధికారులు వారి వారి శాఖల పురోగతిపై నివేదికలను సమర్పించారు. ప్రత్యేకంగా ఎస్సీ కార్పొరేషన్, మిషన్ భగీరథ, మాతా శిశు సంక్షేమశాఖ, ఎస్సీ కార్పొరేషన్, హార్టికల్చర్ శాఖలపై ప్రధానంగా చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలాజీ నివేదికను ప్రవేశపెడుతుండగా.. జెడ్పీ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేశం కలుగజేసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో దళితబంధు పథకంతో ఎస్సీలకు అండగా నిలిచామనీ, ఈ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ పథకం కొనసాగుతుందా..? లేదా..? అనే విషయాన్ని స్పష్టం చేయాలన్నారు. జెడ్పీ చైర్మెన్ కలుగజేసుకుని వివరాలను ఇప్పటికే సేకరించారనీ, ప్రభుత్వం నుంచి విధి విధానాలు వెలువడగానే అర్హులకు అందిస్తామని చెప్పారు. మిగిలిన 1100 మందికి అప్పుడే అందజేసి ఉంటే.. ఇప్పుడు వారిని అన్యాయం జరిగి ఉండేది కాదనీ గత ప్రభుత్వాన్ని విమర్శించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల కృషి మరువలేనిది : జెడ్పీ చైర్మెన్

జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు కృషి చేయడంలో ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు ముందున్నారని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా పరిషత్ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి కొనియాడారు. నేటితో జిల్లాలోని జెడ్పీటీసీ, ఎంపీపీల పదవీకాలం ముగుస్తున్నందున జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. జెడ్పీ చైర్మెన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, జిల్లా పరిషత్ చైర్మెన్ దిలీప్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మెన్ మాట్లాడుతూ అధికారుల కృషి, ప్రజాప్రతినిధుల సమన్వయంతో జిల్లాను అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు తోడ్పడ్డారనీ, అదే స్ఫూర్తితో రాబోయే రోజుల్లో కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు కొనసాగించాలని ఆకాంక్షించారు. జిల్లాలో పనిచేసిన అధికారులందరి సహాయ సహకారాలు ఉన్నందున మండల, గ్రామస్థాయిలో ప్రజలకు సేవలందించడంలో అధికారుల కృషి మరవలేదని కొనియాడారు. ఈ ఐదేండ్లలో ప్రతి గ్రామంలో వ్యవసాయం, రోడ్లు, వైకుంఠధామాలు, కరెంటు, నర్సరీలు, డంపింగ్ యార్డు వంటి మౌలిక సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. ఈ సందర్భంగా పదవీకాలం పూర్తి చేసుకున్న జెడ్పీటీసీ, ఎంపీపీలను జెడ్పీ చైర్మెన్ శరత్ చంద్రారెడ్డి, ఎమ్మెల్యే మల్లారెడ్డి ఘనంగా శాలువా, మెమోంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అసెంబ్లీ సీట్లు పెరుతాయి : ఎమ్మెల్యే మల్లారెడ్డి

త్వరలో అసెంబ్లీ సీట్లు పెరుగుతున్నాయనీ, ఇప్పటి జెడ్పీటీసీలు, ఎంపీపీలు ఎమ్మెల్యేలు కావొచ్చని మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీపీలకు ఇది లాస్ట్ బ్యాచ్ కావొచ్చు అన్నారు. రాష్ట్రంలోనే తక్కువ గ్రామాలు గల జిల్లా అన్నారు. రాష్ట్రంలో 12,769 గ్రామాలుంటే, గడిచిన ఐదేండ్లలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 61 గ్రామాల్లో క్రీడా మైదానాలు, వైకుంఠధామాలు, స్ట్రీట్ లైట్లు వంటి పనులు చేపట్టినట్టు చెప్పారు. జిల్లాలో సిమెంట్ రోడ్డు లేని గ్రామమే లేదనీ, గుళ్లు సైతం కట్టించామని తెలిపారు. నర్సరీలు ఏర్పాటు చేశామనీ, హరితహారం కార్యక్రమం చేపట్టామని చెప్పారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయండి

- ఐక్య విద్యార్థి సంఘాల డిమాండ్



నవతెలంగాణ-ఘట్కేసర్

నీట్ పేపర్ లీకేజీని నిరసిస్తూ ఈ నెల నాలుగో తేదీన విద్యా సంస్థల బంద్‌ను (భారత్‌బంద్) విజయవంతం చేయాలని ఐక్య విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు అన్నారు. మంగళవారం ఘట్కేసర్ మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్‌లో ఐక్య విద్యార్థి సంఘాల జిల్లా నాయకులు ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి నానావత్ శివాజీ నాయక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండీ.అన్వర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు వినయ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నీట్, నెట్ పరీక్షలను రద్దు చేసి రీ ఎక్షమ్ నిర్వహించాలని, ఎన్‌టీఏ సంస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షా పేపర్ లీకేజ్ పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష 23 లక్షల 33 వేల 297 మంది, యుజీసీ-ఎన్ఏటీ పరీక్ష 11 లక్షల మంది విద్యార్థులు రాశారని తెలిపారు. యూజీసీ-ఎన్ఏటీ రద్దు చేయడం వెనుక నీట్ అవకతవకలను మరిపించడం కోసమేనని ఆరోపించారు. ఈ పరీక్ష కుంభకోణానికి బాధ్యత వహిస్తూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టీఏ చైర్మెన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పజెప్పాలన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో విద్యార్థి సంఘా నేతల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హరీష్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు రక్షించాలని తహశీల్దార్‌కు వినతి



నవతెలంగాణ-ఘట్కేసర్

మండలంలోని అవుషాపూర్ గ్రామంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అవుషాపూర్ గ్రామ ప్రజాప్రతినిధులు మంగళవారం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అవుషాపూర్‌లోని సర్వే నెబర్ 349లో 28 గుంటల భూమి ప్రభుత్వ భూమిని కొంతమంది ప్రయివేట్ వ్యక్తులు కబ్జా చేస్తున్నారని గతంలో తహశీల్దార్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. మళ్లీ అదే భూమిని కబ్జా చేసి అందులో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. వెంటనే తహశీల్దార్ కబ్జాకు గురవుతున్న భూమిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఘట్కేసర్ మండల ప్రధాన కార్యదర్శి పన్నాల కొండల్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ ఎలుసాని ఐలయ్య యాదవ్, మాజీ ఎంపీటీసీ కొట్టి గోపాల్ రెడ్డి, కడారి రమేష్, కంచర్ల వెంకట్ రెడ్డి, పన్నాల మల్లారెడ్డి, ఊటుకూరి భాను ప్రకాష్, షేక్ సల్మాన్, శ్రీనివాస్ గౌడ్, కొల్లి చెలిమే వీరేశం, నాగరాజు గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



- ఎంసీపల్లి మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గొనె హనుమంత రెడ్డి ఎల్లాగూడెంలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన

నవతెలంగాణ-శామీర్‌పేట

సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నామని మూడు చింతలపల్లి మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు గొనె హనుమంత రెడ్డి అన్నారు. మంగళవారం అద్రాస్‌పల్లి గ్రామపంచాయతీ అనుబంధ గ్రామమైన ఎల్లగూడలో ఎంపీటీసీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లాగూడెంకు వెళ్లే ప్రధాన రహదారి కంకర తేలి పూర్తిగా గుంతలమయం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పదేండ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఊరికి రోడ్డు నిర్మాణానికి సహకరించలేదన్నారు. రూ.4లక్షల ఎంపీటీసీ నిధులు రోడ్డు నిర్మాణానికి మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింలు యాదవ్, అద్రాస్‌పల్లి మాజీ సర్పంచ్ యాదగిరి, మాజీ ఉపసర్పంచ్ జహంగీర్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు నగేష్, నాయకులు దయాకర్, శ్రీపతి నర్సింహ, సంజీవ, రమేష్, ప్రవీణ్, సంజీవరెడ్డి, శంకర్‌రెడ్డి, మల్లేశ, ఆంజనేయులు, బిల్ కలెక్టర్ విజయ్ కుమార్, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలి : మేయర్ శాంతి

- సొంత నిధులు రూ.7లక్షలతో పోచమ్మ గుడి స్లాబ్ పనులు ప్రారంభం



నవతెలంగాణ - జవహర్‌నగర్

పోచమ్మ అమ్మవారి దయతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ అన్నారు. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 12వ డివిజన్ శ్రీరామ్ నగర్ కాలనీలో పోచమ్మ గుడి నిర్మాణానికి మేయర్ శాంతి కోటేష్ గౌడ్ తన సొంత నిధులు రూ.7 లక్షలతో చేపట్టిన స్లాబ్ పనులను మంగళవారం ప్రారంభించారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న మేయర్‌కు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. దాతలు గుడి నిర్మాణానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ సతీష్ కుమార్, పల్లపు రవి, ఆలయ కమిటీ అధ్యక్షులు సాంబయ్య గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ చారి, కోశాధికారి లక్ష్మణ్, వైస్ ప్రెసిడెంట్ సుశీల బాబు, సత్యనారాయణ, కాలనీ వాసులు శిల్పి సత్యనారాయణ, రాము, కృష్ణ రవీందర్ యాదవ్, పాల్గొన్నారు.

శరత్ చంద్రారెడ్డిని ఘనంగా సత్కరించిన నేతలు



నవతెలంగాణ-శామీర్ పేట

మేడ్చల్‌జిల్లా పరిషత్ సమావేశం చివరిది కావడంతో మంగళవారం చైర్మెన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డిని పలువురు నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. వారిలో కాంగ్రెస్ నాయకులు కంఠం కృష్ణారెడ్డి, తెలంగాణ ఉద్యమకారులు విష్ణు గౌడ్, తదితరులున్నారు.

ఉప్పల్ సర్కిల్‌లో సమస్యలపై సమీక్షా సమావేశం

- లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి
- అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఆగ్రహం



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ సర్కిల్‌లోని నాలుగు డివిజన్లలో నెలకొన్న సమస్యలపై, పెండింగ్ పనులపై ఉప్పల్ ఉప కమిషనర్ ఆంజనేయులు అధ్యక్షతన వాటర్ వర్క్స్ ఇంజనీరింగ్ విభాగం, టౌన్ ప్లానింగ్, శానిటేషన్ విభాగం అధికారులతో ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాకాలం లోతట్టు ప్రాంతాలు జలమయం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చిల్కానగర్ డివిజన్‌లోని ఆదర్శనగర్ హిందూ శ్మశాన వాటికను రూ. 3 కోట్లతో అభివృద్ధి చేయాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో డ్రయినేజీ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉప్పల్ నల్లచెరువు సుందరీకరణ కోసం రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్టు తెలిపారు. ఉప్పల్ సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ అధికారులు 50 గజాలు, 70గజాలలో ఇల్లు నిర్మిస్తున్న పేదవారికి నోటీసులు ఇస్తూ చర్యలు తీసుకుంటున్నారని, ఉప్పల్ బాగాయత్‌లో అనుమతులు లేకుండా నిర్మిస్తున్న బహుళ అంతస్తులు, పెద్ద షెడ్లు నిర్మిస్తున్న వారికి సహకరిస్తూ అధికారులు తమ జేబు నింపుకొని ప్రభుత్వ ఆదాయానికి గండీ కొడుతున్నారని టౌన్ ప్లానింగ్ ఏసీపీ వెంకటరమణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చిల్కానగర్ కార్పొరేటర్ బన్నాల గీత, జీహెచ్‌ఎంసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇండ్లల్లో పని చేసే వారిని కార్మికులుగా గుర్తించాలి



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఇండ్లల్లో పని చేసే వారిని కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ మల్కాజిగిరి మండల కార్యదర్శి బంగారు నర్సింగరావు అన్నారు. మంగళవారం గౌతం నగర్ డివిజన్, ఏకలవ్య నగర్‌లో ఇండ్లల్లో పని చేసే మహిళలతో జనరల్ బాడీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇండ్లల్లో పనిచేసే మహిళలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. మహిళలు పని ప్రదేశంలో అనేక రకాల వివక్షకు, చీదరింపులకు గురవుతున్నారని వాపోయారు. ఇంటి పని చేసే మహిళలను కార్మికులుగా గుర్తించి హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. సామాజిక భద్రత, రక్షణ కల్పించాలని కోరారు. మహిళలపై మానసిక, శారీరక వేధింపులు, అత్యాచారాలు నివారించాలన్నారు. పనికి తగ్గ వేతనం నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ, గోవా, తమిళనాడు, కేరళ రాష్ట్రాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మల్కాజిగిరి మండల నాయకురాలు ఎర్రోళ్ల సుమిత్ర, నాయకులు జగదీష్, స్థానిక మహిళలు రేఖ, పుష్ప, అనురాధ, అనిత, లక్ష్మి, జానకి ,60 మంది ఇండ్లల్లో పని చేసే మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మర్రి దీపికా నర్సింహారెడ్డి



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపాలిటీలో బీఆర్ఎస్ బిగ్ షాక్ తగిలింది. మంగళవారం మున్సిపల్ చైర్ పర్సన్ మర్రి దీపికా నర్సింహ రెడ్డి, కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్ రెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు సిహెచ్.శేఖర్ గౌడ్, కోఆప్షన్ సభ్యురాలు గీతా మధుకర్, మర్రి నర్సింహ రెడ్డిలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. వారికి మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాగా బీఆర్ఎస్‌లో ప్రస్తుతం ముగ్గురు కౌన్సిలర్లు మాత్రమే మిగిలి ఉన్నారు. గతంలో మెజార్టీ కౌన్సిలర్లు చైర్ పర్సన్ మర్రి దీపిక నర్సింహ రెడ్డి కాంగ్రెస్‌లోకి రావడానికి వ్యతిరేకించిన విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగానే వారు చైర్ పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం నోటీస్ సైతం కలెక్టర్ కార్యాలయంలో ఇచ్చారు. ఆ తీర్మానాన్ని గతంలో మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి అడ్డుకుంటున్నారని వార్తలు సైతం వచ్చాయి. నేడు వారి సమక్షంలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో నక్క ప్రభాకర్ గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణ మహోత్సవం



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మండల పరిధిలోని రాజబోల్లారం గ్రామంలో సీతారాముల కల్యాణ మహోత్సవాన్ని గ్రామ స్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భ ంగా గ్రామ పెద్దలు, మున్నురుకాపు సంఘం అధ్యక్షులు బాలగిరి రాజయ్య తన ఇంటి నుండి తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించారు. మున్నురుకాపు కులస్తులు ఏర్పాటు చేసిన భజన మండల వారి పాటలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఆలయం ముందు ఏర్పాటు చేసిన ముత్యాల పందిరిలో సీతారాముల కల్యాణాన్ని బ్రాహ్మ ణుల వేదమంత్రాలు, డోలు సన్నాయిలు శబ్దలతో అంగరంగ వైభోగంగా నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సాయంత్రం శ్రీ సీతారాముల శోభయాత్ర గ్రామమంతా డీజే చప్పులతో నిర్వహించారు.

జెడ్పీ సభ్యులను సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ- మేడ్చల్

జిల్లా పరిషత్ సభ్యుల పదవి కాలం పూర్తయితున్న సందర్భంగా మంగళవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా సర్వసభ్య సమావేశం అనంతరం వారిని ఎమ్మెల్యే మల్లారెడ్డి, మేడ్చల్ మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మెన్ మలిపెద్ది సుధీర్ రెడ్డి, మూడుచింతలపల్లి జెడ్పీటీసీ, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ జెడ్పీటీసీ శైలజ విజయానందారెడ్డి, ఎంపీపీ వీర్లపల్లి రజిత రాజమల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు గౌస్ లకు పూల బొకేలు,జ్ఞాపికలు అందజేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ సత్యనారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవేంద్ర గౌడ్, మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షులు రమణా రెడ్డి, కౌన్సిలర్లు ఉన్నారు.

మాజీ ముఖ్యమంత్రికి జన్మదిన శుభాకాంక్షలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు 90 వ పుట్టినరోజు సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గ జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ ఆయనను కలిసి శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ప్రస్తుత ఆంధ్ర రాష్ట్ర నూతన ఆహారం, పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొల్లా శంకర్, అడబాల షణ్ముఖ, విజయ్, కామేశ్వరరావు, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీరారెడ్డి జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం డివిజన్ ఉషోదయ కాలనీ ఫేజ్-2 అధ్యక్షులు పీరారెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం సాయంత్రం ఉషోదయ కాలనీలోని ఫేస్ 2 కమ్యూనిటీ హాల్‌లో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు, పలువురు పారిశ్రామికవేత్తలు, పలు పార్టీలకు చెందిన నాయకుల మధ్య ఘనంగా జరిగాయి. స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి రవికాంత్, కార్యనిర్వాహక అధ్యక్షు లు ఆంజనేయులు, సలహాదారు ఉదయ్‌కుమార్, కోశాధికారి వినోద్, సంయుక్త కార్యదర్శి కుమార్‌స్వామి, నాయకులు మాధవరావు, శర్మ, కళ్యాణకృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



- కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జి.హెచ్.యం.సి. అధికారులతో కలసి, కూకట్‌పల్లి హై టెన్షన్ రోడ్ వద్ద ఉన్న డ్రయినేజీ, రోడ్ల పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే వర్షాకాలంను దృష్టిలో పెట్టుకొని ఎంటమాలజీ సిబ్బంది శానిటేషన్ పనులను డ్రయినేజీ పనులను పూర్తి చేయాలని, అధికారులకు ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో, జి.హెచ్.యం.సి. అధికారులతో కలిసి సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పలు కాలనీల నుంచి కాలనీ అసోసియేషన్ల అధ్యక్షులు మరియు స్థానిక ప్రజలు ఫిర్యాదులను ఎమ్మెల్యేకి అందజేశారు. డివిజన్‌లోని చెరువులలో గుర్రపు డెక్క ఎక్కువగా ఉండటం వల్ల, దోమల సమస్య ఎక్కువ అవుతుందని తెలిపారు. అధికారులు రానున్న ఆషాడ బోనాలను దృష్టిలో ఉంచుకొని, దేవాలయాల వద్ద డ్రయినేజీ పనులను, రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను కోరారు. సమస్యలు ఎన్ని ఉన్న వాటికి కావలసిన నిధుల కోసం ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. వాటికి కావలసిన నిధులను జిల్లా మంత్రులను కలిసి తీసుకొస్తామని ఆలస్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ అధికారులు వాటర్ వర్క్ అధికారులు ఎలక్ట్రికల్ అధికారులు, డివిజన్ అధ్యక్షులు సంతోష్, ప్రభాకర్, బొట్టు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివితే గొప్పవారవుతారు..

విద్యార్థులు విద్యను అభ్యసించి కష్టపడి చదివితే గొప్ప ఉద్యోగులు అవుతారని అందుకు నిదర్శనం కూకట్‌పల్లి హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు గూరాచారి జోషి అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్ పల్లి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గూరాచారి జోషి పదవి విరమణ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొని శాలువాతో సత్కరించి సన్మానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పట్టుదలతో చదివితే కచ్చితంగా ఉన్నత ఉద్యోగాలు అందుకోవచ్చని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



కార్మికుల కోర్కెల దినాన్ని పాటించండి

- 10న జిల్లా, మండల పారిశ్రామిక కేంద్రాల్లో ధర్నాలు
- తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)



నవతెలంగాణ-సిటీబ్యూరో/కాప్రా

కార్మికుల కోర్కెల దినోత్సవాన్ని పాటించాలనీ, ఈ నెల 10వ తేదీన జిల్లా, మండల పారిశ్రామిక కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్టు తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. సోమవారం కుషాయిగూడ పీహెచ్‌సీలో జరిగిన యూనియన్ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చి, గడిచిన పదేండ్లలో సాగించిన సంస్కరణలు, ప్రయివేటీకరణ విధానాలను వేగవంతంగా అమలు చేసేందుకు ఉవ్విళ్ళూరుతున్న దన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే 4 లేబర్ కోడ్లను అమలు చేస్తామని బీజేపీ ప్రకటించిందనీ, బొగ్గు బ్లాకుల వేలానికి పూనుకున్నదన్నారు. ఈపీఎఫ్ సకాలంలో చెల్లించని యాజ మాన్యాలకు విధించే జరిమానాను భారీగా తగ్గించిందన్నారు. కార్పొరేట్ మతోన్మాదులను ప్రసన్నం చేసుకుని వారికి లాభాలు కట్టబెట్టేందుకు నిశ్చయంగా ఉందన్నారు. కేంద్ర బీజేపీ విధా నాలను నివారించి, కార్మిక హక్కులను కాపాడేందుకు దేశ వ్యాప్తంగా కార్మిక పోరాటాలను ఉధతం చేయాలని సీఐటీయూ అఖిల భారత కమిటీ నిర్ణయించిందనీ, ఈ నెల 10వ తేదీన "కార్మికుల కోర్కెల దినం" పాటించాలని పిలుపునిచ్చిందనీ, అందులో భాగంగా జిల్లా, మండల, పారిశ్రామిక కేంద్రాల్లో జరిగే ధర్నాల్లో కార్మికవర్గమంతా పాల్గొనాలని కోరారు. పదేండ్లుగా కేంద్ర బీజేపీ ప్రభుత్వం అనుసరించిన కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా జాయింట్ ప్లాట్ఫారమ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ (కార్మిక సంఘాల ఐక్య వేదిక), సంయుక్త కిసాన్ మోర్చా (రైతు సంఘాల ఐక్య వేదిక)ల అధ్వర్యంలో సమరశీల పోరాటాలు జరిగాయనీ, ఈ పోరాటాల పట్ల మోడీ ప్రభుత్వం కర్కశంగా వ్యవహరించిందన్నారు. అనేకమందిపై కేసులు పెట్టి జైలుకు పంపిందనీ, లాఠీఛార్జీ చేసిందనీ, నిర్బంధాన్ని ప్రయోగించినా కార్మిక, రైతాంగ పోరాటాలు తీవ్రంగానే జరిగాయన్నారు. ఈ పోరాటాల ఫలితంగానే 400 ఎంపీ స్థానాలు వస్తాయనుకున్న ఎన్డీఏ కూటమికి 300 లోపే రావడంతో మోడీ ముఖం చినబోయిందన్నారు. ఎంపీలు ప్రమాణ స్వీకారం చేయకముందే మతోన్మాద కార్పొరేట్ శక్తులకు లాభాలు ఒడిసి పట్టేందుకు రంగంలోకి దిగారని తెలిపారు. కార్మికుల ఈపీఎఫ్ బకాయిల చెల్లింపులో యాజమాన్యాలకు విధించే జరిమానాలను భారీగా తగ్గించారనీ, నేషనల్ మానిటైజేషన్ పైప్లైన్ (ఎన్ఎంపి) పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను లీజుకివ్వడం, అమ్మేయడం, ప్రయివేటీకరణ చేయడం లాంటివి మరింత వేగవంతం చేస్తామని ప్రకటించినట్టు తెలిపారు. కనీస వేతనం రూ.26వేల అమలు, సమాన పనికి - సమాన వేతనం, ఉద్యోగ భద్రత, పర్మినెంట్, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం హయ్యర్ పెన్షన్ చెల్లింపు, ఓపీఎస్ రద్దు, స్కీమ్ వర్కర్లను కార్మికులుగా గుర్తింపు వంటి అంశాలపై మాత్రం కేంద్రం నోరు మెదపడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకిచ్చిన 6 గ్యారంటీలతో పాటు ఉద్యోగ, కార్మికులకు అనేక హామీలిచ్చారనీ, అధికారంలోకి వచ్చి 6 నెలలు గడిచినా ఇచ్చిన హామీల ఊసే లేదన్నారు. కార్మిక సమస్యలపై కనీసం చర్చ కూడా చేయలేదన్నారు. రాష్ట్ర కార్మిక సంఘాలకు 6 నెలలుగా సీఎం రేవంత్‌రెడ్డి కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడం లేదన్నారు. ముఖ్యమంత్రి కార్మిక సంఘాలతో సమావేశం కావాలనీ, కార్మిక సమస్యలు చర్చించాలనీ, కార్మిక సంఘాలు చేస్తున్న డిమాండ్ పట్టించుకోవాలని కోరారు. మోడీ ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలను ఆశా వర్కర్లకు నష్టదాయకమన్నారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పరీక్షలను పెట్టకుండా నిరాకరించాయనీ, మన రాష్ట్రంలో మాత్రం 15-20 ఏండ్లుగా పనిచేస్తున్న ఆశాలకు పరీక్షలు నిర్వహిస్తామని చెప్పడం అన్యాయం అన్నారు. ఐటీ పరిశ్రమలకు నాలుగేండ్ల కార్మిక చట్టాల నుంచి మినహాయింపు ఇచ్చారనీ, రాష్ట్రంలో కూడా 4 లేబర్ కోడ్లను అమలు చేస్తామని పత్రికలకు లీకులు ఇస్తున్నదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు, వారు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ జరిగే "కార్మికుల కోర్కెల దినం" ధర్నాల్లో జిల్లా కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలు పరిష్కారానికి కృషి



- మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

డివిజన్ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు శాయశక్తుల కృషి చేస్తున్నామని మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి అన్నారు. సుభాష్ నగర్ 130 డివిజన్, రామిరెడ్డి నగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు స్థానికంగా నెలకొన్న సమస్యలపై మంగళవారం కార్పొరేటర్ కార్యాలయంలో సురేష్ రెడ్డిని కలిశారు. తమ కాలనీల్లో నెలకొన్న పలు సమస్యలు , చేపట్టవలసిన పలు అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సురేష్ రెడ్డి వెంటనే సమస్యలపై స్పందించి సంబంధిత అధికారుల తో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను సత్వరమే పరిష్కరిం చాలని ఆదేశించారు. అసంపూర్తిగా మిగిలి పోయిన పను లు త్వరలోనే పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని... సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకు రావాలని వాటి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే 'పాదయాత్ర'..

ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే పాదయాత్ర చేస్తున్నట్లు సుభాష్ నగర్ 130 డివిజన్ మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి పేర్కొన్నారు. అందులో భాగంగానే స్థానిక సమస్యలపై జై సంతోష్ నగర్ కమిటీ సభ్యులతో కలిసి కాలనీలో పాదయాత్ర చేశారు. ప్రజల ను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ... తన దృష్టికి వచ్చిన సమస్యలను సాధ్యమై నంత త్వరగా పరిష్కరించ డానికి కృషి చేస్తానన్నారు. ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, పేద విద్యార్థుల భవిష్యత్తు కోసం తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటా యని, యువత మంచి మార్గంలో వెళ్లాలని, సోషల్ మీడియాకు ఆకర్షితులు కాకుండా ఉండాలని సూచిం చారు. అధికారులు ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. డివిజన్ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు సురేష్ రెడ్డి తెలిపారు.



జులై 4 న విద్య సంస్థల బంద్‌ను జయప్రదం చెయ్యండి



- ఎస్ఎఫ్ఐ
- నీట్, నెట్ పరీక్షలను రద్దు చేసి రీఎగ్జామ్ నిర్వహించాలి. ఎన్‌టీఏ సంస్థని రద్దు చేయాలి

నవతెలంగాణ-బాలానగర్

ఈ నెల 4న విద్య సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు జి.కార్తీక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన పేపర్ లీకేజ్ పై అవకతవకల పై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించి, నీట్ పరీక్షను మళ్ళీ నిర్వహించాలని, ఎన్‌టీఏను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నీట్ విద్యార్థుల పట్ల ఎన్‌టీఏ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మంగళవారం విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో జూలై 4న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్‌ను జయప్రదం చేయాలి పిలుపునిచ్చారు. నీట్ పరీక్షలో పేపర్ లీక్ అవకతవకలు జరిగాయని దేశ మంతా ఆందోళనలు జరుగుతున్న నేపథ్యాన్ని మరవక ముందే.. మొన్న దేశవ్యాప్తంగా నిర్వహించిన యుజీసి-ఎన్ఎటీ పరీక్షను రద్దు చేస్తున్నట్లు ప్రకటించడం విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడాడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. నీట్ పరీక్షలో మొత్తం 23 లక్షల 33 వేల 297 మంది, యుజీసి-ఎన్ఎటీ పరీక్షలో మొత్తం 11 లక్షల మంది విద్యార్థులు పరీక్ష రాశారని, యుజీసి - ఎన్ఎటి రద్దు చేయడం వెనుక నీట్ అవకతవకలను మరిపించడం కోసమేననే అనుమా నాలు కలుగుతున్నాయని ఆరోపించారు. నీట్, యుజీసి - ఎన్ఎటీ పరీక్షలో జరిగిన అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జ్ చేత న్యాయ విచారణ జరిపించా లన్నారు. పరీక్ష కుంభకోణంకు బాధ్యత వహిస్తూ వెంటనే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చైర్మన్ ప్రదీప్ కుమార్ జోషి రాజీనామా చేయాలని, కేంద్ర పరీక్షల నిర్వహణ బాధ్యత రాష్ట్రాలకు అప్పజెప్పాలని ఆయన అన్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల నుంచి ఇప్పటి వరకు విద్యార్థి సంఘ నేతల అక్రమ అరెస్టులు, నిర్బంధాలు, యూనివర్సిటీ లలో స్వేచ్ఛ వక్రీకరణ ప్రజాస్వామ్యం అణిచివేత చర్యలు ఆపాలన్నారు. ఈనెల 4న జరిగే బంద్ ను విజయవం తానికై పాఠశాలల, కళాశాల యజమాన్యం సహకరించి స్వచ్ఛందంగా బంద్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు చందు, నితేష్, అరుణ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

భానుప్రకాష్‌ను సన్మానించిన సంక్షేమ సంఘం సభ్యులు..



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట డివిజన్ శ్రీనివాస్ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికల్లో 83 ఓట్ల మెజారిటీతో తాజాగా టి.భానుప్రకాష్ గెలుపొందారు. ఈ మేరకు మంగళవారం ఉమాదేవినగర్ సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో భానుప్రకాష్‌ను శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల, అధికారుల సహ కారాలతో బస్తీ ప్రజలందరినీ కలుపుకుపోతూ బస్తీ అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి కృషి చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పి.సమ్మయ్య యాదవ్, కూరపాటి కరుణాకర్ రాజు, ఉపాధ్యక్షులు షెర్విరాల కృష్ణమూర్తి గుప్త, కార్యనిర్వాహక కార్యదర్శి పాడిచేటి రాములు గౌడ్, నాయకులు రామ్ రెడ్డి, ఖయ్యూం, తారాసింగ్,శంకర్, తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.

'జగదాంబ మాత సేవాలాల్ మహారాజ్' బోనాల ఉత్సవాలు..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

129 - సూరారం డివిజన్ నెహ్రూ నగర్‌లోని జగదాంబ మాత సేవాలాల్ మహారాజ్ దేవాలయ బోనాల ఉత్సవాలకు మంగళవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై జగదాంబ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి దయతో ప్రజలంతా సంతోషంగా ఉండి అష్టైశ్వర్యాలతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ, నిజాంపేట్ కార్పొరేటర్ ఆగం రాజు, డివిజన్ అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, ప్రభుదాస్, ఫెరోజ్, ఆలయ కమిటీ సభ్యులు దశరథ్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని కొలవడం ద్వారా అన్ని పనుల్లో విజయం : ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ..

సుభాష్ నగర్ 130 డివిజన్ సూరారం కాలనీ విజయ దుర్గా సమేత బంగారం మైసమ్మ దేవాలయం ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమానికి మంగళవారం ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజయ్యారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శక్తి స్వరూపిణి అయిన అమ్మవారిని కొలవడం ద్వారా కార్యసిద్ధి కలిగి విజయం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, నిజాంపేట్ కార్పొరేటర్ ఆగం రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, పందిరి యాదగిరి, ఆలయ కమిటీ అధ్యక్షులు వెంకటస్వామి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సభ్యులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



రోడా అవార్డులలో సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల రోటరాక్ట్ క్లబ్ అవార్డ్



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల రోటరాక్ట్ క్లబ్ ఇటీవల జరిగిన రోడా (రోటరాక్ట్ అవుట్స్టాండింగ్ డిస్ట్రిక్ట్ అవార్డ్స్) వేడుకలో అద్భుతమైన విజయాన్ని సాధించి, రెండు ప్రతిష్టాత్మక అవార్డులను సొంతం చేసుకుందని కళాశాల యాజమాన్యం తెలిపింది. వారి సంతకం ఈవెంట్ "మిస్టర్ అండ్ మిసెస్ ఉమాంగ్" కోసం ఉత్తమ ఫెలోషిప్ ఈవెంట్ అత్యంత గౌరవనీయమైనది డిఆర్ఆర్ సైటేషన్. వార్షిక ఫెలోషిప్ ఈవెంట్ అయిన "మిస్టర్ అండ్ మిసెస్ ఉమాంగ్" క్లబ్ కార్యకలాపాలకు ముఖ్య లక్షణంగా మారింది. ఇది సభ్యుల మధ్య స్నేహం ఐక్యతను పెంపొందిస్తుంది. ఈ కార్యక్రమంలో మిరుమిట్లుగొలిపే రాంప్ నడక స్నేహపూర్వక ఉత్సవం, ఉత్సాహభరితమైన భాగస్వా మ్యం సానుకూల స్పందన ఉన్నాయి. ఈ సంవత్సరం ఈ కార్యక్రమం అంచనాలను అధిగమించి, దాని వినూత్న విధానం ఉల్లాసభరితమైన వాతావరణానికి ప్రశంసలు అందుకుంది. దీనితో పాటు ఉత్తమ డైరెక్టర్ పబ్లిక్ ఇమేజ్ను కూడా అందుకున్నారు. కాకినాడలో ఫ్రెండ్షిప్ కప్ (క్రికెట్ మ్యాచ్) లో పాల్గొన్నందుకు మహోత్సవ్ మహాదాన్‌లో పాల్గొన్నందుకు గుర్తింపు లభించింది.

సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాల యొక్క రోటరాక్ట్ క్లబ్ ఫెలోషిప్ కమ్యూనిటీ ఎంగేజ్మెంట్ కోసం ఉన్నత ప్రమాణాలను నిర్దేశిస్తూనే ఉంది. ఇది జిల్లాలోని వెలుపల ఉన్న ఇతర క్లబ్లకు స్ఫూర్తినిస్తుంది. రోడా అవార్డుల వేడుకలో వారి ఇటీవలి విజయాలు వారి అంకితభావానికి, శ్రేష్టతకు నిదర్శనంగా నిలుస్తాయి. ఈ అవార్డు సాధించిన విద్యార్థులను కళాశాల సెక్రటరీ టి వి రెడ్డి, ప్రిన్సిపాల్ డా.కె శ్రీలత, అకడమిక్ డైరెక్టర్ సరోజా రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ అనురాగ్ రెడ్డి, పిఆర్వో రవి సుధాకర్ అభినందించారు.

బస్తీలలో మౌలిక వసతులు కల్పించాలి



- కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ

నవతెలంగాణ-బాలానగర్

బస్తీలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించి, ప్రత్యేక శ్రద్ధ వహించాలి అని కూకట్‌పల్లి సీపీఐ మండల కార్యదర్శి జి. కృష్ణ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలానగర్ డివిజన్ మండల పరిధిలో ప్రజా సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి జి కృష్ణ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో వర్షాకాల దృష్ట్యా బస్తీలలో, ప్రాంతాలలో ఉండే ప్రజలు శ్రీశ్రీ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ఇంద్రానగర్, ఎన్టీఆర్ నగర్ తదితర ప్రాంతాల్లో కెమికల్‌తో కూడిన కాలువలో నీరు ప్రహహించడం వల్ల స్థానిక నివాసితులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధానంగా నివాసిత ప్రాంతాలలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు సరైన వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. అంతేకాకుండా రాత్రి వేళల్లో దోమల స్వైర విహారం చేస్తున్నాయని, డివిజన్ పరిధిలో కనీసం ఫాగింగ్ నిర్వహణ నెలలో రెండు రోజులు నామమాత్రపు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోకపోవడంతో వృద్ధులు, చిన్నారులు, మహిళలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా బస్తీ ప్రజలను దృష్టిలో ఉంచుకుని బస్తీలలో ఫాగింగ్ నిర్వహణ చేపట్టి, దోమల నివారణకు మందుల పిచికారి చేపట్టి సంబంది అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- కాంగ్రెస్ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేష్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ప్రజలు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అధికారులకు సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని అల్లాపూర్ డివిజన్‌లో మంగళవారం ఆయన డిప్యూటీ కమిషనర్ రమేష్, టౌన్ ప్లానింగ్, ఇతర అధికారులతో వార్డు కార్యాలయంలో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ సమస్యలను లేవనెత్తారు. ప్రధానంగా టౌన్ ప్లానింగ్ విభాగం పై సమావేశంలో విమర్శలు వెల్లు వెత్తాయి. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కారంలో అధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించాలన్నారు. నిధులు అవసరమైన చోట పనులు కొంత ఆలస్యమైనా పర్వాలేదు కానీ నిధులతో పనిలేని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మాజీ కార్పొరేటర్ సయ్యద్ బాబు మాట్లాడుతూ పాండురంగ నగర్‌లో వంద ఫీట్ల రోడ్ స్థలంలో బిల్డింగ్ కు అనుమతి ఎలా ఇస్తారని అధికారులను నిలదీశారు.



సర్వే నెంబర్లు సైతం మార్చి భవనాలకు అనుమతులు ఇవ్వడంపై స్థానికంగా పెద్ద ఎత్తున చర్చ జరుగుతుం దన్నారు. దీనిపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌కు సూచించారు. కాంగ్రెస్ నాయకు రాలు రేష్మ మాట్లాడుతూ రాజీవ్ గాంధీ నగర్‌లో లెక్కకు మిక్కిలి ఐదు, ఆరు అంతస్తుల అక్రమ కట్టడాలు వెలుస్తు న్నాయని వీటికి అనుమతులు ఎవరు ఇచ్చారని ప్రశ్నించా రు. చెరువులో విపరీతంగా పెరిగి పోయిన గుర్రపు డెక్క ద్వారా దోమలు వ్యాప్తి చెంది ప్రజలకు ఇబ్బందిగా మారిం దని స్థానికులు అధికారులకు దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యలను పరిష్కరిస్తా మని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూము వేణు, మోయునుది ్న్, లక్ష్మయ్య, విట్టల్ రెడ్డి, జమీర్ పాల్గొన్నారు.

'బోనాల' కు ఎలాంటి ఇబ్బందులు ఉండకూడదు

- జలమండలి జీఎంకి వినతి పత్రం అందించిన కార్పొరేటర్ మహేందర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

హైదరాబాద్ మెట్రో వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు జనరల్ మేనేజర్ ప్రభాకర్ రావుకి, పీఆర్ నగర్ వీకర్ సెక్షన్, కబీర్ నగర్‌లలో నూతన భూగర్భ డ్రయినేజీ పనులు చేయాలని, పవర్ బోర్ వెల్స్ మరమత్తులు చేయాలని, రాబోవు బోనాల పండుగకు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిల్ట్, డ్రయినేజీ సమస్యలు ఏర్పడకుండా చూడాలని మూసాపేట్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నూతన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. టటీఆర్ నగర్ వీకర్ సెక్షన్‌లో డ్రయినేజీ లైన్ లేకపోవడం మూలంగా అక్కడున్న ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని



పేర్కొన్నారు. పవర్ బోర్ వెల్స్ పూర్తిగా పనిచేయకుండా ఉన్నటువంటి వాటిని తొలగించి వాటి స్థానంలో నూతన మోటార్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. రానున్న రెండు వారాలలో బోనాల పండగ జరగబోతుందని, కావున ఎక్కడపడితే అక్కడ కుప్పలు తెప్పలుగా వేసినటువంటి సిల్టును ఎప్పటికప్పుడే తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మూసాపేట్ జనరల్ సెక్రటరీ ఎర్ర స్వామి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
బుధవారం జూలై 03, 2024 www.navatelangana.com

అర్హులకు సంక్షేమ పథకాలు



నవతెలంగాణ-ఓయూ

సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో అర్హులకు వివిధ సంక్షేమ పథకాలు లభించేలా కృషి చేస్తామని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సీతాఫలమండీ, బౌద్ధనగర్ మున్సిపల్ డివిజన్లకు చెందిన సుమారు 155 మంది లబ్దిదారులకు షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను మంగళవారం పద్మారావు గౌడ్ మధురానగర్ కమ్యూనిటీ హాల్‌లో అధికారులు, కార్పొరేటర్లు, వివిధ పార్టీల నేతలతో కలిసి అందిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లబ్దిదారులకు వీలైనంత తొందరగా వారికి లభించాల్సిన ప్రయోజనాలు అందించేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు జరపాలని పద్మారావు గౌడ్ సూచిం చారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసురి సునీత రమేష్, లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, మరేడుపల్లి తాసిల్దార్ అశోక్, ముషీరాబాద్ తహసీల్దార్ గోవర్ధన్, నాయకులు పాల్గొన్నారు.

వెస్ట్రన్ రైల్వే నుండి కంప్లీషన్ సర్టిఫికెట్ పొందిన 'ఎంఐసీ' ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఎల్ఈడీ వీడియో డిస్‌ప్లేల రూపకల్పన, అభివృద్ధి, తయారీలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఎంఐసీ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, రైలు డిస్‌ప్లే బోర్డ్‌ను మార్చడం, కొత్త ఏర్పాటు కోసం పశ్చిమ రైల్వే జోన్‌లోని రత్లాం డివిజన్ నుండి లెటర్ ఆఫ్ కంప్లీషన్, ఇన్‌స్టాలేషన్ సర్టిఫికేట్‌ను అందుకుందని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఎస్‌ఎంహెచ్ వద్ద 2, సీజీఎస్ బోర్డులు, పరిధిలోని 33 నంబర్ స్టేషన్లలో రైలు డిస్‌ప్లే బోర్డులు జిపిఎస్ గడియారాలు, జీపీఎస్ గడియారాల భర్తీ కంపెనీ తన క్యూఐబీ ఇష్యూని మూసివేసినట్లు కూడా ప్రకటించింది. 1,95,65,217 ఈక్విటీ షేర్లను అర్హతగల సంస్థాగత కొనుగోలుదారులకు ఒక్కో షేర్‌కి రూ.46 ఇష్యు ధరతో జారీ చేయడానికి కేటాయింపును బోర్డు ఆమోదించిందని పేర్కొన్నారు. క్యూఐబి లలో కంపెనీ అంటారా ఇండియా ఎవర్‌గ్రీన్ ఫండ్ లిమిటెడ్, కోయస్ గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్ మినర్వా వెంచర్స్ ఫండ్‌లకు షేర్లను కేటాయించిందని తెలిపారు.

సమస్యలనూ సమిష్టిగా పరిష్కరించాలి



● ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

సమస్యలనూ సమిష్టిగా పరిష్కరిస్తేనే సులువుతుం దని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని దేవాలయాల అభివృద్ధి కమిటీ సభ్యులతో అన్ని శాఖల అధికారులు, అన్ని డివిజన్ల ముఖ్య నాయకులతో అధికారుల సమక్షంలో చర్చ గోష్టి నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సమస్యలను అధిగమించి ముందుకు వెళ్లాలని అధికారులకూ ఎమ్మెల్యే సూచించారు. అత్యధికంగా మురుగు నీటి, రహదారుల, అక్రమ నిర్మాణాల వల్ల విద్యుత్ అంతరాయం, వీధి దీపాల ఏజెన్సీ సృష్టిస్తున్న సమస్యలపై దృష్టి కేంద్రీకరించి త్వరలోనే ప్రభుత్వ ప్రయివేటు శాఖల సమన్వయ సహకారంతో బోనాల పండుగ ఘనంగా నిర్వహించే విధంగా ప్రత్యేక చొరవ తీసుకొని పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించే విధంగా ఆలయాలకు ప్రత్యేక నిధులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నానని బోనాల చెక్కులు లబ్దిదారులకు 10 రోజుల ముందే ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్,మాజీ కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్లు ప్రశాంతి, జగన్, దివాకర్, వాటర్ బోర్డు సిజిఎం ప్రభు, జియం హరీష్ శంకర్,షేక్ పేట ఎమ్మార్వో అనిత రెడ్డి, విద్యుత్ నరేందర్ రెడ్డి, ఏఎంహెచ్ఓలు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పండుగ సమయంలో సమస్యలు లేకుండా చూడండి

పండుగల సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే దానం నాగేందర్ సూచించారు. బంజారాహిల్స్ లోని ఆయన నివాసంలో దానం అధికారులు, దేవాలయాల నిర్వాహకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో భక్తీ శ్రద్ధలతో నిర్వహించుకునే బోనాల పండుగకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ నేపథ్యంలో దేవాలయాల వద్ద విద్యుత్, రోడ్లు, మంచినీటి సమస్య తలెత్తకూండా చూడాలని కోరారు. దేవాలయాల నిర్వాహకులకు అవసరమైన ఏర్పాట్లు అధికారులను అడిగి పూర్తి చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు, జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్లు ప్రశాంతి,జగన్,దివాకర్, వాటర్ బోర్డు సిజిఎం ప్రభు, జియం హరీష్ శంకర్,షేక్ పేట ఎమ్మార్వో అనిత రెడ్డి,విద్యుత్ నరేందర్ రెడ్డి, ఏఎంహెచ్ఓలు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ఇండ్లు అందజేస్తాం



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

అర్హులకు ఇండ్లను అందజేస్తామని ఎమ్మార్వో నయీముద్దీన్ అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్ నగర్ డివిజన్ కమలానగర్‌లో గత ఐదు సంవత్సరాలు క్రితం, రెండు బ్లాకులలో మొత్తం 210 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, తలసాని శ్రీనివాస్ యాదవ్ అప్పటి ఎమ్మార్వో, ఆర్డిఓ పాల్గొని 102 మందికి లబ్ధిదారులకు ఎంపిక చేసి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల తాళాలు అందజేశారు. మిగిలిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఖాళీగానే ఉన్నాయి. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ కేటాయించిన ఇండ్లలో అనేక అవకతవకలు జరిగాయని అర్హులు కాని వారికి ఎమ్మెల్యే ఇండ్లు కేటాయించారని అప్పటిలో బస్తీ నాయకులు కార్యకర్తలు అభ్యంతరం తెలిపారు. అప్పటినుండి అసలైన లబ్దిదారులను ఎన్నిక చేయలేదు. అధికారులు, నాయకులు, మిగిలిపోయిన ఇండ్లను ఎవరికీ కేటాయించకుండా ఇప్పటివరకు పెండింగ్‌లో ఉంచారు. ప్రభుత్వం మారిన తర్వాత మంగళవారం ఆర్డిఓ ఆదేశాల మేరకు ఖైరతాబాద్ ఎమ్మార్వో నయీముద్దీన్, ఆర్ఐ కిరణ్ రాజు పొజిషన్‌లో ఉన్న లబ్ధిదారుల వివరాలు, పెండింగ్‌లో ఉన్న లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఖైరతాబాద్ ఎమ్మార్వో నయుముద్దీన్, స్థానిక కార్పొరేటర్ సిఎన్‌రెడ్డి కార్యక్రమానికి హాజరై లబ్ధిదారులతో మాట్లాడి, ఇండ్లు రాని వారి వద్ద నుండి తిరిగి అన్ని ఆధారాలతో అర్జీలను స్వీకరించారు. ఆర్డిఓతో కలెక్టర్ తో చర్చించి అసలైన లబ్ధిదారులను ఎన్నిక చేసి త్వరలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను తప్పకుండా అర్హులైన వారికి అందజేస్తామని బాధితులకు తెలియజేశారు. స్థానికంగా ఉన్న బస్తీ నాయకుడు హైదర్ మాట్లాడుతూ ఇప్పుడు ఉన్న వారిలో 20 మంది అర్హులు కాని వారు ఉన్నారని, అర్జీలు పెట్టిన వారిలో 24 మంది అర్హులు కాదని, అప్పటిలో ఎమ్మెల్యే తన కార్యకర్తలు చెప్పిన వారి పేర్లకు ఇండ్లు కేటాయించారని 56 మందితో అసలైన లబ్ధిదారులు హైకోర్టులో కేసు వేశామని, ఆ కేసు తేలే వరకు ఎవరికీ ఇండ్లు కేటాయించవద్దని ఖైరతాబాద్ ఎమ్మార్వో ను స్థానిక నాయకుడు హైదర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

● ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ప్రజా సమస్యలు, ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎర్రగడ్డ డివిజన్ ప్రజా సమస్యలపై సుల్తాన్ నగర్ షంషీర్ ఫంక్షన్ హాల్ లో మంగళవారం సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని అధికారులతో కలిసి నిర్వహించారు. ఈసందర్భంగా ఎర్రగడ్డ ప్రజలు వాటర్, సివరేజీ ఎలక్ట్రిసిటీ, సివిల్ సప్లై, రెవిన్యూ తదితర అధికారులకు ఫిర్యాదులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు సర్కిల్ 19 డిప్యూటీ కమిషనర్ సేవా ఇస్లావత్ , వాటర్ వర్క్స్ డీజీఎం వాహెద్, ఈ ఈ రాజ్ కుమార్, ఖైరతాబాద్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, అమీర్పేట ఆర్ఐ జీఎస్ బాలరాజ్, ఖైరతాబాద్ ఆర్ఐ గిరిధర్ రావు, సివిల్ సప్లై ఆఫీసర్ బి ఎస్ సరస్వతి, ఎలక్ట్రికల్ ఏ ఈ ప్రేమ్ కుమార్, సి. మల్లికార్జున్ మరియు ఇతర జిహెచ్ఎంసి అధికారులు, ఎర్రగడ్డ డివిజన్ ప్రెసిడెంట్ బి సంజీవ, ఎండి షరీఫ్, జావీద్, సయ్యద్ రసూల్, ఎండి అజీమ్, కళ్యాణి, బాలు, దాసి శ్రీకాంత్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏండ్ల తరబడి రహదారులపై వాహనాలు పార్కింగ్ స్వస్తి

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఏండ్ల తరబడి రహదారులపై వాహనాలు పార్కింగ్ చేయడం వలన అనర్థాలు చోటు చేసుకుంటున్నాయని వెంకటేశ్వర కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలను సందర్శించిన ఆమె మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 10 మిథిలా నగర్ లో స్థానికులతో మాట్లాడి వారి అభీష్టం మేరకు ఎన్నో ఏండ్ల నుంచి రహదారులపై పార్కింగ్ చేస్తున్న వాహనాలను ట్రాఫిక్ పోలీసులు సహకారంతో తీసివేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... వ్యర్థాలకు నిలయంగా మారుతున్నాయని ప్రజలకూ సూచించారు. కాలనీవాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు జీహెచ్ఎంసీ అధికారుల సహకారంతో తక్షణమే ఈ వాహనాలు వాటి వెనకున్న వ్యర్థాలను తొలగించాలని వ్యర్థాల కొరకు వాహనాలు వచ్చినప్పుడు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దొగ్గల కరుణాకార్‌కు ఓయు డాక్టరేట్



నవతెలంగాణ-ఓయూ

వరికోల్ వాసి దొగ్గల కరుణాకర్‌కు కామర్స్‌లో డాక్టరేట్ పట్టా పొందారు. ఉస్మానియా యూనివర్సిటీ కామ ర్స్ విభాగంలో దొగ్గల కరుణాకర్ పీహెచ్డీ పట్టా అందుకు న్నారు. డాక్టర్ కరుణాకర్ ఒక నూతన అంశం "వస్తు సేవల పన్ను (జీఎస్టీ)" పై పరిశోధన చేశారు. ఈ అంశం పై బహు కొద్ది మంది మాత్రమే పరిశోధన చేసి డాక్టరేట్ పొందిన వారిలో కరుణాకర్ ఒకరు. దక్షిణ భారతదేశంలో ఈ అంశం పైన తెలుగు రాష్ట్రాలలో తాను ప్రథమ అధ్యయనం చేసిన ట్లుగా డాక్టర్ కరుణాకర్ చెప్పారు. ఉస్మానియా యూనివర్సి టీలో పనిచేసి రిటైరైన ప్రొఫెసర్ సులోచన ఆధ్వర్యంలో తాను పీహెచ్డీ (పరిశోధన) చేశానని గర్వంగా చెప్పారు. ప్రొఫెసర్ సులోచన దక్షిణ భారతదేశంలోనే కామర్స్ లో పీహెచ్డీ పట్టా పొందిన మొట్టమొదటి మహిళా డాక్టరేట్, ప్రొఫెసర్ వద్ద పరిశోధన చేసిన విద్యార్థి అని సగర్వంగా తెలియజేశారు. డాక్టర్ కరుణాకర్‌కు ఈ సందర్భంగా అధ్యాపకులు, కుటుంభ సభ్యులు, ప్రొపెసర్స్ డా. కరుణా కర్‌ను అభినందించారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వద్దు..

● బేగంపేట్ ట్రాఫిక్ ఇన్స్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజ్



నవతెలంగాణ-కంటోన్మెంట్

మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని బేగంపేట ట్రాఫిక్ ఇన్స్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజ్ తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తిరుమలగిరి మహబూదా విద్యాలయంలో విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన సదస్సు ను విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, మైనర్లు వాహనాలు నడిపితే రూ.25 వేల జరిమానా మూడు సంవత్సరాలు జైలు శిక్ష పడే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు . 18 సంవత్సరాల లోపు పిల్లలు (మైనర్లు) వాహనాలు నడపరాదని అది చట్టరీత్య నేరమని తెలిపారు. పిల్లలకు చిన్నతనం నుండే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు భద్రత, నియమాల గురించి వారి యొక్క బోధనాంశాలలో కూడా చేర్చాలన్నారు.అందరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని వాహనం వెనుక కూర్చున్న వ్యక్తి కూడా తప్పని సరిగా హెల్మెట్ ధరించాలన్నారు. విద్యార్థులు బాగా కష్టపడి చదివి మంచి క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని తల్లితండ్రులను గురువులను పూజించాలని పేర్కొన్నారు. వారికి కలిగిన సందేహాలను కూడా వివరించారు. ఇట్టి కార్యక్రమములో సుమారు 100 మంది విద్యార్థులు ప్రిన్సిపాల్ నాగ భవాని , వైస్ ప్రిన్సిపాల్ స్వప్న వారి సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో 6 నుండి 15 వరకు బస్తీ బాట



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

ఈనెల 6 నుంచి 15వరకు సీపీఐ(ఎం) పార్టీ బస్తీ బాట నిర్వహిస్తున్నట్లు సీపీఐ(ఎం) పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు తెలిపారు. బస్తీల్లో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను, వాటిని అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించే విధంగా కృషి చేయాలని సీపీఐ(ఎం) పార్టీ నగర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం సీపీఎం పార్టీ జూబ్లీహిల్స్ జోన్ కమిటీ నాయకులు ముందుగానే, బడి బాట పేరుతో బస్తీలలో నివసించే విద్యార్థినీ, విద్యార్థులు అధికంగా వెళ్లే బోరబండ నాట్కో ప్రభుత్వ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పరిశీలనలో సమస్యలతో సతమవుతున్న ప్రభుత్వ నాట్కో ఉన్నత పాఠశాలలో ఆచరణలో ఏ మాత్రం విద్యపై శ్రద్ధ చూపడంలేదని సీపీఐ(ఎం) పార్టీ నాయకులు టి.సాయి శేషగిరి రావు, జే.స్వామీలు అన్నారు. ఈ ఉన్నత పాఠశాలలో మొత్తం 1500 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరిలో 700 మంది కి పైగా బాలురు, 729కి పైగా బాలికలు ఇంగ్లీష్ మీడియంలో చదువుతున్నారని, ప్రైమరీ స్కూల్ 33 మంది విద్యార్థినీలు, 63 మంది విద్యార్థులు చదుతున్నారని పాఠశాల ప్రారంభించి నెల కావస్తున్న మౌలిక సదుపాయాల సరిగా లేవని తెలిపారు. మొత్తం 34 తరగతి గదులు ఉన్నాయని 31 మంది టీచర్స్ విద్యా బోధన చేస్తున్నారని ,ఇంకా 16 మంది అవసరం ఉంటే మరి కొద్ది రోజుల్లో 8 మంది వీధుల్లో చేరే అవకాశం ఉందని ఇన్‌చార్జి హెచ్ఎం ప్రేమ పావని లక్ష్మీ కుమారి నాయకులకు తెలియజేశారు. ఇప్పటికి వరకు బాత్‌రూంలు అసంపూర్తిగా ఉన్నాయని, ఉన్న ప్రైమరీ స్కూలుకు సంబంధించిన ఒకటి రెండు బాత్ రూంలు మాత్రమే పిల్లలు వాడుతున్నారన్నారు. మా బస్తీ, మా బడి స్కీమ్ కింద కొన్ని నిధు లు వచ్చాయని ఇంకా కొన్ని నిధులు రావాల్సిందని డిప్యూటీ ఎంఈఓ శామ్యూల్ రాజు తెలిపారని నాయకులు తెలిపారు. నాట్కో సంస్థ ఎనిమిది మంది ఉద్యోగులను సొంత నిధుల తోటి పని చేస్తుందని ముగ్గురే స్వీపర్స్ ఉన్నారని ఒక సెక్యూరిటీ ఒక వాచ్మెన్ మాత్రమే ఉన్నారని, ఆ సంఖ్య పెంచాల్సిన అవసరం ఉందని నాయకులు కోరారు. ఖైరతాబాద్ వన్ డిప్యూటీ డీఈఓ పరిధిలో మొత్తం 20 ప్రాథ మిక ,ఆరు ఉన్నత పాఠశాలలు ఉన్నాయని అన్ని పాఠశాల ల్లో పది రోజుల్లో సమస్యలను అధికారులు పరి ష్కరించకపోతే నిరాహార దీక్షకు వెనకడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో నాయకులు దాది మల్ల కృష్ణ, నరేష్, సికిందర్, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు

ఓయూ జేఆర్‌కు ఘనంగా సత్కారం..



నవతెలంగాణ, ఓయూ:

ఉస్మానియా విశ్వవిద్యాలయం నూతనంగా జాయింట్ రిజిస్ట్రార్‌గా నియమితులైన యం. శ్రీనివాస్‌ను మంగళవారం ఓయూ మాజీ ఎన్‌జీఓఎస్ ప్రధాన కార్యదర్శి, ఎఐయుటిఈసీ ట్రెజరర్, అబ్దుల్ ఖాదీర్‌ఖాన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఓయూకు అయిన సేవాలు ఎనలేనివని ఓయూ బడ్జెట్ రూపకల్ప న, పాలక మండలి సమావేశంలో ఫైనాన్స్ కమిటీ సమావేశంలో ఆయన చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఆయనకు అనుభవంతో పాటుగా అధికారులతో చొరవ ఉందని ఆయన ఉద్యోగుల నేస్తమని ఖాదీర్ ఖాన్ అన్నారు. కార్యక్ర మంలో సుధీర్ కుమార్ ,యాదగిరి ,వెంకటేష్, పి.రమేష్, కృష్ణ ,నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచవ్యాప్త విస్తరనే లక్ష్యం



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఆఫర్ నుండి ఉత్పాదకత వరకు లోప రహిత ఉద్యోగి అనుభవాన్ని రూపొందించడానికి హైరింగ్ మేనేజర్లు, హెచ్ఆర్, హెచ్ఆర్ ఐటీ టీమ్‌లకు ఈ స్వాధీనం వీలు కల్పిస్తుందనీ ఉద్యోగులకు హైర్ నుండి రిటైర్ వరకు అసాధారణమైన ప్రీ-బోర్డింగ్ ఆన్‌బోర్డింగ్ అనుభవాలను అందించ డంపై దృష్టి సారించిన మానవ వనరుల సాంకేతిక సంస్థ ట్రైడీని కొనుగోలు చేస్తున్నట్లు ఫెనోమ్ సీఈఓ, సహ-వ్యవస్థాపకుడు మహే బైరెడ్డి ప్రకటించారు. ఈ ఐదో స్వాధీనం ఇంటెలి జెంట్ టాలెంట్ ఎక్స్ పీరియన్స్ ప్లాట్‌ఫామ్ పోర్ట్ ఫోలియోకు ఈ అదనపు జోడింపు ఉద్యోగులకు ఉత్పాదకత కోసం సన్నద్ధమ య్యే సమయాన్ని తగ్గించడానికి ఫెనోమ్ కు గల విజన్‌ను బలపరుస్తుందని సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఇంజనీరింగ్ శివా నంద అఖేలా, వైస్ ప్రెసిడెంట్ హెచ్ఆర్‌టీఏ, శ్రీనివాస్ పిండేలు మంగళవారం బంజారా హిల్స్‌ని తాజ్ డెక్కన్ హోటల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. ట్రైడీ ప్రారంభమైనప్పటి నుండి ప్రతి ఒక్కరికీ పని సజావుగా సాగాలని మేం కోరుకున్నమని ట్రైడీ సహ వ్యవస్థాపకుడు కిరణ్ మీనన్ తెలిపారు.

దళిత ఎస్ఐకి ప్రభుత్వం అండగా నిలబడాలి



నవతెలంగాణ-ఓయూ

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావు పేటలో ఎస్ఐగా భాద్యతలు నిర్వహిస్తున్న శ్రీరాముల శ్రీనివాస్‌ను మానసికంగా వేధించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడేలా చేసిన సీఐ జితేందర్ రెడ్డి, నలుగురు కానిస్టేబుళ్ల మీద ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆల్ మాల స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ మాల పొలిటికల్ జేఏసీ చైర్మెన్ డాక్టర్ మంచాల లింగస్వామి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు అధికారిగా ప్రజల మన్ననలు పొంది నిజాయితీగా ఆశ్వరావుపేట పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ గత ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడం బాధాకరమని అశ్వారావుపేట పోలీసు స్టేషనుకు ఐదు నెలల క్రితమే బదిలీ మీద వచ్చిన దళిత ఎస్ఐ శ్రీనివాసుపై, సీఐ జితేందర్ రెడ్డి, మరో నలుగురు కానిస్టేబుళ్లతో అగ్రకుల దురహంకారంతో నాలుగు సార్లు అకారణంగా మెమోలు జారీ చేసి కుల వివక్షతకు ఆజ్యం పోశారన్నారు. మానసికంగా వేధించి చిత్ర హింసలు పెట్టారని ప్రజలను రక్షించాల్సిన బాధ్యతల్లో పని చేస్తున్న తనకే అవమానం జరుగుతుంటే ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక శ్రీనివాస్ ఆత్మహత్యే శరణ్యం అనుకోని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని దళిత ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్‌కు ప్రభుత్వం అండగా నిలబడి మెరుగైన వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలన్నారు. ఆయనను వేధించిన సీఐ జితేందర్ రెడ్డి, మరో నలుగురు కానిస్టేబుళ్లపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకోకపోతే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని" హెచ్చరించారు.

వీఆర్ ఆస్పత్రిలో డాక్టర్స్ డే



నవతెలంగాణ-కంటోన్మెంట్

డాక్టర్స్‌డేని పురస్కరించుకొని మంగళవారం బోయిన్‌పల్లి వీఆర్ ఆస్పత్రిలో డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించారు. మేనేజింగ్ డైరెక్టర్ నందకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ నందకుమార్, మాజీ ఉపాధ్యక్షుడు ప్రతాప్ మాట్లాడుతూ వీఆర్ ఆస్పత్రి ప్రజలకు చేరువైందని నాణ్యతమైన వైద్యం అందిస్తూ ప్రజలకు చేరువైందన్నారు. అన్ని సేవలు ఒకే ప్రాంగణంలో ఉండటం ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉందన్నారు.



వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హైదరాబాద్ లోని అసెంబ్లీ ప్రాంగణంలోని విప్ ఆఫీస్ లో ఓయూ జేఏసీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సంజయ్, ఓయూ జేఏసీ చైర్మెన్ కొత్తపల్లి తిరుపతి, తెలంగాణ ఎస్సీ, ఎస్టీ విద్యార్థి సంఘం వ్యవస్థాపక అధ్యకులు డా.పెంట కృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నవతెలంగాణ,ఓయు

పీజీ ప్రవేశ పరీక్షల తేదీలను మార్చాలి : టీఎస్‌పీ జేఏసీ



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహించే కామన్ పీజీ ఎంట్రెన్స్ ఎలిజిబులిటీ టెస్ట్ ఓయూ, 2024 జూలై 7 నిర్వహించే అర్హత పరీక్షల తేదీని మార్చాలని తెలంగాణ స్టూడెంట్స్ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో మంగళవారం సీపీజీఈటీ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ జలపతికు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జాతీయ స్థాయిలో నిర్వహించే సీటెట్ , ఇతర అర్హత పరీక్షలు ఒకే తేదీలో ఉండడం వల్ల అర్హత పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి అయ్యే ప్రమాదం ఉందని 7న, నిర్వహించే అర్హత పరీక్షను విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకొని వాయిదా వేసి తదుపరి పరీక్ష సమయాన్ని ప్రకటించాలని కోరారు.


కట్ట మైసమ్మ ఆలయానికి ఎమ్మెల్యే పద్మారావు వ్యక్తిగత విరాళం

నవతెలంగాణ-ఓయూ

బోనాలు పండుగను పురస్కరించుకొని చిలకలగూడ లోని చారిత్రాత్మక కట్టమైసమ్మ దేవాలయానికి సికింద్రా బాద్ శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ తన వ్యక్తిగత విరాళాన్ని అందించాలని నిర్ణ యించారు. ఆలయంలో పంచరంగులకు కనీసం రూ. ఏడు లక్షల నిధులు ఖర్చవుతాయని ఆలయం అధికారులు అంచ నా వేశారు. పంచ రంగుల ఖర్చు కింద రూ.ఏడు లక్షల డబ్బులను తన వ్యక్తిగత విరాళంగా పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా ప్రకటించారు. వెంటనే పనులను ప్రారంభించి, బోనాలు పండుగ నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలనీ పద్మారావు ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. ఎమెల్యే ఎదాతృత్వం పట్ల ఆలయం కార్యనిర్వహణాధికారి, నిర్వాహకులు, భక్తులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆవులకు ఆగంతకుల కత్తిపోట్లు





నవతెలంగాణ-కంటోన్మెంట్

ఆలయంలో ఆవులకు గుర్తుతెలియని దుండగులు కత్తిపోట్లు పెట్టారు. మంగళవారం కారానా పోలీస్ స్టేషన్ పరిధిలో వీరాంజనేయ స్వామి గోశాలలో ఉన్న ఆవులకు గుర్తు తెలియని వ్యక్తులు కత్తిపోట్లు పెట్టి పరారీ అయ్యారు. విషయం స్థానికులకు తెలియడంతో కొంత ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది. ఆగంతకులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి తీవ్ర ఉధృతంగా మారడంతో పోలీసులు సంఘర్షణ స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణేష్ తక్షణమే కారానా పోలీస్ స్టేషన్ వెళ్లి గోమాతలకు కత్తిపోట్లు పొడిచిన నిందితులను వెంటనే అదుపులో తీసుకోవాన్నారు. పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించారు. నిందితుల కోసం గాలింపు చేపట్టారు.

డ్రయినేజీ సమస్యను నివారించడానికి చర్యలు



నవతెలంగాణ-కంటోన్మెంట్

బస్తీ పర్యటనలో భాగంగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే గణేష్ మంగళవారం రెండో వార్డు పరిధిలోని ఇంద్రమ్మ నగర్ పెద్ద రోడ్డు గల్లీ, నాగమ్మ టెంపుల్ పరిధిలో కంటోన్మెంట్ పర్యటించారు. అనంతరం ఇంద్రమ్మ నగర్ పెద్దరోడ్డులో రూ.40 లక్షల వ్యయంతో జేకే లైన్ అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భవిష్యత్తులో ఇంకా ఏ విధంగా చేస్తే ఈ బస్తీలో ఉన్న డ్రైనేజీ సమస్య పూర్తిగా పరిష్కారం అవుతుందని ప్రజాభిప్రాయాన్ని, అదేవిధంగా డ్రయినేజీకి సంబంధించిన నిపుణులు మాకు అడ్వైజ్ చేస్తే ఒక కమిటీ ఏర్పాటు చేసి కంటోన్మెంట్ వ్యాప్తంగా డ్రయినేజీ సమస్య నివారించడానికి చర్యలు చేపడతామన్నారు. నాణ్యత గల పని చేయించడం తన బాధ్యతని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అందరూ సహకరించాలని కోరారు. జైక ప్రాజెక్టు సగంలో ఆగిపోయిందని నాళాలకు చాలా ఇబ్బంది అవుతుందన్నారు. దీనికి సంబంధించిన నిపుణులతో మాట్లాడి మన కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వెళ్తానని ఖచ్చితంగా, శాశ్వతంగా ప్రతి బస్తీ నుండి డ్రయినేజీ సమస్య లేకుండా పూర్తిస్థాయిలో పనిచేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు,బస్తివాసులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రుణమాఫీ చేస్తాననడం హర్షనీయం

- మాజీ ఎంపీపీ రమావత్ జ్యోతిశ్రీను నాయక్

నవతెలంగాణ-యాచారం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఏకకా లంలో రూ.2 లక్షల రుణమాఫీ చేస్తాన నడం హర్షించదగ్గ విషయమని మాజీ ఎంపీపీ రామావత్ జ్యోతి శ్రీను నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ నిర్ణయం తీ సుకోవడం సంతోషకరమైన విషయమని తెలిపారు. రైతులందరికీ త్వర లోనే రుణమాఫీనిప్రభుత్వం అందిస్తుందని ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని తెలపారు. త్వరలోనే అర్హులైన పేదలందరికీ 6 గ్యారంటీల సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. గత ప్రభుత్వం ఇండ్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని రాబోయే రోజుల్లో రాష్ట్రంలో ప్రతి పేదవాడికీ సొంతింటి కలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఆరు గ్యారెంటీలైన ఉచిత కరెంటు జీరో బిల్లులు, రూ.500లకే గ్యాస్, కొత్త రేషన్ కార్డులు, సొంత ఇంటి కల ఇతర పథకాలను త్వరలోనే అమలు చేస్తుందని మాజీ ఎంపీపీ పేర్కొన్నారు.

ముగిసిన రవాణాశాఖ అధికారుల తమిళనాడు పర్యటన



నవతెలంగాణ-సిటీబ్యూరో

తమిళనాడు రాష్ట్రంలో అమలవుతున్న రవాణ విధానాలను అధ్యయనం చేయడానికి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉప్పల్ ఆర్టీవో వాణి, కామారెడ్డి ఎంవీఐ జింగ్లి శ్రీనివాస్ బృందం అక్కడికి వెళ్లింది. రెండవ రోజు పర్యటనలో భాగంగా మంగళవారం తెలంగాణ రవాణాశాఖ అధికారులు మీనం బాకం ఆర్టీవో కార్యాలయాన్ని, బెసంత్ నగర్ ఫిట్‌నెస్ సెంటర్‌ని, నేషనల్ ఇన్ ఫర్మేటిక్ సెంటర్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా వాహన్, సారథి పోర్టల్ ద్వారా వాహనదారులకు అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. వీరి వెంట తమిళనాడు జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సురేష్, ఆర్టీవో సంపత్, శ్రీధర్, ఎంవీఐలు కావేరి, కార్తీక్ తదితరులు ఉన్నారు.

బడి బస్సులు, ఆటోలపై ..

ఆర్టీఏ, పోలీసుల ప్రత్యేక డ్రైవ్



- ఆరు బడి బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలపై కేసులు నమోదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి నగర రోడ్లపై ఫిట్‌నెస్ లేకుండా రోడ్డెక్కుతున్న స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి.. చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు బడి బస్సులపైనే దృష్టిసారించిన ఆ శాఖ.. ఇకపై ఆటోలతో పాటు వాహన రిజిస్ట్రేషన్, ట్యాక్స్‌లు చెల్లించకుండా తిరుగుతున్న వాటిపై ఫోకస్ పెట్టాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మంగళవారం ఆర్టీఏ, పోలీసు అధికారులు కలిసి సంయుక్తంగా నగరమంతటా ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సి.రమేష్ ఆధ్వర్యంలో ఆర్టీఏ, పోలీసు అధికారులు పలు బృందాలుగా ఏర్పడి నగరంలోని అమీర్‌పేట్, సికింద్రాబాద్, టోలిచౌకి, మలక్‌పేట్, బంజారాహిల్స్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టి.. పలు స్కూల్ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలను చెక్ చేశారు. ఇందులో మొత్తం 6 స్కూల్ బస్సులు, 5 ఆటోలు, మూడు ఇతర రాష్ట్రాల వాహనాలతో పాటు ఒక ఒమ్ని బస్సును మ్యాక్సీ క్యాబ్‌గా మార్చి తిరుగుతున్నట్టు గుర్తించి కేసులు నమోదు చేయడంతో పాటు పలు వాహనాలను సీజ్ చేశారు. ఫిట్‌నెస్, లెసెన్స్ కాలపరిమితి, ఇన్సూరెన్స్, ట్యాక్స్‌లు కట్టకుండా, ఇతర ధ్రువపత్రాలు సరిగ్గాలేని బస్సులతో పాటు నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న వాహనాలను సీజ్ చేసినట్టు ఈ సందర్భంగా జేటీసీ తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, రక్షణ దృష్ట్యా నిబంధనలు పాటించాలని ఇప్పటికే చెప్పామని, ఇలాంటి బస్సులు, ఆటోలు రోడ్లపై రాకుంటే పిల్లలు సురక్షితంగా ఉంటారని ఆయన సూచించారు. ఈ ప్రత్యేక డ్రైవ్ కొనసాగుతుందని జేటీసీ తెలిపారు.



800 కిలోల నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత





డీసీఎం సీజ్, వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ -శామీర్ పేట

ఐచర్ గూడ్స్ వాహనంలో నకిలీ పత్తి విత్తనాలను తరలిస్తుండగా పోలీసులు అడగించి పట్టుకున్నారు. విశ్వాసనీయ సమాచారం మేరకు ఈ నెల ఒకటో తేదీన వ్యవసాయ అధికారి, శామీర్‌పేట పోలీసులు, మేడ్చల్ ఎస్ఓటి పోలీసులు శామీర్ పేట ఆరెంజ్ బౌల్ వద్ద వాహనాన్ని అడ్డగించి 800 కిలోల నకిలీ పత్తి విత్తనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి శామీర్ పేట పోలీస్ స్టేషన్‌లో మేడ్చల్ డీసీపీ కోఠిరెడ్డి మంగళవారం విలేకరుల సమావేశం పెట్టి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లికి చెందిన గుండా రాజు ఆదేశాల మేరకు నల్ల మల్లేష్ (32) విజయవాడ రహదారిలో సూర్యపేటకు 4 కిలోమీటర్ల దూరంలో 20 సంచుల నకిలీ పత్తి విత్తనాలు (ఒక సంచి 40 కేజీలు 20 సంచులు మొత్తం 800 కేజీలు) ఐచర్ డీసీఎం గూడ్స్ వాహనం (నెం. టీఎస్ 18 టీ 6999)లో లోడు చేసుకొని అనుమానం రాకుండా నకిలీ విత్తనాల సంచులను 100 కూరగాయల బాక్స్‌లతో కప్పి సూర్యపేట నుంచి బెల్లంపల్లికి తరలిస్తుండగా శామీర్ పేట ఆరెంజ్ బౌల్ వద్ద వాహనాన్ని అడ్డగించి పట్టుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని, నకిలీ విత్తనాలను స్వాదీనం చేసుకున్నట్లు, దాని డ్రైవర్‌ని అదుపులోకి తీసుకొని ఒక మొబైల్ ఫోన్ కూడా స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్ డీసీపీ కోఠిరెడ్డి వెల్లడించారు. డి. శ్రీనివాస్ ఎస్ఓటీ డీసీపీ శోభన్ కుమార్ అడిషనల్ డీసీపీ రాములు, పేట్ బషీరాబాద్ ఏసీపీల పర్యవేక్షణలో శామీర్‌పేట పీఎస్ ఇన్‌స్పెక్టర్ ఎస్. శ్రీనాథ్, మేడ్చల్ ఎస్ఓటీ ఇన్స్‌స్పెక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, మండల వ్యవసాయధికారి రమేష్ వారి బృందాలు పనిచేశాయని తెలిపారు. నకిలీ విత్తనాలు పట్టుకోవడంలో ఎస్ఓటీ పోలీసుల, శామీర్ పేట పోలీసుల కృషిని సైబరాబాద్ సీపీ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ లు మునిందర్, హారిక, అనిత, పోలిసు సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై సమాచారం ఇవ్వండి

ఇటీవల కాలంలో అనేక మంది రైతులు నకిలీ విత్తనాల కొని మోసపోయి పంట చేతికి రాక ఎందరో రైతులు మనస్తాపంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నారని డిసిపీ కోటిరెడ్డి అన్నారు. నకిలీ విత్తనాల కొనకుండా జాగ్రత్తలు పడాలని సూచించారు. అలాగే నకిలీ విత్తనాలపై నిఘా పెట్టి పోలీసులను సంప్రదించాలని, 100 డయిల్ కు, వాట్సాప్ నెం. 9490617444 ద్వారా సమాచారాన్ని తెలియజేయాలని సూచించారు. అందరం కలసి నకిలీ విత్తన రహిత తెలంగాణగా తయారుచేద్దామని డీఎస్పీ కోఠిరెడ్డి అన్నారు.

కబ్జాదారుల నుంచి హెర్బల్ పార్క్ స్థలాన్ని కాపాడండి





మొక్కల కోసం గుంతలు తీసిన మున్సిపల్ అధికారులు
గుంతలు పూడ్చివేసిన హుడా అధికారులు
కబ్జాదారులకు సహకరిస్తున్నారంటూ స్థానికుల ఆరోపణ

నవతెలంగాణ - జవహర్‌నగర్

ప్రజల అవసరాల నిమిత్తం గతంలో హెర్బల్ పార్క్ కోసం 2019 లో జవహర్ నగర్ మున్సిపల్ పరిధిలోని 16వ డివిజన్ అరుంధతి నగర్‌లో సర్వే నెంబర్లు 759, 974లలో 4.03 ఎకరాల భూమిని ప్రభుత్వం అధికారికంగా కేటాయించారు. అప్పటి కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఎంవీ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేశారు. కొంతకాలం మొక్కలు నాటి వాటిని సంరక్షించిన, తరువాత కొత్త మొక్కలు నాటకపోగా ఉన్న వాటి నిర్వహణ గాలికి వదిలేశారు. దీంతో ఆట్టి భూమిపై కబ్జాదారుల కన్ను పడింది. పార్కు కోసం కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతుందంటూ స్థానికులు పలు మార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ అధికారుల సమన్వయ లోపం

ప్రజల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో జవహర్ నగర్ మున్సిపల్ కమిషనర్ తాజ్ మోహన్ రెడ్డి, అరుంధతి నగర్ లోని హెర్బల్ పార్కులో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు ఆదేశాలు జారీ చేశారు. దింతో మున్సిపల్ సిబ్బంది సోమవారం మొక్కలు నాటడానికి జెసిబి సహాయంతో గుంతలు తీశారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన హెర్బల్ పార్క్ స్థలం హుడా సంస్థకు చెందినదని మంగళవారం హుడా అధికారులు, మునిసిపల్ అధికారులు సోమవారం తీసిన గుంతలను జెసిబి సహాయంతో పూడ్చి వేశారు. దీంతో స్థానికులు అప్పటి ప్రభుత్వం హెర్బల్ పార్కు కోసం కేటాయించిన భూమిని హుడా అధికారులు తమ శాఖకు సంబంధించిందని రావడం శోచనీయమని, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

భూ కబ్జాదారులకు సహకరించకుండా, పార్క్ అభివృద్ధి చేయాలి



హెర్బల్ పార్కులో మొక్కలు నాటి వాటి సంరక్షణ పూర్తిగా మానేయడంతో, కొందరు కబ్జాదారులు తెర వెనుక ఉండి సరిహద్దు కంచెను, సూచిక బోర్డును తీసేయించారు. ఇనుప కంచెను, బోర్డును తొలగించినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇన్ని రోజులకు మున్సిపల్ అధికారులు మొక్కలు నాటుటకు గుంతలు తీస్తే, హుడా అధికారులు ఎందుకు పూడ్చి వేస్తున్నారో అర్థం కావటం లేదు. ఇక్కడ కచ్చితంగా హెర్బల్ పార్క్ ఏర్పాటు చేయాలి. లేని పక్షంలో కాలనీ ప్రజల అందరితో కలిసి మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగుతాం. -అరుంధతి నగర్ డివిజన్ అధ్యక్షుడు, వుచల సత్యం.

CHANGE OF NAME

I, SOPPARI BABU (Old Name) S/o SOPPARI RAMULU, R/O H.No. 16-11/741/C/A/55, Sbh Colony, Hyderabad, Telangana State. I have changed my name as **SOPPARI SRINIVASULU** (New Name) S/O SOPPARI RAMULU for all purposes.

IN THE COURT OF THE JUNIOR CIVIL JUDGE-CUM--XIV ADDL METROPOLITAN MAGISTRATE AT : HAYATHNAGAR. O. S. NO. 481 OF 2022

Between:
Kashamoni Satyanarayana ... Plaintiff.
And
Surepally Mamatha @ Vanam Kavya &Others . ...Defendants.
To
D-2. Smt. Appidi.Padma Rani w/o A.Krishna Reddy,age 39 Yrs.occ: House wife.R/o H.nO. 4-9-569, Plot.NO.3 West part, Vinayaka nagar, Hayathnagar, R.R.Dist.
D-5. Chivukula Vaidehi w/o Ch.Sai Sankara Babu age 69 Yrs.occ: house hold.R/o H.No.4-37, Kamalanagar, Vanasthalipuram, Hayathnagar Mandal. R.R.Dist.

Please take notice that the above plaintiff filed the above suit for declaration and cancelation of documents in O.S. 481 of 2022 and this Hon'ble court ordered notice through publication to defendant. No. 2 & 5 and the court is posted the date of hearing on 17-7-2024 for your appearance please appear on the said day by party or through an advocate failing which the court pass orders material available on record.

(By order of the court).
Counsel for the Plaintiff.
R.PRABHAKAR.
Advocate"
H.NO.17-2-580/7 MADANNAPET SAIDABAD.HYD.59.

పదవీ విరమణ పొందిన ఎంపీపీకి ఆత్మీయ వీడ్కోలు

- ఘనంగా ఎంపీటీసీలను సన్మానించిన అధికారులు
- వారి సేవలు మరువలేనివి

నవతెలంగాణ-యాచారం

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ప్రజా ప్రతినిధుల ఆత్మీయ వీడుకోలు సమావేశం ఎంపీడీవో నరేందర్ రె డ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. పదవీ విరమణ పొందిన ఎంపీ పీ కొప్పు సుకన్య భాష, వైస్ ఎంపీపీ కొడవగంటి శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు తాండ్ర లక్ష్మమ్మ, ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్, కొర్రజ్యోతి అరవింద్ నాయక్, ముప్పిడిబాబు, ఎండీ ఈశ్రత్ బేగం తదితరులను అధికారులు సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం వారు అందించిన సేవలను కొనియాడారు. అనంతరం బదిలీపై వెళ్లిన ఎంపీడీవో విజయలక్ష్మిని స న్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో తహసీల్దార్ అయ్యప్ప, మం డల వ్యవసాయ అధికారి సందీప్, ఎంపీఓ శ్రీలత, ఏఈ ఉస్మాన్, ఏపీఓ లింగయ్య, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులున్నారు.

IN THE COURT OF THE HON'BLE III ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURT, AT: HYDERABAD E.P. No. 100 of 2007 IN O.P. No. 2324 of 2001

Between:
APSFC, Mahabubnagar Branch. ....Decree Holder
AND
M. Venkataramulu Goud and another ..... Judgement Debtor

Notice to the Judgement Debtor i.e., M. Venkataramulu Goud, S/o. Bassanne Goud, R/o.2-3-70/39, Anantharam Nagar, Bagh Amberpet, Hyderabad-13.

Proclamation of Sale by the Decree Holder it is hereby informed to public at large that the following immovable property will be sold in public auction at 10.30 A.M. on 25.07.2024 in the Court premises. Attached immovable property is:

SCHEDULE OF PROPERTY

All the premises bearing House No. 2-3-70/39 on Plot No.39 admeasuring 234.67 sq.yards or 196.18 sq mtrs., in Sy.No 282/1, 283/1,2,3,284 and 285 situated at Bagh Amberpet Village, Ward No.2, Block No.3, Municipal Corporation of Hyderabad and bounded by North: Plot No.38, South: Plot No.40, East: MCH Play Ground & West: 30' wide Road.

By the order of Court
Sd/- Sri Challa Praveen Kumar, Advocate
Off: 2-1-340/16, 5th Floor, Sai Tara Towers, Beside Fever Hospital, Nallakunta, Nimboliadda, Hyderabad- 500044- Ph No.9963672942

IN THE COURT OF THE Principal Dist Judge at SURYAPET OPNO : 32 of 2024 O.S. No: 54 OF 2019

Between:
యడ్లపల్లి లక్ష్మి మరియు ఇతరులు ...పిటీషనర్లు
మరియు
బినోద్ ప్రసాద్ మరియు ఇతరులు ... రెస్పాండెంట్స్
టు R2
శ్రీ సాయి శబరి ట్రాన్స్‌పోర్టు Rep by :- బత్తుల శ్రీనివాసరెడ్డి R/o ప్లాటు నెం : 203, సెకండ్ ఫ్లోర్, హౌస్ నెం. 4-80, నవ్యరెసిడెన్సి, వీరారెడ్డి నగర్, ఉప్పల్, మేడ్చల్ జిల్లా, హైద్రాబాద్.

పైన తెలిపిన పిటీషనరు పై గౌరవనీయ కోర్టులో సెక్షను 166 యం.వి. యాక్టు 1988 మరియు రూల్స్ 455, ఆంధ్రప్రదేశ్ యం.వి. యాక్టు రూల్స్ 1989 ప్రకారం ప్రమాదనష్టపరిహారం గురించి కేసువేయడమైనది.

పై కేసులో మీ లోని 2వ వారికి కోర్టు ద్వారా, పోస్టుద్వారా పంపిన నోటీసు ముట్టక తిరిగివచ్చినది. పై కేసు మీ హాజరు నిమిత్తం ది. 26-07-2024న కలదు. కావున మీరు ఆ రోజున పై కోర్టు యందు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా ఉ. 10:30 గం॥లకు హాజరు కాగలరు. లేనిచో పై కేసు మీ పరోక్షంలో తీర్పు చెప్పబడును.

//కోర్టు వారి అనుమతితో//
గోంద్రాల అశోక్, అడ్వకేట్, సూర్యాపేట, సెల్ : 9490569341.

IN THE COURT OF THE HON'BLE V JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT, AT: HYDERABAD O.S.NO.2695 OF 2024

BETWEEN:
ARRAM VIJAYA LAXMI and another ...Plaintiff
AND
1.THE TAHSILDAR KHAIRTHABAD MANDAL
2.ALL CONCERNED ...Defendants
To
1)THE TAHSILDAR Khairtabad Mandal
2)All Concerned

Take Notice that the above plaintiff's filed above Suit for Declaration To Declare the plaintiffs as Legal Heirs of the deceased Late Arram Padma Rao against you and the same stands posted for your appearance on **19-07-2024** at **10.30 a.m.** before the said court. In case if you fail to appear and answer the Hon'ble Court may pass orders against you in accordance with law.

(By order of the Hon'ble Court)
D.HARSHA VARDHAN ADVOCATE
8-3-988/1/8/3, NAGARJUNA NAGAR, YELLAREDDYGUDA, HYDERABAD-73.
Cell: 9885208707

BY ORDER OF THE COURT IN THE COURT OF THE HON'BLE IX ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE. RANGA REDDY- DISTRICT, AT : L.B. NAGAR IA NO. 907 OF 2023 IN O.S. NO. 1369 OF 2022

Between:
M/s. Vision India Infra Developers Rep by its Managing Partner, Smt. N. Vanaja W/o Mr. Tirupathi Reddy Nagam, ...Petitioners/Plaintiffs
And
Saranga Thirupathaiah S/o Sri. S. Nagishetty. Aged about 50 yrs, Occ- Agriculture, R/o Hno.16-11-5/11/220, Plot No- 401. Shalivahana Nagar, Hyderabad, T.S. ....Respondent/ Defendant

WHEREAS the Petitioners/ Plaintiffs M/s. Vision India Infra Developers, Rep by its Managing Partner, Smt. N. Vanaja W/o Mr. Tirupathi Reddy Nagam, has instituted petition against Saranga Thirupathaiah S/o Sri. S. Nagishetty, in the main suit in O.S. No. 1369 of 2022 on the file of the Hon'ble IX Additional District & Sessions Judge, Ranga Reddy District, At. L.B. Nagar you the defendant Saranga Thirupathaiah S/o Sri. S. Nagishetty, Aged about 50 yrs, Occ- Agriculture, R/o Hno.16-11-5/11/220, Plot No- 401, Shalivahana Nagar, Hyderabad, T.S, is hereby summoned to appear in the Court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the petition in the above suit or who shall be accompanied by some person able to answer all such questions, on 5th day of August 2024 at 10.30 o' clock, to answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of your defence.

Take notice that, in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence. GIVEN under my hand and the seal of the Court, this 2nd day of July 2024

Sd/-
HONBLE IX ADDITIONAL DISTRICT AND SESSIONS JUDGE RANGA REDDY-DISTRICT, AT L.B.NAGAR
K.S.L. Shiva Prasad, P. Aruna Advocates & Associates
Off # Munni's Villa, Plot No-24, (HNo. 2-30-36), HNo.3-09-008, Wahab Nagar, Secunderabad-003, Ph: 9866388895, 9000109759 email-kslsp2430@gmail.com

IN THE COURT OF THE HON'BLE XIX JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURT AT :HYDERABAD O.S.No. 2349 OF 2024

Between:
1. Cirundas Aradhana, W/o.Late. Cirundas Badrinarayana,
2.Cirundas Prajwal Kumar, S/o. Late.Cirundas Badrinarayana,
3.Cirundas Maanya Sree, D/o. Late.Cirundas Badrinarayana, ...Plaintiffs
AND
1.Tahasildar, Mandal Revenue Officer, Saidabad, Hyderabad.
...Defendants
2. All Concerned, Hyderabad.
To,
All Concerned, Hyderabad.

Whereas the above named Plaintiffs have filed the above case for Declaration to declare that the Plaintiffs are legal heirs and successors of Late. Cirundas Badrinarayana against the Defendants and case is posted to **22-07- 2024** for appearance of All concerned.

If you fail to appear either in person or through an advocate on the above said date and time **at 10:30 am** before the Hon'ble Court and the matter will be heard and decided Exparte.

//BY ORDER OF THE COURT//
B. Rajeshwar. Bhoga Rahul. Counsels for the Plaintiffs
Cell No.9849311458
Office at # 13-6-955, Banjawadi, Karwan, Hyderabad-500 006, T.S.

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGAREDDY DISTRICT AT: L.B.NAGAR O.S No. 744 Of 2016

BETWEEN:-
Sreekonda Bhaskar ...Plaintiff
AND
G.Madhusudhan Reddy & others ...Defendants
To.
1.Sri Thakur Ghanshyam Singh, Son of Sri Purushotham Singh, Aged about 39Yrs, Occupation:- Business, Resident of H-No:-18-7-455/B/5/A, Patelnagar, Lalitha Bagh, Hyderabad ...Proposed/Defendant
2.Sri Arjun Singh Son of Late Dhani Ram, Aged about 49Yrs, Occupation:- Bank Employee, Resident of H-No:-18-7-455/B/5/A, Patelnagar, Lalitha Bagh, Uppuguda, Hyderabad ...Proposed Defendant

NOTICE BY SUBSTITUTED SERVICE

Whereas the plaintiff has instituted a suit for declaration, recovery of possession and Mandatory injunction and proposed to implead you as party defendants, whereas the court is satisfied that it is not possible to serve the summons in the suit on you in the ordinary course, since you are avoiding the same, the court has ordered that substituted service of the summons be caused on all of you by publication in news paper. You are therefore hereby summoned by order of court to appear before the Honourable court and answer all material questions relating to the suit **on the 18th Day of July 2024 at 10.30 a.m.** in the forenoon either in person or through a pleader duly instructed in that regard. In the event of your failure to appear before the court on the said day. the court may proceed against you ex-parte. Hence the notice

//BY ORDER OF THE COURT.//
M/s NOMOS VISTAS, The Lawyers, Through Govardhan Venu, Advocate Shiva Shakti,
H.No.8-2-684/3, Plot No.80, Near GHMC Ward Office, Banjara Green Colony, Ministers Colony, Road No.12, Banjara Hills, Hyderabad-500034.
MOB:-8466995858, 9849091266

NOTICE TO DEFENDANT NO.2/ALL CONCERNED IN THE COURT OF HON'BLE IIIrd SENIOR CIVIL JUDGE, CITY CIVIL COURT: AT: SECUNDERABAD O.S.No.106 of 2024

Between:
Smt.L.Sumathi & Two others ...Plaintiffs
And
1.The Tahsildar, Trimulgherry Mandal
2.All concerned ...Defendants

SUMMONS

The general public / All Concerned are hereby informed that the Plaintiffs in the above case have filed the Suit for Declaration to declare them, that they are the only surviving Legal heirs and legal representatives of the deceased Late Sri.R.L.Narasimhan against All Concerned. The above matter is posted to **25-07-2024.** If any persons have got any objection for declaring them as only Legal heirs and legal representatives of the deceased, Sri.R.L.Narasimhan, he/she/they may appear in the above designate Court **at 10.30 a.m.** in person or by an advocate duly instructed. Therefore, make it convenient to attend the Court on the said date and time before the Hon'ble Court. In the event of your failing to appear before the designated Court, matter will be heard and appropriate orders will be passed by the Hon'ble Court in accordance with law.

(BY ORDER OF THE COURT)
MS Thirunathan. Sri.N.Omprakash Smt. Jyothi Ms.S.J.B. Jayavalli Advocates
H.No. 1-11-59/B, Chinna Thokatta New Bowenpally Secunderabad- 500011
Cell No. 9885177045

IN THE COURT OF HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE RANGAREDDY DISTRICT AT: L.B.NAGAR O.S No.744 Of 2016

BETWEEN:-
Sreekonda Bhaskar ...Plaintiff
AND
G.Madhusudhan Reddy & others ...Defendants
To.
1.Sri Thakur Ghanshyam Singh, Son of Sri Purushotham Singh, Aged about 39Yrs, Occupation:- Business. Resident of H-No:-18-7-455/B/5/A, Patelnagar, Lalitha Bagh, Hyderabad ...Proposed/Defendant.7
2.Sri Arjun Singh Son of Late Dhani Ram, Aged about 49 Yrs, Occupation:- Bank Employee, Resident of H-No:-18-7-455/B/5/A, Patelnagar, Lalitha Bagh, Uppuguda, Hyderabad ...Proposed/Defendant.8

NOTICE BY SUBSTITUTED SERVICE

Whereas the plaintiff has instituted a suit for declaration, recovery of possession and Mandatory injunction and proposed to implead you as party defendants, whereas the court has ordered that substituted service of the summons be caused on all of you by publication in news paper. You are therefore hereby summoned by order of court to appear before the Honourable court and answer all material questions relating to the suit **on the 18th Day of July 2024 at 10.30 a.m.** in the forenoon either in person or through a pleader duly instructed in that regard. In the event of your failure to appear before the court on the said day. the court may proceed against you ex-parte. Hence the notice

//by order of the Court//
M/s NOMOS VISTAS, The Lawyers, Through Govardhan Venu, Advocate Shiva Shakti,
H.No.8-2-684/3, Plot No.80, Near GHMC Ward Office, Banjara Green Colony, Ministers Colony, Road No.12, Banjara Hills, Hyderabad-500034.
MOB:-8466995858, 9849091266

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

చైతన్య యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం శాలిబండ రిప్స్ ఈఎం హై స్కూల్ లో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ కార్యదర్శి పుల్ల రెడ్డి, రిటైర్డ్ ఎచ్.ఎం. మధుసూదన్ , స్కూల్ ఎచ్.ఎం రఘునాథ్ రెడ్డి, చైతన్య యూత్ అసోసియేషన్ అధ్యక్షులు సి.విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ సుశీల్ కుమార్ నాయి, సభ్యులు భాస్కర్, కార్తిక్, నికాంత్, సాయినాథ్ యాదవ్, రాకేశ్, స్వప్న, రజిని, భార్గవి, శ్రావన్, నవీన్ పటేల్, వెంకటేష్, సాయి పాల్గొన్నారు.

సీవరేజీ సమస్యలను పరిష్కరిస్తాం

- గాంధీనగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్



నవతెలంగాణ-ముషీరాబాద్

గాంధీనగర్ డివిజన్, జవహర్ నగర్‌లోని సాయి కృపా అపార్టుమెంట్స్ వీధిలో తరచూ సీవరేజి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, అందుకు నూతన పైప్ లైన్ ఏర్పాటు చేయాలని స్థానికులు మంగళవారం గాంధీ నగర్ కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. స్థానిక ప్రజల వినతి మేరకు త్వరలో సంబంధిత జలమండలి ఉన్నతాధికారులతో సమీక్షించి, సీవరేజి సమస్య పరిష్కారానికి స్థానికుల అభ్యర్థన మేరకు నూత సీవరేజీ పైప్ లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బీజేపీ నాయకులు హర్ష యాదవ్, నరేందర్ బాస, సంపత్ యాదవ్ స్థానికులు. అరుణ, విజయ లక్ష్మి, మనోహర్, రామ కృష్ణ, పవన్, తదితరులున్నారు.

మూసీ నది అభివృద్ధి పేరుతో బస్తీల్లో సర్వే

సర్వే ఉద్దేశంను బహిరంగంగా ప్రకటించాలి - సీపీఐ(ఎం), బస్తీ సంఘాలు..



నవతెలంగాణ-ధూల్‌పేట్

మూసీ అభివృద్ధి పేరుతో గోషామహల్ నియోజకవర్గంలోని మూసీ పరిసర బస్తీల్లో అధికారులు జరుపుతున్న సర్వే పట్ల ప్రజలకు పలు అనుమానాలున్నాయని వాటిని నివృత్తి చేస్తూ ప్రభుత్వం బహిరంగ ప్రకటన చేయాలని గోషామహల్ డివిజన్ దేవీనగర్, చంద్ర కిరణ్, అంబేద్కర్ నగర్ బస్తీల ప్రతినిధులు, సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు ఎండి.అబ్బాస్ అన్నారు. వారి నేతృత్వంలో ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఎంతో కష్టపడి రూపాయి కూడబెట్టి కట్టుకున్న ఇండ్లను కూలగొడతారేమోనని ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఈ విషయంలో పేదల ఇండ్లకు ఎలాంటి నష్టం కలిగించబోమని ప్రభుత్వం ప్రకటించాలని సీఎం క్యాంప్ ఆఫీస్ ప్రజావాణిలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనిపై సంబంధిత అధికారులు వివరణ ఇస్తారని హామీ ఇచ్చారు. సీపీఐ(ఎం) జిల్లా నాయకులు జి.విఠల్,కే జంగయ్య, వివిధ బస్తీల ప్రతినిధులు నరసింహా చారి, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తాం



- తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-హిమాయత్‌నగర్

రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలు కేటాయిస్తామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మెన్‌గా నియమితులైన కె.శ్రీనివాస్ రెడ్డి, సాక్షి ఫోటో ఎడిటర్‌గా ఉద్యోగ విరమణ చేసిన కె.రవికాంత్ రెడ్డి, జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ కో-ఆపరేటివ్, ఏం.ఏ.హౌసింగ్ సొసైటీ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన బొమ్మగాని కిరణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన కె.విరాహత్ అలీ రాష్ట్ర కార్యదర్శులు వరకల యాదగిరి, కోశాధికారి ఎం.వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.అనిల్ కుమార్, ఎ.రాజేష్, సయ్యద్ గౌస్, మొయినుద్దీన్ లను తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం ఘనంగా సత్కరించింది. సంఘం అధ్యక్షులు అనుమళ్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కె.ఎన్.హరిలు ఇతర సభ్యులతో కలిసి శాలువా, మెమొంటో, పూలమాలలు అందజేసి ఘనం గా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టుల సంఖ్య మీడియాలో వస్తున్న మార్పులతో ప్రాధా న్యత తగ్గిపోతుందని చెప్పారు. జర్నలిస్టుల ప్రధాన అసోసియేషన్లు కాకుండా కుల సంఘాల పేరిట అసోసియేషన్లు ఏర్పడడం ఆందోళన కలిగిస్తుందని తెలిపారు. జర్నలిజానికి గౌరవం రావాలంటే అక్రిడేషన్ అవసరమన్నారు. సుప్రీంకోర్టు ఆర్డర్‌ను అనుసరించి ఇండ్ల స్థలాలను జవహర్ లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ కో-ఆపరేటివ్ ఏం.ఏ. హౌసింగ్ సొసైటీకి ఇచ్చేందుకు సీఎం ఎ.రేవంత్ రెడ్డి సైతం సిద్ధంగా ఉన్నారని, అతి త్వరలో అందజేస్తామని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐజేయూ జాతీయ స్టీరింగ్ కమిటీ సభ్యులు దేవులపల్లి అమర్, వై.నరేందర్ రెడ్డి, హెచ్.యు.జె ప్రధాన కార్యదర్శి శిగా శంకర్ గౌడ్, ప్రముఖ సంఘ సంస్కర్త కన్నాట్ సురేంద్రన్, తెలంగాణ రాష్ట్రం ఫోటో జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, సంయుక్త కార్యదర్శి బి.హెచ్.ఏం.కె.గాంధీ, కార్యవర్గ సభ్యులు నక్క శ్రీనివాస్, ఏం.ఎ.సర్వర్, ఎండి.ఏలీముద్దీన్, పి.హరికృష్ణ, పి.మోహన చారి, నగర గోపాల్, ఎ.మహేష్ కుమార్, ఎస్.శివ కుమార్, నేతలు శ్రీధర్, విజయ్, సుమన్‌రెడ్డి, జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌టిఏ అనేది ఒక చెత్త ఏజేన్సీ

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఎన్‌టిఏ అనేది ఒక చెత్త ఏజేన్సీ అని, దేశ ప్రధాని నరేంద్ర మోడీ తండ్రి స్థాయిలో ఉండి విద్యార్థులను రక్షించాల్సింది పోయి బక్షిస్తున్నారని ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్‌లు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. నీట్ పరీక్ష విధానాన్ని రద్దు చేయాలని మంగళవారం బా గ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అఖిలపక్ష విద్యార్థి సంఘాల నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. నీట్‌ను భేషరతుగా రద్దు చేసి, సుప్రీం కోర్టు ప్రస్తుత న్యాయమూర్తి తో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ.. 4న నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. ఈ సమా వేశంలో బీసీ విద్యార్థి సంఘం కేంద్ర కమిటీ అధ్యక్షు లు తాటికొండ విక్రమ్ గౌడ్, ఆర్థోపెడిక్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ గౌడ్ , బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కుర్మా, వి.జె.ఎస్.అధ్యక్షులు అరుణ్ కుమార్, పీడీఎస్‌యు జనరల్ సెక్రెటరీ ఆజాద్, ఏఐఎస్ఎఫ్ సెక్రటరీ పుట్ట లక్ష్మణ్, గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట నాయక్, బీసీ, ఎస్సీ ,ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్, ఈ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, బీసీ మహిళా సం ఘం రాష్ట్ర అధ్యక్షురాలు మని మంజరి, పానుగంటి విజయ్, బూడిద మల్లి కార్జున్ యాదవ్ తదితరులున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీకి సిద్ధం..

- తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

తెలంగాణ బీసీ ఫెడరేషన్ కులాల సమితి తరపున త్వరలో జరగబోవు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పోటీకి సిద్ధమన్నారు. మంగళవారం హనుమాన్ టెక్డి బీసీ సాధికారత భవన్‌లో గ్రేటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో త్వరలో జరగబోవు గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలు భవిష్యత్ కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు పాల్గొని మాట్లాడుతూ.. రాష్ట్రంలోని తెలంగాణ ఫెడరేషన్ కులాల తరపున హైదరాబాద్ లోని గ్రేటర్ ఎన్నికల్లో పాల్గొని బీసీ ఫెడరేషన్ కులాల సమితి సత్తా చాటాలని వారు పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే స్పందించి స్థానిక రాజకీయ రిజర్వేషన్ కల్పించాలని కోరారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలలో అన్ని నియోజకవర్గాలలో ఫెడరేషన్ కుల సభ్యులు పాల్గొని కులాల ఓట్ల బదిలీని చేపట్టి అన్ని రాజకీయ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఫెడరేషన్ కులాల సమితి రాష్ట్ర అధ్యక్షులు బెల్లపు దుర్గారావు, రాష్ట్ర కోశాధికారి పసుపులేటి కరుణాకర్, రాష్ట్ర కార్యదర్శి చేర్యాల రాకేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు సంఘ వీరప్ప, కోశాధికారి దుర్గ ప్రసాద్ నాయి, మీడియా ఇన్‌చార్జి భాస్కరుడు, శ్రీధర్, కుందేటి రవి నాయకులు తదితరులున్నారు.

8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

8వ పే కమిషన్ వెంటనే ఏర్పాటు చేయాలని మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు అన్నారు. హైదరాబాద్ (నాంపల్లి) జనరల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మాణం చేసిన బ్రాంచ్ కార్యాలయంను జోనల్ ప్రధాన కార్యదర్శి శంకర్ రావు జోనల్ అధ్యక్షులు శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.... రైల్వే హక్కుల కోసం మజ్దూర్ యూనియన్ రాజీలేని పోరాటం చేస్తుంద న్నారు.. 8 వ కమిషన్ వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేసారు. నూతన పెన్షన్ విధానం రద్దు చేయాలనీ డిమాం డ్ చేశారు. రిస్ట్రాక్చరింగ్ కమిటీ త్వరగా పూర్తి చేయాలని రైల్వే ఖాళీలను భర్తీ చేయాలన్నారు. కార్మికులపైన పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు మజ్దూర్ యూనియన్‌లో చేరారు. ఈ కార్యక్ర మంలో మజ్దూర్ యూనియన్ జోనల్ కోశాధికారి సరోజినీ రెడ్డి, అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఉదయ భాస్కర్, భారాటే, శ్రీనివాస్ రెడ్డి, హైదరాబాద్ జనరల్ బ్రాంచ్ కోశాధికారి ఏ శ్రీనివాస్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ రవీందర్,ప్రెసిడెంట్ ఖాజాబాబ, సిసియాస్ ప్రెసిడెంట్ స్వామి, ఎడిఎస్ లు నాగలక్ష్మి చైర్మన్ గోపాల్, సెక్రటరీలు వర ప్రసాద్,ఢిల్లీ రావు, శ్రీనివాస్, సమయ్య వేద ప్రకాష్, రాజేందర్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

4న రవీంద్ర భారతిలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలు



నవతెలంగాణ-ధూల్‌పేట్

సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలను 4నరాష్ట్ర ప్రభుత్వం పక్షాన అధికారికంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం పేర్కొన్నారు.. ఈ మేరకు ముస్లిం జంగ్ పూల్ వంతెన వద్ద ఉన్న తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం భవనంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి వేడుకలపైన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ నాడు పెత్తాందారుల ఆగడాలు సాగనీయకుండా వారి గడీలను ముట్టడించిన సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యేలు బీర్ల ఐలయ్య మాజీ ఎమ్మెల్యేలు అంజయ్య యాదవ్, జైపాల్ యాదవ్, మల్లయ్య యాదవ్, క్యామా మల్లేశం, నోముల భగత్, దూదిమెట్ల బాలరాజ్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ వర్ధంతి వేడుకలు అధికారికంగా నిర్వహించడం కుర్మ జాతికి దక్కిన అరుదైన గౌరవమన్నారు.. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, హాస్టల్ ట్రస్ట్ చైర్మన్ కొలుపుల నరసింహ, జంటనగరాల అధ్యక్షుడు నర్స వినోద్ కుమార్, కొండల రాజు, ఎక్కాల కన్నా, విమల, టీ.అరుణ్ కుమార్, కరాటే శ్రీను, కుమార స్వామి, సదానంద్, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు టీ.బాలమణి, కే.సునీత, ఎం.లక్ష్మి విజయ, ఎం.జగదాంబ, బీ.రాజు, కాలే అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్లకు నష్టం చేకూరిస్తే న్యాయ పోరాటం చేస్తాం



నవతెలంగాణ-ధూల్‌పేట్

మూసీ అభివృద్ధి పేరుతో బడా కంపెనీల ప్రయోజనాలకు సామాన్యుల ఇండ్లను తొలగించే కుట్రల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీపీఐ(ఎం) గోషామహల్ నియోజకవర్గ కన్వీనర్ పి.నాగేశ్వర్ పేర్కొన్నారు. ఎలాంటి సమాచారం లేకుండా గోషామహల్ డివిజన్‌లో జుమ్మెరత్ బజార్ సర్వేకు రావడంతో అధికారులను దేవీ నగర్ బస్తీ వాసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పేద ప్రజలు నివాసం ఉండే ప్రాంతాలను ప్రభుత్వం సర్వే పేరుతో తొలగించడం సరికాదన్నారు. గోషామహల్ డివిజన్‌లో దేవినగర్ బస్తీలో డీప్యూటీ కలెక్టర్ అశోక్ కుమార్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులు సోషియో ఎకనామిక్ సర్వే పేరుతో వచ్చారన్నారు. ఏ ఉద్దేశంతో ఇంటింటికీ సర్వే(మూసీ అభివృద్ధి) చేయదలిచారో వ్రాత పూర్వకంగా తెలియజేయాలన్నారు.

వాగ్వివాదం..

ఏ ఉద్దేశంతో సర్వే చేస్తున్నారో చెప్పాలని బస్తీ కమిటీ నాయకులు కె.రాజు, వీజీ.సాయి, సీపీఎం నాయకులు పి.నాగేశ్వర్‌లు అడిగారు. అధికారులు మొదట వ్రాత పూర్వకంగా ఉన్న కాపీ చూపించకుండా నిరాకరించారు. సర్వే ను రేపటికి వాయిదా వేయాలని, ఈలోపు బస్తీ కమిటీ ప్రజలతో చర్చించి చెపుతామని అధికారులకు చెప్పారు. దీనితో అధికారులు కాస్త వెనుకడుగు వేశారు. ఆవిధంగా రెండు గంటల పాటు సర్వే నిలిపివేశారు. ఆ తర్వాత అధికారులు మూసీ అభివృద్ధి ప్రణాళికలో భాగంగా ఇది ప్రాథమిక సర్వే మాత్రమేనని తెలుపుతూ ఒక సర్క్యులర్ చూపించారు. అది చదివిన తర్వాత బస్తీ నాయకులు సర్వే చేసుకోడానికి అధికారులకు అనుమతించారు. ఈ సందర్భంగా గోషామహల్ డివిజన్ దేవి నగర్‌లో బస్తీ వాసులకు అధికారులకు మధ్య వాగ్వివాదం పెరిగి కొంత ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

'మొహర్రం'కు భద్రత ఏర్పాట్లు కల్పించాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

రాబోయే మొహర్రం సందర్భంగా భద్రత ఏర్పాట్లు కల్పించాలని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి సీనియర్ నాయకులు మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ అన్నారు. అదనపు డీజీపీ సంజయ్ కుమార్ జైన్‌ను బీజేపీ సీనియర్ నేత అల్కా మనోజ్ నవాబ్ షఫత్ అలీ ఖాన్, మహ్మద్ వసీముద్దీన్, అబ్బాస్ రజాఖాన్‌లతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొహర్రం వేడుకల సందర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ర్యాలీ వేడుకలకు నగరంలోని నలు మూలాల నుండి ప్రజలు పాల్గొంటారని తెలిపారు. లా అండ్ ఆర్డర్, షీ టీమ్స్ వంటి భద్రత సౌకర్యాలు కల్పించాలన్నారు.

ఆర్‌సి రెడ్డి ఐఏఎస్ స్టడీసర్కిల్లో ఉచిత గ్రాండ్ టెస్ట్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇప్పటి వరకు సివిల్ సర్వీసెస్, గ్రూప్-1 పరీక్షలు రాసే అభ్యర్థుల కోసం ఉచితంగా గ్రాండ్ టెస్టులను నిర్వహించిన ఆర్‌సి రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్, ఇప్పుడు తెలంగాణా గ్రూప్-2 పరీక్షలు రాసే విద్యార్థుల కోసం ఉచిత గ్రాండ్ టెస్ట్‌ను నిర్వహిస్తోంది. ఆర్‌సి రెడ్డి కుమార్తె, ఆర్‌సి రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సంఘమిత్ర ఈ విషయాన్ని మంగళవారం తెలిపారు. తెలంగాణ గ్రూప్-2 అభ్యర్థులను పరీక్షలకు సన్నద్ధం చేసే దిశగా మొత్తం ఎనిమిది గ్రాండ్ టెస్టులను తమ సంస్థ ఉచితంగా నిర్వహిస్తోందన్నారు. ఇందులో భాగంగా హిమాయత్నగర్, అశోక్ నగర్, దోమలగూడలోని ఆర్‌సి రెడ్డి ఐఏఎస్ స్టడీ సర్కిల్ బ్రాంచ్‌లో మొదటి గ్రాండ్ టెస్టు నిర్వహించడం జరిగిందని తెలియజేశారు. తమ ఇన్స్టిట్యూట్ బ్రాంచ్లతో పాటు ఆన్‌లైన్‌లో టెస్టు రాసిన వేలాది మంది అభ్యర్థులు మంచి ఫలితాలతో విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నామని తెలియజేశారు. ప్రస్తుతం ఆర్‌సి రెడ్డి ఐఏఎస్ స్టడీసర్కిల్లో సివిల్ సర్వీసెస్‌తో పాటు తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ గ్రూప్-1, గ్రూప్-2 కోర్స్ లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతోందని సంఘమిత్ర ప్రకటించారు. కోర్సు వివరాల కోసం 040-23228513, 27612673, 27668513, 9346882593, 9573462587లను సంప్రదించాలని తెలిపారు.

అంబర్‌పేటను విస్మరించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



నవతెలంగాణ-అంబర్‌పేట

రెండోసారి కేంద్రమంత్రిగా బాధ్యతలు చేపట్టిన కిషన్ రెడ్డి అంబర్‌పేటను పట్టించుకోవడం లేదని అంబర్‌పేట సీపీఐ(ఎం) పార్టీ కన్వీనర్ మహేందర్ అన్నారు. మంగళవారం అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన సీపీఐ(ఎం) పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత రెండు రోజుల కింద బీజేపీ కార్యకర్తలు సమావేశంలో కిషన్ రెడ్డి మాట్లాడుతూ అంబర్‌పేటకు నేను ఎంతో రుణపడి ఉన్నానని, అంబర్‌పేట ప్రజల వల్ల గెలుపు దక్కిందని, గొప్ప గొప్ప మాటలు చెప్పడం తప్ప అంబర్‌పేటలో ఉన్న పేద ప్రజల యొక్క సమస్యలపై దృష్టి సాధించలేదని, ఛే నెంబర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఎన్ని సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రజల రాకపోకలకు, దుమ్ము ధూళికి ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఫ్లైఓవర్ కు సంబంధించిన నిధులు వెంటనే కేంద్రం నుండి విడుదల చేయించి వెంటనే ఫ్లైఓవర్ పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.

పీడీఎస్‌యు రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌ను విజయవంతం చేయాలి

- పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఈ నెల 6 ,7న సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జరిగే ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యు) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ విజయవంతం చేయాలని రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యానగర్‌లోని చంద్రపులా రెడ్డి భవన్‌లో రాష్ట్ర కమిటీ రూపొందించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరశురాం హాజరై మాట్లాడుతూ ఈ కౌన్సిల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎండగడుతూ భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నామని తెలిపారు, మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం విద్యాను కాషాయకరణ చేసి మూఢ నమ్మకాలను పెంచి పోషించే నూతన జాతీయ విద్యా విధానంను దేశ వ్యాప్తంగా అమలు చేయాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తూ, మనువాద భావ జాలాన్ని బలవంతంగా విద్యార్థుల మెదళ్లపై రుద్దుతున్నారన్నారు. ఈసభకు ప్రొఫెసర్ హరగోపాల్, పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.గోవర్ధన్, అశోక్ కుమార్, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు, తదితరులు పాల్గొని ప్రసంగిస్తారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రియాజ్, నాగరాజు, శ్యామ్, ఝాన్సి తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఎస్‌సీ కార్యాలయం ముందు ఏబీవీపీ ధర్నా..



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

టీజీపీఎస్‌సీ ముందు మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ మాట్లాడుతూ.. ఖాళీగా ఉన్న 25 వేల పోస్టులతో మెగా డీఎస్‌సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 2 లక్షల ఉద్యోగాలకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని గ్రూప్ 1 ప్రిలిమ్స్‌లో 1:10 అభ్యర్థులను షార్ట్ లిస్ట్ చేయాలన్నారు. యుపీఎస్‌సీ తరహాలో జాబ్ క్యాలెండర్ ను విడుదల చేయాలన్నారు. గ్రూప్- టు, గ్రూప్- త్రీ పోస్టులు పెంచాలన్నారు. టీజీపీఎస్‌సీ కార్యాలయం ముందు దూసుకెళ్లాలని ప్రయత్నించిన నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

ఉర్దూ మీడియం స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలి



నవతెలంగాణ-ధూల్‌పేట్

ఉర్దూ మీడియంహైస్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను ఉర్దూ టీచర్లతోనే భర్తీ చేయాలని ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు షకీల్ అహ్మద్, గులాం దస్తగిర్ అన్నారు. అసోసియేషన్ అధ్యర్యంలో ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్ బేగ్ తో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శషాంకకు మంగళవారం మెమోరాండం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పలు ఉర్దూ హైస్కూళ్లలో ప్రమోషన్‌లో భాగంగా తెలుగు మీడియం టీచర్లకు పోస్టింగ్ కొరకు సీనియారిటీలో పేర్లు పొందుపరిచారన్నారు. వీటిని రద్దు చేసి ఉర్దూ టీచంతోనే భర్తీ చేయాలని కోరారు. ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ముహమ్మద్ రఫీ, షేక్ ఖాలిద్, మహమూద్, తాహెర్‌లు తదితరులు పాల్గొన్నారు.

పెత్తందారులను తక్షణమే అరెస్టు చేయాలి


- సీఐటీయూ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పాలడుగు భాస్కర్



నవతెలంగాణ-ముషీరాబాద్

దళిత మైనర్ బాలుడిని తాళ్లతో కట్టేసి దౌర్జన్యం చేసిన పెత్తందారులను తక్షణమే అరెస్టు చేయాలని నిర్లక్ష్యం వహించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రదాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు.కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ప్రకాశ్ కరత్ అధ్యక్షత వహించారు. 22సంఘాల నాయకులు పాల్గొని తీవ్రంగా ఖండించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాలడుగు భాస్కర్ హాజరై మాట్లాడుతూ..రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కేసారం గ్రామంలో దళిత మైనర్ బాలుడు బేగరి యాదగిరిని తాళ్లతో కట్టేసి కాళ్లతో తన్ని కులం పేరుతో దూషించి దౌర్జన్యం చేసిన ఆ గ్రామ పెత్తాందారుడు విశ్రాంత ఉపాధ్యాయుడు ఆశన్నగారి మధుసూదన్ రెడ్డి అతని భార్య కలమ్మ కుమారుడు జగన్మోహన్ రెడ్డిలను తక్షణమే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన ఈ పదేండ్లలో దళితులపై దౌర్జన్యాలు రెట్టింపు స్థాయిలో పెరిగాయన్నారు. దానిమ్మకాయ దొంగతనం పేరుమీద అగ్రకుల ఆధిపత్య మనువాద భావజాలంతో వ్యవహరించారని తెలిపారు . కులంపేరుతో దూషించిన పెత్తందారులను అరెస్ట్ చేయడంలో పోలీసులు ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారన్నారు. ఈ ఘటనపై జూన్ 22వ 100కు డయల్ చేసిన పోలీసులు స్పందించలేదని తెలిపారు. ఏసీపీ కిషన్, సీఐ కాంతారెడ్డి , ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి లు పెత్తందారుల తరుపున ఉన్నారని విమర్శించారు. చేవెళ్ల నియోజకవర్గం దళిత ఎమ్మెల్యే ఉన్నప్పటికీ ఈ ఘటనపై ఎందుకు స్పందించలేదని విమర్శించారు. యాదగిరి కుటుంబానికి అగ్రకుల పెత్తందారుల నుండి ప్రమాదం ఉందని పోలీసులు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిటి. స్కైలాబ్ బాబు మాట్లాడుతూ ఇటీవల కెవిపిఎస్ రాష్ట్ర జిల్లా బృందం బేగరి యాదగిరి కుటుంబాన్ని పరామర్శించి అన్ని వివరాలను అడిగి తెలుసున్నామని ఏసీపీ, సీఐలతో మాట్లాడిన ఫలితం లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో దాడులు దౌర్జన్యాలు జరుగుతున్నా యని ఈ దాడులను అరికట్టడంలో పోలీసులు చట్టప్రకారం వ్యవహరించాలన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో పంచాయతీరాజ్ డిపార్టుమెంట్ రిటైర్డ్ అధికారి ఈ నర్సింగరావు, దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి శంకర్, మాల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బత్తుల రాంప్రసాద్, మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రెసిడెంట్ మన్నే శ్రీధర్ రావు, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కోట రమేష్, అనెగంటి వెంకటేష్, మాల సంఘాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోపోజు రమేష్, సీనియర్ అంబేద్కర్ వాది గొల్లపల్లి దయానంద్, బేడ బుడగ జంగాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కడమంచి రాంబాబు, కేఏఎన్పిఎస్ నాయకులు మోహనకృష్ణ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక నాయకులు అశోక్ పోశం సామాజిక సంఘాల జేఏసీ నాయకులు కొమ్ము తిరుపతి, కెవిపిఎస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం దశరథ్, బి సుబ్బారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం కృపాసాగర్, ఎన్ బాల పీరు, కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు గంధం మనోహర్, సీనియర్ నాయకులు జి.విజయ్ కుమార్, భీమనపల్లి కనకయ్య, తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ అయిత విజయ్ కుమార్, బాధిత కుటుంబ సభ్యులు బ్యాగరి యాదగిరి , రాములు, ,ప్రేమలత ,అమృత ,చెన్నమ్మ, బుడ్డమ్మ తదితరులు పాల్గొన్నారు.

కోపం ఎంత చేటో...



'**త**న కోపమే తన శత్రువు..' అన్నారు పెద్దలు. ఆవేశానికి పోయి అవకాశాలు కోల్పోతే వచ్చిన ప్రమాదమేం లేదు. కానీ, కోపం కారణంగా ఆరోగ్య నష్టం జరుగుతుందనీ, తీవ్రమైన వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందనీ వైద్యులు హెచ్చరిస్తున్నారు. చిన్న చిన్న విషయాలకు ఆగ్రహోద్రిక్తులు అవుతున్నారంటే మీ ఆరోగ్యాన్ని చేజేతులా పాడుచేసుకుంటున్నారని గమనించాలి. ఇంతకీ చీటికీ మాటికీ వచ్చే కోపం ఎంత చేటు చేస్తుందంటే...

కోపం కారణంగా కడుపులో అల్సర్, గ్యాస్ట్రిక్ సమస్యలు పెరుగుతాయి. కోపంగా ఉన్న సమయంలో మన మెదడులోని రక్తనాళాలు సంకోచిస్తాయి. ఇలాంటి పరిస్థితులలో కోపం ఒక్కొక్కసారి రక్తనాళాలు దెబ్బతినేలా చేస్తుంది. విపరీతమైన కోపం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దాని కారణంగా అనేక ఇన్ఫెక్షన్లు తలెత్తే ప్రమాదముంది.

అధిక కోపం వల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. మితిమీరిన కోపం తెచ్చుకోవడం ఒక్కొక్కసారి ప్రాణాంతకంగా మారుతుంది. కోపం వల్ల తలనొప్పి, అధిక రక్తపోటు, నిద్రలేమి సమస్యలు పెరుగుతాయి. మానసిక ప్రశాంతత దెబ్బతింటుంది.

ఒక్కొక్కసారి విపరీతమైన కోపం వల్ల బ్రెయిన్ స్ట్రోక్, పక్షవాతం వంటి సమస్యల ముప్పు పెరుగుతుంది. చాలా కోపంగా ఉండే వ్యక్తుల్లో కూడా మధుమేహం వచ్చే ప్రమాదం ఎక్కువ. అందుకే కోపాన్ని జయించి తన శాంతమే తకు రక్ష సూత్రాన్ని వంటబట్టించుకోవడం అవసరం.

నా విజయ మంత్రం నా నమ్మకం



డాక్టర్ మరియాజీనా జాన్సన్... విద్యా రంగంలో నిష్ణాతులైన ఓ ఛాంపియన్.. అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసే సంఘ సంస్కర్త... ఉన్నత శిఖరాలను సాధించేలా స్త్రీలను ప్రేరేపించే స్త్రీవాది అయిన ఆమె చెన్నైలోని సత్యబామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ యూనివర్శిటీ ఛాన్సలర్‌గా బాధ్యతలు చూస్తున్నారు. వివిధ రంగాలలో విద్యా కార్యక్రమాలను అందించే భారతదేశంలోని ప్రముఖ విద్యా, పరిశోధనా విశ్వవిద్యాలయాలలో ఇదీ ఒకటి. తన నైపుణ్యంతో దీన్ని మరింత ఎత్తుకు తీసుకువెళుతున్న ఆమెతో సంభాషణ...





? పరిశోధన, అకడమిక్స్‌లో గొప్ప కృషి చేస్తున్న విశ్వవిద్యాలయానికి ఛాన్సలర్‌గా ఎలా ఫీలవుతున్నారు?

35 ఏండ్ల వారసత్వం ఉన్న ఇన్‌స్టిట్యూట్‌కు ఛాన్సలర్‌గా ఉండటం చాలా పెద్ద బాధ్యత. నాకు దక్కిన ఓ మంచి అవకాశం. అలాగే ఓ చాలెంజ్ లాంటిది కూడా. యూనివర్సిటీని విజయాల వైపుకు నడిపించడానికి నా ప్రణాళికలను తరచుగా పునశ్చరణ చేస్తాను. ఈ స్థాయి సంస్థకు నాయకత్వం వహించడం కచ్చితంగా ఓ సవాలే. నా శక్తి మేరకు సంస్థను అభివృద్ధివైపు తీసుకెళుతున్నందుకు సంతోషిస్తున్నాను. సంస్థలోని యువత ప్రతిస్పందనలను చూసి ఆశ్చర్యపోతుంటాను. వారి ప్రశ్నలు సంస్థ అభివృద్ధి గురించి నన్ను పరిశోధించేలా చేస్తాయి. సామాజిక అవసరాల కోసం నైపుణ్యం కలిగిన మానవ వనరులను ఉత్పత్తి చేయడం మా బాధ్యత. కొత్త తరం అంచనాలకు అనుగుణంగా కృషి చేస్తున్నాం. వీటి గురించి నిత్యం చర్చిస్తూనే ఉంటాం. ఏదైనా ఓ ప్రణాళికను రూపొందించేటపుడు అట్టడుగు వర్గాలను, మహిళలను కచ్చితంగా పరిగణనలోకి తీసుకుంటాం. ఇన్నోవేషన్ అనేది విజయానికి మా కొత్త నినాదంగా మారింది. దీనికి అనుగుణంగా గత ఐదేండ్లలో విద్యార్థులు, అధ్యాపక బృందాలను ప్రోత్సహించాం. దీని ఫలితంగా మా విద్యార్థులు ప్లేస్‌మెంట్‌లలో మంచి అవకాశాలు పొందుతున్నారు.

? సంస్థ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు ఏమిటో చెప్తారా?

స్థిరమైన అభివృద్ధికి సంబంధించి ఎల్లప్పుడూ ప్రతిస్పందించడం అనేది సంస్థలో పురోగతికి కేంద్ర బిందువు. ఈక్విటీ, సమానత్వం మా సమ్మిళిత వృద్ధి నమూనా అంశాలు. ఉదాహరణకు ఉన్నత విద్యను పొందలేని నిరుపేద విద్యార్థులకు సంస్థలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలను అభ్యసించే అవకాశం ఇస్తాం. పరిశీలన, ఎంపిక, విద్యాపరమైన పురోగతి ప్రక్రియలో మేము వివిధ సంస్థలతో టైఅప్ అవుతాయి. గ్రామీణ విద్యార్థుల్లో కమ్యూనికేషన్, ఆప్టిట్యూడ్ నైపుణ్యాలను మెరుగుపరచడానికి ప్రత్యేక కోచింగ్ ఏర్పాటు చేస్తాం. క్యాంపస్‌లో పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి కూడా ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం. సామాజిక పరివర్తనల గురించి అప్రమత్తంగా ఉంటాం.

? విశ్వవిద్యాలయం కోసం మీ దీర్ఘకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలు ఏమిటి?

దీని గురించి నేను ఎప్పుడూ ఓ ప్రణాళికను రూపొందించుకుంటాను. దీర్ఘకాల లక్ష్యాలలో సత్యబామను ఎలైట్ శాస్త్రవేత్తలకు ఎంపిక చేసే సంస్థగా చేయడం, భవిష్యత్ తరాలకు ప్రపంచవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన కలల విద్యా గమ్యంగా, పరిశ్రమ భాగస్వాములకు ఉపాధి నైపుణ్యాన్ని మెరుగుపరిచే యూనిట్‌లా దీన్ని తీర్చిదిద్దడం. అంతర్జాతీయ సహకారాల విస్తరణ, విద్యార్థుల మద్దతు వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, అన్ని రంగాలలో ఇంటెన్సివ్ అసోసియేషన్ల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న మా పూర్వ విద్యార్థులను చేరుకోవడం. ఈ ప్రక్రియను మేము ఇప్పటికే ప్రారంభించాం. గణనీయమైన పురోగతి కూడా సాధిస్తున్నాం. స్వల్పకాలిక లక్ష్యాలు దీర్ఘకాలిక లక్ష్యాలను పూర్తి చేస్తాయి. వీటిలో అక్రిడిటేషన్లు, ర్యాంకింగ్, రేటింగ్‌ల పరంగా సాధించిన విజయాన్ని కొనసాగించడం, భవిష్యత్తు కోసం మా విద్యా, పరిశోధన ప్రణాళికలకు మద్దతు ఇవ్వడానికి వ్యక్తుల మేధో సమూహాన్ని సృష్టించడం వంటివి ఉన్నాయి.

? వృత్తిపరమైన ప్రయాణంలో మీరు ఎదుర్కొన్న సవాళ్లు, వాటిని ఎలా ఎదుర్కొన్నారో చెప్తారా?

వృత్తి జీవితంలో నేను ఎదుర్కొన్న అతిపెద్ద సవాళ్లలో మహమ్మారి ఒకటి. సంస్థను సాధారణ స్థితికి తీసుకురావడానికి ఇప్పటికి కృషి చేస్తూనే ఉన్నాను. కోర్సుల డిజిటలైజేషన్‌కు త్వరిత నమూనా మార్పు చేయడం, విద్యార్థులకు అకడమిక్, ఎంప్లాయబిలిటీ మద్దతును కొనసాగించడం ప్రధాన ఆందోళనలలో ఒకటి. అయితే నా బృందం మద్దతు, ఇప్పటికే ఉన్న ఉత్తమ అభ్యాసాలతో నేను ఈ సంక్షోభాన్ని సమర్థవంతంగా నిర్వహించగలిగాను.

? నాయకులుగా ఎదగాలంటే ఎలాంటి లక్షణాలు ఉండాలంటారు?

నాయకత్వం అనేది సహజంగా అభివృద్ధి చెందేది. బాధ్యతల లోతును అర్థం చేసుకోవాలి. వినయం, ధైర్యం, సానుకూలతతో నాయకత్వాన్ని స్వీకరించాలి. కనికరం, ఆత్మవిశ్వాసం, భవిష్యత్తు పట్ల దృక్పథం మనల్ని ఉత్తమ నాయకులుగా చేస్తాయని నేను గట్టిగా నమ్ముతున్నాను. అది ఓ సంస్థ అయినా లేదా దేశమైనా. నా అభిప్రాయంలో వ్యవస్థలో మార్పు తీసుకురావడానికి నాయకత్వం ఓ అద్భుతమైన అవకాశం. వ్యవస్థలు పటిష్టంగా ఉన్నప్పుడు ప్రజలు ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు ఆసక్తి చూపుతారు. నాయకత్వం గురించి నా ఉద్దేశ్యం ఇదే. అలాగే ఎలాంటి పరిస్థితినైనా నిర్వహించడానికి ఓ జట్టును సిద్ధం చేయగలగాలి.

నేటి యువతకు మీరిచ్చే సందేశం ..

ధైర్యం, ఏకాగ్రత అనేది గుణాల సమ్మేళనం. ఇది ఎవరినైనా వారు ఎంచుకున్న రంగంలో అత్యుత్తమంగా మారుస్తుందని నేను నమ్ముతున్నాను. నా విజయ మంత్రం నా నమ్మకం. ఏదైనా నిర్ణయం తీసుకుంటే దాని కోసం కృషి చేస్తాను. ఆలోచనలో ఈ స్పష్టత విజయం సాధించడానికి అవసరం.

? మిమ్మల్ని ప్రేరేపించే అంశాలు?

నేను పరిస్థితుల ద్వారా ప్రేరణ పొందాను. అవి నన్ను స్థిరమైన జీవిత స్థితి నుండి ముందుకు సాగేలా ప్రేరేపిస్తాయి. ప్రతి పరిస్థితి నుండి నేను నాకు అవసరమైన, మెరుగైన మార్పును స్వీకరిస్తాను. ఇది నా అంతరంగాన్ని, నా బాహ్య ప్రకాశాన్ని సాధ్యమైనంత ఉత్తమమైన మార్గాల్లో రూపొందిస్తుంది. కఠినమైన పరిస్థితులు బలమైన వ్యక్తులను తయారు చేస్తాయని నేను నమ్ముతున్నాను.

? వ్యక్తిగత, వృత్తి జీవితాన్ని ఎలా సమతుల్యం చేసుకుంటారు?

సమయం చాలా విలువైనది, దానిని వృధా చేయలేము. తెలివిగా ప్లాన్ చేసుకొని అందుబాటులో ఉన్న 24 గంటలను సద్వినియోగం చేసుకుంటే ఎక్కువ కాలం విజయవంతంగా ఉండగలం. వ్యక్తులు, సమయం విలువను తెలుసుకుంటే ప్రతి వ్యక్తి వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితం సరైన క్రమంలో ఉంటుంది. కాబట్టి మీ జీవితంలో వ్యక్తుల ఉనికిని విలువైనదిగా పరిగణించండి. తదనుగుణంగా చేతిలో ఉన్న పనికి ప్రాధాన్యం ఇవ్వండి.



టీజీఎస్ఆర్టీసీలో 3,035 కొలువులు

(మొదటిపేజీ తరువాయి)

ఇచ్చినట్టు ప్రభుత్వం తెలిపింది. దీనికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్కకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఇప్పటివరకు టీజీఎస్ఆర్టీసీలో ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదనీ, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగాల భర్తీకి కృషి చేస్తున్నదని తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన ఆర్టీసీ బస్సుల్లో రద్దీ పెరిగిందనీ, దానికి అనుగుణంగా సంస్థ కొత్త బస్సులను కొనుగోలు చేస్తున్నదని తెలిపారు. ఈ కొత్త బస్సులకు అనుగుణంగా నియమకాలు చేపడుతున్నామని వివరించారు. సాధ్యమైనంత త్వరగా ఆర్టీసీలోని 3,035 పోస్టులను భర్తీ చేస్తామన్నారు.

సర్కారుకు యాజమాన్యం కృతజ్ఞతలు

ప్రజా రవాణా వ్యవస్థ ప్రాముఖ్యతను గుర్తిస్తూ సంస్థలో 3035 పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్టీసీ యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు మంగళవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ విషయంలో చొరవ తీసుకున్న రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కి ధన్యవాదాలు తెలిపారు. సంస్థలో 2012 నుంచి ఇప్పటివరకు డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జరగలేదనీ, దాదాపు 12 ఏండ్ల తర్వాత నియామక ప్రక్రియ జరుగబోతున్నదని వివరించారు. ఈ పోస్టుల భర్తీతో ఆర్టీసీ మరింత బలోపేతమవుతుందనీ, ప్రజలకు మరింత వేగవంతమైన సేవల్ని అందించగలుగుతామన్నారు. పోస్టుల నియామక ప్రక్రియను త్వరగా చేపడతామని తెలిపారు.

నీట్‌పై లోక్‌సభలో చర్చించాలి

(మొదటిపేజీ తరువాయి)

కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రధాని మోడీకి లేఖ రాశారు. విద్యార్థుల ప్రయోజనాల దృష్ట్యా నీట్ అంశంపై చర్చించాలన్నారు. 24 లక్షల మంది నీట్ అభ్యర్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మకంగా వ్యవహరించడమే తమ లక్ష్యమని లేఖలో పేర్కొన్నారు. ఈ చర్చకు ప్రధాని నాయకత్వం వహించడం సముచితమని తాను నమ్ముతున్నానన్నారు. జూన్ 28న పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ అంశంపై చర్చకు ప్రతిపక్షాలు కోరగా తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై మరోసారి చర్చించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో చర్చిస్తామని లోక్‌సభ స్పీకర్ ప్రతిపక్షాలకు హామీ ఇచ్చారన్నారు. తమ ఏకైక ఆందోళన దేశంలోని సుమారు 24 లక్షల మంది నీట్ అభ్యర్థులు క్షేమమేనని, లక్షల కుటుంబాలు తమ పిల్లల చదువుల కోసం వ్యక్తిగత త్యాగాలు చేశాయని అన్నారు. నీట్ పేపర్ లీక్ అనేది ఎంతో మంది అభ్యర్థుల చిరకాల స్వప్నానికి ద్రోహం చేయడమేనని తెలిపారు. సమస్య పరిష్కారానికి ప్రజాప్రతినిధులు ధైర్యంగా నిర్ణయాత్మకమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి కుటుంబాలు ఆశిస్తున్నాయన్నారు. గత ఏడేండ్లలో 70కుపైగా పేపర్లు లీక్ అయ్యాయని, దీంతో రెండు కోట్ల మంది విద్యార్థులపై ప్రభావం పడిందని లేఖలో పేర్కొన్నారు.

నేడు క్షమాభిక్షపై 231 మంది యావజ్జీవ ఖైదీల విడుదల

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఏర్పాట్లను చేసింది. గవర్నర్ రాధాకృష్ణన్ సూచన మేరకు అందులో అర్హులైన వారికి జైళ్ల శాఖ పెట్రోల్ బంకుల్లో, ప్రయివేటు కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్లపల్లి జైలులో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్ర తెలిపారు. చర్లపల్లి, చంచల్‌గూడ, వరంగల్ కేంద్ర కారాగారాలతో పాటు జిల్లా జైళ్లలో దీర్ఘకాలంగా యావజ్జీవ శిక్షలు అనుభవిస్తున్న 65 ఏండ్లు పైబడిన వారిని, ఆరోగ్యం సరిగా లేనివారిని గుర్తించి నాలుగేండ్ల వరకు రెమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. అలా రాష్ట్రంలోని వివిధ జైళ్లలో ఉన్న 231 మంది ఖైదీలు విడుదలకు అర్హులుగా గుర్తించి జాబితా రూపొందించింది. దాన్ని గవర్నర్ రాధాకృష్ణన్‌కు పంపింది. అన్నీ పరిశీలించిన తర్వాత గవర్నర్ ఆ జాబితాపై ఆమోదముద్ర వేశారు. దీంతో ఆ ఖైదీల విడుదలకు మార్గం సుగమమమైంది. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు ఖైదీల విడుదలకు జైళ్ల శాఖ ఏర్పాట్లు చేసింది. అంతేగాక, గవర్నర్ చేసిన సూచన మేరకు వివిధ వృత్తుల్లో శిక్షణ పొందిన ఖైదీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని చర్లపల్లి జైలులో ఖైదీల జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. ఇష్టమున్నవారిని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామనీ, మిగతా వారిని వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని జైళ్ల శాఖ అధికారులు తెలిపారు.

ఎన్టీఏకి వ్యతిరేకంగా ఐక్యపోరాటం

- నేడు జంతర్ మంతర్ వద్ద ఆందోళన
- రేపు దేశవ్యాప్త బంద్ : విద్యార్థి సంఘాల నేతలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)కి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య పోరాటం చేయనున్నట్టు విద్యార్థి సంఘాలు నేతలు ప్రకటించారు. నేడు (బుధవారం) జంతర్ మంతర్ వద్ద ఆందోళన, రేపు (గురువారం) దేశవ్యాప్తంగా బంద్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం నాడిక్కడ ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా(పీసీఐ)లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ, సీఆర్‌జేడీ, సమాజ్ వాది ఛత్ర సభ నేతలు సంయుక్తంగా మాట్లాడారు. డీఎంకే విద్యార్థి విభాగం, పీఎస్‌యూ, పీఎస్ఎఫ్, ఏఐఎస్‌బీ సంఘాలు కూడా మద్దతు ప్రకటించాయి. ఎస్ఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిస్వాస్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ)కి వ్యతిరేకంగా నిరసన చేపట్టేందుకు ఉమ్మడి వేదిక ఏర్పడిందన్నారు. గడిచిన నెల రోజులుగా నీట్‌కు సంబంధించిన మోసాలు, నెట్‌తోపాటు జాతీయ స్థాయి పరీక్షలను నిర్వహించడంలో యూజీసీ వైఫల్యం, ఎన్టీఏ అసమర్థత బట్టబయలయ్యాయని పేర్కొన్నారు. ఎన్టీఏను రద్దు చేయాలని, విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా విద్యార్థులు నిరసనలు చేస్తున్నారని గుర్తు చేశారు.ఏఐఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు విరాజ్ దేవాంగ్ మాట్లాడుతూ దేశవ్యాప్త ఉమ్మడి ఉద్యమంలో భాగంగా విద్యార్థులంతా భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఎస్ఎఫ్ఐ, ఏఐకెఎస్ఎఫ్, పీఎస్‌యూ, ఏఐఎస్‌బీ సంఘాలు రేపు (గురువారం) దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చాయని తెలిపారు. ఈ బంద్‌కు ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఏ, ప్రగతిశీల విద్యార్థి సంఘాలు మద్దతు ఇచ్చాయని పేర్కొన్నారు. ఎన్ఎస్‌యూఐ జాతీయ అధ్యక్షుడు వరుణ్ చౌదరి మాట్లాడుతూ ఈ అంశాన్ని పార్లమెంట్ లేవనెత్తడానికి ఇండియా బ్లాక్ నేతలకు మెమోరాండం ఇస్తున్నామని అన్నారు. ఎన్టీఏ, ఇతర ఉమ్మడి పరీక్షా విధానాన్ని రద్దు చేయాలని, ఎన్టీఏని నిషేధించాలని డిమాండ్ చేశారు. పారదర్శకత, సమర్థతతో కూడిన పరీక్ష నిర్వహణ ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు.ఏఐఎస్ఏ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రసేన్‌జీత్ మాట్లాడుతూ మళ్లీ నీట్‌ను నిర్వహించాలని, విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, యూనివర్సిటీల్లో ఆందోళన చేపడతామని అన్నారు. సమాజ్‌బాదీ ఛత్ర సభ జాతీయ అధ్యక్షుడు ఇమ్రాన్ మాట్లాడుతూ 2024 బ్యాచ్‌కి మాత్రమే రీ-నీట్ కొనసాగించాలని, నీట్, సీయూఈటీ వంటి జాతీయ ఉమ్మడి పరీక్షలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఆర్‌జేడీ నేత అక్షన్ రంజన్ మాట్లాడుతూ నీట్, నెట్, ఇతర ప్రవేశ, నియామక పరీక్షల్లో అవకతవకలకు సంబంధించి విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, విధాన నిర్ణయదారులతో చర్చలు ప్రారంభించాలని మోడీ సర్కార్‌ను డిమాండ్ చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ సహాయ కార్యదర్శి ఆదర్శ ఎం.సాజి, కేంద్ర కమిటీ సభ్యురాలు ఐషీఘోష్, ఎంఎస్ఎఫ్ నేత అహ్మద్ సాజు తదితరులు పాల్గొన్నారు.

పనితీరు మార్చుకోండి

(మొదటిపేజీ తరువాయి)

ఎంతో మంది సీఎంలతో పని చేసిన అనుభవమున్న అధికారులు ఇప్పటికీ కీలక విభాగాల్లో ఉన్నారనీ, సర్కార్ ఆలోచనా విధానానికనుగుణంగా వారు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని సూచించారు. ప్రతి రోజూ సమయం ప్రకారం సచివాలయంలో అందుబాటులో ఉండాలని కోరారు. కేవలం ఆఫీసులకు పరిమితం కాకుండా తమ విభాగం పనితీరును పర్యవేక్షించేందుకు వారానికోసారి జిల్లాల పర్యటనకు వెళ్లాలని సూచించారు. నెలకోసారి అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో సమావేశం ఏర్పాటు చేసి, సంబంధిత విభాగం చేపట్టిన కార్యక్రమాలు, జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకోవాలని ఈ సందర్భంగా సీఎస్‌ను ఆదేశించారు. ఆస్పత్రులు, అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ప్రభుత్వ సేవలందించే అన్ని విభాగాలను సంబంధిత అధికారులు తరుచూ పర్యటించాలని కోరారు. ప్రజా సమస్యలు తమ దృష్టికి వచ్చిన వెంటనే కింది స్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. తమ పరిధిలోని శాఖలు, విభాగాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు సిబ్బంది పని తీరును మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రక్షాళన చేయాలని సూచించారు. ఐఏఎస్ అధికారులందరూ విధిగా ఒక్కో ఫ్లాగ్ షిప్ ఐడియాను రెండు వారాల్లో ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు.

అధికారులందరూ ఏకతాటిపై పని చేస్తేనే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి వంద రోజుల్లోనే ప్రజలకిచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీలో ఐదు గ్యారంటీలను అమలు చేసిందని సీఎం చెప్పారు. తర్వాత వంద రోజులు ఎన్నికల కోడ్ కారణంగా ప్రభుత్వ కార్యక్రమాలు, పనులు నిలిచిపోయాయనీ, ఇకపై అధికారులు విధిగా పాలనపైనే దష్టి సారించాలని ఆదేశించారు. వ్యక్తుల ఇష్టాయిష్టాలతో తమ ప్రభుత్వానికి సంబంధం లేదని ముఖ్యమంత్రి తేల్చి చెప్పారు. వ్యక్తిగతంగా అధికారులపై రాగద్వేషాలేమీ లేవనీ, వారి పని తీరు ఆధారంగానే తదుపరి ఉన్నతావకాశాలుంటాయని చెప్పారు. బాగా పని చేసే వారికి ప్రోత్సాహకాలుంటాయని సీఎం ఈ సందర్భంగా అధికారులకు భరోసా ఇచ్చారు. లేనిపోని సొంత నిర్ణయాలతో ప్రభుత్వానికి చెడ్డపేరు తేవద్దనీ, సీఎం కార్యాలయం ఇచ్చే సలహాలు సూచనలు పాటించాలని ఆదేశించారు. త్వరలోనే వారానికో జిల్లా పర్యటనకు వెళతానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులతో పాటు క్షేత్ర స్థాయిలో వివిధ కార్యక్రమాల అమలు తీరును స్వయంగా పరిశీలిస్తానని చెప్పారు. స్థానిక ప్రజలను కలుసుకునేలా తన పర్యటన ఉంటుందని ఐఏఎస్ అధికారులను అప్రమత్తం చేశారు. జిల్లా పర్యటనల షెడ్యూలు త్వరలోనే విడుదల చేస్తామని వారికి చెప్పారు. ఈ సమావేశంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ ప్రసంగ వ్యాఖ్యలు రికార్డుల్లో నుంచి తొలగింపు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

బీజేపీని విమర్శిస్తూ లోక్‌సభలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను రికార్డుల్లోంచి తొలగించారు. ప్రతిపక్ష నేత హోదాలో లోక్‌సభలో ఆయన చేసిన ప్రసంగంపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ సందర్భంగా మాట్లాడిన ఆయన కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అగ్నివీర్, మైనార్టీ, నీట్ పరీక్షల్లో అక్రమాలు సహా ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్, హిందువులు తదితర అంశాలపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. రాహుల్ వ్యాఖ్యలకు ప్రధాని మోడీ, అమిత్ షా సహా బీజేపీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాహుల్‌పై చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఓం బిర్లాకు బీజేపీ ఫిర్యాదు చేసింది.

ఈ క్రమంలో స్పీకర్ ఓం బిర్లా రాహుల్‌పై చర్యలు చేపట్టారు. ఆయన ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను పార్లమెంట్ రికార్డుల్లో నుంచి తొలగించినట్టు లోక్‌సభ సెక్రటేరియట్ తాజాగా వెల్లడించింది. స్పీకర్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది.

వ్యాఖ్యల తొలగింపుపై స్పీకర్‌కు రాహుల్ లేఖ

తన ప్రసంగంలోని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించడంపై రాహుల్ గాంధీ విస్మయం వ్యక్తం చేశారు. ఈ విషయంపై స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాశారు. లోక్‌సభలో తన ప్రసంగంలో తొలగించిన వ్యాఖ్యలను పునరుద్ధరించాలని స్పీకర్‌ను కోరారు. తన ప్రసంగంలోని కొన్ని వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించిన తీరు తనకు దిగ్భ్రాంతి కలిగించిందని, ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి విరుద్ధమని రాహుల్ లేఖలో పేర్కొన్నారు.

ప్రతిపక్షాలే టార్గెట్‌గా...

(మొదటిపేజీ తరువాయి)

విమర్శించారు. ప్రతిపక్షాల మాటలు హిందువుల మనోభావాలను కించపరిచాయని అన్నారు.

ప్రధాని ప్రసంగాన్ని అడ్డుకున్న ప్రతిపక్షాలు

ప్రధాని నరేంద్ర మోడీ తన ప్రసంగాన్ని విపక్షాల నిరసనల మధ్యే కొనసాగించారు. మణిపూర్, నీట్ అంశాలపై మాట్లాడాలని ప్రతిపక్ష సభ్యులు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. మోడీ ప్రసంగానికి ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డు తగిలారు. వారిని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వారించారు. సభ్యులను వెల్‌లోకి పంపేలా ప్రతిపక్ష నేతలు వ్యవహరించడం సరైంది కాదని హితవు పలికారు. ప్రతిపక్షాలే లక్ష్యంగా ప్రధాని మోడీ మాట్లాడటంతో ఆయన మాట్లాడినంత సేపు మణిపూర్ మణిపూర్ అంటూ వారు నినాదాలు హోరెత్తించారు.

ఏపీ ప్రస్తావన

ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ గురించి ప్రస్తావించారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో తమ కూటమి క్లీన్ స్వీప్ చేసిందని పేర్కొన్నారు.

నిరవధిక వాయిదా

(మొదటిపేజీ తరువాయి)

పట్టుబట్టాయి. మోడీ సర్కార్ లక్ష్యంగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలతో విరుచుకుపడ్డారు. రాహుల్ వివాదాస్పద వ్యాఖ్యలను స్పీకర్ ఆదేశాలతో రికార్డుల నుంచి తొలగించినట్లు లోక్‌సభ సెక్రటేరియట్ ప్రకటించడం పెను దుమారం రేపింది. తన వ్యాఖ్యలను పునరుద్ధరించాలని రాహుల్ గాంధీ లోక్‌సభ స్పీకర్‌కు లేఖ రాశారు. మరోవైపు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై బీజేపీ ఎంపీ అనురాగ్ ఠాకూర్ చర్చను ప్రారంభించగా, ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ తొలి సమాధానం ఇచ్చారు.

వివిధ పార్టీలకు చెందిన 68 మంది సభ్యులు మాట్లాడారు. 18 గంటల పాటు తీర్మానంపై చర్చ జరిగింది. మొత్తం సభ ఏడు రోజుల పాటు జరగగా, 34 గంటల పాటు జరిగింది. 103 శాతం ఉత్పదకత నమోదు అయినట్టు స్పీకర్ ఓం బిర్లా తెలిపారు.

నూతన సభ్యుల ప్రమాణం

ఈ సెషన్‌లో తొలుత ప్రొటెం స్పీకర్‌గా నియమితులైన సీనియర్ ఎంపీ భర్తృహరి మహతాబ్ కొత్తగా ఎన్నికైన లోక్‌సభ సభ్యులతో ప్రమాణం చేయించారు. జూన్ 24న లోక్‌సభ ప్రారంభం కాగా 24, 25 తేదీల్లో నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు. రెండు రోజుల్లో 539 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. జూన్ 26న లోక్‌సభ స్పీకర్‌గా ఓం బిర్లా రెండో సారి ఎన్నికయ్యారు. అనంతరం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన మంత్రి వర్గ సభ్యులను సభకు పరిచయం చేశారు. జూన్ 27న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పార్లమెంటు ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. అదే రోజు రాహుల్ గాంధీ లోక్‌సభ ప్రతిపక్షనేతగా నియమితులైనట్లు సభలో ప్రకటించారు.

80 సీట్లు గెలిచినా.. ఈవీఎంలను నమ్మను: అఖిలేశ్ యాదవ్

ఈవీఎంలను తమ పార్టీ నమ్మదని, ఒకవేళ ఉత్తరప్రదేశ్‌లో ఉన్న 80 స్థానాలను తమ పార్టీ గెలిచినా నమ్మదని సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ అన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై లోక్‌సభలో మంగళవారం ఆయన మాట్లాడారు. ఆ ఈవీఎంలను తొలగించే వరకూ తమ పోరాటం ఆగదని అన్నారు.

ఎన్నికల వల్ల వర్గ రాజకీయాలకు తెరపడిందని తెలిపారు. తాజా ఫలితాలు ఇండియా కూటమికి బాధ్యతను అప్పగించాయన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించడం.. ఇండియా కూటమికి నైతిక విజయాన్ని అందించిందన్నారు. ఉద్యోగాలు ఇవ్వాలని మోడీ సర్కారుకు లేదని, అందుకే పేపర్ లీకేజీలు అవుతున్నట్లు ఆయన ఆరోపించారు. కుల గణన చేపట్టకుండా న్యాయం అందించలేమన్నారు.

ఎన్నికల వేళ కొందరి పట్ల ప్రవర్తనా నియమావళి విషయంలో ఎన్నికల సంఘం ఉదాసీనంగా ఉన్నట్లు తెలిపారు.

నువ్వెంతంటే.. నువ్వెంత..

కరీంనగర్ జెడ్పీ మీటింగ్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, జడ్పీటీసీల వాగ్వాదం

- ఓ దశలో తిట్ల దండకమూ..
- డీఈఓను సస్పెండ్ చేయాలని కౌశిక్‌రెడ్డి డిమాండ్
- పాఠశాల అభివృద్ధిపై సమావేశమైన ఎంఈఓలకు నోటీసులిస్తారా!
- ఎమ్మెల్యేగా అధికారులతో సమావేశమయ్యే అధికారం లేదా? అంటూ కలెక్టర్‌ను నిలదీత
- దళితబంధు నిధులపై ప్రశ్నించే జెడ్పీటీసీని సమావేశానికి రానివ్వరా?
- గొడవలు, నిరసనలతో ముగిసిన చివరి జెడ్పీ సర్వసభ్య సమావేశం
- సాయంత్రం వీడ్కోలు సమావేశానికి మంత్రి పొన్నం
- పార్టీలకతీతంగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ



నవతెలంగాణ - కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్ జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం మంగళవారం రసాభాసగా ముగిసింది. ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, చిగురుమామిడి జెడ్పీటీసీ గీకురు రవీందర్, మరో ఇద్దరు కాంగ్రెస్ సభ్యుల మధ్య పెద్దవార్ చోటుచేసుకుంది. తనతో సమావేశమైన ఎంఈఓలకు నోటీసులిచ్చిన డీఈఓను సస్పెండ్ చేయాలని, దళితబంధు రెండో ఫేస్ నిధుల విషయమై కలెక్టర్‌ను నిలదీసిన కౌశిక్‌రెడ్డి పోడియం వద్ద బైటాయించారు. కాంగ్రెస్ నియంతపాలన ఆర్నెళ్లలో తేలిపోయిందంటూ ఎమ్మెల్యే మాట్లాడుతుండగా..అధికారపార్టీలో చేరిన జెడ్పీటీసీలు అడ్డుకోవడంతో వివాదం మొదలై మధ్యాహ్న భోజన విరామం వరకూ ఇరువురి మధ్య తిట్లదండకం సాగింది. అప్పటివరకూ ఘర్షణ వాతావరణంతో సాగిన సమావేశం కాస్త సాయంత్రానికి చల్లబడి మంత్రి పొన్నం సమక్షంలో పాలవకర్గానికి వీడ్కోలు పలికారు.

కరీంనగర్ జిల్లా పరిషత్ చివరి సర్వసభ్య సమావేశం, పాలకవర్గం వీడ్కోలు కార్యక్రమాన్ని మంగళవారం జెడ్పీ హాల్‌లో నిర్వహించారు. ఉదయం 11.30గంటలకు జెడ్పీ చైర్‌పర్సన్ కనుమళ్ల విజయ అధ్యక్షతన సమావేశం ప్రారంభం కాగా.. పలువురు అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు ప్రవేశపెట్టారు. ఈ ఐదేండ్ల కాలంలో జరిగిన ప్రతి సమావేశంలోనూ లేవనెత్తిన ఏ ఒక్క సమస్య కూడా పరిష్కారానికి నోచుకోలేదని, తమ గౌరవ మర్యాదలకూ అవమానమే ఎదురైందని చైర్‌పర్సన్ సహా జెడ్పీటీసీలందరూ పెదవి విరిచారు. వానాకాలం సీజన్‌లో ఎప్పటిలాగే విషజ్వరాలు ప్రారంభమయ్యాయని, దీనిపై ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో సదరు శాఖ విఫలమవుతూ వస్తోందని విమర్శించారు. సరిగ్గా 12.15గంటలకు సమావేశానికి హాజరైన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తమ నియోజకవర్గంలోని హుజూరాబాద్, జమ్మికుంట ఆస్పత్రుల్లో గత ప్రభుత్వ హయాంలో అత్యధిక ప్రసవాలు జరిగాయని, ప్రస్తుతం ప్రభుత్వం అక్కడి వైద్యులను బదిలీ చేయడం, కేసీఆర్ కిట్లు, న్యూట్రిషన్ కిట్లు ఆపేయడంతో గర్భిణులు ఆస్పత్రికి రావడమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హుజూరాబాద్ ఆస్పత్రిలో అన్ని వసతులతో ఐసీయూని ఏర్పాటు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం దాన్ని ప్రారంభించకపోగా మూలన పడేసిందని చెప్పుకొచ్చారు. అనంతరం విద్యాశాఖ నుంచి డీఈఓ మాట్లాడేందుకు రాగానే కౌశిక్‌రెడ్డి ఒక్కసారిగా కోపొద్రిక్తులయ్యారు. నియోజకవర్గ స్థాయిలో పాఠశాలలు, సమస్యలపై ఎంఈఓలు, హెచ్ఎమ్‌లతో తాను సమావేశమైతే.. డీఈఓ వారికి ఎలా నోటీలిస్తారు? ఎమ్మెల్యేగా తనకు కనీసం అధికారులతో సమావేశమయ్యే అధికారం లేదా? అంటూ కలెక్టర్ పమేలా సత్పతిని ప్రశ్నించారు. 'నీ సంగతి చూస్తా బిడ్డా. ఎమ్మెల్యే హోదానూ అవమానించిన నిన్ను వదలా? అసెంబ్లీలో మాట్లాడి కోర్టు ద్వారా నీ సంగతి తేల్చుతా?' అంటూ డీఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీఈఓను వెంటనే సస్పెండ్ చేయాలని ప్లకార్డులతో బీఆర్ఎస్ సభ్యులతో కలిసి నిరసన తెలిపారు. పోడియం వద్ద బైటాయించారు. మళ్లీ తన స్థానంలోకి వచ్చిన ఎమ్మెల్యే ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. దళితబంధు రెండో విడత నిధులు ఎందుకు ఆపేశారు?.. ఇదివరకే నిధులు లబ్దిదారుల ఖాతాలో జమ అయినా.. ప్రభుత్వం ఎందుకు నిలిపివేసిందని కలెక్టర్‌ను ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రాలేదని కలెక్టర్ సమాధానం చెబుతుండగానే.. ప్రభుత్వం ఈ పథకాన్ని ఆపేయాలని చెప్పిందా? అంటూ నిలదీశారు. కనీసం లబ్దిదారుల ఖాతాలో పడిన నిధులైనా విత్‌డ్రాకు అవకాశం ఇవ్వాలని కోరారు. ఇదే విషయమై 'దళితబంధు' లోగో టీషర్ట్‌తో వచ్చిన జమ్మికుంట జెడ్పీటీసీ శ్రీరాంవిష్ణును సమావేశానికి రాకుండా పోలీసులు ఎలా అడ్డుకుంటారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ చివరి సమావేశానికి కూడా సభ్యుల్ని రానివ్వరా?, కనీసం ఆయన గోడు వినలేరా? అంటూ కలెక్టర్ సహా జడ్పీ సీఈఓను నిలదీశారు. ఎమ్మెల్యే మాట్లాడుతుండగానే.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన గీకురు రవీందర్‌రెడ్డి ఎమ్మెల్యేను అడ్డుకోవడంతో ఘర్షణకు దారి తీసింది.

తిట్ల పురాణం..

'హుజూరాబాద్‌లో నీ వేషాలు తెలియనివి కావు. నువ్వేమన్నా నిజాయితీగా ఉన్నావా?' అంటూ చిగురుమామిడి సభ్యులు గీకురు రవీందర్‌రెడ్డి ప్రశ్నించడంతో కౌశిక్‌రెడ్డి ఒక్కసారిగా కోపంతో ఊగిపోయారు. మొన్నటివరకూ బీఆర్ఎస్‌లో ఉండి దొంగలా కాంగ్రెస్‌లో చేరిన నువ్వు నన్ను ప్రశ్నిస్తున్నావా? జనం సమస్యలన్నీ గాలికొదిలేసి నియంతపాలన సాగిస్తున్న కాంగ్రెస్ వ్యవహారం కనిపిస్తలేదా? అంటూ నిలదీశారు. ఇరువురు పరస్పరం మాటలు సంధించుకుంటూ తిట్ల దండకం వరకూ వెళ్లారు. ఎమ్మెల్యేకు సపోర్ట్‌గా బీఆర్ఎస్ సభ్యులు ఓవైపు, కాంగ్రెస్‌లో చేరిన సభ్యులు మరోవైపు దూషణలు మొదలుపెట్టారు. 'ఒరేయ్.. అరేయ్' అంటూ ఎమ్మెల్యే ఓ వైపు.. 'అసలు నువ్వెంత.. నీ బతుకెంత' అంటూ కాంగ్రెస్ సభ్యులు తిట్లపురాణం అందుకున్నారు.

ఘర్షణ ముగిసి ప్రశాంత వాతావరణంలో పాలకవర్గానికి వీడ్కోలు



సర్వసభ్య సమావేశానికి ఉదయమే రావాల్సిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ భోజన విరామం తరువాత వచ్చారు. అప్పటికే రసాభాసగా సాగిన సమావేశం వివరాలను సభ్యులను అడిగి తెలుసుకున్నారు. సాయంత్రం నిర్వహించిన పాలకవర్గం వీడ్కోలును సన్మానాలు, సత్కారాలతో ముగించారు. ఈ సందర్భంగా పదవీకాలం ముగిసినా సభ్యులంతా ప్రజలతో కలిసే ఉంటారని, వారి పరిధిలోని ప్రజల సమస్యలను పార్టీలకతీతంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



జకోవిచ్ అలవోకగా..

- జ్వెరెవ్, రిబకినా శుభారంభం
- వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ 2024

తొలి రౌండ్లో మెరుపు విజయం

లండన్‌(ఇంగ్లాండ్):టెన్నిస్‌ఓపెన్ చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు గ్రాండ్‌స్లామ్ వేటలో సెర్బియా యోధుడు, రెండో సీడ్ నొవాక్ జకోవిచ్ తొలి అడుగు అలవోకగా వేశాడు. ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో నొవాక్ జకోవిచ్ మెరుపు విజయం సాధించాడు. చెక్ రిపబ్లిక్ ఆటగాడు విట్ కొప్రివపై వరుస సెట్లలో విజయం సాధించాడు. 6-1, 6-2, 6-2తో జకోవిచ్ చెమట పట్టకుండా రెండో రౌండ్‌కు చేరుకున్నాడు. నాల్గో సీడ్, జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్ 6-2, 6-4, 6-2తో స్పెయిన్ ఆటగాడు రాబర్టోపై వరుస సెట్లలో విజయం సాధించాడు. 16 ఏస్‌లు కొట్టిన అలెగ్జాండర్ జ్వెరెవ్.. ఐదు బ్రేక్ పాయింట్లతో మెరిశాడు. పాయింట్ల పరంగా 98-66తో ఆధిపత్యం చెలాయించాడు. జపాన్ ఆటగాడు నిషియోక 6-2, 7-6(8-6), 2-6, 6-3తో నూనో (పోర్చుగల్)పై గెలుపొందగా..తొమ్మిదో సీడ్ అలెక్స్ 7-6(7-1), 7-6(7-3), 7-6(7-4)తో సహచర ఆసీస్ ఆటగాడు జేమ్స్‌పై మూడు సెట్ల ఉత్కంఠ మ్యాచ్‌లో పైచేయి సాధించాడు. మూడు సెట్లు టైబ్రేకర్‌కు దారితీయగా.. అలెక్స్ ఒత్తిడిలో విలువైన పాయింట్లు సాధించాడు.

మహిళల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్, ఆరో సీడ్ మార్కెటా వంద్రుసోవ (చెక్ రిపబ్లిక్)కు అనూహ్య భంగపాటు ఎదురైంది. స్పెయిన్ అమ్మాయి జెస్సికా 6-4, 6-2తో వరుస సెట్లలో మార్కెటను ఇంటిబాట పట్టించింది. వంద్రుసోవ నాలుగు ఏస్‌లు, రెండు బ్రేక్ పాయింట్ల తో మెరిసినా.. జెస్సికా రెండు ఏస్‌లు, ఐదు బ్రేక్ పాయింట్లతో చెలరేగింది. నాల్గో సీడ్ ఎలెనారిబకినా తొలి రౌండ్లో శుభారంభం చేసింది. 6-3, 6-1తో ఎలెనా రూస్‌పై సులువుగాగెలుపొందింది. అమెరికా క్రీడాకారిణి జెస్సికా పెగులా 6-2, 6-0 తో వరుస సెట్లలో ఏకపక్ష విజయం నమోదు చేసింది.

ఇదిలా ఉండగా, భారత ఆటగాడు సుమిత్ నగాల్‌కు వింబుల్డన్‌లో నిరాశే ఎదురైంది. ఇటీవల వరుస టోర్నీల్లో సత్తా చాటిన సుమిత్ నగాల్ తొలిసారి వింబుల్డన్ ప్రధాన టోర్నీకి అర్హత సాధించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో మియోమిర్ చేతిలో 2-6, 6-3, 3-6, 4-6తో నాలుగు సెట్ల మ్యాచ్‌లో పోరాడి ఓడాడు. మూడు ఏస్‌లు కొట్టిన నగాల్.. నాలుగు బ్రేక్ పాయింట్లతో మెప్పించాడు. పాయింట్ల పరంగా 104-122తో గట్టి పోటీ ఇచ్చాడు.

అందుకే కొనసాగాను!

- కెప్టెన్ రోహిత్ శర్మకు కృతజ్ఞతలు
- చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ భావోద్వేగం



నవతెలంగాణ-బ్రిడ్జ్‌టౌన్

2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ఫైనల్. అజేయ రికార్డుతో టైటిల్ పోరుకు చేరుకున్న టీమ్ ఇండియా ఆఖరు అడుగులో తడబడింది. ఆతిథ్య భారత్ రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది. భారత జట్టు చీఫ్ కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ రెండేండ్ల పదవీ కాలం సైతం అక్కడితో ముగిసింది. 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్ ఫైనల్లోనూ ఆస్ట్రేలియా చేతిలోనే ఓడిన టీమ్ ఇండియా... టైటిల్ నిరీక్షణకు తెరదించలేదు. చీఫ్ కోచ్‌గా రెండు టైటిళ్ల ముంగిట నిరాశ చెందిన రాహుల్ ద్రవిడ్.. టీమ్ ఇండియా కోచింగ్ బాధ్యతల నుంచి వైదొలిగేందుకు నిర్ణయం తీసుకున్నాడు. కానీ కెప్టెన్ రోహిత్ శర్మ చేసిన ఓ ఫోన్ కాల్‌తో ద్రవిడ్ మనసు మార్చుకున్నాడు. 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్ చారిత్రక విజయంతో భాగమయ్యాడు. ఈ విషయాన్ని రాహుల్ ద్రవిడ్ బీసీసీఐ విడుదల చేసిన ఓ వీడియోలో వెల్లడించాడు.

' రోహిత్ శర్మ.. థ్యాంక్యూ వెరీ మచ్. నవంబర్‌లో నీవు చేసిన ఒక్క ఫోన్ కాల్‌తో చీఫ్ కోచ్‌గా కొనసాగాను. భారత జట్టు చీఫ్ కోచ్‌గా పని చేయటం ఎంతో గర్వకారణం. జట్టులోని ప్రతి ఒక్కరితో కలిసి పని చేయడాన్ని ఆస్వాదించాను. రోహిత్ శర్మకు బిగ్ థ్యాంక్స్. సాధారణంగా మాట్లాడేందుకు నాకు ఎప్పుడూ పదాల కొరత ఉండదు. కానీ తొలిసారి ఆ పరిస్థితి ఎదుర్కొన్నాను. ఈ విజయంలో భాగమైనందుకు ఎంతగానో గర్వపడుతున్నాను. క్రికెటర్లు నా పట్ల, సహాయక సిబ్బంది పట్ల చూపి గౌరవం ఎప్పటికి మరువలేను. మనం అందరం ఈ క్షణాలు గుర్తించుకుంటాం. చేసిన పరుగులు, తీసిన వికెట్లు.. మైలురాళ్లు ఇవేవీ మన కెరీర్‌లో గుర్తుండవు. ఇటువంటి చారిత్రక విజయ సన్నివేశాలను ఎప్పటికి మరువలేం' అని ద్రవిడ్ అన్నాడు. ఇదిలా ఉండగా, టీ20 ప్రపంచకప్ విజయం అనంతరం టీమ్ ఇండియా డ్రెస్సింగ్‌రూమ్‌లో విరాట్ కోహ్లిని ఉద్దేశించి రాహుల్ ద్రవిడ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ' వైట్‌బాల్‌లో మూడు సాధించావు. ఇక ఒక్క రెడ్ మాత్రమే మిగిలింది. అది కూడా అందుకో..' అంటూ కోహ్లితో అన్నాడు. 2011 వన్డే వరల్డ్‌కప్, 2013 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ, 2024 టీ20 ప్రపంచకప్‌తో వైట్‌బాల్ ఫార్మాట్‌లో ఐసీసీ టైటిళ్లను అన్నింటికి విరాట్ కోహ్లి సాధించాడు. ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్‌లో రెండు సార్లు ఫైనల్లో పోటీపడినా.. నిరాశే ఎదురైంది. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్స్ టైటిల్‌ను సైతం సాధించాలని కోహ్లికి ద్రవిడ్ సూచించాడు.

వైలెంట్ క్లైమాక్స్‌తో తిరగబడరా సామి



మాల్వి మల్హోత్రా, రాజ్ తరుణ్

రాజ్ తరుణ్ హీరోగా, ఎ ఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'తిరగబడరసామీ'. మాల్వి మల్హోత్రా కథానాయికగా నటిస్తోంది. సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్ మీడియా బ్యానర్ పై మల్కాపురం శివకుమార్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం మేకర్స్ ట్రైలర్‌ని గ్రాండ్‌గా లాంచ్ చేశారు.
హీరో రాజ్ తరుణ్ మాట్లాడుతూ,'ఈ సినిమాకి అందరం ప్రాణం పెట్టి చేశాం. మా అందరికి కంటే ఎక్కువ కష్టపడింది డీవోపీ జవహర్ రెడ్డి. ఆయన లేకపోతే సినిమా ఇంత అద్భుతంగా వచ్చేది కాదు. ఈ సినిమాలో నన్ను పార్ట్ చేసిన నిర్మాత శివకి కృతజ్ఞతలు. జేబి గ్రేట్ మ్యూజిక్ ఇచ్చారు. మాల్వి వన్ అఫ్ ది బెస్ట్ యాక్టర్. డైరెక్టర్ రవికుమార్ చౌదరితో వర్క్ చేయడం గ్రేట్ ఎక్స్‌పీరియన్స్. ఇంత యాక్షన్ పార్ట్ చేయడం నాకు కొత్త. డైరెక్టర్ ప్రోత్సాహంతో ఈజీగా చేశాను. ఇందులో ఎమోషన్, ఎంటర్‌టైన్మెంట్ అద్భుతంగా ఉంటుంది. ఆడియన్స్‌కి ఖచ్చితంగా నచ్చుతుంది' అని తెలిపారు.
'ఈ రోజు చాలా ఎమోషనల్‌గా ఉంది. 2004 ఇదే రోజున 'యజ్ఞం' విడుదలై నా జీవితాన్ని మలుపు తిప్పింది. అదే రోజున ఈ ట్రైలర్ రిలీజ్ కావడం చాలా ఆనందంగా ఉంది. రాజ్ తరుణ్ కాబోయే మాస్ హీరో. ఈ సినిమా తర్వాత తను మాస్ హీరోగా నిలబడతాడు. డీవోపీ జోహార్ రెడ్డి అద్భుతమైన విజువల్స్ ఇచ్చారు, జేబీ అద్భుతమైన మ్యూజిక్ చేశారు. శివకుమార్ సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారు. ఈ సినిమా అందరినీ ఎంటర్‌టైన్‌చేస్తుంది' అని డైరెక్టర్ ఎ ఎస్ రవికుమార్ చౌదరి అన్నారు. నాయిక మాల్వి మల్హోత్రా మాట్లాడుతూ, 'ఈ సినిమాలో అవకాశం ఇచ్చిన దర్శక నిర్మాతలకు ధన్యవాదాలు. ఇది చాలా బ్యూటీఫుల్ కథ. ఇందులో చాలా మంచి పాత్ర చేశాను. ఇందులో బాలకృష్ణ ఫ్యాన్‌గా కనిపిస్తా. నాకు యాక్షన్ సీన్ కూడా ఉంది. ఈ సినిమాతో తెలుగులో పరిచయం కావడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. 'నేను ప్రతి సినిమాలో కొత్తవారిని పరిచయం చేస్తుంటాను. మాల్వి ఈ సినిమాతో తెలుగు తెరకి పరిచయం అవుతున్నారు. ఈ పాత్రని చాలా చక్కగా చేశారు. మంచి సినిమాని ప్రేక్షకులకు అందివ్వాలని టీమ్ అంతా సమిష్టి కృషితో పని చేశాం. రాజ్ తరుణ్ యాక్షన్ పాత్రలో చాలా కొత్తగా కనిపిస్తారు. సైలెంట్‌గా మొదలై వైలెంట్ ముగింపు ఉంటుంది. ఈ నెలలోనే సినిమాని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం' అని నిర్మాత మల్కాపురం శివకుమార్ చెప్పారు.

కుబేరలో సర్‌ప్రైజ్ చేస్తా..



రష్మిక మందన్న

శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న హైలీ యాంటిసిపేటెడ్ సోషల్ డ్రామా 'కుబేర'. మోస్ట్ ఎవెయిటింగ్ పాన్-ఇండియన్ చిత్రాలలో ఇదొకటి. ఈ చిత్రం నుంచి రష్మిక మందన్న అఫీషియల్ ఫస్ట్‌లుక్ గ్లింప్స్ ఇంటర్నెట్‌లో సంచలనం క్రియేట్ చేస్తూ మాగ్నం ఓపస్ కోసం ఎగ్జైట్‌మెంట్‌ని మరింతగా పెంచింది. అఫీషియల్ లుక్‌ని ఈనెల 5న లాంచ్ చేస్తుండగా, మేకర్స్ విడుదల చేసిన పోస్టర్‌లో రష్మిక క్యారెక్టర్ పింక్ కలర్ సూట్ ధరించి, ఆమె వెనుక సూట్‌కేస్‌ని లాగుతున్నట్లు ప్రెజెంట్ చేసింది. కొత్త పోస్టర్‌ని విడుదల చేయడంతో పూర్తి లుక్‌ని చూడాలనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది.
ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదలైన ధనుష్, నాగార్జున అక్కినేని ఫస్ట్ లుక్‌లు దేశవ్యాప్తంగా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందనలు అందుకున్నాయి.
ధనుష్, నాగార్జున అక్కినేని, రష్మిక మందన్న, జిమ్ సర్భ్ వంటి ప్రముఖ తారాగణం నటిస్తున్న ఈచిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి, అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్ మోహన్ రావు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ పాన్-ఇండియా ఫిల్మ్‌ని తమిళం, తెలుగులో ఏకకాలంలో చిత్రీకరణ చేస్తున్నారు.

నవచిత్రం

ది ఇండియా హౌస్ షూటింగ్ షురూ..




థియేటర్లలో నేచురల్ హైస్ ఇచ్చే పాత్ బ్రేకింగ్ చిత్రాలను నిర్మించడానికి కథానాయకుడు రామ్ చరణ్ ఫిల్మ్ ప్రొడక్షన్‌లోకి అడుగుపెడుతున్నారు. 'వి మెగా పిక్చర్స్' బ్యానర్ పై రూపొందనున్న ఈ సినిమాలకు యూవీ క్రియేషన్స్ విక్రమ్ రెడ్డి ప్రొడక్షన్ పార్ట్‌నర్. అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్ సంస్థ మరో నిర్మాణ భాగస్వామిగా ఉంది. ఈ మూడు సంస్థల భాగస్వామ్యంలో రాబోతున్న తొలి సినిమా 'ది ఇండియా హౌస్'.
నిఖిల్ సిద్ధార్థ్, సాయి మంజ్రేకర్ నాయకనాయికలుగా, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి రామ్ వంశీకృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు.
1905 బ్యాక్ డ్రాప్‌లో లవ్, రెవల్యూషన్ థీంని ఎక్స్‌ప్లోర్ చేసే ఈ పీరియడ్ డ్రామా చిత్రానికి సంబంధించి కోర్ టీమ్ సమక్షంలో హంపి (కిష్కింద)లోని విరూపాక్ష దేవాలయంలో గ్రాండ్‌గా పూజా కార్యక్రమం జరిగింది. ఈ క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ నేటి నుండి ప్రారంభమవుతుంది. ఈ చిత్రానికి ప్రెజెంటర్: రామ్ చరణ్, నిర్మాతలు: అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, వి మెగా పిక్చర్స్, రచన, దర్శకత్వం: రామ్ వంశీకృష్ణ, సహ నిర్మాత: మయాంక్, డీవోపీ: కామెరాన్ బ్రైసన్, ప్రొడక్షన్ డిజైనర్: విశాల్ అబానీ, కాస్ట్యూమ్ డిజైనర్: రజిని.

వినూత్న కథతో విరాజి



ఇటీవల 'నింద' మూవీతో మంచి సక్సెస్ అందుకున్న హీరో వరుణ్ సందేశ్ కొత్త సినిమా 'విరాజి'తో మరోమారు ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఈ చిత్రాన్ని మహా మూవీస్‌తో కలిసి ఎమ్ 3 మీడియా బ్యానర్ పై మహేంద్ర నాథ్ కూండ్ల నిర్మిస్తున్నారు. ఈ చిత్రంతో ఆద్యంత్ హర్ష దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 2న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో మంగళవారం ఈ చిత్ర టైటిల్ అనౌన్స్ మెంట్ వేడుకని ప్రసాద్ ల్యాబ్స్‌లో ఘనంగా నిర్వహించారు.
నిర్మాత మహేంద్ర నాథ్ కూండ్ల మాట్లాడుతూ, "విరాజి' చాలా మంచి టైటిల్. వరుణ్ సందేశ్ ఇప్పటి వరకు ఎన్నో మంచి మూవీస్ చేశారు. ఆయనను కొత్త అవతారంలో చూపించే చిత్రమిది. మూవీ చాలా బాగా వచ్చింది' అని తెలిపారు. 'ఇది దర్శకుడిగా నా మొదటి సినిమా. త్వరలో రివీల్ చేసే మా మూవీ ఫస్ట్ లుక్ చూస్తే మీరు తప్పకుండా ఇంప్రెస్ అవుతారు. ఇది వరుణ్ సందేశ్‌కు టైలర్ మేడ్ మూవీ' అని దర్శకుడు ఆద్యంత్ హర్ష చెప్పారు.
హీరో వరుణ్ సందేశ్ మాట్లాడుతూ, 'ఈ కథని హర్ష చెబుతున్నప్పుడు ఫస్టాఫ్ పది నిమిషాల తర్వాత కథ ఇలా ఉంటుందేమో అని రెండు మూడు చోట్ల గెస్ చేశాను. సెకండాఫ్‌కు వచ్చేసరికి గూస్ బంప్స్ వచ్చాయి. కథ చాలా బాగుందని చెప్పాను. ఈ సినిమా తప్పకుండా చేయాలని ఫిక్స్ అయ్యా. మా డైరెక్టర్ హర్షకు ఇది మొదటి సినిమా కానీ ఆయన చేయబోయే చాలా సినిమాలకు ఇది మొదటి సినిమా. నా 17 ఏళ్ల కెరీర్‌లో చేయని ఒక డిఫరెంట్ మూవీ. అలాంటి మోస్ట్ క్రేజియెస్ట్ క్యారెక్టర్ ఇందులో చేశాను' అని అన్నారు.

జనక అయితే గనక..



సుహాస్

ప్రేక్షకులకు వైవిధ్యమైన సినిమాలను అందిస్తూ న్యూ టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తున్న నిర్మాణ సంస్థ దిల్ రాజు ప్రొడక్షన్స్.
'బలగం' 'లవ్ మీ' చిత్రాల తర్వాత ఈ బ్యానర్‌పై వస్తోన్న చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సుహాస్ హీరోగా నటిస్తోన్న ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ కోర్టు డ్రామా ఫస్ట్ లుక్‌ను మేకర్స్ మంగళవారం విడుదల చేశారు. సినిమా టైటిల్ ఉన్న పలకను పట్టుకున్న హీరో సుహాస్ దాన్ని ఓరగా ఓ కంటితో చూస్తున్నారు. ఇంకా పోస్టర్‌లో న్యాయదేవత బొమ్మ, చిన్నపిల్లలకు సంబంధించిన స్కూల్ బ్యాగ్, స్కూల్ బస్, టెడ్డీ బేర్ బొమ్మలను గమనించవచ్చు. హీరోగా వరుస విజయాలను అందుకుంటున్న సుహాస్ మరోసారి డిఫరెంట్ మూవీతో అలరించటానికి సిద్ధమవుతున్నారని పోస్టర్ చెప్పకనే చెబుతోంది.
'మా సంస్థ నుంచి రాబోతున్న మరో వైవిధ్య చిత్రంగా 'జనక అయితే గనక..' నిలుస్తుందని ఆశిస్తున్నాం. ఈ మూవీకి సంబంధించి మరిన్ని వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం' అని నిర్మాతలు అన్నారు.
సాయి శ్రీరామ్ సినిమాటోగ్రఫీ అందిస్తోన్న ఈ చిత్రానికి విజయ్ బుల్గానిన్ సంగీతాన్ని సమకూరుస్తున్నారు.

నయా హర్రర్ థ్రిల్లర్ నిన్ను వదలను



లియుబా పామ్, కుష్బూ జైన్ ముఖ్య పాత్రల్లో యు వీ టి హాలీవుడ్ స్టూడియో (యూఎస్ఏ), శ్రేయ ప్రొడక్షన్స్ బ్యానర్‌లు సంయుక్తంగా అశోక్ కుల్లర్ నిర్మాతగా, దేవేంద్ర నెగి సహ నిర్మాతగా షిరాజ్ మెహది దర్శకత్వంలో నిర్మిస్తున్న సినిమా 'నిన్ను వదలను'. గంగాధర్, వైజాగ్ షరీఫ్, వైజాగ్ రవితేజ, అజయ్, అనంత్ ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. గోవా, హైదరాబాద్ ప్రాంతాల్లో జరిగే ఈ సినిమా హర్రర్, సస్పెన్స్ థ్రిల్లర్‌గా ఉండనుంది.
లియుబా పామ్ రష్యాలో పుట్టి పెరిగారు. ఆమె ఒక సింగర్, ప్రొడ్యూసర్ కూడా. రష్యాలో సేవ్ ద చిల్డ్రన్ అని ఒక డాక్యుమెంటరీ ఫిలింకి నిర్మాతగా, 'లవ్ ఓవర్ ఈవిల్' అనే టీవీ సిరీస్‌కి రైటర్, నిర్మాతగానూ వ్యవహరించారు. ఇప్పుడు స్ట్రయిట్ తెలుగులో ఈ హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ సినిమాతో మన ముందుకు వస్తున్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్ : ప్రవీణ్ కొమరి, ఎడిటర్ : కే.ప్రభు, డి ఐ : శ్రీ, కొరియోగ్రాఫర్ : సాయి రాజు, యాక్షన్ : షావులిన్ మల్లేష్, దర్శకుడు : షిరాజ్ మెహది.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

భారత సంతతి వ్యాపారులకు జైలు

- అమెరికాలో వేల కోట్ల మోసం



చికాగో : అమెరికాలో భారత సంతతికి చెందిన వ్యాపారవేత్తలు వేల కోట్ల మోసం చేయడంతో వారికి అక్కడి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. ఒకప్పుడు చికాగోలోనే అత్యంత వేగంగా ఎదిగిన స్టార్టప్ 'ఔట్‌కమ్ హెల్త్' మోసాలకు పాల్పడింది. రిషి షా, శ్రద్ధా అగర్వాల్‌లు 2006లో ఔట్‌కమ్ హెల్త్‌ను ఏర్పాటు చేశారు. ఆ సంస్థ డాక్టర్ల వద్ద స్క్రీన్‌లు, టాబ్లెట్లను ఏర్పాటు చేసింది. వీటిలో ఔషధ ప్రకటనలు ప్రసారం చేసేవారు. దీనికి అక్కడ దేశ వ్యాప్తంగా కాంట్రాక్టులు లభించాయి. 2010 నుంచి భారీగా పెట్టుబడిదారుల దృష్టిని ఆకర్షించింది. మరోవైపు 'ఔట్‌కమ్ హెల్త్' నిర్వహణ, ఆర్థిక కార్యకలాపాలను పెంచి చూపిస్తున్నట్లు అక్కడి క్లయింట్లు గుర్తించారు. కంపెనీ డెలివరీ చేయగలిగిన స్థాయి కంటే ఎక్కువగా వాణిజ్య ప్రకటనల ఇన్వెంటరీని విక్రయిస్తున్నట్లు తేలింది. ఫార్మా జెయింట్ నోవో నార్డిస్క్ తదితర సంస్థలు దీన్ని బయటపెట్టాయి. దాదాపు రూ.8300 కోట్ల మోసానికి పాల్పడ్డారు. దీంతో షాపై 2023 ఏప్రిల్‌లో 12పైగా మనీ లాండరింగ్ కేసులు నమోదయ్యాయి. తాను చేసిన పనికి సిగ్గు పడుతున్నట్లు రిషి షా తన నేరం అంగీకారంలో తెలిపారు. ఈ కేసులో విచారణ జరిపిన న్యాయస్థానం షాకు 7 ఏళ్ల ఆరు నెలలు, శ్రద్ధాకు మూడేళ్ల హాఫ్‌వే హౌస్‌లో ఉండేలా, పోర్దీకి 2 ఏళ్ల మూడు నెలల జైలు శిక్ష విధించింది.

నేటి నుంచే టెల్కోల బాదుడు

న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కోలు పెంచిన ఛార్జీలను బుధవారం నుంచి అమల్లోకి తేనున్నాయి. రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్ సంస్థలు జులై 3 నుంచి కొత్త టారీఫ్‌లను వసూలు చేయనున్నాయి. వొడాఫోన్ ఐడియా గురువారం నుంచి మొబైల్ ఛార్జీలను మార్చనున్నట్లు ప్రకటించింది. ప్రయివేటు టెల్కోలు తమ టారీఫ్‌లను 12 శాతం నుంచి 25 శాతం వరకు పెంచుతున్న విషయం తెలిసిందే.

బిఎస్‌ఎన్‌ఎల్ నుంచి ఆకర్షణీయ ప్లాన్

న్యూఢిల్లీ : ప్రయివేటు టెల్కోలు పోటాపోటీగా టారీఫ్ ధరలను



పెంచుతుంటే.. ప్రభుత్వ రంగంలోని బిఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులకు ఊరటనిచ్చే అత్యంత ఆకర్షణీయ ప్లాన్‌ను ప్రకటించింది. రూ.249కే 45 రోజుల కాల వ్యవధితో రోజుకు 2జిబి డాటాను అందిస్తున్నట్లు ప్రకటించింది. అదే విధంగా రోజుకు 100 ఎస్‌ఎంఎస్‌లు ఉచితంగా లభిస్తాయని పేర్కొంది. ప్రయివేటు టెల్కోలు భారీగా పెంచిన ప్లాన్ల ధరల నుంచి ఉపశమనం కోరే మొబైల్ వినియోగాదారులకు ఇది ఉపశమనం కల్పించనుంది. ఇదే ధరలో ఇతర టెల్కోలు కేవలం 28 రోజుల గడువు, రోజుకు 1జిబి డాటా మాత్రమే అందించడం గమనార్హం.

యాదాద్రిలో ఎస్‌బిఐ లైఫ్ కొత్త శాఖ ఏర్పాటు

హైదరాబాద్ : ప్రయివేటు బీమా సంస్థల్లో ఒకటైన ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ తమ వినియోగదారులకు బీమా సేవలను అందుబాటులోకి తేవడంపై మరింతగా దృష్టి కేంద్రీకరించినట్లు ప్రకటించింది. ఈ క్రమంలోనే యాదాద్రి భువనగిరి జిల్లాలో ఏర్పాటు చేసిన కొత్త శాఖ కార్యాలయాన్ని ఎస్‌బిఐ లైఫ్ ఇన్సూరెన్స్ రీజనల్ డైరెక్టర్ (హైదరాబాద్ రీజియన్) అభిషేక్ మజుందార్ ప్రారంభించారు. దీంతో ఆ పరిసర ప్రాంతాల్లో జీవిత బీమా విస్తృతికి మరింత దోహదం చేయనుందని మజుందార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ అధికారులు పి వంశీధర్ రెడ్డి, పి శ్యామ్ సుందర్ రాజు, వినీత్ శుక్లా, ఎస్ ఫ్రెడ్‌లిన్ తదితరులు పాల్గొన్నారు.

లోపాలను ఎత్తి చూపిస్తే బెదిరింపులు

- అర్థంలేని సెబీ నోటీసులు
- వాస్తవాల గుర్తింపులో విఫలం
- కొటాక్ బ్యాంక్ పేరెందుకు చేర్చలేదు..!
- సెబీపై హిండెన్‌బర్గ్ విమర్శలు



న్యూఢిల్లీ : అదానీ గ్రూప్ సంస్థలపై చేసిన ఆరోపణలకు గాను అమెరికా షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్‌కు మార్కెట్ రెగ్యూలేటర్ సెబీ షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దీనిపై హిండెన్‌బర్గ్ తీవ్రంగా స్పందించింది. భారతీయ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపిస్తూ సెబీ నోటీసులు జారీ చేసిందని హిండెన్‌బర్గ్ పేర్కొంది. భారత్‌లోని అత్యంత శక్తివంతమైన వ్యక్తులు చేసిన అవినీతి, మోసాలను బహిర్గతం చేయడానికి ప్రయత్నిస్తే తమను సెబీ బయపెట్టే ప్రయత్నం చేస్తుందని విమర్శించింది. తమకు ఉద్దేశపూర్వకంగానే నోటీసులు జారీ చేసిందని ఆరోపించింది. అవినీతి అక్రమాలను బయటపెట్టిన ఒకటిన్నర సంవత్సరం తర్వాత కూడా ఈ కేసులో వాస్తవాలను గుర్తించడంలో సెబీ విఫలమైందని హిండెన్‌బర్గ్ విమర్శించింది. తాము వివిధ సంస్థలతో కలిసి అదానీ గ్రూప్‌ను లక్ష్యంగా చేసుకున్నామని వస్తున్న ఆరోపణల్లోనూ వాస్తవం లేదని తెలిపింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపితే ఇలా నోటీసులు పంపడం సరికాదని హిండెన్‌బర్గ్ పేర్కొంది.

అదానీ గ్రూప్ అవకతవకలను బయటపెట్టిన సమయంలోనే తాము ఆయా కంపెనీల స్టాక్స్‌పై షార్ట్ చేసినట్లు స్పష్టంగా వెల్లడించామని పేర్కొంది. అంటే అదానీ షేర్ల పతనాన్ని ముందే అంచనా వేసి వాటిని అమ్మకాలు చేశామని తెలిపింది. అదానీ షేర్ల షార్ట్ సెల్లింగ్‌లో నిబంధనలు పాటించామని స్పష్టం చేసింది. ఇన్వెస్టర్లతో ఉన్న సంబంధాలతో క్రయ, విక్రయాలు (షార్ట్) చేసి 4.1 మిలియన్ డాలర్ల (రూ.34 కోట్లు) ఆదాయం పొందామని.. అయితే.. సంస్థ ఖర్చులు, మిగతా వ్యయాలను లెక్కిస్తే తమకు ఏం మిగలలేదని తెలిపింది.

కోటాక్ భాగస్వామి ఎవరూ..!

'అదానీ గ్రూప్ అవకతవకల వ్యవహారం భయటకు వచ్చే సమయంలో కోటక్ బ్యాంకు విదేశాల్లో ఫండ్ కంపెనీని ఏర్పాటు చేసింది. దాని సహాయంతో ఓ పెట్టుబడి భాగస్వామి ద్వారా అదానీ స్టాక్స్‌ను షార్ట్ చేశారు. దీనివల్ల కోటక్ బ్యాంకుకు పెద్దగా లాభాలు ఏమి రాలేదు. కానీ.. సెబీ జారీ చేసిన షోకాజ్ నోటీసుల్లో ఎక్కడా కోటక్ పేరు గానీ, ఆ సంస్థ బోర్డు సభ్యుల ప్రస్తావన లేదు. సెబీ మరో శక్తిమంతమైన భారత వ్యాపారవేత్తను రక్షించే యోచనలో ఉన్నట్లు స్పష్టమవుతోంది' అని హిండెన్‌బర్గ్ తెలిపింది.

అదానీ గ్రూప్ సంస్థలు స్టాక్ ధరలను కృత్రిమంగా పెంచాయని హిండెన్‌బర్గ్ 2023 జనవరిలో ఓ కీలక రిపోర్ట్‌ను విడుదల చేసి.. సంచలనం రేపింది. షేర్ల పెంపునకు కొన్ని విదేశీ పెట్టుబడిదారుల సహాయం తీసుకున్నారని అందులో ఆధారాలతో పేర్కొంది. విలువ పెరిగిన షేర్లను తనఖా పెట్టి ఆర్థిక సంస్థల నుంచి రుణాలు పొందిందని వెల్లడించింది. ఇది ఆర్థికపరమైన నేరాలకు పాల్పడినట్లు అవుతుందని అదానీ గ్రూపునపై విమర్శలు చేసింది.

సెల్ఫీ వీడియోనా.. మరెవరైనా తీశారా..?

- చింతకాని మండల రైతు మృతిపై అనుమానాలు
- ఆత్మహత్యకు ఎవరైనా ప్రోత్సహించారా? అనే దిశగా విచారణ

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తనకున్న ఏడెకరాల భూమిలో మూడెకరాలను కొంతమంది పొక్లెయిన్లతో తవ్వి నాశనం చేశారని, ఈ విషయాన్ని తాను ఏ అధికారికి చెప్పుకున్నా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేస్తూ... ఆత్మహత్యకు పాల్పడిన రైతు బోజెడ్ల ప్రభాకర్ (45) మృతిపై అనుమానాలు నెలకొన్నాయి. వీడియో రికార్డు చేస్తూ తన ఆవేదన వెలిబుచ్చిన ఆయన ఆ తర్వాత పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ వీడియో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు చేరాలని, తన కుటుంబానికి న్యాయం జరగాలని విన్నవించుకున్నాడు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం పొద్దుటూరు గ్రామానికి చెందిన బోజెడ్ల ప్రభాకర్ (45) అనే రైతు సోమవారం సాయంత్రం పురుగుమందు తాగి మృతిచెందాడు.

న్యాయం చేయాలని కోరుతూ వీడియో..

బోజెడ్డ ప్రభాకర్ అనే రైతు తన సెల్ఫీలో సోమవారం సాయంత్రం 3.30కు ఓ వీడియో రికార్డు చేశాడు. సాయంత్రం 5.30 గంటలకు ఆ వీడియోను గ్రూపులో స్థానిక యువకుడు ఒకరు ఫార్వర్డ్ చేశారు. అందులో రైతు





ప్రభాకర్ తన సమస్యను బాధతో వెల్లడించాడు. వీడియోలో ప్రభాకర్ తన చేతిలో పురుగుల మందు బుడ్డిని పట్టుకున్నాడు. పొద్దుటూరులో 276, 277 సర్వే నెంబర్‌లో తనకున్న మూడెకరాల భూమిని కొందరు పొక్లెయిన్లు, ఎక్స్‌వేటర్, డోజర్లతో నాశనం చేశారని పేర్కొన్నాడు. గ్రామానికి చెందిన కూరపాటి కిషోర్, పెంట్యాల రామారావు, గుర్రం నాగమల్లేశ్వరావు, మొగిలి శ్రీను, ముత్తయ్య కలిసి తన పొలాన్ని నాశనం చేశారని వీడియోలో ఆరోపించాడు. తహసీల్దార్ కు, ఎస్ఐకి చెప్పినా న్యాయం జరగలేదన్నాడు. ఖమ్మం కలెక్టర్‌ను కలుద్దామని వచ్చినా సమయం అయిపోయిందని చెప్పారన్నాడు. తనకు వేరే గత్యంతరం లేక ఈ మందు బుడ్డే శరణ్యంగా భావిస్తున్నానని, తాను ఎవరికీ అన్యాయం చేయలేదన్నాడు. ఎక్కడికి వెళ్లినా తనకు న్యాయం జరగలేదని, ఇక తనకు మరణమే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. 'నేను రైతుగా బతికా, రైతురాజ్యం రావాలని కాంగ్రెసు ఓటేశాను.. అందరూ కలిసి నా కుటుంబసభ్యులకు న్యాయం చేయాలి..' అని వీడియోలో వేడుకున్నాడు. ఈ వీడియోను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు పంపి న్యాయం చేయాలని కోరాడు. అయితే ఈ వీడియో రికార్డింగ్ పై అనుమానాలు నెలకొన్నాయి.

వీడియో రికార్డింగ్ పై అనుమానాలు

వీడియో రికార్డు చేసి, వాట్సాప్లో తన కుటుంబసభ్యులకు పంపాడు. అలాగే ఫోన్లో తెలిపాడు. అనంతరం పురుగులమందు తాగాడు. ప్రభాకర్ నుంచి ఫోన్ రాగానే కుటుంబసభ్యులు ఆందోళనతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి చూసే సరికి ప్రభాకర్ విగతజీవిగా కనిపించాడు. కుటుంబసభ్యులు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై విచారణ కొనసాగుతోంది, రైతు ప్రభాకరే స్వయంగా వీడియో రికార్డు చేసి పంపాడా..? మరెవరైనా వీడియో తీసి ఆత్మహత్యకు ప్రేరేపించారా అనే విషయం తేలాల్సి ఉంది. గోడపైన సెల్ఫోన్ను ఉంచి సెల్ఫీ వీడియో తీసినట్టుగా కూడా అనుమానిస్తున్నారు. ఈ ఘటనతో పొద్దుటూరు గ్రామంలో మంగళవారం పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు.

పది మందిపై కేసు

మృతుడు ప్రభాకర్ తండ్రి వీరభద్రయ్య ఫిర్యాదు మేరకు పది మందిపై కేసు నమోదు చేశారు. ఆత్మహత్యకు ఎవరైనా ప్రేరేపించారా? అనే దిశగా పోలీసులు విచారణ చేస్తున్నారు. రైతు మృతిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నారు.

రెమీడియం లైఫ్‌కేర్‌తో ఆస్టర్ బయోటెక్ ఒప్పందం

న్యూఢిల్లీ : ఎపిఐ ఉత్పత్తుల సంస్థ రెమీడియం లైఫ్‌కేర్‌తో బ్రిటన్ కేంద్రంగా పని చేస్తోన్న ఔషధ సరఫరాల సంస్థ ఆస్టర్ బయోటెక్ ఒప్పందం కుదర్చుకుంది. ఐదేళ్ల కాలపరిమితి కలిగిన ఈ కాంట్రాక్ట్‌లో వివిధ యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్స్ (ఎపిఐ)లను సరఫరా చేయాల్సి ఉంటుందని రెమీడియం పేర్కొంది. జూన్ 2025 నాటి కల్లా మధ్య షెడ్యూల్ చేయబడిన రూ.175 కోట్ల ఉత్పత్తులను అందించనున్నట్లు పేర్కొంది.

మొక్కజొన్నతోనూ ఇథనాల్

- దావణగెరె షుగర్ వెల్లడి



చెన్నయ్ : మొక్కజొన్న, ఇతర దెబ్బతిన్న ధాన్యాల నుండి ఇథనాల్‌ను ఉత్పత్తి చేయాలని యోచిస్తోన్నట్లు దావణగెరె షుగర్ కంపెనీ లిమిటెడ్ తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లోనే దేశ వ్యాప్తంగా మొక్కజొన్న నుండి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం నేషనల్ కోఆర్డినేటింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేసిందని పేర్కొంది. దీని ద్వారా రైతుల నుండి మొక్కజొన్నను సేకరించి, ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెర కర్మాగారాలకు సరఫరా చేయాలని నిర్ణయించిందని పేర్కొంది. ఇది తమ ఫ్యాక్టరీకి, ఇతరులకు ప్రయోజనం చేకూర్చుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది.

రిటైల్‌లో విస్తరణకు ప్రణాళికలు

- హిస్సెన్స్ వెల్లడి

న్యూఢిల్లీ: భారత మార్కెట్‌లో వేగవంతమైన విస్తరణ, ప్రతిష్టాత్మక వృద్ధి ప్రణాళికలను రూపొందించినట్లు అంతర్జాతీయ ఎలక్ట్రానిక్స్ ఉపకరణాల తయారీదారు హిస్సెన్స్ తెలిపింది. ఇందుకోసం రిటైల్ విస్తరణలో వ్యూహాత్మక పంపిణీ భాగస్వామ్యం ద్వారా మార్కెట్‌లో రాణించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని హిస్సెన్స్ ఇండియా సిఇఒ పంకజ్ రాణా తెలిపారు. టెలివిజన్ల నుంచి ఎసిల వరకు అనేక రకాల ఉత్పత్తులను పరిచయం చేయనున్నామన్నారు.

ప్రపంచం



అధిక ఆదాయ దేశంగా రష్యా : ప్రపంచ బ్యాంకు

రష్యా తన ఆర్థిక వద్ధి బలంతో అప్పర్ మిడిల్ నుండి హై కేటగిరీకి పురోగమించిందని సోమవారంనాడు విడుదల చేసిన ప్రపంచ బ్యాంక్ వార్షిక జాతీయాదాయ ర్యాంకింగ్స్ తెలియజేస్తున్నాయి. 1989 నాటి ప్రపంచ బ్యాంక్ పద్ధతి ఆధారంగా స్థూల జాతీయ ఆదాయాన్ని (జిఎన్ఐ) అమెరికన్ డాలర్లలో కొలుస్తుంది. మునుపటి క్యాలెండర్ సంవత్సరం తలసరి జీఎన్ఐ ఆధారంగా ప్రతి జులై 1న దాని వర్గీకరణలను నవీకరిస్తుంది. రష్యాలో ఆర్థిక కార్యకలాపాలు 2023లో సైనిక సంబంధిత కార్యకలాపాలలో ఏర్పడిన పెద్ద పెరుగుదలతో ప్రభావితమయ్యాయి, అయితే వాణిజ్యం (06.8 శాతం), ఆర్థిక రంగం (08.7 శాతం), నిర్మాణం (06.6 నిర్మాణం) పుంజుకోవడం ద్వారా కూడా వద్ధి పెరిగింది" అని ప్రపంచ బ్యాంకు బ్లాగ్‌లో ఒక పోస్ట్ పేర్కొంది. ఈ కారకాలు వాస్తవ (3.6 శాతం) నామమాత్రపు (10.9 శాతం) స్థూల జాతీయోత్పత్తి రెండింటిలో పెరుగుదలకు దారితీశాయి. రష్యా అట్లాస్ జీఎన్ఐ తలసరి 11.2 శాతం పెరిగింది అని బ్యాంక్ ప్రకటించింది.

రష్యా ఆర్థిక వ్యవస్థను నాశనం చేయడం, మాస్కోలో పుతిన్ పాలనను అంతమొందించటం తమ లక్ష్యమని బహిరంగంగా పేర్కొంటూ ఉక్రెయిన్ వివాదం కారణంగా రష్యాపై అమెరికా, దాని మిత్రదేశాలు వేల సంఖ్యలో ఆంక్షలు విధించిన తర్వాత కూడా ఈ ఆర్థిక వద్ధి జరిగింది. అధిక ఆదాయ దేశంగా పరిగణించ బడటానికి ఒక దేశం 14,005 డాలర్ల కంటే ఎక్కువ స్థూల జాతీయ ఆదాయాన్ని (జీఎన్ఐ)ని కలిగి ఉండాలి. గత ఆర్థిక సంవత్సరానికి చెందిన 13,845 డాలర్ల నుండి సర్దుబాటు చేయబడింది. ఈ సర్దుబాటు చైనా, జపాన్, బ్రిటన్, అమెరికా, యూరోజోన్ జీడీపీ డిఫ్లేటర్ల(ధరలలో సంభవించే మార్పు) సగటుపై ఆధారపడి ఉంటుంది. ఆదాయ వర్గీకరణ స్థూల జాతీయ ఆదాయాన్ని(జీఎన్ఐ)ని ఆర్థిక సామర్థ్యానికి విస్తతంగా అందుబాటులో ఉన్న సూచికగా ఉపయోగించి దేశం అభివద్ధి స్థాయిని ప్రతిబింబిస్తుంది. ప్రపంచ బ్యాంకు గణాంకాలు దక్షిణాసియా, లాటిన్ అమెరికా, కరేబియన్‌లలో అభివద్ధి వైపు మొగ్గు చూపాయి. అయితే మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా 1987 కంటే 2023లో అధ్వానంగా ఉన్నాయి. దీనికి విరుద్ధంగా, యూరప్, మధ్య ఆసియాలలో 1987లో 71 శాతంగా వున్న అధిక ఆదాయ దేశాలు గత ఆర్థిక సంవత్సరంలో 69 శాతానికి పడిపోయాయి.

ట్రంప్ కు ప్రెసిడెంట్ ఇమ్యూనిటీ ఉంటుంది

- అమెరికా సుప్రీంకోర్టు



అమెరికన్ అధ్యక్షుల అధికారిక చర్యలకు చట్టపరమైన విచారణ నుంచి సంపూర్ణ రక్షణ ఉంటుందని మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై వరుస ఆరోపణలను ప్రస్తావిస్తూ అమెరికా సుప్రీకోర్టు సోమవారంనాడు తీర్పునిచ్చింది. ఫెడరల్ ప్రాసిక్యూటర్లు 2020 అధ్యక్ష ఎన్నికలకు సంబంధించి నాలుగు నేరారోపణలతో ట్రంప్‌పై అభియోగాలు మోపారు. ఫలితాల సేకరణ, లెక్కింపు, ధృవీకరణను అడ్డుకునేందుకు తెలిసి తప్పుడు వాదనలు వ్యాప్తి చేయడం ద్వారా ఫలితాలను తారుమారు చేయడానికి కుట్ర చేశారని ఆరోపించారు. బీమా రాజ్యాంగ నిర్మాణం ప్రకారం విభజించబడిన అధికారాల అధ్యక్ష అధికార స్వభావం రీత్యా మాజీ రాష్ట్రపతికి తన నిశ్చయాత్మక, నిర్దిష్ట రాజ్యాంగ అధికారంలో చర్యలకు క్రిమినల్ ప్రాసిక్యూషన్ నుండి సంపూర్ణ రక్షణ ఉంటుంది అని కోర్టు 6-3 మెజారిటీ నిర్ణయంలో పేర్కొంది. అయితే అనధికారిక చర్యలకు ఈ రక్షణ వర్తించదని, దీనిలో ఎటువంటి మినహాయింపు లేదని సుప్రీంకోర్టు పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జాన్ రాబర్ట్స్ మెజారిటీ అభిప్రాయాన్ని వ్రాశాడు. ఇందులో ఆరుగురు సంప్రదాయవాద న్యాయమూర్తులు ఈ తీర్పును సమర్థించగా, ముగ్గురు ఉదారవాదులు వ్యతిరేకించారు. జనవరి 6న అమెరికన్ ప్రజలకు చేసిన ట్వీట్లు, ఎన్నికల ఫలితాల ధృవీకరణకు అధ్యక్షత వహించడం గురించి అప్పటి వైస్ ప్రెసిడెంట్ మైక్ పెన్స్‌తో సంభాషణల పరంగా ఈ నిర్ణయం మాజీ అధ్యక్షుడికి అనుకూలంగా ఉంది. ఎందుకంటే ఆ రెండూ అధికారిక విధుల పరిధిలోకి వస్తాయి. ఏది ఏమైనప్పటికీ, 2020 ఓటు గురించి రాష్ట్ర, స్థానిక ఎన్నికల అధికారులను సంప్రదించినప్పుడు, ట్రంప్ ఎలాంటి చర్యలు అనధికారికంగా జరిగి ఉండవచ్చో నిర్ధారించడానికి దిగువ కోర్టులు సాక్ష్యాధార విచారణలను నిర్వహించడానికి ఈ తీర్పు అనుమతిస్తుంది. అధికారిక ప్రవర్తన నుండి అధికారిని విభజించడంలో, కోర్టులు రాష్ట్రపతి ఉద్దేశాలను విచారించకపోవచ్చు అని కోర్టు హెచ్చరించింది. "రాష్ట్రపతి చట్టానికి అతీతుడు కాదు. కానీ మన విభజిత అధికారాల వ్యవస్థ ప్రకారం, రాష్ట్రపతి తన ప్రధాన రాజ్యాంగ అధికారాలను అమలు చేసినందుకు ప్రాసిక్యూట్ చేయబడకపోవచ్చు. అతను తన అధికారిక చర్యలకు ప్రాసిక్యూషన్ నుండి కనీసం ఊహాజనిత మినహాయింపునకు అర్హులు" అని తీర్పు పేర్కొంది. అత్యున్నత న్యాయస్థానం తన పదవీకాలం చివరి రోజున అధ్యక్ష ఇమ్యూనిటీ కేసుపై తన తీర్పును వెలువరించింది. నవంబర్ ఎన్నికలకు ముందు వాషింగ్టన్-డీసీలోని ఫెడరల్ కోర్టులో ట్రంప్‌ను ప్రాసిక్యూట్ చేయడానికి ప్రత్యేక న్యాయవాది జాక్ స్మిత్ వ్యూహానికి దీనితో దెబ్బ తగిలింది. కోవిడ్ -19 మహమ్మారి కారణంగా అసాధారణమైన విధానాలతో, బహుశా మోసంతో కళంకితమైన, డెమొక్రాట్ జో బైడెన్‌కు అనుకూలంగా ఆకస్మికంగా వెళ్ళిన 2020 ఎన్నికలను ట్రంప్ సవాలు చేశాడు. ఎన్నికలు అత్యంత సురక్షితమైనవని, చట్టబద్ధమైనవని, ఫలితాన్ని ప్రశ్నించడం ప్రజాస్వామ్యంపై దాడి అని డెమొక్రాట్లు వాదించారు.

నో ఎంట్రీ..! నో ఎగ్జిట్..!!

- నేషనల్ హైవే అధికారుల తీరుతో ఇక్కట్లు
- ఖమ్మానికి పది కి.మీ తిరిగి రావాలట..!
- సూర్యాపేట- దేవరపల్లి హైవేకు ప్రవేశానికి నిరాకరణ
- రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన నిర్వాసితుల ఆవేదన
- మొదటి డిజైన్‌ను కాదని.. ఎంట్రీ, ఎగ్జిట్ లేని రెండో డిజైన్ ఫైనల్
- ముగ్గురు మంత్రులు చెప్పినా మారని ఎన్‌హెచ్ అధికారుల తీరు

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

పెరిగిన రద్దీతో ఖమ్మం నగరంలో ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఓ వైపు రింగ్ రోడ్ల కోసం ఏర్పాట్లు జరుగుతుంటే.. మరోవైపు ఈ సమస్యను జఠిలం చేసే రీతిలో జాతీయ రహదారుల అధికారుల తీరు ఉంది. సూర్యాపేట నుంచి ఖమ్మం మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని దేవరపల్లి వరకు నిర్మించే నేషనల్ హైవే (ఎన్‌హెచ్365బీజీ)కు ఎంట్రీ, ఎగ్జిట్‌లు ఇచ్చే విషయంలో ఎన్‌హెచ్ అధికారులు మొండివైఖరి అవలంబిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పక్క నుంచే వెళ్తున్నా ప్రయోజనం లేదు..

ఖమ్మంలో అంతర్భాగంగా ఉన్న ధంసలాపురం పక్క నుంచే ఈ హైవే వెళ్తున్నా నగరంతో పాటు ఈ మార్గంలోనే



ఉన్న చింతకాని, ముదిగొండ, బోనకల్ మండల వాసులకు దీనిపై ప్రయాణించే అవకాశం లేదు. కనీసం ఈ రోడ్డు నిర్మాణానికి భూములిచ్చిన ధంసలాపురం వాసులు సైతం ఈ రోడ్డు ఎక్కాలంటే పది కి.మీ తిరిగి రావాలి. ఖమ్మం నుంచి ఆంధ్రప్రదేశ్ రాజధాని విజయవాడ- అమరావతి వెళ్లాలన్నా ఇదే రూట్లో ప్రయాణించాలి. పైగా ముగ్గురు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రాతినిధ్యం వహించే ఖమ్మం, మధిర, పాలేరు నియోజకవర్గాలకు కూడా ధంసలాపురం వద్ద ఇచ్చే ఎంట్రీ- ఎగ్జిట్ పాయింట్ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఇవేవీ పరిగణనలోకి తీసుకోకుండా ఎన్‌హెచ్ అధికారులు మొండివైఖరి అవలంబిస్తుండటంతో ఈ మార్గంలో ప్రయాణించే వేలాది మంది ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు.

డిజైన్ మార్చడంతో సమస్య..

మొదటి అలైన్‌మెంట్‌లో ఈ హైవేకి ఎంట్రీ- ఎగ్జిట్‌ను 16వ డివిజన్ ధంసలాపురం వద్ద కేటాయించారు. కాబట్టే ఈ గ్రామస్తులు రోడ్డు నిర్మాణానికి భూములు ఇచ్చారు. రోడ్డు నిర్మిస్తుండగా ఏం జరిగిందో తెలియదు కానీ ఎన్‌హెచ్ అధికారులు ఆకస్మికంగా ఎంట్రీ- ఎగ్జిట్ పాయింట్లను మార్చారు. ఖమ్మం-బోనకల్ మార్గంలో ప్రవేశాన్ని రద్దు చేస్తూ రెండో డిజైన్ ఇచ్చారు. వెంటనే డిజైన్ మార్చాలని ఈ ప్రాంతవాసులు ఎన్‌హెచ్ అధికారులను కలిశారు. వారు వినకపోవడంతో అనాటి బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. అప్పటి ఎంపీ నామ నాగేశ్వరరావును సైతం ఆశ్రయించారు. నామ నేషనల్ హైవే అధికారులతో మాట్లాడారు. పై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినా ఎన్‌హెచ్ అధికారులు ఆ దిశగా ఎలాంటి ప్రయత్నాలు చేయలేదని తెలుస్తోంది. ఆ తర్వాత రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంతో మళ్లీ ముగ్గురు మంత్రులతో పాటు ప్రస్తుత ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వారు మాట్లాడినా ఎన్‌హెచ్ అధికారుల వైపు నుంచి ఆశించిన స్పందన లేకపోవడంతో బాధితులు రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకున్నారు. డిజైన్ మార్చి ఎంట్రీ-ఎగ్జిట్ ఇవ్వకపోతే ఇటు చింతకాని మండలం వందనం, అటు ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు అంటే అటో పది, ఇటో పది కి.మీ దూరం తిరిగి ఖమ్మానికి రావాల్సి ఉంటుంది. దీనిపై ఎన్‌హెచ్ అధికారులు స్పందించి ఈ డిజైన్ మార్చి ఎంట్రీ-ఎగ్జిట్ ఇవ్వాలని నగరంతో పాటు ఈ మార్గంలోని వివిధ ప్రాంతాల వాసులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై వివరణ కోసం ప్రయత్నిస్తే ఎన్‌హెచ్ పీడీ అందుబాటులోకి రావడం లేదు.

మంత్రులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు

మంత్రులు తుమ్మల, భట్టి, పొంగులేటి దృష్టికి తీసుకెళ్లాం. వారు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎన్‌హెచ్ అధికారులతో ఇప్పటికే పలుమార్లు మాట్లాడారు. ఒకటి, రెండు రోజుల్లో హైదరాబాద్ వెళ్లి జాతీయ రహదారుల ఉన్నతాధికారులను కలుస్తాం.



మందదపు లక్ష్మి మనోహర్, 18వ డివిజన్ కార్పొరేటర్

పీడీ రాంగ్ డైరెక్షన్ ఫలితం

ఎన్‌హెచ్ పీడీ దుర్గాప్రసాద్ నేషనల్ హైవే అధికారులకు రాంగ్ డైరెక్షన్ ఇచ్చిన ఫలితమే ఈ సమస్య ఇంత జఠిలంగా మారింది. నిర్వాసితులకు ఎకరానికి ఇచ్చింది రూ.45 లక్షలు. ధంసలాపురం వద్ద ఎంట్రీ ఇస్తే రెండు ఎకరాల భూమి ఎన్‌హెచ్‌కు అవసరం ఉంటుంది. కానీ రూ.25 కోట్లు నష్టం వాటిల్లుతుందని పీడీపై అధికారులకు నివేదిస్తుండటం ఆశ్చర్యం గొల్పుతుంది.



మేదారపు వెంకటేశ్వర్లు, 16వ డివిజన్ కార్పొరేటర్

ఎగ్జిట్ ఇవ్వకపోతే తీరని ఇబ్బందులు

ఖమ్మం నుంచి విజయవాడ వెళ్లే ఈ ప్రధాన మార్గంలో ఎగ్జిట్ ఇవ్వకపోతే ప్రజలు తీరని ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. ఇక్కడి నుంచి రోడ్డు వెళ్తుంటే పది కి.మీ తిరిగి రావాలనే రీతిలో ఎన్‌హెచ్ అధికారులు డిజైన్ మార్చడం సరైంది కాదు. దీనిపై మంత్రులు గట్టిగా ప్రయత్నిస్తున్నారు. ఈ సమస్య త్వరగా పరిష్కారం కావాలని మా అందరి ఆకాంక్ష.



దేవరపల్లి శ్రీనివాసరెడ్డి, స్థానికుడు

నవతెలంగాణ

ఏపీ ఆధీనంలోని రోడ్డు, భవనాల శాఖ

ఆస్తుల స్వాధీనం దిశగా చర్యలు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆధీనంలోని ప్రభుత్వ భవనాలను తిరిగి స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు మొదలు పెట్టామని రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడుతో మన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సమావేశం కానున్న నేపథ్యంలో ఏపీ తన దగ్గర ఉన్న భవనాల అప్పగింతపై అనుసరించాల్సిన ప్రక్రియపై మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో ఆ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రోడ్డు భవనాల శాఖ పరిధిలోని లేక్ వ్యూ అతిథి గృహం, మంత్రుల నివాస సముదాయంలోని క్వార్టర్లు, ఆదర్శనగర్, బషీర్ బాగ్, కుందన్ బాగ్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న ఎమ్మెల్యేల నివాస సముదాయాలతో పాటు గ్రీన్ ల్యాండ్స్, మంజీర అతిథి గృహాల వంటి వివిధ ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అనుగుణంగా పూర్తి సమాచారం సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో రోడ్డు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, ఈఎన్‌సీ గణపతి రెడ్డి, సీఈ మధుసూధన్ రెడ్డి, మోహన్ నాయక్ తో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట సీఐ

జితేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలి

- డీజీపీకి డీబీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దళిత ఎస్ఐ శ్రీరాములు శ్రీనును వేధించిన సీఐ జితేందర్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం నేతలు డీజీపీతో పాటు జాతీయ ఎస్సీ కమిషన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు బాబు నాయక్, జిల్లా శంకర్‌లకు వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎస్ఐని వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జాతీయ కార్యదర్శి శంకర్ మాట్లాడుతూ అయిదు నెల్లుగా ఎస్.ఐ శ్రీరాములు శ్రీను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేటలో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జితేందర్ రెడ్డి అడుగడుగునా ఎస్ఐపై కుల వివక్షతను ప్రదర్శించారనీ, ఎస్ఐని నిలబెట్టి కానిస్టేబుళ్లను కూర్చొపెట్టి అవమానించారని పేర్కొన్నారు. మానసికంగా కులం పేరుతో అవమాన పరుస్తూ నిరంతరం వేధింపులు చేస్తుండటంతో కొన్ని రోజులు సెలవుపై వెళ్లాడని తెలిపారు. వేధింపులను తట్టుకోలేక సొంత జిల్లా కేంద్రమైన మహబూబాబాద్‌కు జూన్ 30న రాత్రి చేరుకుని మార్కెట్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారని తెలిపారు. ప్రాణాప్రాయ స్థితిలో ప్రస్తుతం సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. ఈ ఘటనకు కారణమైన సీఐని సస్పెండ్ చేసి, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఐకి మెరుగైన వైద్యం ప్రభుత్వమే అందించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర నాయకులు పులి కల్పన, నగర నాయకులు బ్యాగరి బాస్కర్, మల్లేశం, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ సమాచారం, ఫొటోలు

తొలగించడం దారుణం

- ప్రభుత్వ వెబ్ సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ తొలగింపు కేటీఆర్ ఆగ్రహం
- చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారికి లేఖ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు ఏర్పడగానే ప్రభుత్వ వెబ్‌సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో గత ప్రభుత్వానికి సంబంధించిన డిజిటల్ సమాచారాన్ని, ఫొటోలను తొలగించడం దారుణమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా ఈ చర్యలకు పూనుకున్నవారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారికి కేటీఆర్ మంగళవారం లేఖ రాశారు. కొన్ని ముఖ్యమైన వెబ్ సైట్లను ఎత్తేయడం దారుణమని పేర్కొన్నారు. తెలంగాణకు సంబంధించిన కీలక సమాచారం భవిష్యత్తు తరాలకు తెలియకుండా చేయాలనే కుట్ర దీనిలో దాగి ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలగించిన వైబ్ సైట్లు, సోషల్ మీడియా హ్యాండిల్స్ వివరాలను లేఖలో పొందుపరిచారు. పబ్లిక్ డొమైన్ నుంచి తొలగించిన సమాచారాన్ని వెంటనే పునరుద్ధరించేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. కొందరి ఇష్టాయిష్టాల కోసం ప్రజల ఆస్తులను ధ్వంసం చేస్తే తెలంగాణ ప్రజలు క్షమించబోవని హెచ్చరించారు.

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రద్దు

ఆలోచనను విరమించుకోవాలి

- టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ రద్దు ఆలోచనను విరమించుకోవాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాదా నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అనేది వైద్యరంగానికి గుండెకాయలాంటిదని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, వైద్య విధాన పరిషత్ లను కలుపుకుని ఒక డైరెక్టరేట్ లేదా కమిషనరేట్ ఏర్పాటుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్టు వస్తున్న సమాచారం రెండు విభాగాల్లోని ఉద్యోగులను ఆందోళనకు గురి చేసిందని తెలిపారు. ఇప్పటికీ జీవో 142కు సంబంధించిన గందరగోళం సమిసిపోలేదని గుర్తు చేశారు. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలోని ఉద్యోగులు, గ్రామీణ, మారుమూల ప్రాంతాలు, ఏజెన్సీ గూడాలు, తండాలలో నివసిస్తున్న ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు చెబుతూ అవగాహన కల్పిస్తున్నారని గుర్తుచేశారు. చిన్న చిన్న జబ్బుల పాలైతే ఆరోగ్య ఉప కేంద్రాలు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వెంటనే ఆరోగ్య చికిత్సలు అందిస్తూ కీలక భూమిక పోషిస్తున్నారని తెలిపారు. వైద్య విధాన పరిషత్ పరిధిలో సెకెండరీ గ్రేడ్ ఆస్పత్రులు తాలుకా, జిల్లా కేంద్రాల్లో ఉండి గ్రామీణ, మారుమూల ప్రాంతాల నుంచి వచ్చే రెఫరల్ కేసులకు చికిత్స లందిస్తున్నాయని వివరించారు. ఈ రెండు విభాగాల ఉద్యోగుల సర్వీస్ రూల్స్ వేర్వేరుగా ఉన్నాయనీ, వీటిని కలిపితే భవిష్యత్తులో వేతనాల చెల్లింపు, పదోన్నతులు, ఇతర సర్వీస్ అంశాలు గందరగోళంలో పడే పరిస్థితి ఉంటుందని తెలిపారు. అందువల్ల రెండు విభాగాలను కుదించే ఆలోచన వెంటనే విరమించుకోవాలనీ, లేకపోతే రాష్ట్రంలో అన్ని ప్రజా సంఘాలను, అన్ని ట్రేడ్ యూనియన్లను, అసోసియేషన్లను కలుపుకుని దశల వారీగా ఆందోళనలు నిర్వహిస్తామని యాద నాయక్ హెచ్చరించారు.

దోస్త్ మూడో విడత రిజిస్ట్రేషన్ గడువు

రేపటి వరకు పొడిగింపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో బీఏ, బీఎస్సీ, బీకాం, బీకాం ఒకేషనల్, బీకాం ఆనర్స్, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ, బీసీఏ, బీబీఎం, బీసీఏ కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) మూడో విడత రిజిస్ట్రేషన్ గడువును గురువారం వరకు ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు దోస్త్ కన్వీనర్, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. షెడ్యూల్ ప్రకారం రిజిస్ట్రేషన్ గడువు మంగళవారంతో ముగిసిందని తెలిపారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు గురువారం వరకు పొడిగించామని పేర్కొన్నారు. అదేరోజు వరకు వెబ్‌ఆప్షన్ల నమోదు గడువును కూడా పొడిగించామని వివరించారు. మూడో విడతలో ఇప్పటి వరకు 55 వేల మంది కొత్త రిజిస్ట్రేషన్ చేసుకున్నారనీ, 60 వేల మంది వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని తెలిపారు. రిజిస్ట్రేషన్, వెబ్‌ఆప్షన్ల నమోదు గడువు పెంపు అవకాశాన్ని విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే 'సీతారామ' ఆలస్యం

- ఖమ్మం జిల్లాపైనా బీఆర్ఎస్ కపట ప్రేమ
- రూ.100కోట్లతో లింక్ కెనాల్ ఏర్పాటు
- 10 టీఎంసీలతో రిజర్వాయర్ నిర్మిస్తాం
- మున్నేరు నుంచి ఏటా పాలేరుకు జలాలు : మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



నవతెలంగాణ - మరిపెడ

ఉమ్మడి ఖమ్మం జిల్లా, మహబూబాబాద్ జిల్లాల సాగుకు సీతారామ ప్రాజెక్టు జీవనధార వంటిదని, గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఈ ప్రాజెక్టు ఆలస్యమైందని, దాంతో మూడు జిల్లాల రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని గృహ, సమాచార, సాగునీటి, రెవెన్యూ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సమృద్ధిగా సాగు నీటిని అందించడమే లక్ష్యమని తెలిపారు. కృష్ణా, గోదావరి జలాలను అనుసంధానం చేస్తూ రూ.100 కోట్లతో ప్రత్యేక లింక్ కెనాల్‌నూ త్వరలో నిర్మిస్తామన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలంలోని చాప్లతండా వద్ద కొనసాగుతున్న సీతారామ ప్రాజెక్టు కెనాల్స్ పనులు, భూ సేకరణ, ప్రాజెక్టు పూర్తి కావడానికి కావాల్సిన నిధులు, ఎదురవుతున్న సమస్యలను ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులు.. మంత్రికి వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా రాజీవ్‌సాగర్, ఇందిరా సాగర్ పేరుతో ఈ ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. అయితే రాష్ట్ర విభజన అనంతరం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రీ డిజైన్ పేరుతో కాలయాపన చేసి రెండు జిల్లాల రైతాంగంపై కపట ప్రేమను చూపిందన్నారు. 2.75 లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టును రీ డిజైన్ చేసి పేరు మార్చి మొదట 9వేల కోట్లను వాటినే మళ్లీ రూ.18వేల కోట్లకు పెంచిందన్నారు. సుమారు రూ.8500కోట్లు ఖర్చు పెట్టినా ఇప్పటి వరకు ఒక్క ఎకరాకు నీరు అందించలేకపోయారని విమర్శించారు. సీతారామ ప్రాజెక్టు, కెనాల్ నిర్మాణం, లిఫ్టులు, రిజర్వాయర్ పనులపై రాష్ట్రప్రభుత్వం పూర్తిగా దృష్టి సారించినట్టు చెప్పారు.

15 రోజుల క్రితం హెడ్ వర్క్స్, ఫస్ట్ లిఫ్ట్, థర్డ్ లిఫ్టను పరిశీలించామని, మొదటి లిఫ్ట్ ట్రయల్ రన్ జరిగిందన్నారు. హెడ్ రీచ్ వద్ద పనులు పూర్తైనా కెనాల్ పనులు పూర్తి కాకపోవటంతో నీటి విడుదల ఆలస్యమవుతోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఇంత పెద్ద కెనాల్ ఏర్పాటు చేయాలని సూచించి కనీసం రిజర్వాయర్లు కూడా ఏర్పాటు చేయకపోవటం దారుణమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అనుమతితో సుమారు 10టీఎంసీలతో రిజర్వాయర్ ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు.

నాగార్జున సాగర్ ఆయకట్టులో సుమారు 1.55లక్షల ఎకరాలని, మీడియం ప్రాజెక్టులైన వైరా, లంకా సాగర్ ప్రాజెక్టుల పరిధిలో ఉన్న ఆయకట్టుతో పాటు మైనర్ ఇరిగేషన్‌లో ఉన్న ఆయకట్టు చెరువులను కూడా కెనాల్‌ను అనుసంధానం చేసి రైతులకు రెండు పంటలకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. సుమారు రూ.100కోట్లు ఖర్చు పెట్టి లింకు కెనాల్‌ను ఏర్పాటు చేసి ఏన్కూరు వద్ద కృష్ణా కాలువలో వదిలేలా ప్రణాళికలు చేస్తున్నట్టు తెలిపారు. దాంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయకట్టు మరింత పెరిగే అవకాశముందన్నారు. మున్నేరు నదిపై నుంచి గ్రావిటీతో సుమారు ప్రతి ఏటా కృష్ణా బ్యారేజీ నుంచి 38 నుంచి 42 టీఎంసీలు సముద్రంలో కలుస్తుందని, ఆ నీటిని గ్రావిటీతో ఈ సీతారామ ప్రాజెక్టులో డ్రాప్ చేసి పాలేరు రిజర్వాయర్‌కు పంపించటం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

ఏకకాలంలోనే రైతులకు రుణమాఫీ..

రైతులకు రూ.2లక్షల రుణమాఫీని రెండు నెలల లోపు ఏకకాలంలోనే పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. సీతారామ ప్రాజెక్టులో భాగంగా భూమిని కోల్పోయిన బాధితులకు నష్టపరిహారం త్వరలోనే అందేలా చూస్తామని తెలిపారు. గత ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీ ద్వారా పోటీ పరీక్షలు నిర్వహించి వాటిని లీక్ చేసి యువత భవిష్యత్తుతో చెలగాటమాడిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం టీఎస్‌పీఎస్సీని పునరుద్ధరించి గాడిన పెట్టిందని తెలిపారు. ఇప్పటికే 30వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, అన్న మాట ప్రకారం ప్రతి ఏడాదీ జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని తెలిపారు. యువత గత పాలకుల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని, టీఎస్‌పీఎస్సీ ద్వారా త్వరలో విడుదల కాబోయే పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. రాంచంద్రునాయక్, కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్, అడిషన్ కలెక్టర్ డేవిడ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, మహబూబాబాద్ ఆర్డీవో ఎల్ అలివేలు, అదనపు ఎస్పీ తిరుపతిరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నూకల నరేష్ రెడ్డి, మూడు మండలాల ఇన్‌చార్జి కాలం రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల శ్రీనివాస్, మండల, పట్టణ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ ప్రధాని కాదు... అభివృద్ధికి విధానాలు కావాలి

- ఎంపీ ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశానికి కావాల్సింది ఓబీసీ ప్రధాని కాదని, ఓబీసీల అభివృద్ధికి విధానాలు కావాలని వైసీపీ ఎంపీ ఆర్. కృష్ణయ్య అన్నారు. ఓబీసీల్లో చాలా మంది ఇప్పటికీ అడుక్కు తినే దుస్థితిలో ఉన్నారన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చాలా మంది ఓబీసీ వర్గానికి చెందిన పిల్లలు అడుక్కునే వారిగా, పొలాల్లో బాల కార్మికులుగా ఉన్నారన్నారని చెప్పారు. ఇలాంటి వారి జీవన విధానంలో మౌలిక మార్పు తీసుకువచ్చేందుకు సంస్కరణలు చేపట్టాల్సి ఉందన్నారు. దేశంలోని ఓబీసీలకు ఇచ్చేది చారిటీ కాదని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. కానీ ఈ ప్రభుత్వాలు ఆ విషయాన్ని విస్మరించాయని దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగంపై మంగళవారం రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. బీసీలకు చెందిన కీలకమైన ఇలాంటి అంశం రాష్ట్రపతి ప్రసంగంలో లేకపోవడం బాధాకర మన్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 76 ఏండ్లు గడుస్తోన్నా... దేశంలోని 56 శాతం ఓబీసీలకు మాత్రం న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. బీసీ జాబితాలో 2,600కుపైగా కులాలు ఉన్నాయన్నారు. కానీ స్వాతంత్ర్యం తర్వాత కూడా సమాన హక్కులు రాలేదని తెలిపారు. దేశం అభివృద్ధి చెందుతుందని గొప్పగా చెప్పుకుంటున్నా, ఇంకా 32 శాతం మంది నిరక్షరాస్యులుగానే ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందులో అధికులుగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు విద్యను అందించడం రాజ్యాంగబద్ధమైన హక్కు అని కేంద్ర ప్రభుత్వానికి గుర్తు చేశారు.

ఏపీలో ఐఏఎస్‌ల బదిలీ

- కలెక్టర్లుగా పలువురు నియామకం



అమరావతి : రాష్ట్రంలో పెద్దయెత్తున ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీకాకుళం కలెక్టరుగా స్వప్నిల్ దినకర్, పార్వతీపురం మన్యం-శ్యామ్‌ప్రసాద్, విశాఖ పట్నం-హరీంద్రప్రసాద్, అనకాపల్లి-కె విజయ, అంబేద్కర్ కోనసీమ-రావిలాల మహేష్‌కుమార్, పల్నాడు- అరుణ్‌బాబు, నెల్లూరు- ఆనంద్, తిరుపతి-ఎస్ వెంకటేశ్వర్, అన్నమయ్య- చామకూరి శ్రీధర్, కడప-శివశంకర్ లతోటి, శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరుగా చేతన్‌ను నియమించారు. ఇప్పటి వరకు ఆయా జిల్లాల్లో పనిచేస్తున్న వారిని బదిలీ చేసిన ప్రభుత్వం వేరొక ప్రాంతంలో ప్రస్తుతం పోస్టింగు ఇవ్వలేదు.

డిప్యుటేషన్‌పై వచ్చిన అధికారులు రిలీవ్

ఎన్నికల విధుల్లో భాగంగా డిప్యుటేషన్‌పై వచ్చిన 27 మంది అధికారులను ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా రిలీవ్ చేశారు. ఆయా అధికారులను వారి మాతృశాఖలకు పంపిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

హెల్త్ ఫెసిలిటీస్ మ్యాపింగ్

సిద్ధం చేయాలి

- మంత్రి దామోదర ఆదేశం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భౌగోళికంగా అన్ని ప్రభుత్వాస్పత్రుల హెల్త్ ఫెసిలిటీస్ మ్యాపింగ్ (రూట్ మ్యాప్) సిద్ధం చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ టీజీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సదుపాయాల కల్పనలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు ఎంతెంత దూరంలో ఉన్నాయనే వాటితో ఈ రూట్ మ్యాప్ ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులకు, పాము కాటు నివారణ కోసం అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో మందులను అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ సహదేవరావు, రాజీవ్ ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓ విశాలక్షి, టీజీఎంఎస్ఐడీసీ ఈడీ కౌటిల్య, చీఫ్ ఇంజినీర్ దేవేందర్ కుమార్ పాల్గొన్నారు.

పాఠశాల విద్యా కమిషనర్ శ్రీదేవసేన బదిలీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బదిలీ అయ్యారు. దీంతో పాఠశాల విద్యాశాఖ సంచాలకులుగా ఈవి నర్సింహారెడ్డి బుధవారం బాధ్యతలను స్వీకరిస్తారు. ఇటీవల ఐఏఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగే వరకు శ్రీదేవసేన పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌గా బాధ్యతలను నిర్వర్తించారు. ఇప్పుడు రంగారెడ్డి మినహా అన్ని జిల్లాల్లో బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముగిసింది. ఆ జిల్లాలోనూ బుధవారం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులను ఉపాధ్యాయులకు కల్పిస్తారు. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ సజావుగా నిర్వహించారు. దీంతో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ బాధ్యతల నుంచి ఆమె మంగళవారం బదిలీ అయ్యారు. అదేరోజు కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా శ్రీదేవసేన బాధ్యతలను స్వీకరిస్తారు.

శ్రీదేవసేనకు ఆర్‌యూపీపీటీఎస్ సన్మానం

పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, అదనపు సంచాలకులు కె లింగయ్యను ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు మంగళవారం



హైదరాబాద్‌లో సన్మానించారు. భాషాపండితులకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించినందుకు వారికి శుభాకాంక్షలు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల గురించి వివరించారు. మల్టీజోన్-2 పరిధిలో భాషాపండితుల సీనియార్టీ తేదీలకు అనుగుణంగా రంగారెడ్డి జిల్లాలోని వారికీ ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. పదోన్నతులు రాకుండా మిగిలిపోయిన భాషాపండితులకు కూడా అవకాశం కల్పించాలని సూచించారు. స్కూల్ అసిస్టెంట్ భాషల ఖాళీ పోస్టుల్లో పదోన్నతులు కల్పించాలని కోరారు. ఇంకా మిగిలితే అప్‌గ్రేడ్ చేయడానికి కావాల్సిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పంపించాలని విజ్ఞప్తి చేశారు. వారు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌యూపీపీటీఎస్ కోశాధికారి గిరిజారమణ, ప్రచార కార్యదర్శి లింగంతోపాటు అన్నిజిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సివిల్స్ మెయిన్స్‌కు 24మంది ఎంపిక

- స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎ నర్సింహారెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సివిల్స్ మెయిన్స్‌కు 24మంది అభ్యర్థులు తెలంగాణ షెడ్యూల్డ్ కులాల స్టడీ సర్కిల్‌నుంచి ఎంపికయ్యారని ఆ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎ నర్సింహారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24లో 152 అభ్యర్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్ష (ప్రిలిమ్స్-కమ్-మెయిన్స్) కోసం ఉచిత కోచింగ్ నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో ఎస్సీ అభ్యర్థులు 10మంది, ఎస్టీలు ఆరుగురు, బీసీలు ఎనిమిది మంది అందులో నలుగురు మహిళా అభ్యర్థులు మెయిన్స్‌కు ఎంపికైనట్టు ఆయన పేర్కొన్నారు.

కాంగ్రెస్ మోసాలు గ్రహిస్తున్న ప్రజలు

- ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ మోసాలను నేడు మోతీలాల్ నాయక్ తెలుసుకున్నారు. రాబోయే కాలంలో ప్రజలంతా తెలుసుకుని హస్తం పార్టీ నాయకులను తరిమి కొడతారు అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. గిరిజనులపై ఎప్పుడో దాడులు జరిగితే దొంగలు పడ్డ ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్టు మంత్రి వెళుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజా పోరాటాలకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. జాబ్ క్యాలెండర్‌ను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

టీశాక్స్ బదిలీల్లో ఇష్టారాజ్యం

సీనియార్టీకి తిలోదకాలు

- న్యాయం చేయాలని కోరుతున్న ఉద్యోగులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఒక వైపు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆ శాఖలో సీనియార్టీకి ప్రాధాన్యతనిస్తూ ప్రక్షాళన చేస్తున్నామని చెబుతుంటే తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీలో (టీశాక్స్)లో అందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అక్కడ బదిలీల వ్యవహారంపై ఆరోపణలు వస్తున్నాయి. కొంత మంది అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సీనియార్టీ, వయస్సు, పదవీ విరమణ, మెడికల్ గ్రౌండ్, స్పౌజ్ వంటి అంశాలను పక్కన పెట్టినట్టు తెలుస్తున్నది. తరచూ వివాదాస్పద నిర్ణయాలకు వేదికగా మారుతున్న టీశాక్స్ బదిలీల వ్యవహారంలో వ్యవహరించిన తీరు కూడా ప్రశ్నార్థకంగా మారింది. ఒక ఉద్యోగికి డిప్యూటేషన్ ఆర్డర్స్ ఇచ్చి కేటాయించిన చోట రిపోర్ట్ చేయకముందే మరుసటి రోజు సవరించిన ఆర్డర్లు ఇచ్చారు. ఇదంతా కేవలం కొంత మంది అధికారులు తమకు అనుకూలమైన వారికి నచ్చిన చోటికి పంపించేందుకు చేసిన సర్దుబాటుతో జరుగుతున్న గందరగోళమని ఉద్యోగులు ఆరోపిస్తున్నారు.

టీశాక్స్‌లో 20 ఏండ్లుగా మారుమూల జిల్లాల్లో పని చేస్తూ కుటుంబాలకు దూరంగా ఉన్న ఉద్యోగులున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చివరిసారి 2012లో బదిలీలను సీనియార్టీ ప్రకారం చేయడంతో అప్పుడు న్యాయం జరిగిందని ఉద్యోగులు గుర్తుచేసుకుంటున్నారు. ఆ తర్వాత అనేక సార్లు బదిలీ కావాలని ఉద్యోగులు కోరినప్పటికీ చేపట్టలేదు. ఇప్పుడు బదిలీలు చేపట్టారని సంతోషించేలోపే ఓ ప్రాతిపదిక అంటూ లేకుండా పోవడంతో సిబ్బంది ఆవేదనకు గురవుతున్నారు. ఇదే విషయంపై టీశాక్స్‌లో ఉన్నతాధికారులతో మాట్లాడేందుకు ప్రయత్నించినా తమ గోడు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఉద్యోగుల యూనియన్ ప్రతినిధులు కలసి సమస్యలను వివరిద్దామంటే అందుకు కూడా అనుమతించడం లేదనీ, దీంతో అసలు ప్రాజెక్టు లక్ష్యం నెరవేర్చడం పక్కన పెట్టి ఉద్యోగులు తమ ఉద్యోగ భద్రతను కాపాడుకునే పనిలో పడ్డారని తెలిసింది.

టీశాక్స్‌లో హెచ్ఐవి నివారణ, హెచ్ఐవీ రోగుల బాగోగుల కోసం ప్రధానంగా ఖర్చు పెట్టాల్సి ఉంది. అయితే అధికారులు చేస్తున్న పలు కార్యక్రమాలు, చర్యలతో రోగులకు ఉపయోగం లేకపోయినా నిరర్థక ఖర్చులు పెరిగిపోతున్నాయని సమాచారం. టీశాక్స్‌లో ఉద్యోగుల సంక్షేమానికి ఉన్న అవకాశాలను సైతం ఉన్నతాధికారుల నిర్లక్ష్యంతో కోల్పోతున్నారని వినికిడి. ఇటీవల ఇద్దరు ఉద్యోగులు మరణించగా అధికారుల నిర్లక్ష్యం కారణంగా వారికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి రావాల్సిన రూ.5 లక్షల శాలరీ అకౌంట్ బెనిఫిట్ రాలేదని తెలిసింది. అందులో పని చేసినంత కాలం చేసి, చనిపోయాక కుటుంబాలను రోడ్డున పడేసుకోవాల్సిన పరిస్థితి నెలకొన్నది. కొంత మంది అధికారులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ నుంచి ఫారిన్ సర్వీస్ డిప్యూటేషన్‌పై కనీస అర్హత లేకుండా అధికారులుగా కొనసాగడం, ఎన్జీవోలతో కలిసి కుమ్మక్కు కావడంతోనే ఇలాంటి పరిస్థితి ఉందని చెబుతున్నారు. టీశాక్స్ పరిణామాలపై సమగ్ర దర్యాప్తు జరిపి, ఉద్యోగులకు న్యాయం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

ప్రతిపక్షనేతగా

రాహుల్ వ్యాఖ్యలు సరిగాదు

- ఆయన నిర్మాణాత్మకపాత్ర పోషించాలి: మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత పదవి రాజ్యాంగ బద్ధమైనదనీ, ఆ హోదాలో ఉన్న రాహుల్‌గాంధీ దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం సరిగాదని బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు హితవు పలికారు. ఆయన లోక్‌సభలో సహేతుకమైన విమర్శలతో చర్చ చేయాలనీ, నిర్మాణాత్మక పాత్ర పోషించాలని సూచించారు. మంగళవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హిందువులను కించపరిచేలా రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేశారనీ, దాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. ప్రపంచంలోని హిందూవులందరికీ రాహుల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 2004లో ఆనాటి కేంద్ర హోంమంత్రి సుశీల్ కుమార్ షిండే కూడా ఇలాగే వ్యాఖ్యలు చేసి క్షమాపణ చెప్పారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలోనే సిక్కుల ఊచకోత, దేవాలయాల కూల్చివేత జరిగిందని ఆరోపించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి భానుప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ..జగన్ ప్రభుత్వ హయాంలో టీటీడీలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఐదేండ్ల కాలంలో టీటీడీ నుంచి నిధుల మళ్లింపుపైనా, అవినీతిపైనా నిగ్గుతేల్చేందుకు ఏపీ స్టేట్ విజిలెన్స్ విచారణ జరుపుతున్నదని చెప్పారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధులు డాక్టర్ ఎస్.ప్రకాశ్‌రెడ్డి, ఎన్వీ సుభాశ్ పాల్గొన్నారు.